సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 66

బుధవారం 28-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'



వచ్చే నెలలో మంచి వర్షాలే

సాధారణం కంటే అధిక వర్షపాతం.. భారత వాతావరణ శాఖ వెల్లడి -6లో



విదేశీకి రాం..రాం..

మేడిన్ చైనాను వదిలేద్దాం.. మేడిన్ ఇండియాకు మళ్లుదాం: మోదీ -6లో



వచ్చేస్తోంది ఐదో తరం 'ఫైటర్'

మారుతున్న యుద్ధతంత్రాలకు అనుగుణంగా అధునాతన ఐదోతరం యుద్ధవిమాన తయారీ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించింది.

వివరాలు 6లో ▸



విద్యార్థి వీసాలకు బ్రేక్

విదేశీ విద్యార్థుల వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపేయాలని ట్రంప్ సర్కార్ నిర్ణయించింది.


వివరాలు 6లో ▸



క్లాసులు డుమ్మా కొడితే ఇంటికే..

విదేశీ విద్యార్థులు క్లాసులు ఎగ్గొట్టినా, కోర్సును వదిలేసినా వీసాలు రద్దవుతాయని భారత్‌లోని యూఎస్ ఎంబసీ తెలిపింది.

వివరాలు 6లో ▸



సెప్టెంబర్ 15 వరకు పొడిగింపు

ఆదాయపన్ను రిటర్నుల దాఖలు గడువును జూలై 31 నుంచి సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది.

వివరాలు 15లో ▸

ఇసుక దోపిడీ సహించం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచితంగా సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి, సీఎస్ రామకృష్ణారావు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

- ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి.. కలెక్టర్లు మరింత ప్రో యాక్టివ్‌గా ఉండాలి
- ధాన్యం కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు వివరించాలి..
- దుష్ప్రచారం తిప్పికొట్టాలి..
- రుతుపవనాలు ముందే వచ్చాయి.. సాగు ఏర్పాట్లు పర్యవేక్షించండి
- కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రులు రేపు, ఎల్లుండి క్షేత్రస్థాయికి వెళ్లాలి
- భూ భారతిపై 3 నుంచి సదస్సులు
- రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలి. మరింత ప్రో యాక్టివ్‌గా (చురుగ్గా) ఉండాలి. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా చూడాలి. లబ్ధిదారులకు టోకెన్ జారీ చేసి ఉచితంగా సరఫరా చేయాలి. ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న సంఘటనలు కూడా విస్తృత ప్రచారంలోకి వస్తున్నాయి. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలులో జాప్యం వల్లనే అని దుష్ప్రచారం జరుగుతోంది. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి. కొన్ని రాజకీయ ప్రేరేపిత సంఘటనలూ జరుగుతున్నాయి. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం సీఎం వో నుంచి ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, వ్యవసాయ శాఖ తదితర అంశాలపై.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ కె.రామకృష్ణారావులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

పరిహారం ప్రతిపాదనలు పంపండి

'పౌరసరఫరాల శాఖ గతసారి కంటే దాదాపు 22 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్ఎంటీ)

మిగతా 2వ పేజీలో ▶

హైకోర్టు కొత్త భవనాల సముదాయం నమూనా...



సకల హంగులతో సరికొత్తగా..

2,583 కోట్ల రూపాయల అంచనా వ్యయం 12లో

హైకోర్టు కొత్త భవన నిర్మాణం..

- కాంట్రాక్టు దక్కించుకున్న డీఈసీ ఇన్‌ఫ్రా
- 6 అంతస్తుల్లో ఇండో–పర్షియన్ శైలిలో ప్రధాన భవనం
- 60 మంది జడ్జీలకు సరిపడా కోర్టు హాళ్లు, నివాసాలు

తెలంగాణకు ముగ్గురు జడ్జీలు



జస్టిస్ అభిషేక్‌రెడ్డి



జస్టిస్ లలిత



జస్టిస్ సుమలత

- రాష్ట్ర హైకోర్టుకు జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ లలిత, జస్టిస్ సుమలత
- ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్ కలకత్తా హైకోర్టుకు బదిలీ
- కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

- వివరాలు 12లో▶

5న విచారణకు కేసీఆర్

జస్టిస్ ఘోష్ కమిషన్ ఎదుట హాజరుకానున్న మాజీ సీఎం

- 'కాళేశ్వరం'పై తన వాదనలు విన్పించనున్న బీఆర్ఎస్ అధినేత
- గత ప్రభుత్వం నిర్ణయం సరైనదేనని చెప్పనున్న కేసీఆర్!
- విదేశీ పర్యటన నుంచి జూన్ 4నే హైదరాబాద్‌కు కేటీఆర్
- ఫార్ములా–ఈ పై రెండో వారంలో ఏసీబీ ఎదుట హాజరయ్యే చాన్స్



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు జూన్ 5న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరుకానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని అనుమానిస్తున్న ప్రభుత్వం, వాటిపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించిన విషయం విదితమే. కాగా ఇప్పటికే పలువురు అధికారులను, కాంట్రాక్టు సంస్థలను కమిషన్ విచారించింది. తాజాగా ఈ నెల 20న కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు నోటీసులు జారీ చేసింది. జూన్ 5న కేసీఆర్, 6న ఈటల, 9న హరీశ్‌రావు తమ ముందు హాజరు కావాలని సూచించింది.

సమగ్ర నివేదికతో సిద్ధం!

కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తూ గత ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తూ వస్తోంది. తాజాగా గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదేననే


మిగతా 2వ పేజీలో ▶

ఎందుకీ సాగదీత?

- మంత్రివర్గ విస్తరణపై అసలేం జరుగుతోంది..?
- అధిష్టానం వైఖరిపై రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ
- తాజా భేటీల్లోనూ కుదరని ఏకాభిప్రాయం
- ఇప్పుడీ తలనొప్పి ఎందుకనే యోచనలో అధిష్టానం పెద్దలు!
- కేబినెట్ ప్రక్షాళనపైనా దృష్టి.. కొంత సమయం ఇచ్చే అవకాశం
- ప్రస్తుతానికి పీసీసీ కార్యవర్గంతోనే సరి.. 30న భేటీ తర్వాత ప్రకటన

- వివరాలు 2లో▶

కామ్రేడ్.. లాల్ సలామ్



- నంబాలకు తూటా తాకగానే నినదించిన మావోయిస్టులు
- ఆయనను కాపాడేందుకు ప్రాణాలకు తెగించి పోరాటం
- దాదా నేలకొరిగే వరకు వెనుకడుగు వేయని వైనం
- ఎన్‌కౌంటర్ వివరాలు వెల్లడించిన ఖాకీలు

5లో

కరోనా.. ఆందోళన అక్కర్లేదు

కరోనా కొత్త వేరియంట్లు అంత ప్రమాదకరం కాదు

చాలామందిలో లక్షణాలు కూడా కనిపించటంలేదు

- గత లక్షణాలకు అదనంగా ఈసారి డయేరియా, తీవ్ర అలసట.. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి
- 'బూస్టర్ డోస్' వేసుకోవటం మంచిదే..
- సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఉదయ్‌లాల్ సూచన



- వివరాలు 16లో▶

న్యూస్‌రీల్

హెచ్‌సీఏ ఒత్తిడి నిజమే..



ఐపీఎల్ మ్యాచ్‌లలో 10% అదనపు టికెట్ల కోసం హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతోపాటు ఇబ్బందులకు గురిచేసినట్లు ప్రభుత్వానికి సమర్పించిన ప్రాథమిక నివేదికలో విజిలెన్స్ పేర్కొన్నట్టు తెలిసింది.

- వివరాలు 16లో▶

'సింగరేణి జాగృతి'



సింగరేణి కార్మికుల సంక్షేమంతోపాటు సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. మంగళవారం సింగరేణి జాగృతి ఆవిర్భావ సమావేశం నిర్వహించారు.

- వివరాలు 2లో▶

రైల్వేస్టేషన్లు.. మినీ సోలార్ పవర్ ప్రాజెక్టులు



స్వీయ అవసరాల కోసం సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకొనే దిశగా రైల్వేశాఖ అడుగులేస్తోంది. రైల్వేస్టేషన్లు, వర్క్‌షాప్‌లు, ఇతర భవనాల్లో సౌర విద్యుత్‌ను భారీగా ఉత్పత్తి చేసుకోవాలని నిర్ణయించింది.

- వివరాలు 3లో▶

పాఠం వింటేనే డ్రైవింగ్ లైసెన్స్



డ్రైవింగ్ లైసెన్స్ కావాలా? అయితే రహదారి భద్రతపై 10 నిమిషాలపాటు ఆడియో క్లాస్ వింటేనే ఇకపై స్లాట్ నమోదవుతుంది. లైసెన్స్ కోసం వచ్చే వాహనదారులకు అవగాహన కల్పించేందుకు రవాణాశాఖ ఇలా వినూత్నంగా ముందుకొచ్చింది.

- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



రాష్ట్ర రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ అంశం మరోమారు చర్చనీయాంశమవుతోంది. గత నాలుగైదు రోజులుగా ఢిల్లీ వేదికగా రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయం నడుస్తుండడం, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ పెద్దలతో చర్చల కోసం వెళ్లడం, నీతి ఆయోగ్ సమావేశం కోసం వెళ్లిన సీఎం రేవంత్ ఆ తర్వాత ఒకరోజంతా అక్కడే వేచి ఉండడం, పీసీసీ అధ్యక్షుడితో సమావేశమైన అధిష్ఠానం పెద్దలు ఈనెల 30న మరోమారు రావాలంటూ రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సమాచారమిచ్చిన నేపథ్యంలో అసలేం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంగా అదిగో.. ఇదిగో అంటూ ఊరిస్తున్న కేబినెట్ విస్తరణ కోసం ఆశావహ ఎమ్మెల్యేలు ఎదురుచూస్తుండగా, అధిష్ఠానం ఈసారైనా అనుమతిస్తుందా..లేదా? అన్న సంశయం రాష్ట్ర కాంగ్రెస్ నేతలను వెంటాడుతోంది. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మంత్రివర్గ విస్తరణ విషయంలో అనేక అంశాలు బేరీజు వేసుకుంటున్న కాంగ్రెస్ అధిష్ఠానం లేనిపోని తలనొప్పులు ఇప్పుడెందుకనే ఆలోచనలో ఉందని తెలుస్తోంది. ప్రస్తుతానికి ఈ నెల 30 తర్వాత పీసీసీ కార్యవర్గ ప్రకటనతోనే సరిపెడుతుందని, మరికొన్ని రోజుల తర్వాతే కేబినెట్ విస్తరణ ఫైల్‌ను కదిలిస్తుందనే అభిప్రాయం గాంధీభవన్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

- సాక్షి, హైదరాబాద్

ఎందుకీ సాగదీత?



మంత్రివర్గ విస్తరణపై అసలేం జరుగుతోంది..

- అధిష్ఠానం వైఖరిపై రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ
- ఇప్పటికే ఎన్నోసార్లు చర్చలు..ముమ్మర కసరత్తు
- తాజా భేటీల్లోనూ కుదరని ఏకాభిప్రాయం
- ఇప్పుడీ తలనొప్పి ఎందుకనే యోచనలో అధిష్ఠానం పెద్దలు!
- కేబినెట్ ప్రక్షాళనపైనా దృష్టి..కొంత సమయం ఇచ్చే అవకాశం
- ప్రస్తుతానికి పీసీసీ కార్యవర్గంతోనే సరి.. 30న భేటీ తర్వాత ప్రకటన

మంత్రివర్గ విస్తరణ కోసం అటు ఢిల్లీ పెద్దలు, ఇటు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యులు పలుమార్లు చర్చలు జరిపారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షీ ఉన్నప్పటి నుంచే ఇటు సీఎం నివాసం, అటు ఏఐసీసీ కార్యాలయం వేదికగా చాలాసార్లు సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి, సీనియర్ మంత్రి ఉత్తమ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌లు భేటీ అయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో కూడా చర్చోపచర్చలు జరిపారు. చివరకు మార్చి నెలలో పార్టీ పెద్దలను కలిసిన సందర్భంగా ఇక అన్ని చర్చలు అయిపోయాయని, తమ ప్రతిపాదనలన్నింటినీ అధిష్ఠానం ముందుంచామని, విస్తరణ బంతి అధిష్ఠానం కోర్టులో ఉందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మంత్రివర్గ విస్తరణ అంశం ఫ్రీజ్ అయిందని (స్తంభించిందని), ఈ వ్యవహారాన్ని అధిష్ఠానమే పరిష్కరిస్తుందని అధికారికంగానే చెప్పారు. అయితే ఇంతా జరిగి, ఇన్ని చెప్పిన తర్వాత మళ్లీ ఢిల్లీ వేదికగా మంత్రివర్గ విస్తరణ చర్చలు జరుగుతున్నాయన్న వార్తలు దేనికి సంకేతమని పార్టీ నేతలు అంటున్నారు. గతంలో కుదరని ఏకాభిప్రాయం ఇప్పుడెలా సాధ్యమవుతుందని, ఏకాభిప్రాయం పేరుతో ఈ సాగదీత ఎందుకనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పార్టీలోని ఇద్దరు ఎమ్మెల్యేలు మంత్రివర్గ విస్తరణ జాప్యం అంశంలో అసహనంతో ఉన్నారని, వీలున్నంత త్వరలో తమకు కేబినెట్ హోదా ఇవ్వకుంటే అమీతుమీ తేల్చుకుంటామని, తమ దారి తాము చూసుకునే పని ప్రారంభిస్తామని తమ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారన్న వార్తలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి.

ఏకాభిప్రాయమెలా సాధ్యం?

ఈ పీటముడులు వీడవా?

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ విషయంలో పడిన పీటముడులు వీడేవి కావనే అభిప్రాయానికి అధిష్ఠానం పెద్దలు వచ్చారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. జనగణనలో కులగణన చేసి బీసీల లెక్క తేల్చాలని, ఎవరి వాటా ఎంతో తేల్చాలని కోరుతున్న కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు రాష్ట్ర మంత్రివర్గంలో బీసీ నేతలకు ఎన్ని బెర్తులిస్తారన్న దానిపై స్పష్టత లేదు. ఇప్పుడున్న రెండింటికి తోడు మరొకటి వస్తుందని అనుకుంటున్నా.. ఆ తర్వాత ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చే పరిస్థితి కూడా ఉండదు. ఇక జిల్లాలు, సామాజిక వర్గాల వారీగా కుదరని పొంతన, టీపీసీసీ కార్యవర్గానికి, కార్పొరేషన్ చైర్మన్ పోస్టులకు, అసెంబ్లీలో ఇచ్చే పదవులకు మంత్రివర్గ విస్తరణతో లింకు పెట్టడం, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధిష్ఠానం పక్షాన ఇచ్చిన హామీలను నెరవేర్చడం, సీఎం అభిప్రాయం, ఇతర సీనియర్ల ప్రతిపాదనలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నివేదికలు... ఇలా కావాల్సినన్ని పీటముడులు ఉన్న ఈ అంశం అసలు పరిష్కారమయ్యే మార్గం కూడా దొరకడం లేదనేది బహిరంగ రహస్యమని అంటున్నారు. మరోవైపు ఇద్దరు, ముగ్గురు మంత్రుల పనితీరు ఆశాజనకంగా లేదన్న రిపోర్టులు కూడా ఈ సాగదీతకు కారణమని తెలుస్తోంది. దీంతో మంత్రివర్గ విస్తరణతో పాటు ప్రక్షాళన కూడా చేయాలనుకుంటే ఇంకో ఆరు నెలల సమయమిచ్చి, పనితీరు సరిగా లేని వారిని కూడా పక్కనపెట్టి, వారి సామాజిక వర్గాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఒకేసారి విస్తరణ పూర్తి చేస్తే బాగుంటుందనే యోచనలో కాంగ్రెస్ పెద్దలున్నట్టు సమాచారం.

ప్రస్తుత పరిస్థితుల్లో ఈనెల 30వ తేదీ తర్వాత కూడా పీసీసీ కార్యవర్గ ప్రకటన మాత్రమే ఉంటుందని, మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం మరికొంత సమయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఒకవేళ మంత్రివర్గ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ వస్తే అది అనూహ్యమేనని, అలా జరిగినా రెండు లేదా మూడు బెర్తులు మాత్రమే భర్తీ చేస్తారని సమాచారం. మరికొంత సమయం తర్వాత మంత్రివర్గ ప్రక్షాళన చేస్తామనే సంకేతాలను ఇచ్చి ఈ బెర్తులను భర్తీ చేసే అవకాశముంటుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు అభిప్రాయపడ్డారు.

అయితే.. అనూహ్యమే

క్లుప్తంగా...

జూన్ 2న కవిత పార్టీ పెడతారు

- తర్వాత రాష్ట్రంలో పాదయాత్ర
- ఎంపీ రఘునందన్ వ్యాఖ్యలు



తూప్రాన్: ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ ఒక డ్రామా అని, జూన్ 2న ఆమె కొత్త పార్టీ పెడతారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు చెప్పారు. ఆయన మంగళవారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాయిపల్లిలో కొత్త పోస్టాఫీసు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీగా, అడ్డదారిలో ఎమ్మెల్సీ అయినప్పుడు.. తండ్రి కేసీఆర్ దేవుడని చెప్పిన కవితమ్మ.. ఇప్పుడు దేవుడి పక్కన దెయ్యాలుంటే 12 ఏళ్లుగా ఏం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌ను వీడేవారు మరో పార్టీలో చేరకుండా.. కవిత పార్టీలో చేరేందుకే ఇదో నాటకమన్నారు. కుటుంబంలో విభేదాలు వస్తే మాట్లాడుకోవడానికి ఫోన్లు ఉన్నాయి లేదా ఫాంహౌస్ ఉందని.. కానీ తండ్రికి బిడ్డకు మధ్య మధ్యవర్తులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. జూన్ 2న కవిత పార్టీ పెట్టాక.. రాష్ట్రంలో పాదయాత్ర చేస్తారని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ కక్షలతో పోరాటం

ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం రాజకీయ కక్షలతో పోరాడుతుంటే.. ప్రధాని మోదీ అభివృద్ధి దృక్పథంతో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమానంగా వ్యవహరిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు సహకరించకపోయినా కేంద్రం రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు మంజూరు చేస్తూనే ఉందని తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో దేశం అభివృద్ధి మార్గంలో పరుగులు తీస్తుంటే.. వరుస ఓటములను జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలతో విషం చిమ్ముతున్నారని ఆరోపించారు.

నోటీసుకు సమాధానమిచ్చా..

పార్టీ మారతానన్నది వాస్తవం కాదు: సునీతారావు



సాక్షి, హైదరాబాద్: పార్టీ తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానమిచ్చానని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు చెప్పారు. గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ నేతల ఆందోళన ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని, ఎలా చేసినా, ఎవరు చేసినా మహిళా కాంగ్రెస్ పక్షాన తానే బాధ్యత వహిస్తానని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని పార్టీ అగ్రనేతలు మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో ఫోన్‌లో మాట్లాడానని, జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబాను స్వయంగా కలిసి మన్నించాలని కోరినట్టు చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు పదవుల విషయంలో న్యాయం చేస్తానని పీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చారని చెప్పారు. తాను పార్టీ మారుతున్నానని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు శిక్షణ ఉంటుందని, ప్రతి మంగళవారం రాష్ట్రానికి చెందిన ఐదుగురు జిల్లా మహిళా కాంగ్రెస్ నేతలు ఈ శిక్షణలో పాల్గొంటారని సునీతారావు వెల్లడించారు.

ఇసుక దోపిడీ సహించం

▶ మొదటి పేజీ తరువాయి

అధికంగా ధాన్యాన్ని, అదీ తక్కువ సమయంలోనే కొనుగోలు చేయడం అభినందనీయం. 10.50 లక్షల మంది రైతుల దగ్గర్నుంచి 64 ఎల్ఎంటీలకు పైగా ధాన్యం కొనుగోలు చేశాం. గతంలో ఎన్నడూ లేని విధంగా కొనుగోలు చేయడమే కాకుండా రైతులకు 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేశాం. ఇప్పటివరకు రూ.12,184 కోట్లు చెల్లించాం. 90 శాతానికి పైగా రైతులు ధాన్యాన్ని విక్రయించి సంతోషంగా ఉన్నప్పటికీ, రాష్ట్రానికి రుతుపవనాలు ముందే రావడంతో కల్లాల వద్ద ధాన్యం తడిసిపోయి కొంతమంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు పంపాలి.

రైస్ మిల్లులను నిరంతరం పర్యవేక్షించాలి

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మెరుగ్గా పనిచేస్తున్నప్పటికీ అసత్య ప్రచారాలు బలంగా జరుగుతున్నాయి. వీటిని తిప్పికొట్టాలి. వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉంది. గత 3 సంవత్సరాల ధాన్యం కొనుగోలు వివరాలను కలెక్టర్లు వెల్లడించాలి. రైతులకు అన్యాయం చేయాలని మిల్లర్లు చూస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి' అని సీఎం ఆదేశించారు.

జూన్ 1 నాటికి నివేదిక ఇవ్వాలి

'వర్షాలు ముందే వచ్చినందున వ్యవసాయ శాఖ ప్రణాళికలలో మార్పులు చేసుకోవాలి. విత్తనాలు, యూరియా అందుబాటులో ఉంచాలి. విత్తనాల, ఎరువులు అక్రమ నిల్వలు ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి. జిల్లా కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రులు ఈ నెల 29, 30 తేదీలలో క్షేత్రస్థాయిలో వానాకాలం సాగు ఏర్పాట్లు పర్యవేక్షించాలి. నకిలీ విత్తనాలు, ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై నివేదిక తయారు చేసి జూన్ 1 నాటికి సమర్పించాలి. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలు జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి..' అని రేవంత్ ఆదేశించారు

పేదలకు చుట్టంలా భూ భారతి చట్టం

'గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ ప్రజలను భూతంలా పీడిస్తే, భూ భారతి చట్టం పేదలకు చుట్టంలా పని చేస్తుంది. భూ భారతి చట్టం కోసం తొలుత 4 మండలాలనే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకున్నాం. తర్వాత ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసుకుని రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలి. జూన్ 3 నుంచి 20 వరకు భూ భారతి సదస్సులు అన్ని మండలాల్లో నిర్వహించాలి. ఈ సదస్సుల్లో భూ భారతిపై అవగాహన కల్పించాలి' అని సీఎం సూచించారు.

ధరల నియంత్రణ కమిటీలు నియమించండి

'ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుతో ప్రభుత్వ పనితీరు ఏంటో తెలుస్తుంది. కలెక్టర్లు ఈ కీలకమైన పథకం అమలు పర్యవేక్షించాలి. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను నియమించాలి. మేస్త్రీ చార్జీలు, నిర్మాణ పరికరాల ధరలపై నియంత్రణ ఉండాలి. మహిళా సంఘాలు, రాజీవ్ యువ వికాసం ద్వారా ఇటుక, సెంట్రింగ్ యూనిట్ల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. తక్కువ ధరతో నాణ్యమైన ఇళ్లు నిర్మించేందుకు సాంకేతికంగా అనేక కొత్త పద్ధతులు వచ్చాయి. వీటిని లబ్ధిదారులకు తెలియజేయాలి' అని రేవంత్ చెప్పారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

'ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయి. ముందుగా వచ్చే వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదముంది. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా ఏజెన్సీ ఏరియాలు, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి. పొరుగు రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు కూడా నమోదవుతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ సీజన్‌కు అనుగుణంగా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..' అని సీఎం ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని చెప్పారు.

వర్షాలతో జాగ్రత్త

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు.

నేడు మీనాక్షితో కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేల భేటీ

సాక్షి, హైదరాబాద్: మాదిగ సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బుధవారం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలవనున్నారు ఈ మేరకు ఆమె వారికి అపాయింట్‌మెంట్ ఇచ్చినట్టు తెలిసింది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షకు హాజరయ్యేందుకు మీనాక్షి బుధవారం హైదరాబాద్ వస్తున్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో మాదిగ ఎమ్మెల్యేలు ఆమెతో సమావేశమై.. మంత్రివర్గ విస్తరణ జరిగితే తమకు ప్రాధాన్యం కల్పించాలని కోరనున్నట్టు సమాచారం. కాగా మంగళవారం సాయంత్రం మాదిగ సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మందుల శామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ, తోట లక్ష్మీకాంతరావులు సీఎల్పీ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మీనాక్షి అపాయింట్‌మెంట్ తీసుకున్నట్టు తెలిసింది.

పోలవరం బ్యాక్ వాటర్ ముంపు భేటీ రద్దు

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో కలిగే బ్యాక్ వాటర్ ముంపుపై ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం నిర్వహించ తలపెట్టిన వర్చువల్ భేటీ రద్దయ్యింది. సమావేశపు ఎజెండా నుంచి ఈ అంశాన్ని తొలగించారు. రూ.30,136 కోట్ల వ్యయంతో పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగిరం కావడంతో ముంపు ప్రభావిత రాష్ట్రాలతో చర్చించి, సమస్యకు పరిష్కారం చూపడానికి వీలుగా నాలుగు రాష్ట్రాల సీఎంలతో ప్రధాని భేటీ అవుతారని రాష్ట్రాలకు గతంలో సమాచారం ఇచ్చారు.

జూన్ 2న యువ వికాసం మంజూరు పత్రాలు

- వచ్చేనెల 10 నుంచి 15 వరకు అర్హులకు శిక్షణ కార్యక్రమాలు
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడి



మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో సీఎస్ రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హత సాధించిన లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ రెండో తేదీన మంజూరు పత్రాలను అందిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఈ మంజూరు పత్రాల పంపిణీకి క్షేత్రస్థాయిలో అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యువ వికాసం పథకం అమలు పురోగతిపై మంగళవారం సచివాలయంలో సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు భట్టి పలుసూచనలు చేశారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రాజీవ్ యువ వికాసం పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించాలన్నారు. జూన్ 10 నుంచి 15 వరకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూన్ 16వ తేదీ నుంచి స్వయం ఉపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గాంధీ జయంతి నాటికి యూనిట్లన్నీ గ్రౌండింగ్ అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సంక్షేమ శాఖ అధికారులు బ్యాంకర్లతో తరచూ మాట్లాడుతూ స్వయం ఉపాధి పథకాన్ని విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కీర్తి ప్రతిబింబించేలా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు: తెలంగాణ రాష్ట్ర చరిత్ర, కీర్తి ప్రతిబింబించేలా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని, ఇందు కోసం ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులకు సూచించారు. ఆవిర్భావ దినోత్సవ సమన్వయ సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై భట్టి సమీక్షించారు. సమావేశంలో భాగంగా భట్టి మాట్లాడుతూ ఈసారి అవతరణ వేడుకలకు అతిథులుగా జపాన్ మేయర్‌తో పాటు మిస్‌వరల్డ్ విజేతలు హాజరవుతారని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

'సింగరేణి జాగృతి'

కొత్త సంస్థను ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ కవిత

- కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ప్రకటన
- కవిత నివాసంలో భేటీ, నూతన కమిటీ ఏర్పాటు
- సింగరేణిలో 11 ఏరియాలకు సమన్వయకర్తల నియామకం



జాగృతి సైన్యంతో కల్వకుంట్ల కవిత

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కార్మికుల సంక్షేమంతోపాటు సంస్థను కాపాడటమే ధ్యేయంగా 'సింగరేణి జాగృతి'సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మంగళవారం తన నివాసంలో 'సింగరేణి జాగృతి' ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థ పరిధిలోని 11 ఏరియాల కార్మికులు పాల్గొన్నారు. సమావేశంలో కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పాటైన 'తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం'(టీబీజీకేఎస్)తో సమన్వయం చేసుకుంటూ సింగరేణి జాగృతి పని చేస్తుందని తెలిపారు. సింగరేణి కార్మికుల విద్య, వైద్య ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతితో సింగరేణి సంస్థనే అంతం చేసే కుట్రలు చేస్తోందని, వీటిని అడ్డుకుంటామని ప్రకటించారు. 11 ఏరియాలకు సింగరేణి జాగృతి కో ఆర్డినేటర్లను కవిత నియమించారు. సింగరేణి జాగృతికి అనుబంధంగా మహిళల విభాగం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కిరణ్ ఓరం (బెల్లంపల్లి), కుర్మ వికాస్ (శ్రీరాంపూర్), ఎస్.భువన్ (మందమర్రి), బొగ్గుల సాయికృష్ణ (రామగుండం 1), కె.రత్నాకర్ రెడ్డి (రామగుండం 2), దాసరి మల్లేశ్ (రామగుండం 3), నరేశ్ నేత (భూపాలపల్లి), అజ్మీరా అశోక్ కుమార్ (మణుగూరు), వన్నంరెడ్డి వీర నాగేంద్ర సాగర్ (కొత్తగూడెం), వసికర్ల కిరణ్ కుమార్ (కార్పొరేట్), కె.రామ్మోహన్ చారి (ఎస్టీపీపీ పవర్‌ప్లాంట్)లను ఏరియా కో ఆర్డినేటర్లుగా నియమించారు.

సింగరేణి స్కూళ్లను పునరుద్ధరించాలి: సింగరేణి స్కూళ్లను పునరుద్ధరించి సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన చేయాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ హాస్పిటళ్లలో ఉచిత వైద్యం అందించాలని కోరారు. అన్ని రీజియన్లలో కార్మికుల కోసం కొత్త క్వార్టర్స్ నిర్మించాలని కోరారు. జైపూర్ పవర్ ప్లాంట్ రెండో దశ పనుల అంచనా పెంపులో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు.

ధాన్యం రవాణాకు వాహనాలు అందుబాటులో ఉంచాలి

- పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొంగులేటి, తుమ్మల సూచనలు



సాక్షి, హైదరాబాద్: ధాన్యం రవాణా కోసం సమస్యలు తలెత్తకుండా రవాణా, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంచాలని పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. రైస్ మిల్లర్లు సహకరించని పక్షంలో ఇంటర్మీడియట్ గోదాములకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉత్తమ్ మాట్లాడారు. రైతులకు ధాన్యం చెల్లింపులు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన 48 గంటల్లోగా పూర్తి చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై ఎలాంటి వ్యతిరేక వార్తలొచ్చినా విచారించి చర్యలు తీసుకోవాలని, తప్పుడు వార్తలొస్తే వెంటనే ఖండించాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో 15 శాతం మాత్రమే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, మిగిలిన వాటిని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టం కింద పైలట్ మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించి జూన్ 2న పట్టాలు పంపిణీ చేయాలన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వానాకాలం పంట సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలని, విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా కలెక్టర్‌లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుతుపవనాలు వస్తున్న నేపథ్యంలో పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్లకు సీఎస్ కె.రామకృష్ణారావు సూచించారు.

తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగే వేడుకలకు శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి హాజరవుతారని వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో జరిగే జాతీయ పతాకం, పార్టీ జెండా ఆవిష్కరణకు పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానమే శరణ్యం

- ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ వైపు టీబీఎంతో తవ్వకాలు సాధ్యం కాదు
- రాష్ట్ర ప్రభుత్వానికి సాంకేతిక కమిటీ సిఫారసు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ఇన్‌లెట్(శ్రీశైలం) వైపు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం (డీబీఎం)లో టన్నెల్ తవ్వకం చేపట్టాలని సాంకేతిక కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో టీబీఎంతో తవ్వకాలు చేపట్టడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుకు జారీచేసిన పర్యావరణ అనుమతికి లోబడి ఈ ప్రక్రియ ఉండాలని సూచించింది. ఇక ప్రమాదంలో చిక్కుకుపోయిన వారి ఆచూకీ కోసం అన్వేషణ చేపట్టాలని, దీనికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) ప్రతినిధి డాక్టర్ అజయ్ కుమార్ నైథాని సహకారం తీసుకోవాలని కోరింది. ఆయన అందించే ఫార్ములా ప్రకారం సహాయక చర్యలు చేపట్టాలని తెలిపింది. గత ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ వైపు సొరంగం పైకప్పు కూలి 8 మంది అందులో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. వారిలో ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మిగిలినవారి ఆచూకీ లభించలేదు. దాంతో వారంతా మరణించి ఉంటారనే నిర్ధారణకు ప్రభుత్వం వచ్చింది. వారి కుటుంబాలకు ఇటీవలే నష్టపరిహారం చెల్లించింది. ఇన్‌లెట్ (శ్రీశైలం) నుంచి 13.9 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వగా... చివర్లో ఉన్న 50 మీటర్లు అత్యంత ప్రమాద ప్రదేశమని నిపుణులు హెచ్చరించడంతో గత నెల ఏప్రిల్ 24న సొరంగంలో సహాయక చర్యలు నిలిపివేశారు. మళ్లీ సహాయక చర్యలను ప్రారంభించినప్పటికీ ప్రమాదకర జోన్‌లో ఉన్న 50 మీటర్ల ప్రదేశంపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) ద్వారా సమగ్ర సర్వేకు సాంకేతిక కమిటీ సిఫారసు చేసింది. ఇన్‌లెట్ వైపు టన్నెల్ తవ్విన ప్రాంతం నుంచి భూ ఉపరితలం 400 మీటర్లు ఉంటుందని అంచనా వేశారు. డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో టన్నెల్ తవ్వినా.. శబ్దాలు బయటికి రావని కమిటీ నిర్ధారించింది. ఉపరితలం అంతా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఉండటంతో శబ్దాలు రాకుండా టన్నెల్ తవ్వకం చేపట్టనున్నారు.

5న విచారణకు కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

వాదన స్వయంగా వినిపించాలని కేసీఆర్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టులు మొదలుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వరకు ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు, పనులు, వెచ్చించిన నిధులు, సమకూరిన ప్రయోజనం తదితర అంశాలన్నింటినీ కమిషన్ ముందు పెట్టేందుకు కేసీఆర్ సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఒక వివరణాత్మక నివేదికను కూడా కేసీఆర్ సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో అనుమతులు లేకుండానే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులు ప్రారంభించడం, మహారాష్ట్రతో ఒప్పందం లేకుండా ప్రాజెక్టును ప్రకటించడం, కాంట్రాక్టు సంస్థలకు మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చిన వైనాన్ని కూడా కమిషన్ ముందు పెట్టాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ ఆరోపణలు చేసిన వారికి.. ఆధారాలు ఇవ్వాల్సిందిగా కోరుతూ కమిషన్ ఎందుకు నోటీసులు ఇవ్వడం లేదనే అంశాన్ని కూడా కేసీఆర్ లేవనెత్తే అవకాశముందని తెలుస్తోంది. మేడిగడ్డ బరాజ్ కేవలం కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక భాగం కాగా, మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదంటూ ప్రభుత్వం చేస్తున్న వాదనలపైనా కేసీఆర్ కమిషన్‌కు వివరణ ఇస్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కమిషన్ విచారణకు హాజరుకానున్నట్టు ఈటల రాజేందర్ ఇప్పటికే ప్రకటించగా, కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా హరీశ్‌రావు విచారణకు హాజరుపై నిర్ణయం తీసుకునే అవకాశముంది.

యూకే, అమెరికా పర్యటనకు కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మంగళవారం ఉదయం యూకే, అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. కేటీఆర్ ఈ నెల 30న యూకేలోని వార్విక్ యూనివర్సిటీ సైన్స్ పార్క్‌లోని రీసెర్చ్ సెంటర్‌లో ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ కొత్త నాలెడ్జ్ పార్క్‌ను ఆవిష్కరిస్తారు. లండన్‌లో జరిగే ఇతర కీలక కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొంటారు. అనంతరం అమెరికాకు చేరుకుని జూన్ 1న డల్లాస్‌లో జరిగే పార్టీ రజతోత్సవ సభ, 2న జరిగే రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొంటారు. జూన్ 6న తిరిగి హైదరాబాద్‌కు చేరుకోవాల్సి ఉండగా, కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరు కావాలనుకుంటున్న నేపథ్యంలో జూన్ 4నే ఆయన నగరానికి వస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఫార్ములా ఈ రేసు కేసులో విచారణకు హాజరు కావాల్సిందిగా కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా తాను అమెరికా పర్యటన నుంచి వచ్చిన తర్వాత విచారణకు హాజరవుతానని తెలుపుతూ ఆయన ఏసీబీకి లేఖ రాశారు. జూన్ రెండో వారంలో కేటీఆర్ విచారణకు హాజరయ్యే అవకాశముంది.

తొలి వేతనం.. జీవిత ప్రయాణంలో ఒక కీలక మైలురాయి. ఆర్థిక స్వాతంత్ర్యం, ఒక బాధ్యత, కుటుంబ సమిష్టి ప్రయాణానికీ సూచిక. అంతటి ప్రత్యేకత ఉన్న తొలి జీతం అందుకున్న రోజు కోట్లాది మందికి భావోద్వేగ ఘట్టం. ఒక్కొక్కరు ఒక్కో తీరుగా ఈ వేడుకను జరుపుకొంటారు. ఇంట్లో వాళ్లకు, బంధువులు, స్నేహితులు, సహచరులకు స్వీట్లు పంచేవారు కొందరైతే తొలి సంపాదనతో తమ వాళ్లకు బహుమతులను అందించేవారు మరి కొందరు. తొలి వేతనం రాగానే 'అమ్మా.. జీతం పడింది' అంటూ జన్మనిచ్చిన తల్లితో సంతోషం పంచుకునేవారే ఎక్కువని యాడ్ ఏజెన్సీ 'రీడిఫ్యూజన్', లక్నో యూనివర్సిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'భారత్ ల్యాబ్' తాజా సర్వేలో వెల్లడించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

అమ్మా.. నాకు జీతం వచ్చిందోచ్!

- తొలి వేతనం కోట్లాది మందికి భావోద్వేగ ఘట్టం
- ఆ సంబరం పంచుకునేది ముందుగా అమ్మతోనే
- బహుమతులతో వేడుక చేసుకుంటున్న జెన్-జీ
- బంగారం కొనుగోలుకు సై అంటున్న మహిళలు



చిన్న నగరాల నుంచి..

'నా తొలి వేతనం' పేరుతో నిర్వహించిన సర్వేలో దేశ వ్యాప్తంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన 2,125 మంది యువ ఉద్యోగులు పాలుపంచుకున్నారు. 1997–2012 మధ్య జన్మించిన ఈ జెన్–జీ తరం వాళ్లు.. మొదటి నెల జీతాన్ని ఏ విధంగా ఖర్చు పెడుతున్నారు, ఎలా ఆదా చేస్తున్నారు అన్న అంశాలను లోతుగా అధ్యయనం చేశారు. సర్వేలో పాల్గొన్నవారిలో కొందరు ప్రధానంగా కుటుంబ సభ్యులకు గిఫ్టులు అందించి తమ కృతజ్ఞతను చూపారు. కొంత మొత్తాన్ని ఆదా చేయడం ద్వారా.. పెరుగుతున్న ఆర్థిక దూరదృష్టికి నిదర్శనంగా నిలిచారు మరికొందరు. విరాళాలు ఇచ్చి తమలో స్వార్థం లేదని ఇంకొందరు నిరూపించారు. ప్రతి రూపాయి లెక్కించే కుటుంబాలకు ఇవన్నీ భావోద్వేగాలతో ముడిపడిన అంశాలే. 'మొదటి జీతం.. ఒక స్వాతంత్ర్య ప్రకటన. ముఖ్యంగా మహిళలకు ఒక నిశ్శబ్ద విప్లవం' అంటారు భారత్ ల్యాబ్ కో–చైర్మన్, రీడిఫ్యూజన్ చైర్మన్ సందీప్ గోయల్.

ముందుగా అమ్మకు..

తొలి వేతనం అందుకున్న మరుక్షణమే 44.6% మంది ఆ సంతోషాన్ని తొలుత అమ్మతో పంచుకుంటున్నారు. 28.6% మంది తండ్రికి, 16.1% మంది జీవిత భాగస్వామికి, 10.7% మంది తోబుట్టువులకు సమాచారం ఇస్తున్నారు. తరాలు మారుతున్నా.. సామాజిక పరిస్థితులు మారుతున్నా.. కుటుంబ బంధాలకు ఇచ్చే విలువను ఇది సూచిస్తుందని నివేదిక వివరించింది. ఇంటికి తమవంతు ఆర్థిక సహకారంగా గత తరాలు భావిస్తే.. నేటి జెన్–జీ తరం మహిళల్లో 88.5% మంది తమ మొదటి జీతాన్ని స్వాతంత్ర్యంగా అభివర్ణించారు. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది అనడానికి ఈ ప్రకటనే నిదర్శనం. స్వాతంత్ర్యంతో పాటు ఇంటికి అందించాల్సిన బాధ్యత అని 41.2% మంది పురుషులు భావించారు.

దానంలోనూ, పొదుపులోనూ మహిళలే

మొదటి జీతాన్ని పొదుపు, దానం చేయడంలో.. రెండింటిలోనూ పురుషుల కంటే మహిళలే ముందుండటం విశేషం. మొత్తంగా 24.5% మంది తొలి జీతాన్ని జాగ్రత్తగా పొదుపు చేశారు. అత్యవసర నిధిని ఏర్పాటు చేయడం, తదుపరి విద్యకు సిద్ధం కావడం లేదా కష్ట సమయాల్లో కుటుంబాన్ని పోషించడం వంటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని పొదుపునకు ప్రాధాన్యత ఇచ్చారు. విడివిడిగా చూసినప్పుడు.. 50% మంది మహిళలు పొదుపు చేస్తే, పురుషుల్లో ఈ సంఖ్య 32.3% మాత్రమే.

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే..20.4% మంది తొలి జీతాన్ని దాతృత్వ కార్యక్రమాలకు వినియోగించారు. మతపర సంస్థలు, ఎన్‌జీఓలు లేదా నేరుగా అవసరంలో ఉన్నవారికి విరాళంగా ఇచ్చారు. భారత్‌లోని యువ సంపాదకులు సమాజ అభ్యున్నతి, శ్రేయస్సును అర్థం చేసుకుంటారని నిరూపించారు.

దానంలో మహిళలు 41.6% కాగా, పురుషుల్లో ఈ సంఖ్య 27.7% ఉంది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని యువతుల్లో ఆర్థిక వివేకం, సామాజిక బాధ్యత పెరుగుతోందని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

తమవారికి కృతజ్ఞతగా..

తొలి వేతనం పొందిన సంబరాన్ని 38.8% మంది బహుమతుల ద్వారా పంచుకుంటున్నారు. గుర్తుండిపోయే రోజున తల్లుల కోసం ఆభరణాల నుండి తోబుట్టువులకు గ్యాడ్జెట్స్ వరకు.. తమ ప్రయాణానికి మద్దతుగా నిలిచిన వారికి గిఫ్టులతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కిరాణా సామాగ్రి, ఫ్యాన్లు, యుటిలిటీ బిల్లుల వంటి వాటికి 12.2% మంది ఖర్చు చేశారు. తల్లిదండ్రుల అవసరాలకు 4.1% మంది తమ తొలి జీతాన్ని వెచ్చించారు. సర్వేలో పాల్గొన్నవారిలో 88.3% మంది తమ మొదటి జీతం అవసర ఖర్చులకు సరిపోతుందని చెబితే.. 11.7% మంది ఇబ్బందులు పడ్డట్టు తెలిపారు.

బంగారం కొంటున్నారు..

పుత్తడి మన జీవితాల్లో భాగం.. అదొక ఆర్థిక భరోసా. అందుకే, ఆభరణాలకు బదులుగా యువ మహిళా ఉద్యోగులు పసిడి కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో మూడింట ఒక వంతు మహిళలు తమ తొలి జీతంతో బంగారం కొన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, భారతదేశంలోని 76% యువత నెలవారీ పొదుపు (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ – సిప్) కంటే సౌకర్యవంత పెట్టుబడి విధానాలను ఇష్టపడుతున్నారని నివేదిక వెల్లడించింది. అదనపు ఆదాయం, పండుగ బోనస్‌లు వచ్చినప్పుడు టూర్స్ లేదా తమ కలల బైక్ కొనుగోలు వంటి వ్యక్తిగత లక్ష్యాలకు ఖర్చు చేస్తున్నారు. సంకెళ్ళు లేకుండా జెన్–జీ తరం పొదుపు చేయాలనుకుంటున్నారు.

నివేదిక హైలైట్స్	44.6%	38.8%	24.5%	20.4%	88.5%
	మంది తమ తల్లులకు ముందుగా సమాచారం ఇచ్చారు.	మంది తమ మొదటి జీతాన్ని బహుమతుల కోసం ఖర్చు చేశారు.	మంది తమ ఆదాయాన్ని ఆదా చేసుకున్నారు.	మంది మతపరమైన, సామాజిక కార్యక్రమాలకు విరాళాలు ఇచ్చారు.	మంది తమ జీతాన్ని కేవలం ఆర్థిక సహకారం కంటే ఎక్కువగా వ్యక్తిగత స్వేచ్ఛకు చిహ్నంగా మహిళలు భావించారు.

క్లుప్తంగా...

పచ్చదనమే లక్ష్యంగా అడుగులు

అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: పచ్చదనమే లక్ష్యంగా అడుగులు వేద్దామని, వన మహోత్సవంలో భాగంగా ప్రజలు అడిగిన మొక్కలను అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. వన మహోత్సవంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో మంగళవారం అధికారులతో మంత్రి సురేఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది వన మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి మొక్కలు అందజేసి.. నాటేందుకు ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఏ ప్రాంతంలో ఎలాంటి చెట్లు నాటాలో గుర్తించి.. ఆ విధంగా ముందుకెళ్లాలని సూచించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారిని గుర్తించి ప్రోత్సాహకాలు అందజేయాలని ఆదేశించారు. వనజీవి రామయ్య వంటి మహనీయుల కుటుంబసభ్యులను సన్మానించాలని మంత్రి సురేఖ సూచించారు. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, ఎంఏయూడీ సెక్రటరీ టీకే శ్రీదేవి, ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేలా డిప్యూటీ వార్డెన్ విధులు

'ఎట్‌గ్రివా' రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల డిమాండ్


సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లోని పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్ విధులను ఒకే విధంగా రూపొందించి అమలు చేయాలని.. ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎట్‌గ్రివా) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కూకుట్ల యాదయ్య, వై.పాపిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీల్లో డిప్యూటీ వార్డెన్ విధుల్లో చాలా వ్యత్యాసం ఉందని తెలిపారు. మైనార్టీ గురుకుల సొసైటీలో ఔట్ సోర్సింగ్ పర్సన్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన గురుకుల సొసైటీలో మూడు నెలలకు ఒకరికి బాధ్యతలు కేటాయిస్తున్నారని వివరించారు. ఎస్సీ గురుకులంలో ఏటా ఒకరు చొప్పున విధులు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. ఇక బీసీ గురుకులంలో కూడా ఏడాది మొత్తంగా విధులు కేటాయిస్తున్నారని వెల్లడించారు. అలాకాకుండా గురుకుల పాఠశాలలన్నింట్లో ఒకే తరహా విధులు నిర్దేశించాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంక్షేమ శాఖల కార్యదర్శులు, గురుకుల సొసైటీల కార్యదర్శులకు వేర్వేరుగా వినతులు సమర్పించినట్లు తెలిపారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్ టికెట్లను సిద్ధం చేసినట్టు ఎస్ఎస్‌సీ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. www.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు హాల్ టికెట్లు పొందవచ్చని తెలిపారు. టెన్త్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ జరుగుతాయి. ఈ పరీక్షలకు 42,832 మంది దరఖాస్తు చేశారు.

రైల్వే స్టేషన్లు.. సోలార్ పవర్ ప్రాజెక్టులు

- భారీగా సౌర విద్యుత్తు ఉత్పత్తి
- దక్షిణ మధ్య రైల్వే వినియోగించే కరెంటులో 10 శాతం ఉత్పత్తి
- సాలీనా రూ.12 కోట్ల కరెంటు ఖర్చు ఆదా
- భవిష్యత్తులో మొత్తం కరెంటు సొంతంగా ఉత్పత్తి చేసే లక్ష్యం



కాచిగూడ రైల్వే స్టేషన్ రూఫ్ టాప్‌లో ఏర్పాటు చేసిన 400 కిలోవాట్స్ ఉత్పత్తి సామర్థ్యమున్న సోలార్ ప్యానెల్స్

ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే ఆదా చేస్తున్న కరెంటు 15.56 మిలియన్ యూనిట్లు	దీంతో నియంత్రిస్తున్న కర్బన ఉద్గారాలు: 2604 మెట్రిక్ టన్నులు

సాక్షి, హైదరాబాద్: తన విద్యుత్తు అవసరాలకు సరిపడా కరెంటును వీలైనంత వరకు సొంతంగా ఉత్పత్తి చేసుకునే దిశగా రైల్వే శాఖ అడుగులేస్తోంది. ఇందుకోసం సౌర విద్యుత్తును భారీగా ఉత్పత్తి చేసుకోవాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు విజయం సాధించటంతో, దాన్ని భారీగా పెంచి రైల్వే స్టేషన్లు, వర్క్‌షాప్‌లు, ఇతర భవనాల్లో సొంత కరెంటునే వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసుకుంటోంది. ప్రస్తుతం తన మొత్తం అవసరాల్లో 10 శాతం కరెంటును ఉత్పత్తి చేసుకుంటోంది. త్వరలో మరికొన్ని సోలార్ యూనిట్లు అందుబాటులోకి వస్తుండటంతో, మరికొద్ది నెలల్లో 15 శాతం విద్యుత్తు అవసరాలకు సొంత కరెంటే వినియోగంలోకి రాబోతోంది. దీన్ని నిరంతర ప్రక్రియగా మార్చి సౌర విద్యుదుత్పత్తిని ఓ లక్ష్యంగా నిర్ధారించుకుని అమలు దిశగా చర్యలు చేపట్టింది.

13.4 మెగావాట్ పవర్ సామర్థ్యం

కొంతకాలంగా దక్షిణ మధ్య రైల్వే వీలైనన్ని రైల్వే స్టేషన్లు, ఇతర భవనాలు, వర్క్‌షాప్ రూఫ్ టాప్‌లపై సోలార్ విద్యుత్తు ప్యానెల్స్‌ను పరుస్తోంది. ఈ జోన్ పరిధిలో 318 రైల్వే స్టేషన్లు, 143 సర్వీస్ భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసింది. పంపులు, స్ట్రీట్ లైట్స్‌కు సంబంధించి 1500 ప్రాంతాల్లో ప్యానెల్స్ అమర్చింది. వీటి ద్వారా 13.4 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఇందులో రైల్వే స్టేషన్ భవనాలపై ఏర్పాటు చేసిన ప్యానెల్స్ ద్వారా 6.58 మెగావాట్లు, సర్వీసు భవనాలపై అమర్చిన ప్యానెల్స్ ద్వారా 6.86 మెగావాట్లు, పంప్స్‌పై ఉన్న ప్యానెల్స్ ద్వారా 492 కిలోవాట్లు.. ఇతర ప్రాంతాల్లోని వాటితో మిగతాది ఉత్పత్తి అవుతోంది. దీనివల్ల సాలీనా రూ.12 కోట్ల కరెంటు బిల్లు ఆదా అవుతోంది. ఈ జోన్ పరిధిలో ప్రస్తుతం ఏటా రూ.126 కోట్ల మేర కరెంటు బిల్లుల రూపంలో ఖర్చవుతుండగా, సౌరవిద్యుత్ వల్ల 10 శాతం ఆదా అవుతోంది. ప్రస్తుతం మరో 10.7 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. రెండు మూడు నెలల్లో అవి ఉత్పత్తి ప్రారంభిస్తాయని, అప్పుడు మరో 6 శాతం మేర కరెంటు ఖర్చు ఆదా అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

నేరుగా సోలార్ కరెంటునే వాడేలా..

సాధారణంగా ప్రైవేటు భవనాలపై ఏర్పాటు చేసే ప్యానెల్స్ ద్వారా ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్తును గ్రిడ్ తీసుకుంటుంది. ఆ భవనంలో వాడే కరెంటుకు సంబంధించిన బిల్లుల్లో అంతమేర రాయితీ ఇస్తారు. కానీ, రైల్వేలో మాత్రం.. అక్కడ ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్తును నేరుగా వినియోగించుకునే మెకానిజం ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వినియోగిస్తున్న కరెంటు కంటే సౌర విద్యుత్తు ఎక్కువగా ఉత్పత్తి అవుతోంది. అవసరాలకు సౌర విద్యుత్తును వినియోగిస్తూ, మిగిలే అదనపు కరెంటును గ్రిడ్‌కు పంపిణీ చేస్తున్నారు.

ఆర్థికేతర అంశాలను వెంటనే పరిష్కరించండి

- ఉద్యోగుల సమస్యలపై డిప్యూటీ సీఎంకు త్రిసభ్య కమిటీ వినతి
- ఈ నెల 29న మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ కానున్న అధికారులు



డిప్యూటీ సీఎం భట్టితో సమావేశమైన త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్, సభ్యులు లోకేశ్‌కుమార్, కృష్ణ భాస్కర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన ముగ్గురు ఉన్నతాధికారుల కమిటీ కసరత్తు వేగవంతం చేసింది. ఇప్పటికే ఉద్యోగ సంఘాల జేఏసీలతో పాటు విడివిడిగా ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులతో సమావేశమై సలహాలు, సూచనలు స్వీకరించింది. తాజాగా త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్, సభ్యులు లోకేశ్‌కుమార్, కృష్ణ భాస్కర్ మంగళవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతులు, డిమాండ్లను మంత్రికి వివరించారు. ఉద్యోగుల ప్రధానమైన 57 డిమాండ్లలో 12 ఆర్థిక పరమైనవి, 45 ఆర్థికేతర అంశాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆర్థికేతర అంశాలను వేగంగా పరిష్కరించాలని సూచించినట్లు తెలిసింది. ఆర్థికపరమైన అంశాలను మాత్రం కాస్త సమయం తీసుకుని విడతలవారీగా పరిష్కరించే అంశాన్ని పరిశీలించాలని కమిటీ భట్టికి సూచించినట్లు సమాచారం. కమిటీ సూచనలను సావధానంగా ఆలకించిన ఆయన.. ఈ నెల 29న మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరగనుందని, ఆరోజు సమావేశానికి త్రిసభ్య కమిటీని ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రస్తుత సూచనలతో పాటు మరింత మెరుగైన సలహాలు ఇవ్వాలని సూచించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

ఉద్యోగ జేఏసీ ఏమనుకుంటోంది?

భట్టితో త్రిసభ్య కమిటీ సమావేశం కావడం ఉద్యోగవర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. అధికారుల సూచనలు, ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం గురించి ఎవరికి వారు చర్చించుకుంటున్నారు. ఉద్యోగ జేఏసీ డిమాండ్లలో మూడు ముఖ్యమైనవి ఉన్నాయి. ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏల్లో కనీసం మూడు తక్షణమే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులన్నీ పరిష్కరించాలని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని నిర్ధారించాలని కోరుతున్నాయి. పీఆర్సీ సైతం అత్యవసరమే అయినప్పటికీ దీనిని నాలుగో ప్రాధాన్యత కింద పేర్కొంటూ త్రిసభ్య కమిటీకి సూచనలు చేశాయి. ఈ నెల 29న జరిగే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశం ఉద్యోగుల్లో ఉత్కంఠ కలిగిస్తోంది.

భర్తకు వంట రాకపోతే భార్య లేచిపోతుంది

- కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావు అనుచిత వ్యాఖ్యలు
- రెండు సంసారాలు ఈదుతున్నానని గొప్పలు
- ఉపాధ్యాయుల మండిపాటు
- డీఈవోను సరెండర్ చేసిన కలెక్టర్



జనార్దన్‌రావు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'అబ్బాయిలకు వంట రాకపోతే.. వారి భార్యలు లేచిపోతారు'.. ఈ వ్యాఖ్య చేసింది ఏ అనామకుడో కాదు.. సాక్షాత్తు కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి జనార్దనరావు. పనితీరు విషయంలో నిర్లక్ష్యంగా ఉంటారని పలుమార్లు గత కలెక్టర్, ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులతో అక్షింతలు పడినా.. జనార్దన్‌రావు తీరు మారలేదు. ఇటీవల ఉపాధ్యాయులకు నిర్వహించిన వేర్వేరు శిక్షణ కార్యక్రమాల్లో డీఈవో జనార్దన్‌రావు భార్యాభర్తల గురించి మాట్లాడుతూ.. 'అబ్బాయిలకు వంట రాకపోతే వారి భార్యలు లేచిపోతారని'.. చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యా యులు మండిపడుతున్నారు. అలాగే, సినిమా పాటలు పాడటం, వేదికపై నుంచి ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడటం పైనా చర్చ సాగుతోంది. 'అందరికీ ఒక సంసారమే.. కానీ, నాకు రెండు సంసారాలు.. ఆ కష్టాలు అనుభవించే వాడికే తెలుస్తుంది'.. అంటూ ఆయన వివిధ కార్యక్రమాల్లో అసందర్భ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం మీడియాలో వైరల్‌గా మారాయి. డీఈవో వ్యవహారశైలిపై పలువురు ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై వివరణ కోరేందుకు డీఈవో జనార్దన్‌రావును ఫోన్‌లో సంప్రదించేందుకు సాక్షి ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

జిల్లా విద్యాధికారి సరెండర్

అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా విద్యాధికారిగా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మొండయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

మహిళలను కించపరిచారు

భర్తకు వంట రాకుంటే భార్య లేచిపోతుందంటూ డీఈవో వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. మహిళలపై ఆయన చులకన భావానికి ఈ వ్యాఖ్యలు నిదర్శనం. లింగవివక్షను పెంచేలా ఉన్న డీఈవో అభ్యంతరకర వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి.

– శనిగరపు రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్టీయూ

విద్యాశాఖ పరువు తీశారు

మహిళలను ఉద్దేశించి డీఈవో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. శిక్షణ శిబిరాలను సందర్శిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలతో ఉపాధ్యాయినులు ఎంతో నొచ్చుకున్నారు. విద్యాశాఖ పరువు పోయినట్లయింది. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలి.

– రాజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, డీటీఎఫ్

పాలమూరు–రంగారెడ్డికి పర్యావరణ అనుమతులివ్వండి

కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌కు మంత్రి పొన్నం విజ్ఞప్తి



కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌తో మంత్రి పొన్నం

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిన పాలమూరు రంగారెడ్డి పాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపిందని కేంద్రమంత్రి గుర్తుచేయగా, సదరు డీపీఆర్‌ను తిరిగి సరిచేసి పంపామని, దానిని పరిశీలించి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని పొన్నం కోరారు. అలాగే, సిద్దిపేట జిల్లాలోని గౌరవెల్లి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. మంత్రి పొన్నం వెంట తెలంగాణ అడ్వొకేట్ ఆన్ రికార్డ్ (ఏవోఆర్) శ్రవణ్ కుమార్ ఉన్నారు.

42% బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుంటే ఆమరణ దీక్ష

ఎంపీ ఆర్.కృష్ణయ్య స్పష్టీకరణ



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో తేవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై ముందుగా అన్ని రాజకీయ పార్టీలు తమ విధానాన్ని ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20 నుంచి 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేసిందని, ఆ తర్వాత దాన్ని కేంద్రానికి పంపుతామని సీఎం ప్రకటించినా.. దాని అతీగతీ లేదని కృష్ణయ్య విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డీ6 ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సుప్రీం కోర్టుకు వెళ్లినా బీసీ జనాభా లెక్కలు చూపి కేసు గెలిచే అవకాశం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచని పక్షంలో వెయ్యి మంది బీసీలు ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర బంద్‌కు కూడా వెనకాడబోమని హెచ్చరించారు.



మనుషులు, పరిస్థితులకు బాధపడొద్దు.
నీ ప్రతిస్పందన లేకపోతే అవి బలహీనమైనవి.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 28 మే 2025

బంగ్లాదేశ్‌లో ముసలం!

జవాబుదారీతనం లేని అధికారం అరాచకానికి దారితీస్తుంది. దేశ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుంది. బంగ్లాదేశ్‌లో నిరుడు ఆగస్టు తిరుగుబాటు తర్వాత జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఈ అభిప్రాయం కలుగుతుంది. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ఆర్థిక నిపుణుడు మహమ్మద్ యూనస్ ప్రధాన సలహాదారుగావున్న అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నది. ఒకపక్క సత్ప్రవర్తన లేని ప్రభుత్వోద్యోగులకు త్వరగా ఉద్వాసన పలికేవిధంగా సర్వీసు నిబంధనలు మార్చటం, మరోపక్క అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలివ్వటంలో విఫలం కావటం వగైరాలు అసంతృప్తికి దారితీసి నాలుగు రోజులుగా దేశవ్యాప్తంగా సమ్మె సాగుతోంది. ఈలోగా అమెరికా ఒత్తిడికి లొంగి లోపాయకారీగా సెయింట్ మార్టిన్స్ దీవిని కట్టబెట్టేందుకు యూనస్ పావులు కదిపారు. అంతేకాదు... దాని ఆదేశాలతో చిట్టగాంగ్– రఖినే కారిడార్‌ను 'మానవతా సాయం' అందించటానికి వీలుగా అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ రెండింటిపైనా దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తంకావటంతో పాటు సైన్యం నుంచి సైతం వ్యతిరేకత వచ్చింది. పర్యవసానంగా పది నెలలకు పైగా బాధ్యత లేని అధికారం చలాయిస్తున్న ప్రభుత్వం చిక్కుల్లో పడింది. గత్యంతరంలేని స్థితిలో తన నిర్ణయాలను వెనక్కు తీసుకుంది.

తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు దేశంలో వరస వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నాయి. ఛాందసవాదులు కత్తులు కటార్లతో రోడ్లపైకొచ్చి ముస్లిం మహిళలు బురఖా ధరించాలని హుకుం జారీచేస్తూ హడావిడి మొదలుపెట్టారు. దాన్ని బేఖాతరు చేసిన మహిళలను నడిరోడ్డుపై దండించటం, జైళ్లపాలు చేయటం కొనసాగాయి. మైనారిటీ హిందువులపై దాడులు, దౌర్జన్యం, అక్రమ అరెస్టులు మామూలే. వీటని సరిదిద్దటానికి బదులు అంతా మీడియా సృష్టి అని యూనస్ దబాయింపులకు దిగారు. ఒకనాడు తూర్పు పాకిస్తాన్‌గా వున్న తమపై పాక్ పాలకుల అకృత్యాలను మరిచి, దాన్ని నెత్తినపెట్టుకోవటం మొదలుపెట్టారు. చైనాకు పోయి దాంతో మరింత సాన్నిహిత్యానికి ప్రయత్నించారు. దేశానికి పనికొచ్చేదేదో, ప్రయోజనకరమైనదేదో గ్రహించి నిర్ణయాలు తీసుకోవటం మాని భారత్‌ను చీకాకు పెట్టడమే లక్ష్యంగా యూనస్ వ్యవహారశైలివుంది.

ఎల్లకాలమూ ఇలాగే సాగిపోతుందనుకుంటే చెల్లదు. పాత ప్రభుత్వం పతనమై పది నెలలు దాటుతున్నా ప్రభుత్వం ఎన్నికల గురించి ఆలోచించదేమన్న ప్రశ్నలు మొదలయ్యాయి. 2026 మధ్య వరకూ ఎన్నికలు జరిపే ఉద్దేశం లేదన్నట్టు యూనస్ ప్రభుత్వం ఈమధ్య లీకులిస్తుండగా, బంగ్లా ఆర్మీ చీఫ్ వాకర్–ఉజ్–జమాన్ ఈ ఏడాది ఆఖరిలోగా ఎన్నికలు జరిగి తీరాలని నిర్దేశించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకొస్తే తాము తిరిగి బ్యారక్‌లకు వెళ్లిపోతామని ఒక సభలో మాట్లాడుతూ ఆయన ప్రకటించారు. సహజంగానే ఇది యూనస్‌కు మింగుడు పడలేదు. అలాగని ప్రభుత్వాన్ని నడపటం ఆయనకు చేతకావటం లేదు. ప్రభుత్వంలోని మత ఛాందసవర్గం, విద్యార్థి నాయకులు చెప్పినట్టల్లా చేస్తూ ఆయన ఇప్పటికే ప్రతిష్ఠ పోగొట్టుకున్నారు. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్‌ను నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయం ఆ బాపతే.

బంగ్లా అధీనంలోవున్న సెయింట్ మార్టిన్స్ దీవి వ్యూహాత్మకంగా కీలకమైనది. బంగాళాఖాతంలో మన దేశం, మయన్మార్ కూడా దీనికి సమీపంగా ఉంటాయి. పదివేలమంది బంగ్లా పౌరులు నివసించే ఈ దీవిలో సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవాలని అమెరికా ఏనాటి నుంచో కలలుగంటున్నది. హిందూ మహా సముద్రంలో డీగో గార్షియా దీవిలో స్థావరం ఉన్నా, బంగాళాఖాతంలో లేని లోటు దాన్ని పీడిస్తోంది. ఈ దీవిపై అమెరికా మాత్రమే కాదు... చైనా కన్ను కూడా పడింది. మయన్మార్ సైతం వీలైతే దాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తోంది. అంతర్జాతీయ సాగర చట్టాల ట్రిబ్యునల్ 2012లో ఈ దీవి బంగ్లాదేశ్‌కు చెందుతుందని, 12 నాటికల్ మైళ్ల మేర ప్రాంతం ఆ దేశానిదేనని తీర్పునిచ్చినా అడపా దడపా మయన్మార్‌తో సమస్యలు తప్పడం లేదు. ఆ దేశ సైన్యం అక్కడ మసిలే బంగ్లా పౌరులను అపహరించటం, కాల్పులు జరపటం రివాజుగా మారింది. దీన్ని అమెరికాకూ లేదా చైనాకూ అప్పగిస్తే మన దేశ భద్రతకు ముప్పు కలుగుతుంది. కానీ యూనస్ భారత్‌పై వ్యతిరేకతతో ఈ దీవిని అమెరికాకు అప్పగించాలనుకున్నారు. ఈ ప్రతిపాదనను కూడా బంగ్లా సైన్యం తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ భవిష్యత్తును నిర్దేశించే ఇలాంటి కీలక నిర్ణయాలు ఎన్నికైన ప్రభుత్వానికే వదలాలని సూచించింది. అలాగే చిట్టగాంగ్–రఖినే కారిడార్ విషయంలోనూ సైన్యం పట్టుదలతో ఉంది. మయన్మార్‌లో సైనిక ముఠా ప్రభుత్వ దాడుల్లో చిక్కుకున్న రఖినే ప్రాంతానికి నిత్యావసరాలు, మందులు, ఆహారం అందించాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిన మాట వాస్తవం. అమెరికా సైతం ఈ కృషిలో పాలుపంచుకుంటామని తెలిపింది. అయితే ఈ మాటున కారిడార్ ఆనుపానులన్నీ అమెరికా తెలుసుకుంటుందన్నది బంగ్లా సైన్యం బెంగ.

తన నిర్ణయాలను హసీనాయే కాదు... బీఎన్‌పీ నేత ఖలీదా జియా, సైన్యం, పౌర సమాజం తీవ్రంగా వ్యతిరేకించటంతో యూనస్‌కు ఎటూ పాలుపోలేదు. అందుకే రాజీనామా బెదిరింపులకు దిగారు. కానీ దానికెవరూ కంగారు పడిన దాఖలా లేకపోవటంతో వెనక్కి తగ్గారు. నిర్ణయాత్మకంగా వ్యవహరించటం చేతకాని తన వ్యవహారశైలితో బంగ్లాదేశ్‌ను ఏం చేద్దామనుకుంటున్నారో యూనస్ ఆలోచించుకోవాలి. నడమంత్రపు సిరిలా వచ్చిపడిన అధికారం అండతో దేశాన్ని భ్రష్టుపట్టించటం మానుకోవాలి. సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించటమే గౌరవప్రదమని గ్రహించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.పాడ్యమి ఉ.6.43 వరకు, తదుపరి విదియ తె.4.34 వరకు (తెల్లవారితే గురువారం), **నక్షత్రం:** మృగశిర తె.3.15 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.9.49 నుండి 11.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.31 నుండి 12.22 వరకు, **అమృత ఘడియలు:** రా.7.01 నుండి 8.32 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.25
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

విరమణే సరా?

అభిప్రాయం



టంకశాల అశోక్

గణనీయంగా బలహీనపడటంతో పాటు దారీతెన్నూ లేకుండా సాగుతున్న నక్సలైట్ ఉద్యమం గురించిన చర్చలు 'ఆపరేషన్ కగార్' కన్నా కొన్నేళ్ల ముందు నుంచే జరుగుతున్నాయి. అందుకు కారణాలు రెండు. ఒకటి – నక్సలిజం పట్ల గత కాంగ్రెస్ ప్రభుత్వాల కన్నా మౌలికంగానే భిన్నమైన విధానం గల బీజేపీ అధికారానికి వచ్చింది. రెండు – యథాతథంగా ఆ ఉద్యమం బలహీనపడటం 1990ల నాటికి మొదలై, 2010లు వచ్చేసరికి బాగా పెరిగింది.

ఇక్కడ చెప్పుకోవలసిన ముఖ్యమైన విషయం ఒకటున్నది. నక్సలైట్ ఉద్యమకారుల త్యాగాలు వృథా ప్రయాసగా మారుతున్నాయన్న భావనలు సాధారణ సమాజంతోపాటు, వారిపట్ల ఏదో ఒక మేర సానుభూతిగల వర్గాలలోనూ కొంతకాలం నుంచి ఉండగా, ఇటీవల పెరిగాయి. ఈ అభిప్రాయాలన్నింటి సారాంశం, ఉద్యమం ఇక ముందుకు సాగే అవకాశం లేదు గనుక విరమించుకోవటం మంచిదని!

తగ్గిన జనాదరణ

దేశం దశాబ్దాల తరబడి ఉద్యమించి 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించుకోగా, 20 ఏళ్లు గడిచేసరికి దేశంలో వేర్వేరు వర్గాల అసంతృప్తి, అశాంతి, అందులో భాగంగా నక్సలైట్ ఉద్యమం ఎందుకు మొదలైనట్లు? అది బలహీనపడినప్పటికీ 55 ఏళ్లు గడిచినా ఎందుకు కొనసాగుతున్నట్లు? అనే చర్చ ఎట్లున్నా, అది మరెంతో కాలం సాగే అవకాశాలు లేవన్నది స్పష్టం. అందుకు కారణాలు అనేకం. స్వీయ లోపాల వల్ల, ప్రభుత్వ అణచివేతల కారణంగా ఉద్యమం బలహీనపడింది. స్వీయ లోపాలు అనేవి సైద్ధాంతికమైనవి, నాయకత్వపరమైనవి, వ్యూహాలూ, ఎత్తుగడలకు సంబంధించినవి, ప్రజాదరణతో నిమిత్తం గలవి. ఈ నాలుగింటిని నక్సలైట్లు సరిదిద్దుకొని తేరుకోగల సూచనలు ఎంతమాత్రం కనిపించటం లేదు. వీటిలో ప్రజాదరణ అన్నింటి కన్న కీలకమైనది. అది ఉన్నట్లయితే తక్కిన మూడింటిలో కొన్ని లోటుపాట్లు ఉన్నా ముందుకు పోగలరు. ఈ సూత్రం ఏ ఉద్యమానికైనా, ఏ సాధారణ రాజకీయ పార్టీకైనా వర్తిస్తుంది.



నక్సలైట్లు తొలి దశాబ్దాలలో ఉండిన ప్రజాదరణను మలి దశాబ్దాలు వస్తుండగా కోల్పోవటం మొదలైంది. అందుకు కారణాలు అనేకం. కొన్ని ప్రభుత్వ అణచివేతలు, దానితోపాటు అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలలో ఉన్నాయి. మరికొన్ని సమాజం వైపు నుంచి. అవి – కొత్త తరాలు ఉనికిలోకి రావటం, వారి ఆలోచనలూ, కోరికలూ, వ్యవహరణా శైలి కొత్తది కావటం, తమ తల్లిదండ్రులు అనుభవించిన స్థాయి పేదరికానికి గురికాక పోవటం, వ్యవసాయ సంక్షోభాలతో నిమిత్తం లేకపోవటం, గ్రామాలతో సంబంధాలు తగ్గి పట్టణీకరణలూ ఆధునికీకరణలలోకి ప్రవేశిస్తుండటం వంటివి కొత్త సామాజిక మార్పులయ్యాయి. పాత తరాలకు కూడా నక్సలిజం పట్ల ఉండిన గురి వివిధ కారణాల వల్ల తగ్గటం మొదలైంది.

పోతే, అణచివేతలు, వాటిని తట్టుకోలేక పోవటాలు, కలిగే నష్టాలను ఒకప్పటి వలె పూడ్చుకోలేక పోవటాలు సరేసరి కాగా, ప్రభుత్వ అభివృద్ధి–సంక్షేమ చర్యల ప్రభావాలు కూడా ఉన్నమాట నిజం.

> ఉద్యమ వర్తమాన స్థితిని, భవిష్యత్ అవకాశాలను లేదా అవకాశ రాహిత్యాన్ని, వీటన్నింటితోపాటు విస్తృతాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు నక్సలైట్ నాయకత్వం ఉద్యమ విరమణను ప్రకటించటమే సరైనదిగా తోస్తుంది.

విరమిస్తే ఏం చేయొచ్చు?

నక్సలైట్ ఉద్యమం మొదలైన తర్వాత ఆ తొలి దశాబ్దాల ఉధృతి, మలి దశాబ్దాల బలహీనతల దశకు చివరన చెప్పుకోవలసింది ఏమంటే, ఒకవైపు ఉద్యమానికి ఆ పరిస్థితులలో ముందుకు పోవటం ఎట్లాగన్న సైద్ధాంతిక స్పష్టత లేకపోయింది. ప్రజలను, వారి భాగస్వామ్యం కేంద్రంగా చేసుకుని ఉద్యమ నిర్మాణానికి బదులు మిలిటరిజానికి పెద్దపీట అయింది. దాని నష్టాలు, సమస్యలు దానివయ్యాయి. ఆ దశకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వాలు ద్వంద్వ వ్యూహం అనుసరించి విజయవంతమయ్యాయి. నక్సలిజాన్ని తీవ్రంగా అణచివేస్తూనే, అది కేవలం శాంతిభద్రతల సమస్య కాదని, అభివృద్ధి సమస్య కూడానని చెప్పటం విధానం అయింది. ఆ రెండు విధాల చర్యలు వ్యూహంగా మారాయి. వాటి ఫలితంగా ఉద్యమం దెబ్బతింటుండగా, ఉద్యమా నికి మైదాన ప్రాంతాల ప్రజలు, బీసీ, ఎస్సీలు దూరం కాసాగారు. ఆర్థిక మార్పులతో కొత్త తరాల దృక్పథం మారి వారు దూరమయ్యారు. పలు ప్రాంతాలలో గిరిజన శ్రేణులు కూడా! బీజేపీ అధికారానికి వచ్చే సరికే సమాజ వర్గాలకు, ఉద్యమానికి సంబంధించి ఈ మార్పులు స్థిరపడుతుండగా, కొత్త అధికార పార్టీ కొత్త విధానాన్ని ముందుకు తేవటం మొదలు పెట్టింది. సామాజిక దృష్టికి కాంగ్రెస్ తరహాలో నటనా పరంగానైనా చోటు లేకపోయింది.

ఉద్యమం విషయానికి వస్తే, వర్తమాన స్థితిని, భవిష్యత్ అవకాశాలను లేదా అవకాశ రాహిత్యాన్ని, వీటన్నింటితోపాటు మొదట చెప్పుకున్న విధంగా వ్యక్తమవుతున్న విస్తృతాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు నక్సలైట్ నాయకత్వం ఉద్యమ విరమణను ప్రకటించటమే సరైనదిగా తోస్తుంది. నిర్ణయం తేలిక కాదు. ఇటువంటి నిర్ణయాలు ఎప్పుడైనా కష్టమైనవే. కానీ పరిస్థితులనుబట్టి తప్పనివి. సరైన నిర్ణయాలు సరైన సమయంలో తీసుకోకపోవటం వల్ల ఎదురయ్యే నష్టాలు మరింతగా ఉంటాయి. తమతోపాటు ప్రజలకు కూడా! శాంతి చర్చలని ప్రాథేయపడిన స్థాయిలో ఇంతగా విజ్ఞప్తులు చేయటమే ఉద్యమం ఎన్నడూ లేనంత బలహీనపడినట్లు చెప్తున్నది. చర్చలని పౌరసమాజం నుంచి మాట్లాడుతున్నవారు ఎంత సహేతుక కారణాలు, తర్కాలు చెబుతున్నా ప్రభుత్వం అణుమాత్రం సడలింపు చూపకపోవటం కనిపిస్తున్నదే!

ఒకవేళ ఉద్యమ విరమణ జరిగినట్లయితే అనంతరం ఏమి చేయాలన్నది వేరే విషయం. ప్రధాన స్రవంతిలో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి సాధారణ ప్రజా ఉద్యమాలు జరపాలనీ, ఇప్పటికే గల వామపక్షాలతో కలిసి పని చేయాలనీ, ఎన్నికలలో పోటీ చేయాలనీ, ఇవేవీ కావనుకుంటే తమకు తోచిన ప్రజాస్వామిక మార్గాలను అనుసరించవచ్చుననే సూచనలు వస్తున్నాయి. సమాజంలో సమస్యలు కొల్లలుగా ఉన్నాయనీ, ప్రజలలో అసంతృప్తి తక్కువ కాదనీ, వివిధ పార్టీ ప్రభుత్వాలే గాక ప్రతిపక్షాల వైఫల్యాలు అనేకం కనిపిస్తున్నాయనీ, కనుక వాటి ఆధారంగా, ప్రజాస్వామిక వ్యవస్థ కల్పించే అవకాశాలను వినియోగించుకుని కృషి చేయవచ్చుననీ పలువురి నుంచి వినవస్తున్న సలహా. నక్సలైట్ నాయకత్వం తన విజ్ఞతతో ఏ నిర్ణయం తీసుకోగలదో చూడాలి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

ఇది గ్రహణమే!

అభిప్రాయం



డి. పాపారావు

కొద్ది దశాబ్దాలుగా కమ్యూనిస్ట్ పార్టీలకు గ్రహణం పట్టింది. వాటి ప్రాభవం గణనీయంగా తగ్గింది. దేశంలోని అనేక చోట్ల ప్రజానీకానికి కమ్యూనిస్టు పార్టీ అంటే ఏమిటో తెలియని స్థితి నెలకొంది. కమ్యూనిస్టు పార్టీలు 'కాలం చెల్లిన' సిద్ధాంతాన్ని పట్టుకొని వేలాడుతుండటమే దీనికి కారణం అనేవారు మొదలు కొని... అసలు కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి, తాము కూడా, తాము నిత్యం విమర్శించే బూర్జువా పార్టీల లాగే తయారవ్వడం వల్లనే, వాటికి ఈ పరిస్థితి దాపురించిందని రకరకాల విమర్శలు ఉన్నాయి.

పునాది లేకుండా పోయింది!

కమ్యూనిస్టు పార్టీల అస్తిత్వానికీ, మనుగడకూ అనివార్యం అయిన ప్రాథమిక పునాదులు నేటి సమాజంలో లేకుండా పోయాయన్నది గమనార్హం. కమ్యూనిస్టు పార్టీల అస్తిత్వానికి పునాది – వర్గ పోరాటాలు. కార్మికులు, యజమానులు అనే పరస్పరాభిముఖాలైన రెండు వర్గాలు ఉండటం, వారి మధ్యన పెట్టుబడి, శ్రమల ద్వారా సృష్టించబడిన సంపద తాలూకు పంపిణీలో ఏర్పడే ఘర్షణలు... ఇదీ సూక్ష్మంగా కమ్యూనిజానికీ, కమ్యూనిస్టు పార్టీలకూ ఆస్కారం కల్పించే నేపథ్యం. ఒక పారిశ్రామిక సంస్థలోనో, సేవారంగపు కార్యాలయంలోనో శారీరక లేదా మేధాశ్రమతో సృష్టించబడిన సంపదలోని సింహభాగాన్ని ఆ సంస్థ యజమాని నొల్లుకోవడం, పెట్టుబడిదారీ వ్యవస్థలో సహజంగా జరిగే పరిణామం. అంటే, పరిశ్రమలో ఒక కార్మికుడు 8 గంటల పాటు శ్రమ చేయడం ద్వారా సృష్టించిన సంపదలోని కొంత వాటాను మాత్రమే (ఉదాహరణకు: 4 గంటల శ్రమ ఫలితం మేరన మాత్రమే) కార్మికుడికి వేతనంగా ఇచ్చి, మిగతా శ్రమ ఫలితాన్ని (దీనినే 'అదనపు విలువ' అని పిలుస్తారు) యజమాని సొంతం చేసుకోవడమే కమ్యూనిజం చెప్పే శ్రమ దోపిడీ సారాంశం! తన శ్రమ ఫలితాన్ని కొల్లగొడుతూ రోజు రోజుకూ మరింత ధనవంతుడవుతోన్న యజమాని పట్ల కార్మికులకు సహజంగానే ద్వేషభావం ఏర్పడుతుంది. ఈ ద్వేష భావమే వర్గ పోరాటాలకు ప్రేరణ. వర్గ రహిత సమాజ ఆలోచనకు చోదక శక్తి.

కొన్ని దశాబ్దాలుగా ఈ పెట్టుబడిదారీ పునాదిలోనే మార్పు వచ్చింది. పారిశ్రామిక, సేవా రంగాల ఉత్పాదక శ్రమ... తద్వారా సంపద సృష్టి స్థానంలో ఎటువంటి ఉత్పత్తికీ స్థానం లేని ఫైనాన్స్ పెట్టుబడుల యుగం నేడు ప్రధాన స్రవంతిగా నడుస్తోంది. ఈ ఫైనాన్స్ ఆధారిత రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్లలో... ఉత్పత్తి రంగాలలో చూసే శ్రమ దోపిడీ, అదనపు విలువ వంటివి కనపడవు. అంటే, యజమాని–కార్మికుడి సంబంధాలు... దాని ఫలితంగా ఏర్పడే దోపిడీ భావన... వర్గ పోరాటాలు... ఈ రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ల వంటి స్పెక్యులేటివ్ రంగాలలో పాత్ర పోషించవు. సూక్ష్మంగా చెప్పాలంటే ఇక్కడ వర్గ పోరాటానికి చోదక శక్తిగా ఉండే వర్గాల మధ్య ద్వేష భావనకు స్థానం లేకుండా పోయింది. దాని స్థానంలో ఫైనాన్స్ పెట్టుబడుల ఈజీ మనీ యుగం పేదలు, ధనికుల మధ్య పోల్చి చూసుకోవడాన్నీ, ఈర్ష్యనూ తెచ్చిపెట్టింది. అంటే, నేటి ఈ రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ ఆధిపత్య యుగంలో – పేదలు ('శ్రామికులు') ధనికులతో పోల్చి చూసుకుంటున్నారు. ఈ యుగం లక్షణం వర్గ పోరాటం ద్వారా హక్కుల సాధనో, సోషలిజం నిర్మాణమో కాదు. ధనవంతుడిని అనుకరించడం, అతని నమూనాని ఆరాధించడం, ఎలాగైనా తాను కూడా ఆ స్థానాన్ని చేరుకోవడం!

> ఫైనాన్స్ ఆధారిత రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్లలో... ఉత్పత్తి రంగాలలో చూసే శ్రమ దోపిడీ, అదనపు విలువ వంటివి కనపడవు. దానివల్ల కమ్యూనిస్టు పార్టీల మనుగడకు అనివార్యం అయిన వర్గ పోరాటాలకు ప్రేరణ లేకుండా పోయింది.

ఈ క్రమంలోనే వర్గ పోరాటాలు, సోషలిజం లక్ష్యంగా గల కమ్యూనిస్టు ఉద్యమాలకు గ్రహణం పట్టింది. దీనితో పాటుగా తెలుగు రాష్ట్రాలలో వచ్చిన సాఫ్ట్‌వేర్ రంగ 'విప్లవ' ఫలితంగా మన యువతీ యువకులకు అమెరికా ఒక అంతిమ డెస్టినేషన్‌గా మారింది. మన పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాలు అమెరికా డాలర్ల ప్రవాహంలో మునిగి తేలుతున్నాయి. ఫలితంగా, కమ్యూనిస్టు సిద్ధాంతానికి గుండెకాయ వంటి సామ్రాజ్య వాద వ్యతిరేక భావన అంతరించింది. మొత్తంగా మధ్యతరగతి వర్గం, నయా మధ్యతరగతి వర్గాలకు కమ్యూనిజం అనేది ఒక ఉబుసుపోని కబురుగా మిగిలిపోయింది. తమ తల్లిదండ్రులు, తాత ముత్తాతల పాత కాలం వాసనగా తయారయ్యింది. అదీ విషయం!

మళ్లీ తెర లేస్తోంది!

ఇదే క్రమంలో సోవియట్ పతనం కూడా దీనికి అదనపు జోడింపై, ఉన్న కాస్తపాటి కమ్యూనిస్టు పార్టీలలో కూడా నైతిక శక్తి, సైద్ధాంతిక బలం నిర్జీవం అయిపోయి రంగు, రుచి, వాసనలను కోల్పోయాయి. ఫలితంగా అవి ఏ సైద్ధాంతిక నిబద్ధతా లేని కొద్దిపాటి మంది అవకాశవాద నాయకుల సమూహంగానో, లేకుంటే మరేం చెయ్యాలో తెలియక ఎర్ర జెండా కప్పించుకొని చనిపోతే చాలు అనుకునే దుర్బల మనఃస్థితిలో జీవిస్తోన్న మానసిక దౌర్బల్యపరులతోనో నిండిపోయాయి.

ఇక్కడ గమనించవలసినది 3, 4 దశాబ్దాల గ్రహణ కాలం నేడు అంతిమ దశకు చేరింది. ఫైనాన్స్ పెట్టుబడుల యుగం దాని చరమాంకానికి చేరుతోంది. పెట్టుబడిదారీ దేశాలు మరెంత మాత్రమూ, మరింతగా కరెన్సీలను ముద్రించి వ్యవస్థలను కాపాడుకొనే అవకాశం లేకుండా పోతోంది. నిరంతరంగా ముద్రించబడిన డబ్బుల ప్రవాహం వలన ఏర్పడిన రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ బుడగలు బద్దలైపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగానే రియల్ ఎస్టేట్ రంగం పతనం, షేర్ మార్కెట్లలో సంక్షోభాలు నేటి సర్వసాధారణ లక్షణాలుగా ఉన్నాయి. ఆర్థిక మాంద్య వాతావరణం ప్రపంచాన్ని కమ్ముకుంటోంది. దీనినంతటినీ మించి ఈ 3, 4 దశాబ్దాల ఫైనాన్స్ వికృత క్రీడకు కేంద్రబిందువయిన అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థ నేడు సంక్షోభాలతో సతమతమవుతోంది. కథ కొలిక్కి వస్తోంది.

ఫైనాన్స్ యుగం గ్రహణం వీడి, పేద–ధనిక వర్గ పోరాటాల యుగానికి నేడు మరలా వేగంగా తెర లేస్తోంది. డాలర్ డ్రీమ్స్ ముగింపులో మరో కొత్త బంగారు లోకం తాలూకు లైట్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ద టన్నెల్ మిలమిలా మెరుస్తూ కనబడుతోంది. ఈసారి ఈ గ్రేట్ మార్చ్ ప్రపంచాన్ని సోషలిస్ట్ మహాయుగం దిశగా నడిపించబోతోంది. వింటున్నారా కామ్రేడ్స్! మేం మళ్ళీ వస్తామన్న మాట నిలబెట్టుకోవడం ఇక మీ వంతు. లాల్ సలామ్!

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు । 98661 79615

బహుముఖ ప్రజ్ఞాశాలి

తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి. కనీస మానవ హక్కులు లేని నిజాం నవాబు నిరంకుశత్వంలో అలమటిస్తున్న ప్రజానీకాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్దిన తెలంగాణ వైతాళికులలో సురవరం ప్రతాపరెడ్డి సదా స్మరణీయులు. పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా, పండితుడిగా, రచయితగా, ప్రేరకునిగా, క్రియాశీల ఉద్యమకారునిగా బహుముఖాలుగా సాగిన సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. ఆ రోజుల్లో తెలుగు వారపత్రికలైన 'నీలగిరి' నల్లగొండ జిల్లా నుండి, 'తెలుగు' వరంగల్ జిల్లా నుంచి వెలువడుతుండేవి. అప్పుడు రాజభాషగా, పాలనా భాషగా, వ్యవహార భాషగా ఉర్దూ ఉండేది. 'గోలకొండ' పత్రిక, దానికి అనుబంధంగా 'ప్రజా వాణి' పత్రికలను స్థాపించి సంపాదకుడిగా, పత్రికా రచయితగా ఆయన ప్రసిద్ధి చెందారు.



సురవరం ప్రతాపరెడ్డి


1926 మే 10వ తేదీన 'గోలకొండ' పత్రికను ప్రారంభించారు. ఆ పత్రిక వారానికి రెండు మార్లు వెలువడుతుండేది. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. ఒక సంపాదకీయంలో 'మేము మా పత్రికా స్థాపన కాలం నుండి రెండు అంశాలను దృష్టిపథంలో ఉంచుకొని దేశీయుల సేవ చేస్తున్నాము. మొదటిది ఆంధ్ర భాషా సేవ, రెండవది జాతి, కుల వివక్ష లేక నిష్పక్షపాతంగా ఆంధ్రులలో సర్వశాఖల సత్వరాభివృద్ధికి పాటుపడుట' అని పత్రిక ఆశయాలను వెల్లడించారు. 1947లో అది దిన పత్రికగా మారింది. పోలీస్ చర్య వరకు ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికా సంపాదకులుగా పనిచేశారు. 1966 వరకూ పత్రిక నడిచింది.

1896 మే 28వ తేదీన గద్వాల సంస్థానం 'బోరవెల్లి'లో సురవరం జన్మించారు. బీఎల్ చదివి న్యాయవాద వృత్తిని చేపట్టినా త్వరలోనే దేశంలో గాంధీ నాయకత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటానికి ఆయన ఆకర్షితులై అటు మళ్లారు. ఆనాటి నైజాంలో రాజ బహదూర్ పింగళి వెంకటరామారెడ్డి కొత్వాలుగా ఉండేవారు. ప్రతాపరెడ్డిని 1924లో హైదరాబాద్ రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా నియమించారు. ఈయన సహాయ సహకారాలతోనే 'గోలకొండ'ను స్థాపించారు సురవరం. తెలంగాణ ప్రజల భాషను కాని, సంస్కృతిని కాని తక్కువ చేసి మాట్లాడితే సహించేవారు కాదు. ముడుంబ వెంకట రాఘవాచార్యులు 'తెలంగాణలో కవులు లేర'న్నారట. ప్రతాపరెడ్డి వారికి తగిన సమాధానం చెప్ప నిశ్చయించి నాలుగు నెలల్లో 354 కవుల జాబితా, వివరాలతో 'గోల్కొండ కవులు' పేరిట ఒక సంచిక ప్రచురించారు. సురవరం సుమారు 40 గ్రంథాలు రచించారు. వారి రచనలలో ప్రధానంగా పేర్కొనదగినది 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'. దీనికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు కూడా వచ్చింది. 1952లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో, మిత్రుల ఒత్తిడిపై వనపర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పక్షాన పోటీచేసి విజయం సాధించిన సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగస్టు 25న దివంగతులయ్యారు. ఆయన కీర్తి అజరామరం.

– నందిరాజు రాధాకృష్ణ । 98481 28215
(నేడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి)

ప్రాథమిక హక్కుల రక్షణ కోర్టు బాధ్యత

అభిప్రాయం



డా॥ మంగారి రాజేందర్

'ఒక వ్యక్తి వెలిబుచ్చిన అభిప్రాయాలు చాలా మందికి నచ్చనప్పటికీ ఆ అభిప్రాయాలు వ్యక్తీకరించే వ్యక్తి హక్కులను గౌరవించాలి. అంతేకాదు రక్షించాలి.'

'ఏ ఖూన్ కే ప్యాసే బాత్ సునో' అన్న జీవిత నేపథ్యం కలిగివున్న ఒక వీడియో క్లిప్‌ను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకుగాను కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గఢీపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్.ఐ.ఆర్.ను గత మార్చి 28వ తేదీన సుప్రీంకోర్టు కొట్టివేస్తూ అన్న మాటలు అవి. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ప్రతాప్ గఢీ దాఖలు చేసిన పిటీషన్‌ను అనుమతిస్తూ... 'ఆ పోస్ట్ ప్రచురించడం వల్ల ఎలాంటి నేరం జరగలే'దని పేర్కొంది. భావప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తీకరణ స్వేచ్ఛలను రక్షించాల్సిన బాధ్యత కోర్టుల మీద, పోలీసుల మీద ఉందని కోర్టు నొక్కి చెప్పింది.

గతంలో భారత రాజ్యాంగ సభలో కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధిగా ఉన్న సోమ్‌నాథ్ లహరి 'ప్రాథమిక హక్కుల అధ్యాయం ఒక పోలీస్ కానిస్టేబుల్ దృక్కోణం నుండి రూపొందించి నట్టు అనిపిస్తుం'దని వ్యాఖ్యానించారు. ఈ హక్కుల వినియోగం చట్టబద్ధమైనదా కాదా అన్నది నిర్ణయించేది పోలీసులే అని ఆయన అన్నారు. ఈ అభిప్రా యంతో మనం ఏకీభవించకపోవచ్చు. కానీ ఇప్పుడు దేశంలో ఉన్న పరిస్థితులను చూస్తే ఆయన వ్యాఖ్యలు గుర్తుకు వస్తున్నాయి.



ఇమ్రాన్ ప్రతాప్ గఢీపై 2024 డిసెంబర్‌లో ఓ క్రిమినల్ కేసును పోలీసులు నమోదు చేశారు. దాన్ని సుప్రీంకోర్టు 2025 మార్చిలో కొట్టివేసింది. ఒక సామూహిక వివాహ కార్యక్రమం వీడియోను ఇమ్రాన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచురించారు. ఆ వీడియో నేపథ్యంలో అతను రాసిన కవిత చదివారు. ఈ కవిత వివిధ వర్గాల ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉందనీ, వారి మధ్య శత్రుత్వం, ద్వేషాన్ని రేపేదిగా ఉందనీ ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. అందుకని ఆయనపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 196, 197 (1), 302, 299, 57, 3 (5) కింద కేసును నమోదు చేశారు. అంటే ప్రజా సమూహాల మధ్య శత్రుత్వం లేదా ద్వేషాన్ని కలిగించే చర్యలను, జాతీయ సమైక్యతకు భంగం కలిగించే చర్యలనీ; మత విశ్వాసాలను అవమానించడం, గాయపరచడం చేస్తుందనీ ప్రథమ సమాచార నివేదికలో ఆరోపించారు. ఈ ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో దరఖాస్తుని దాఖలు చేశారు. దర్యాప్తు ప్రారంభ దశలో ఉందని హైకోర్టు పేర్కొంటూ దరఖాస్తును కొట్టివేసింది. గుజరాత్ హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడాన్ని విమర్శిస్తూ సుప్రీం కోర్టు ఇలా వ్యాఖ్యానించింది: "భారత రాజ్యాంగం అభయం ఇచ్చిన ప్రాథమిక హక్కులను బలపరచడం, అమలు చేయడం కోర్టుల విధి. వాళ్ళు మాట్లాడిన మాటలు, రాసిన రాతలు న్యాయమూర్తులమైన మనకు నచ్చకపోవచ్చు. అయినప్పటికీ ఆర్టికల్ 19 (1) అభయం ఇచ్చిన భావ ప్రకటన, వ్యక్తీకరణ హక్కులను కాపాడాల్సిన బాధ్యత కోర్టుల మీద ఉంది. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ఆదర్శాలను నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయమూర్తుల మీద ఉంది. ప్రాథమిక హక్కులను కాపాడటం కోర్టుల విధి... ఈ హక్కులు ప్రజాస్వామ్యంలో పౌరులకు ఉండే అతి ముఖ్యమైన హక్కులు."

ఇక పోలీసుల నిర్వాకాన్నీ కోర్టు గర్హించింది. "పోలీసు అధికారి రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. రాజ్యాంగ ఆదర్శాలను గౌరవించాలి... దేశ పౌరులందరూ భావప్రకటనా స్వేచ్ఛను కలిగివున్నారు. అది మన రాజ్యాంగ ఆదర్శాలలో ఒకటి. పోలీసులు కూడా దేశ ప్రజలే. వారు కూడా రాజ్యాంగానికి, అందులోని హక్కులకు కట్టుబడి ఉండాలి. ఇమ్రాన్ రాసిన కవిత ఏ మతాన్ని, కులాన్ని, భాషను ప్రస్తావించదు. ఏ మతానికి చెందిన వ్యక్తులను కూడా కవిత ప్రస్తావించదు. ఏ రకంగా చూసినా గ్రూపుల మధ్య శత్రుభావాన్ని ఈ కవిత కలిగించదు. జాతీయ ఐక్యతకి అవి ఎలా హాని కలిగిస్తాయో అర్థం కాదు" అని కోర్టు అభిప్రాయపడింది.

నేర సమాచారం రాగానే కానిస్టేబుల్ కేసు నమోదు చేయాలని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చెబుతుంది. ప్రాథమిక విచారణను చేయడానికి వెసులుబాటును 'భారతీయ నాగరిక సురక్షా సంహిత' కల్పించింది. ఈ కేసులో ప్రాథమిక విచారణ కూడా అవసరం లేదు. గుర్తించదగిన నేరమే జరగనప్పుడు ప్రాథమిక విచారణ అవసరం లేదు. సాహిత్యం, కళలు మన జీవితాలను అర్థవంతం చేస్తాయి. భావప్రకటనా స్వేచ్ఛ గౌరవప్రదమైన జీవితాన్ని ఇస్తుంది. ఇదే ఇమ్రాన్ ప్రతాపగఢీ కేసులో సుప్రీం తీర్పు సారాంశం.

వ్యాసకర్త గతంలో జిల్లా సెషన్స్ జడ్జి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

లాల్ సలామ్ కామ్రేడ్!

మృతదేహాలను అప్పగించకపోవడం ఏ ధర్మ నీతి?

- మావోయిస్టుల మృతదేహాల దహనంపై వామపక్ష పార్టీల ధ్వజం


మాట్లాడుతున్న ప్రొ.హరగోపాల్. చిత్రంలో జస్టిస్ చంద్రకుమార్, కూనంనేని, జాన్ వెస్లీ, సుభాష్ చంద్రబోస్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టుల ఉద్యమానికి భయపడ్డ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చివరికి వారి మృతదేహాలను చూసి కూడా వణికి పోతున్నారని వామపక్షాల పార్టీల నాయకులు ధ్వజమెత్తారు. అనుక్షణం శ్రీరాముడి నామం జపించే బీజేపీ పాలకులకు రావణుడు యుద్ధంలో మరణిస్తే ఆయన దహన సంస్కారాల గురించి రాముడు చేసిన హితబోధ తెలియదా అని ప్రశ్నించారు. ఎన్‌కౌంటర్లో మరణించిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 6 మంది మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహనం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, శాంతి చర్చల కమిటీ నాయకులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు చలపతి (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), సీహెచ్ మురహరి, ఎస్.సుధాకర్ (ఎంసీపీఐ-యూ), హమ్మేష్ (మాస్‌లైన్), జానకిరామ్ (ఆర్ఎస్పీ) పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి: మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించడం అమానవీయమని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు ఏ ప్రమాణాలు పాటించి దహనం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ మృతదేహాలను అప్పగిస్తే రాష్ట్రాల్లో శాంతిభద్రతల సమస్యలు వస్తాయని కేంద్రం ప్రకటించిందంటే మావోయిస్టుల ఉద్యమానికి ప్రజల మద్దతు ఉన్నట్టే కదా అని ప్రశ్నించారు. జస్టిస్ చంద్రకుమార్, జాన్‌వెస్లీ, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, ఆదివాసీ మహిళలను, మావోయిస్టులను చంపేసి కేంద్ర బలగాలు నృత్యాలు చేస్తుంటే దేశ ప్రధాని, హోంమంత్రి హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు చేసుకోవడం ఏ పాలనకు నిదర్శనమని ప్రశ్నించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి: నిరంజన్



సాక్షి, హైదరాబాద్: మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి వారితో కేంద్రం చర్చలు జరపాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. 2026 మార్చిలోగా మావోయిస్టులను ఏరివేస్తాం అంటూ కేంద్ర ప్రకటించడం సరికాదని, వ్యక్తుల నిర్మూలన ద్వారా ఆలోచనలను నిర్మూలించలేరన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా మావో వాదంపై ఆకర్షిస్తున్న తీరుపై కేంద్రం ఆలోచించడం లేదని పేర్కొన్నారు. తూటాకు తూటా, రక్తానికి రక్తం జవాబు కాదు అనేందుకు తెలంగాణ గొప్ప ఉదాహరణగా నిలుస్తుందన్నారు.

నంబాలకు తూటా తాకగానే నినదించిన మావోయిస్టులు

- ఆయనను కాపాడేందుకు ప్రాణాలకు తెగించి పోరాటం
- దాదా నేలకొరిగే వరకు వెనుకడుగు వేయని వైనం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీపీఐ (మావోయిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో కన్నుమూసి వారం దాటింది. లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన సమాచారమే నంబాల మృతికి కారణమంటూ.. ఆ పార్టీకి చెందిన విప్లవ్ సోమవారం లేఖ జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, పేరు చెప్పడానికి ఇష్టపడని పోలీస్ అధికారులు ఎన్‌కౌంటర్ జరిగిన తీరును వెల్లడించారు. ఆ వివరాలు 'సాక్షి'కి ప్రత్యేకం.

మూడో రోజు ఎదురుకాల్పులు

ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్ అడవుల్లో పీఎల్‌జీఏ కంపెనీ-7 సంచరిస్తోందన్న సమాచారం రావడంతో అక్కడ మావోయిస్టు కీలక నేత ఉన్నట్టుగా భావించిన పోలీసులు ఈనెల 19న సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. సుక్మా, బీజాపూర్, దంతేవాడ, నారాయణపూర్ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ యూనిట్లతో కుడ్‌మేల్-కలజా-జట్లూర్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆరోజు ఇరువర్గాల మధ్య నాలుగుసార్లు ఎదురుకాల్పులు చోటుచేసుకున్నా భద్రతా దళాలకు సానుకూల ఫలితం రాలేదు. అయినప్పటికీ అలసిపోకుండా 20వ తేదీ కూడా ముందుకు సాగారు. ఆ రోజు రాత్రి అడవిలోనే క్యాంప్ ఏర్పాటు చేసుకున్నారు. ఇక 21వ తేదీ తిరిగి సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించిన కాసేపటికే డీఆర్‌జీ బృందాలను ముందుండి నడిపిస్తున్న జవాన్‌పై సెంట్రీ విధుల్లో ఉన్న ఓ మావోయిస్టు ఉదయం 7 గంటల సమయాన తుపాకీ మడమతో కొట్టి దాడి చేశాడు. ఇరువురి మధ్య జరిగిన పెనుగులాటలో తుపాకులు ఫైర్ అయ్యాయి. దీంతో ఒక్కసారిగా ఇటు భద్రతా దళాలు, అటు మావోయిస్టులు అప్రమత్తమై పొజిషన్ తీసుకున్నారు. అప్పటికే మూడు రోజులుగా భద్రతా దళాల ఆపరేషన్ నుంచి చాకచక్యంగా తప్పించుకుంటూ వస్తున్న సాయుధులైన మావోయిస్టుల బృందం ఎదురుగా ఉన్న భద్రతా దళాల వలయాన్ని ఛేదించుకుని దక్షిణ దిశగా వెళ్లేందుకు యత్నించింది. అయితే అదే దిశగా మరో డీఆర్‌జీ టీమ్ కాల్పులు జరుపుతుండటంతో వెనక్కి తిరిగి ఉత్తర దిశగా వెళ్తూ కొంచెం ఎత్తుగా ఉన్న ప్రదేశానికి చేరారు. అక్కడి నుంచి భద్రతా దళాల మీద కాల్పులు జరపడం మొదలెట్టారు. ఇదే సమయాన మావోయిస్టులంతా వలయాకారంలోకి వచ్చి మధ్యలో ఓ వృద్ధుడైన వ్యక్తిని కాపాడటానికి యత్నించడం భద్రతా దళాలు గమనించాయి. దీంతో వలయంలో ఉన్న పెద్ద మనిషి కచ్చితంగా పార్టీకి చెందిన టాప్‌ర్యాంక్ లీడరై ఉంటాడనే నమ్మకం, పట్టుదలతో కాల్పులు జరుపుతూ మావోయిస్టుల వలయం వైపు దూసుకెళ్లారు.

శక్తివంచన లేకుండా ప్రయత్నించి..

అటువైపు 30 నుంచి 40 మంది మావోయిస్టులు ఉండగా.. డీఆర్‌జీ బలగాలు దాదాపు 1000 మంది నాలుగు బృందాలుగా విడిపోయి కాల్పులు ప్రారంభించారు. ఇరువైపులా అర గంట పాటు కాల్పులు జరిగాయి. మధ్యలో ఉన్న ముఖ్యమైన వ్యక్తికి గార్డుగా నిలిచిన మావోయిస్టుకు తూటా తాకడంతో పడిపోయాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే కీలకమైన వ్యక్తికి సైతం తూటా తాకడంతో ఆయన కూడా పడిపోయారు. అప్పటివరకు వలయంగా ఉండి తమ నాయకుడిని కాపాడేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించిన మావోలు 'లాల్ సలామ్ కామ్రేడ్.. పీఎల్‌జీఏ జిందాబాద్' అని నినాదాలు చేస్తూ వలయం నుంచి విడిపోయి చెల్లాచెదురై భద్రతా దళాల వైపు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించారు. కానీ వారిని వెంటాడుతూ భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో చాలా మంది చనిపోగా కొందరు తప్పించుకున్నారు. కాల్పులు ఆగిపోయాక ఘటనాస్థలిలో పరిశీలించగా మావోయిస్టులు తమ ప్రాణాలకు తెగించి కాపాడేందుకు యత్నించిన కీలక వ్యక్తి అక్కడే పడిపోయి ఉన్నాడు. డీఆర్‌జీ జవాన్లలో కొందరు ఆయనను మావోయిస్టు పార్టీ చీఫ్ నంబాల కేశవరావు అలియాస్ డీఆర్ దాదా అలియాస్ బసవరాజుగా గుర్తించారు. ఆ తర్వాత సెర్చ్ ఆపరేషన్ చేపట్టగా కేశవరావుతో కలిసి మొత్తం 27 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి.

నంబాలకు తూటా ఎక్కడ తాకింది?

ఎన్‌కౌంటర్ మృతుల ఫొటోలను పరిశీలిస్తే ఎక్కువ మంది మావోయిస్టుల తలలకు తూటాల గాయాలు కనిపించాయి. ఎదురు కాల్పులు జరిగే సందర్భాల్లో గాయపడి పారిపోతూ కిందపడిన / చనిపోయిన ప్రత్యర్థుల శరీరాలను స్వాధీనం చేసుకునే క్రమాన ముందు జాగ్రత్తగా తలపై కాలుస్తుంటారు. అందుకే నంబాల రక్షణ టీమ్‌లో చాలామందికి హెడ్‌షాట్స్ కనిపించాయి. అయితే నంబాలకు మాత్రం అలా కనిపించలేదు. శరీరంలో మరేదైనా కీలక భాగంలో తూటా గాయం కావడంతోనే ఆయన మరణించి ఉండవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, ప్రాణాలతో పట్టుబడిన నంబాలను భద్రతా దళాలు కాల్చి చంపాయని మావోయిస్టులు తమ లేఖలో ఆరోపించారు.

నంబాలకు కుటుంబసభ్యుల కన్నీటి నివాళి

- మృతదేహం అప్పగించకపోవడంతో కలత చెందిన తల్లి, సోదరుడు
- ఏపీ హైకోర్టులో ఛత్తీస్‌గఢ్ పోలీసులపై కోర్టు ధిక్కార కేసు నమోదు


కేశవరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తల్లి భారతమ్మ, కుటుంబ సభ్యులు

టెక్కలి: మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు చిత్రపటం వద్ద కుటుంబ సభ్యులు మంగళవారం నివాళులు అర్పించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో కేశవరావు నివాసం వద్ద తల్లి భారతమ్మ, సోదరుడు ఢిల్లేశ్వరరావుతోపాటు కుటుంబ సభ్యులంతా నివాళులు అర్పించి కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, నంబాల కేశవరావు కుటుంబ సభ్యులు మరోమారు హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. కేశవరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా ఛత్తీస్‌గఢ్ పోలీసులు దాన్ని ధిక్కరించడంపై కేశవరావు తల్లి భారతమ్మ, సోదరుడు ఢిల్లేశ్వరరావు తరఫున పౌర హక్కుల సంఘం మరోమారు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ధిక్కార కేసు నమోదు చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అమితాబ్ జైన్, ఆ రాష్ట్ర డీజీపీ అరుణదేవ్ గౌతమ్, బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తదితర అధికారులను ప్రతివాదులుగా చేర్చినట్లు తెలుస్తోంది.

వచ్చేస్తోంది ఐదో తరం ఫైటర్

అత్యాధునిక యుద్ధవిమానం 'అమ్కా'


రక్షణశాఖ బుధవారం విడుదల చేసిన ఏఎంసీఏ (అమ్కా) మోడల్

న్యూఢిల్లీ: మారుతున్న యుద్ధతంత్రాలకు అనుగుణంగా అధునాతన ఐదోతరం యుద్ధవిమానాన్ని రూపొందించే బృహత్తర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. అడ్వాన్స్‌డ్ మీడియా కంబాక్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)గా పిలిచే నవతరం యుద్ధవిమానం మోడల్ తయారీకి సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆమోదముద్ర వేశారు. ఏఎంసీఏ ప్రాజెక్ట్‌లో భాగంగా గగనతలంలో మెరుపువేగంతో దూసుకుపోతూ శత్రు రాడార్లు, నిఘా వ్యవస్థలను ఏమారుస్తూ భీకర స్థాయిలో దాడి చేయగల మధ్య స్థాయి బరువైన ఐదో తరం యుద్ధ విమానాన్ని అభివృద్ధి చేయనున్నారు. కొత్త ప్రాజెక్ట్ దేశీయ రక్షణ సామర్థ్యాలను మరింత పెంచడంతోపాటు స్థానిక వైమానిక తయారీ రంగ పరిశ్రమ పురోభివృద్ధికి ఇది బాటలు వేయనుందని రక్షణ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)కు చెందిన ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ) రక్షణ రంగ సంస్థల భాగస్వామ్యంతో ఏఎంసీఏ మోడల్‌ను అభివృద్ధి చేయనుంది. ప్రైవేట్ సంస్థలకూ ప్రాజెక్టులో భాగస్వామ్యం దక్కుతుండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి. ''ఈ ప్రాజెక్ట్‌ను స్వతంత్ర సంస్థలాగా లేదంటే జాయింట్ వెంచర్‌లాగా లేదంటే కన్సార్షియం మాదిరి నెలకొల్పి ప్రారంభించనున్నాం. ఈ కొత్త సంస్థను భారతీయ సంస్థగానే నమోదు చేస్తాం. పూర్తిగా భారతీయ చట్టాలు, నియమనిబంధనలకు లోబడే ఈ సంస్థ పనిచేయనుంది. ఏఎంసీఏ ప్రోటోటైప్ దేశీయ రక్షణరంగ సత్తాను చాటేలా ఉంటుంది. రక్షణరంగంలో స్వావలంబన, ఆత్మనిర్భరత సాధనలో ఇది మైలురాయిగా నిలవనుంది'' అని రక్షణ శాఖ పేర్కొంది. ఈ ప్రాజెక్ట్‌ను రూ.15,000 కోట్ల ఆరంభ వ్యయంతో మొదలు పెట్టనున్నారు. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వాయుసేన, నావికాదళం డిమాండ్లకు తగ్గట్లు ఏఎంసీఏ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చుతోంది. తేలికపాటి యుద్ధవిమానమైన తేజస్ తర్వాత మధ్యశ్రేణి బరువైన అడ్వాన్స్‌డ్ మీడియా కంబాక్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ దిశగా భారత్ ముందడుగు వేయడం విశేషం. దీన్ని 2035కల్లా తయారు చేయాలని డీఆర్‌డీవో లక్ష్యం నిర్దేశించుకుంది. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ గతేడాది ఈ ప్రాజెక్ట్‌కు అంగీకారం తెలిపింది. పదేళ్లలోపు తయారు చేస్తామని డీఆర్‌డీఓ చైర్మన్ సమీర్ కామత్ అప్పుడే చెప్పారు.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు కేంద్రం ఆమోద ముద్ర

- రూ.15,000 కోట్లతో ప్రారంభం: రాజ్‌నాథ్
- పదేళ్లలో తొలి విమానం అందుబాటులోకి

మూడు దేశాల వద్దే

ప్రస్తుతం మూడు దేశాల వద్ద మాత్రమే ఐదో తరం యుద్ధవిమానాలున్నాయి.

- → **అమెరికా:** ఎఫ్–22 రాప్టర్, ఎఫ్–35ఏ లైట్నింగ్– II
- → **చైనా:** చెంగ్డూ జె–20 మైటీ డ్రాగన్, జె–35
- → **రష్యా:** సుఖోయ్ 57ఇ

భిన్న రకాల బాంబులు

అమ్కాలో వేర్వేరు రకాల క్షిపణులు, మందుగుండును అమర్చవచ్చు.

- → గైడెడ్ మిస్సైళ్లతోపాటు నాలుగు దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించవచ్చు.
- → 1,500 కేజీల బరువైన బాంబులను సునాయాసంగా జారవిడవగలదు.
- → ఇది అత్యల్పస్థాయిలో విద్యుదయస్కాంత స్వభావాన్ని ప్రదర్శిస్తుంది. దాంతో శత్రు రాడార్లు దీని జాడను కనిపెట్టడం చాలా కష్టం.

సైలెంట్ కిల్లర్

కొత్త తరహా సెన్సార్ వ్యవస్థ, అంతర్గత ఆయుధ వ్యవస్థ, కమ్యూనికేషన్, నావిగేషన్, సూపర్ క్రూయిజ్ సామర్థ్యం ఇలా ఎన్నో విశిష్టతల సమాహారంగా అమ్కా ఫైటర్ జెట్ రూపుదిద్దుకోనుంది. ఇందులోని విశేషాలు అన్నీ ఇన్నీ కావు...

- → అమ్కా మొత్తం బరువు 25 టన్నులు. ఇందులో జంట ఇంజిన్లు ఉంటాయి. సుదూరాలకు ప్రయాణించగలిగేలా 6.5 టన్నుల ఇంధనాన్ని విమానంలో నింపొచ్చు.
- → కొత్త యుద్ధవ్యూహాలకు తగ్గట్లు, శత్రు రాడార్లకు చిక్కకుండా, నిశ్శబ్దంగా దూసుకెళ్లేలా దీనిని డిజైన్ చేస్తారు. ఇది ఏకంగా 55,000 అడుగుల ఎత్తులో ఎగరగలదు.
- → కృత్రిమ మేధ సాయంతో దీనిని పైలట్ లేకుండానే భూమి మీద నుంచే నియంత్రించవచ్చు.
- → ఉపగ్రహాల నుంచి అందే రియల్‌టైమ్ డేటాను విశ్లేషించుకుంటూ కొత్తరకం నెట్ సెంట్రిక్ వార్‌ఫేర్ సిస్టమ్‌తో ఇది పనిచేస్తుంది.
- → ఇది అన్ని రకాల వాతావరణాల్లో, ప్రతికూల పరిస్థితుల్లోనూ నిర్నిరోధంగా దూసుకెళ్లగలదు.
- → శత్రు గగనతలంలోకి వెళ్లగానే ఎలక్ట్రానిక్, ఆప్టికల్, ఇన్‌ఫ్రారెడ్ వ్యవస్థల సాయంతో వారి రాడార్లను పేల్చేసే 'సీడ్' అనే ప్రత్యేక వ్యవస్థ ఈ విమానం సొంతం. అలా శత్రువుల క్షిపణి ప్రయోగ వ్యవస్థ నిర్వీర్యమవుతుంది. మన యుద్ధవిమానాల పని సులువవుతుంది.
- → అమ్కా వేగంగా యాంటీ–రేడియేషన్ క్షిపణులను ప్రయోగించగలదు.
- → దీనిలో వాడే ఇంజన్‌ను విదేశీ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్ (ఓఈఎం)లతో సంయుక్తంగా తయారు చేయనున్నారు.

ఏమిటీ ఐదో తరం?

- → 1940–50 దశకంలో తయారైన వాటిని తొలి తరం యుద్ధవిమానాలుగా పేర్కొంటారు. వీటిల్లో రాడార్‌లు ఉండవు. కేవలం మెషీన్ గన్ బిగించి ఉంటుంది. వేగమూ తక్కువే.
- → 1950–60 కాలంలో తయారైనవి రెండో తరానికి చెందినవి. ప్రాథమిక స్థాయి రాడార్ వ్యవస్థ వీటిల్లో ఉండేది. సూపర్‌సోనిక్ వేగంతో దూసుకెళ్లేవి. మిగ్–21, మిరాజ్–3 ఈ రకానివే.
- → 1970–80ల్లో తయారైనవి మూడో తరానికి చెందినవి. ఇవి శత్రు విమానాలను గాల్లోనే పేల్చేయగలవు. ఎఫ్–4, మిగ్–23, జాగ్వార్ ఈ కోవకు వస్తాయి.
- → 1980–90 కాలంలో తయారైనవి 3.5 తరానికి చెందినవి. వీటిల్లో డిజిటల్ వ్యవస్థలు వచ్చిచేరాయి. ఆకాశంలో 40 కి.మీ. దూరంలోని విమానాలను కూడా పేల్చేసే శక్తి సామర్థ్యాలు వీటి సొంతం. ఎఫ్–5ఈ టైగర్2, మిగ్–21 బిసాన్ ఈ రకానివే.
- → 1990 తర్వాత నాలుగో తరం యుద్ధవిమానాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడున్నవన్నీ 4, 4.5 తరాలకు చెందినవే.

క్లాసులు డుమ్మా కొడితే ఇంటికే

- కోర్సులు మధ్యలో వదిలేస్తే స్టూడెంట్ వీసా రద్దు
- మళ్లీ వీసా కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండదు
- వీసా నిబంధనలకు విదేశీ విద్యార్థులు కట్టుబడి ఉండాలి
- భారత్‌లోని యూఎస్ ఎంబసీ సూచన

వాషింగ్టన్: అమెరికాలో విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరగతులకు డుమ్మా కొట్టినా లేక కోర్సులు మధ్యలో వదిలేసినా వీసా రద్దు కావడం ఖాయం. భవిష్యత్తులో వీసా కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం కూడా ఉండదు. అంటే అమెరికాలో మళ్లీ అడుగు పెట్టడం చాలా కష్టమనే చెప్పొచ్చు. విద్యాసంస్థకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా తరగతులకు గైర్హాజరు కావడం లేదా కోర్సును మధ్యలోనే వదిలేయడం వంటివి చేస్తే విద్యా వీసా రద్దవుతుందని ఇండియాలోని అమెరికా ఎంబసీ తేల్చిచెప్పింది. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేసింది. వీసా నిబంధనలకు ఎట్టిపరిస్థితుల్లోనూ కట్టుబడి ఉండాలని తేల్చిచెప్పింది. అమెరికాలో చదువుకుంటున్న కాలం లో సమస్యలేవీ రాకుండా ఉండాలంటే స్టూడెంట్ స్టేటస్ కోల్పోకుండా జాగ్రత్తపడాలని పేర్కొంది. అమెరికాలో లక్షలాది మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతిఏటా వీరి సంఖ్య పెరుగుతోంది.

విదేశీ విద్యార్థుల్లో ట్రంప్ గుబులు

అమెరికాలోని విదేశీ విద్యార్థులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో కఠినంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ముందస్తుగా నోటీసు ఇవ్వకుండానే వీసాలు రద్దు చేస్తోంది. దాంతో చాలామంది అమెరికాను వీడి స్వదేశాలకు వెళ్లిపోవాల్సి వస్తోంది. పాలస్తీనాకు అనుకూలంగా నిరసనల్లో పాల్గొన్నవారి వీసాలు రద్దయ్యాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలినా వేటు పడింది. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలపై న్యాయ పోరాటం చేసే శక్తి లేని విద్యార్థులు మౌనంగా స్వదేశాల బాట పడుతున్నారు. న్యాయ పోరాటంలో గెలిచిన విద్యార్థులు సైతం కొందరు ఉన్నారు. కానీ, వారి సంఖ్య చాలా స్వల్పం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఆధ్వర్యంలోని స్టూడెంట్ అండ్ ఎక్స్చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(సెవిస్) నుంచి విదేశీ విద్యార్థుల వివరాలను హఠాత్తుగా తొలగిస్తున్నారు. దాంతో వారు అమెరికా వదిలి వెళ్లాల్సి వస్తోంది. ఇలా తొలగిస్తున్నట్లు విద్యార్థులకు గానీ, యూనివర్సిటీలకు గానీ ముందుగా తెలియజేయడం లేదు. మరోవైపు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్(ఓపీటీ) సదుపాయాన్ని తొలగించాలని ట్రంప్ సర్కారు నిర్ణయించడం విదేశీ విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. ఈ మేరకు ఫెయిర్‌నెస్ ఫర్ హై–స్కిల్డ్ అమెరికన్స్ యాక్ట్–2025 పేరిట ఒక బిల్లును ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ బిల్లు చట్టంగా మారితే.. గ్రాడ్యుయేషన్ తర్వాత విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉద్యోగాలు చేసుకొనేందుకు అవకాశం ఉండదు. చదువు పూర్తికాగానే సొంత దేశాలకు వెళ్లిపోవాల్సిందే.


కారుణ్య మరణాలకు ఫ్రాన్స్ చట్టబద్ధత!

బిల్లుకు జాతీయ అసెంబ్లీ ఆమోదం

పారిస్: కారుణ్య మరణాలకు చట్టబద్ధత కల్పించే దిశగా ఫ్రాన్స్ కీలక అడుగు వేసింది. నయం కాని వ్యాధులతో బాధపడే వారు జీవితాన్ని అంతం చేసుకునేందుకు వీలు కల్పించే వివాదాస్పద బిల్లును జాతీయ అసెంబ్లీ మంగళవారం ఆమోదించింది. దానికి అనుకూలంగా 305 ఓట్లు రాగా 199 మంది సభ్యులు వ్యతిరేకించారు. తదుపరి దశలో బిల్లుపై సెనేట్ కూలంకషంగా చర్చిస్తుంది. అది చట్టాల విషయంలో తుది నిర్ణయాధికారం జాతీయ అసెంబ్లీదే. కనుక సెనేట్ నిర్ణయంతో నిమిత్తం లేకుండా ఆత్మహత్య బిల్లు చట్టరూపు దాలుస్తుంది. అయితే ఫ్రాన్స్‌లో అమల్లో ఉన్న చట్టపరమైన సంక్లిష్టతల దృష్ట్యా అందుకు మరికొన్ని నెలలు పట్టవచ్చు. నయంకాని వ్యాధులున్న వారు విషం తీసుకుని మరణించేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది.

వచ్చే నెలలో మంచి వర్షాలే

సాధారణం కంటే అధిక వర్షపాతం: ఐఎండీ



న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాలు ఇప్పటికే దేశంలోకి ప్రవేశించాయి. రోజురోజుకీ విస్తరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు మొదలయ్యాయి. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. జూన్ నెలలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) మంగళవారం తెలియజేసింది. దేశంలో దీర్ఘకాల సగటు వర్షపాతం 166.9 మిల్లీమీటర్లు కాగా, వచ్చే నెలలో అంతకంటే 108 శాతం అధిక వర్షం కురిసే పరిస్థితులు ఉన్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ చెప్పారు. దేశవ్యాప్తంగా సాధారణం నుంచి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈశాన్య, వాయవ్య, దక్షిణ భారతదేశంలో సాధారణం కంటే వర్షపాతం నమోదు కావొచ్చని పేర్కొన్నారు. వర్షాల కారణంగా ఈశాన్యం, వాయవ్య ప్రాంతాలు మినహా దేశమంతటా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం, అంతకంటే తక్కువగానే రికార్డు అవుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. సాధారణ వర్షపాతం 87 సెంటీమీటర్లు కాగా, ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ దాకా 106 శాతం అధిక వర్షపాతం నమోదయ్యే వీలుందని తెలిపారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్‌లో మంచి వర్షాలు కురుస్తాయని వివరించారు. పంజాబ్, హరియాణా, కేరళ, తమిళనాడుల్లో సాధారణ కంటే తక్కువ వర్షం పడుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో 2020లో 958 మిల్లీమీటర్లు, 2021లో 870, 2022లో 925, 2023లో 820, 2024లో 934.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

వక్ఫ్ చట్టం-1995పై... కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టం–1995 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలైంది. అందులోని పలు నిబంధనలు ముస్లిమేతరులకు తమ ఆస్తులపై హక్కును దూరం చేయడమే గాక వక్ఫ్ ఆస్తులకు అనుచిత లబ్ధి కలిగించేలా ఉన్నాయని ఆరోపించింది. ఇలా వక్ఫ్, వక్ఫ్ ఆస్తులకు అనుకూలంగా పార్లమెంటు చట్టాలు చేయజాలదని పిటిషనర్ నిఖిల్ ఉపాధ్యాయ్ వాదించారు. ఆ పిటిషన్‌ను సీజేఐ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీ ధర్మాసనం మంగళవారం విచారణకు స్వీకరించింది. ''1995 నాటి చట్టాన్ని ఇప్పుడెందుకు సవాలు చేస్తున్నట్టు? ఈ ప్రాతిపదికన మీ పిటిషన్‌ను మేమెందుకు తిరస్కరించకూడదు?'' అని సీజేఐ ఈ సందర్భంగా ప్రశ్నించారు. 1995 నాటి చట్టానికి 2013లో చేసిన పలు సవరణలను తాము సవాలు చేస్తున్నట్టు పిటిషనర్ తరఫు న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ విన్నవించారు. పూజనీయ స్థలాల (ప్రత్యేక సదుపాయాల) చట్టం –1991, జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం –1992ల్లోని పలు నిబంధనలను సవాలు చేస్తూ 2020లో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని గుర్తు చేశారు. దాంతో ఆ పిటిషన్లతో కలిపి వాదనలు వినేందుకు ధర్మాసనం అంగీకరించింది. తాజా పిటిషన్‌పై స్పందించాలంటూ కేంద్రానికి నోటీసులిచ్చింది. వక్ఫ్ (సవరణ) చట్టం –2025కు సంబంధించి మూడు కీలకాంశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై ధర్మాసనం మే 22న తీర్పును రిజర్వు చేయడం తెలిసిందే.

విదేశీకి రాం రాం స్వదేశీకి ప్రణామ్

మేడిన్ చైనాను వదిలేద్దాం.. మేడిన్ ఇండియాకు మళ్లుదాం

- హెయిర్ పిన్ను నుంచి వినాయక విగ్రహాల దాకా చైనావేనా?
- దేశీయ తయారీ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- ఇకనైనా స్వదేశీ ఉత్పత్తులను ఆదరిద్దాం
- ట్రేడర్లకు, పౌరులకు ప్రధాని మోదీ విజ్ఞప్తి



గాంధీనగర్: ఆత్మనిర్భరత ఆవశ్యకతను ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. వస్తు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని వ్యాపారులకు, పౌరులకు విజ్ఞప్తి చేశారు. హోలీ, దీపావళి, వినాయక చవతి పర్వదినాల్లో వాడే వస్తువులను చైనా నుంచి దిగుమతి చేసుకునే సంస్కృతిని విడనాడాలని సూచించారు. రెండు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా మంగళవారం గాంధీనగర్‌లో 'అర్బన్ డెవలప్‌మెంట్ ఇయర్–2025'కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ''దీపావళి, హోలీ వేళ చైనా వస్తువుల దిగుమతి ఎక్కువవుతోంది. వ్యాపారులు హోలీ రంగులు, వినాయక విగ్రహాలను కూడా చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఆ విగ్రహాల కళ్లు కనీసం తెరిచి ఉన్నాయో కూడా తెలియనంత చిన్నగా ఉంటున్నాయి. ఎక్కువ లాభాలు కళ్లచూడొచ్చని గ్రామీణ వ్యాపారులు విదేశీ ఉత్పత్తులపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ధోరణి మారాలి. విదేశీ ఉత్పత్తులను విక్రయించకుండా వారిలో మార్పు తేవాలి'' అని మోదీ కోరారు.

వాడే వస్తువుల జాబితా రాయండి

''ఓ భారతీయునిగా నేను మీకో పని అప్పజెప్తున్నా. ఇంటికెళ్లి ఒక రోజులో ఎన్ని విదేశీ వస్తువులు వినియోగిస్తున్నామో జాబితా రాయండి. మీరే ఆశ్చర్యపోతారు. హెయిర్ పిన్ను, దువ్వెన కూడా విదేశీవే'' అని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. ''తక్కువ ధర పలికే వస్తువులను భారతీయ మార్కెట్లోకి చైనా గుమ్మరిస్తోంది. అలంకరణ లైట్లు, టపాసులు, బొమ్మలు, సైకిళ్లు, ఆధ్యాత్మిక వస్తూత్పత్తులు చైనా నుంచి పోటెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా పండుగల వేళ అమ్మకాల్లో వీటి హవానే కొనసాగుతోంది. దాంతో భారత కళాకారుల వస్తువులు, దేశీయ తయారీ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రజలు ఇప్పటికైనా దిగుమతి వస్తువులపై ఆధారపడటాన్ని మానుకోవాలి. విదేశీ వస్తువుల వాడకానికి ఆమడ దూరం జరుగుదాం. భారత్‌ను కాపాడాలంటే దేశీయ వస్తు వులనే వాడండి. మేకిన్ ఇండియాను ముందుకు తీసుకెళ్లండి. 140 కోట్ల భారతీయుల తరఫున మన సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను దిగ్విజయంగా నిర్వహించింది. అలాగే మనందరం భారత వస్తువులనే ఆదరిద్దాం. దేశీయ తయారీ రంగాన్ని కాపాడుకుందాం'' అని పిలుపునిచ్చారు.

'పీఓకే' నెహ్రూ పుణ్యమే

పీఓకే రాచపుండుకు నెహ్రూయే కారణమని మోదీ ఆరోపించారు. ''1947 అర్ధరాత్రి వేళ భరతమాత దాస్య శృంఖలాలను సరిగా తెంచకపోవడంతో మనం బాహువులనూ కోల్పోవాల్సి వచ్చింది. భారత్, పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ రూపంలో దేశం మూడు ముక్కలైంది. ముజాహిదీన్ల ముసుగులో ఉగ్రవాదులు, పాక్ సైన్యం అండతో కశ్మీర్‌ను పాక్ కొంతమేర ఆక్రమించింది. పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకునేదాకా మన సైన్యం విశ్రమించరాదని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పట్టుబట్టినా నాటి పాలకులు పట్టించుకోలేదు. ఆ తప్పిదం ఫలితాన్ని నేటికీ అనుభవిస్తున్నాం. పహల్గాం పాశవిక దాడి అందుకు తాజా తార్కాణం'' అంటూ నాటి నెహ్రూ సర్కారు తీరును తప్పుబట్టారు.

ఉగ్రవాదమే పాక్ యుద్ధవ్యూహం

ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలనూ మోదీ ప్రస్తావించారు. ''వసుధైక కుటుంబకం అనేది మన సంస్కారం. పొరుగువారు సైతం సంతోషంగా ఉండాలనే కోరుకుంటాం. కానీ మన సహనం, శక్తిసామర్థ్యాలను పరీక్షించాలనుకునే వారికి మనది యోధుల పురిటిగడ్డ అని తెలియజెప్పగలం కూడా! ఆపరేషన్ సిందూర్‌లో మనం మట్టుబెట్టిన కరుడుగట్టిన ఉగ్రవాదులకు పాక్ నీరాజనాలు పలికింది. వాళ్ల శవాలపై పాక్ జాతీయ జెండాలు కప్పింది. వారి అంత్యక్రియల్లో ప్రభుత్వ, సైనికాధికారులు పాల్గొని సెల్యూట్లు చేశారు. ఇంతచూశాక ఉగ్రవాదం పాక్ పరోక్ష వ్యూహమని భావించకూడదు. ఉగ్రవాదం ముమ్మాటికీ పాక్ యుద్ధవ్యూహమే. సమస్యలను దౌత్య మార్గంలో పరిష్కరించుకోవాల్సింది పోయి మనపై పలుమార్లు యుద్ధాలకు దిగి తోకముడిచింది. అందుకే ఉగ్రవాదం ద్వారా ఇలా పరోక్ష యుద్ధాలకు దిగుతోంది. పాక్ తీరు ఇలాగే కొనసాగితే భారత్ దీటుగా బదులిస్తుంది. ఒక్క ముల్లు బలమైన శరీరాన్ని కూడా బాధిస్తుంది. భారత్‌ను బాధిస్తున్న ముష్కర ముల్లును శాశ్వతంగా తొలగిస్తాం'' అన్నారు.

సర్వీసు నుంచి డిస్మిస్ అయితే రిటైర్‌మెంట్ ప్రయోజనాలు సున్నా

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త నిబంధనలు
- సెంట్రల్ సివిల్ సర్వీసెస్(పెన్షన్) రూల్స్‌లో మార్పులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల(పీఎస్‌యూ)కు సంబంధించిన ఉద్యోగుల పెన్షన్ నిబంధనల్లో కేంద్రం కీలక మార్పులు చేసింది. ఎవరైనా ఉద్యోగంలో ఉన్నప్పుడు డిస్మిస్ అయినా, మధ్యలో తొలగింపునకు గురైనా అతడికి రిటైర్‌మెంట్ ప్రయోజనాలు అందవు. అయితే, సదరు ఉద్యోగి డిస్మిస్ లేదా తొలగింపును పరిపాలనా శాఖ పునఃసమీక్షిస్తుంది. ఈ మేరకు సెంట్రల్ సివిల్ సర్వీసెస్(పెన్షన్) రూల్స్–2021లో మార్పులు చేసి, సెంట్రల్ సివిల్ సర్వీసెస్(పెన్షన్) అమెండ్‌మెంట్ రూల్స్–2025 తీసుకొచ్చారు. ఈ కొత్త నిబంధనలను ఈ నెల 22న నోటిఫై చేశారు. సర్వీసులో ఉన్నప్పుడు మధ్యలో దుష్ప్రవర్తన కారణంగా తొలగింపునకు గురైతే పదవీ విరమణ తర్వాత వచ్చే ప్రయోజనాలు కోల్పోవాల్సి ఉంటుంది. గతంలో ఇలాంటి అవకాశం లేదు. మధ్యలో డిస్మిస్ అయినా సరే రిటైర్‌మెంట్ ప్రయోజనాలు యథావిధిగా అందేవి. 2003 డిసెంబర్ 31 కంటే ముందు నియమితులైన కేంద ప్రభుత్వ ఉద్యోగులకు ఈ మేరకు సెంట్రల్ సివిల్ సర్వీసెస్(పెన్షన్) రూల్స్–2021 వర్తిస్తాయి. రైల్వే ఉద్యోగులకు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి సర్వీసులకు మినహాయింపు ఉంటుంది.

ఇదొక కొత్త మనువాదం

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు తీవ్ర అన్యాయం

- అర్హతలున్నా ఉద్యోగాలు ఇవ్వడం లేదు
- కేంద్రంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపాటు

న్యూఢిల్లీ: దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్ ఫలాలు దక్కకుండా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు సాగిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలపై అనర్హులన్న ముద్రవేసి విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలు దూరం చేస్తున్నారని, నాయకత్వ స్థానాలకు ఎదగకుండా అణగదొక్కుతున్నారని నిప్పులు చెరిగారు. ఈ మేరకు రాహుల్ మంగళవారం 'ఎక్స్'లో ఒక వీడియో పోస్టుచేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కుట్రపూరితంగా 'నాట్ ఫౌండ్ సూటబుల్' అని ప్రకటించి, ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని ఆరోపించారు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ప్రతినిధులతో ఇటీవల రాహుల్ జరిపిన సంభాషణ ఈ వీడియోలో ఉంది. 'నాట్ ఫౌండ్ సూటబుల్'అనేది ఇప్పుడు కొత్త మనువాదంగా మారిపోయిందని ఆయన విమర్శించారు. యూనివర్సిటీల్లో 60 శాతానికి పైగా రిజర్వ్‌డ్ ప్రొఫెసర్ పోస్టులు, 30 శాతానిక పైగా రిజర్వ్‌డ్ అసోసియేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేరన్న సాకుతో వాటిని భర్తీ చేయడం లేదని తప్పుపట్టారు. అర్హులైన అభ్యర్థులు ఉన్నప్పటికీ వారికి అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. సమానత్వం సాధించడానికి అతిపెద్ద ఆయుధం విద్యేనని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చెప్పినట్లు రాహుల్ గాంధీ గుర్తుచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ ఆయుధాన్ని నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. రిజర్వేషన్లు పొందడం అనేది హక్కులు, గౌరవం, సంపదలో భాగస్వామ్యం పొందడం కోసం పోరాటమని ఉద్ఘాటించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల రిజర్వేషన్ విధానాలను గట్టిగా వ్యతిరేకించాలని, మనమంతా ఒక్కటై పోరాటం సాగించాలని రాహుల్ పిలుపునిచ్చారు. రాజ్యాంగమే మన శక్తి అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల చరిత్రను నామరూపాల్లేకుండా చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.

విద్యార్థి వీసా ఇంటర్వ్యూలకు అమెరికా తాత్కాలిక బ్రేక్

విదేశీ దరఖాస్తులదారుల సోషల్‌మీడియా చరిత్రను క్షుణ్నంగా విశ్లేషించనున్న ఇమిగ్రేషన్ అధికారులు

వాషింగ్టన్: అమెరికాలో విద్యాభ్యాసానికి సంబంధించి విదేశీ విద్యార్థుల వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపేయాలని డొనాల్డ్ ట్రంప్ సర్కార్ నిర్ణయించింది. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో అమెరికా వ్యతిరేక, హమాస్ అనుకూల భావజాలం పెరిగిపోతోందన్న ట్రంప్ ప్రభుత్వం ఆందోళనల నడుమ విదేశాంగ శాఖ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే షెడ్యూలింగ్ అయిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూలను కొనసాగించవచ్చని, ఈరోజు నుంచి కొత్త ఇంటర్వ్యూలను షెడ్యూలింగ్ చేయొద్దని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా ఎంబసీలను మంగళవారం ఆదేశించారు. ఈ మేరకు అత్యయిక ఉత్తర్వుపై మార్కో రూబియో సంతకం చేశారు. విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అందించిన వివరాలతో వారి సోషల్‌మీడియా అకౌంట్లలో అమెరికా వ్యతిరేక భావజాలం తాలూకు వివరాలను అమెరికా ఇమిగ్రేషన్ విభాగ నిపుణులు విశ్లేషించనున్నారు. ఎఫ్, ఎం, జే కేటగిరీ దరఖాస్తుల సోషల్‌మీడియా ఖాతాల పాత పోస్ట్‌లు, వ్యాఖ్యానాలను అధికారులు నిశితంగా గమనించనున్నారు. అమెరికా వ్యతిరేక ధోరణి ఎవరి సోషల్‌మీడియా ప్రొఫైల్, హిస్టరీలో కనిపిస్తే వారిని ఇంటర్వ్యూల దాకా రానివ్వకుండా అడ్డుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. విదేశీ విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో స్టూడెంట్ వీసాల జారీ ప్రక్రియ మరింత ఆలస్యంకానుంది. అంతర్జాతీయ విద్యార్థుల చేరిక, వారి ట్యూషన్ ఫీజులపై ఆధారపడిన పలు అమెరికా విశ్వవిద్యాలయాలకు ఆర్థిక కష్టాలు మరింత ఎక్కువ కానున్నాయి. విదేశీ విద్యార్థుల అమెరికా కల సైతం కాస్తంత చెదిరిపోయే ప్రమాదం పొంచి ఉంది.

ర్యాలీపై రాక్షస దాడి

విజయోత్సవ ర్యాలీపై కారుతో దాడి

- 65 మందికి గాయాలు
- బ్రిటన్‌లోని లివర్‌పూల్‌లో ఘటన

లివర్‌పూర్: బ్రిటన్‌లో ప్రీమియం లీగ్ చాంపియన్‌షిప్‌లో తమ టీమ్ గెలుపునకు గుర్తుగా సోమవారం విజయోత్సవ ర్యాలీలో మునిగిపోయిన లివర్‌పూల్ సాకర్ ఫుట్‌బాల్ అభిమానుల పైకి ఓ ఆగంతకుడు కారుతో దూసుకొచ్చాడు. నడిరోడ్డుపై ఇష్టారీతిగా జనం మీదకు కారును పోనిచ్చాడు. ఈ హఠాత్పరిణామంలో చిన్నారులుసహా 65 మంది అభిమానులు గాయపడ్డారు. వీరిలో 50 మందికి స్వల్ప గాయాలుకాగా 11 మందికి ఇంకా ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. వీరి ఆరోగ్యపరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. లివర్‌పూర్ నగరంలోని వాటర్‌స్ట్రీట్ వీధిలో సోమవారం ఈ ఘటన జరిగింది. గుండెపోటు రోగిని తరలించేందుకు ర్యాలీ మధ్యలో పోలీసులు ఒక అంబులెన్సుకు దారి ఇవ్వడంతో అదే సమయంలో మధ్యలోకి దూసుకొచ్చిన ఒక కారు ఇలా బీభత్సం సృష్టించింది. జనాలను ఢీకొడుతూ కారు ముందుకెళ్లింది. కొంతదూరం వెళ్లాక కారు టైర్ల వద్ద కొందరు ఇరుక్కోవడంతో కారు ఆగిపోయింది. దీంతో జనం కారుపై పడి ఎట్టకేలకు డ్రైవింగ్ సీటు నుంచి ఆగంతకుడిని బయటకు లాగారు. ఉద్దేశపూర్వకంగా జనం మీదకు కారును పోనిచ్చినందుకు 53 ఏళ్ల బ్రిటన్ పౌరుడిని అరెస్ట్‌చేసి హత్యాయత్నం, మాదకద్రవ్యాల వినియోగం, నిర్లక్ష్య డ్రైవింగ్ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ ఘటనను ఉగ్రవాదం కోణంలో చూడట్లేదని మెర్సీసైడ్ పోలీస్ డిటెక్టివ్ చీఫ్ సూపరింటెండెంట్ కరెన్ జాన్‌డ్రిల్ స్పష్టంచేశారు. 10 మైళ్ల పొడవునా ఏర్పాటుచేసిన ఈ విజయోత్సవ ర్యాలీని చూసేందుకు దాదాపు 10 లక్షల మంది జనం విచ్చేశారు. ఈ అనూహ్య ఘటనతో ఒక మైలు దూరం అయితే పూర్తవుతుందనగా పరేడ్ అర్ధాంతరంగా మధ్యలో ఆగిపోయింది.



వేగం ఎక్కువ.. తీవ్రత తక్కువ..
కోవిడ్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇటీవల నగరంలోని ఓ వైద్యుడికి పాజిటివ్ అని తేలడంలో అందరిలోనూ భయాందోళన మొదలైంది. -10లో



ఆన్‌లైన్‌లో.. ఆమ్ కా జోష్..
భాగ్యనగరం మామిడి ప్రియత్వంతో ఉవ్విళ్లూరుతోంది. పండ్ల సీజన్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. విభిన్న రకాల మామిడి వెరైటీలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 31.0/24.0

వాతావరణం
నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



త్వరలో శిల్పా లేఔట్ రెండో ఫ్లైఓవర్

జూన్ మొదటి వారంలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఓఆర్ఆర్, కొండాపూర్ మధ్య సాఫీగా ప్రయాణం
- గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ కష్టాలకు చెక్

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) నుంచి కొండాపూర్ వరకు అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు ప్రయాణించే వారికి సాఫీ ప్రయాణం సాధ్యం కానుంది. శిల్పా లే ఔట్ రెండో ఫేజ్ ఫ్లై ఓవర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. జూన్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్నారు. దీంతో నగర ప్రజలకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వారికి ఎంతో సౌలభ్యం కలగనుంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గనుంది. ప్రయాణ సమయం కూడా ఆదా కానుంది.

ఇదీ ప్రాజెక్ట్

ఎస్సార్‌డీపీ(వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం) కింద రూ.178 కోట్లతో ఈ ఫ్లై ఓవర్‌ను నిర్మించారు. ఆరు లేన్లతో ఉన్న దీని పొడవు 1.2 కిలో మీటర్లు. వెడల్పు 24 మీటర్లు. ఇప్పటికే గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్, దానిపై శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉండగా, ఇప్పుడు దానికి పైన ఫేజ్ 2గా ఈ ఫ్లైఓవర్ నిర్మించారు. కొండాపూర్, హఫీజ్‌పేట్ మార్గాల్లో వెళ్లే వాహనాలకు ఇది అనుకూలంగా ఉంటుంది. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుంది. ప్రయాణ సమయం కలిసి వస్తుంది. త్వరితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. ఎస్సార్‌డీపీ కింద నిర్మించిన ఫ్లై ఓవర్లలో ఇది 23వది. ఈ ఫ్లై ఓవర్‌ను త్వరితగతిన పూర్తిచేసేందుకు శ్రద్ధ చూపుతున్న కమిషనర్ కర్ణన్ దీంతో పాటు ఫలక్‌నుమా, శాస్త్రిపురంల ఆర్‌ఓబీలు సైతం త్వరగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను కోరారు. ఈ రెండు ఆర్‌ఓబీలతో ఎస్సార్‌డీపీ కింద చేపట్టిన పనులు 39 పూర్తవుతాయి.

హై సిటీగా..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ప్రాజెక్టుల పనులను హై సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కింద చేస్తున్నారు. దీని ద్వారా రూ. 7032 కోట్ల వ్యయంతో కొత్తగా 58 పనులు చేపట్టనున్నారు. అందులో 28 ఫ్లైఓవర్లు, 13 అండర్‌పాస్‌లు, 4ఆర్ఓబీలు,3 ఆర్‌యూబీలతోపాటు పది మార్గాల్లో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులున్నాయి. వీటిల్లో కొన్ని పనుల్ని వచ్చే నెలలో చేపట్టనున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది.

నగరాన.. అదే వాన..



మెహిదీపట్నంలో..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల వరకు నగర శివారులోని ఆర్‌సీపురంలో సుమారు 7.7 సెంటీమీటర్లు, పటాన్‌చెరులో 5.3, చందానగర్‌లో 5 సెం.మీ చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది. నైరుతి రుతు పవనాలు ప్రవేశించడంతో వర్షాలు విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాబోయే రెండు మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున పాత భవనాలు, చెట్ల కింద ఉండకూడదని హెచ్చరిస్తున్నారు.

ముందు చూపుందా?

ముంబై మాదిరి ముంచెత్తితే ఎలా?

నగరం మునకేయకుండా చర్యలు అవసరం

- భారీ వర్షాలొస్తే సరిపోని నాలాల సామర్థ్యం
- సాఫీగా సాగిపోని నాలాలు.. రోడ్లపైకి వరద నీరు
- ముందస్తు కార్యాచరణతోనే సమస్యలకు ముకుతాడు
- సరైన దిశా నిర్దేశం ఉండాలంటున్న నగర పౌరులు

సాక్షి, సిటీబ్యూరో:

గ్రేటర్ నగరంలో మూడు సెంటీమీటర్ల వర్షం పడినా రోడ్లు చెరువులవుతున్నాయి. కాలనీలు నీట మునుగుతున్నాయి. అదే ముంబై మాదిరిగా 25 సెంటీమీటర్లు, అంతకుమించి వర్షం పడితే? నగరం ఏం కానుందన్న ప్రశ్నలు ప్రజల నుంచి వెలువడుతున్నాయి. 2020లో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో అప్పటినుంచే ప్రభుత్వాలు ముంపు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టినప్పటికీ, పనులింకా పూర్తి కాలేదు. అప్పటి కంటే ముంపు సమస్యల తీవ్రత తగ్గినప్పటికీ పూర్తిగా సమసి పోలేదు. ఈ నేపథ్యంలో ఊహించని విధంగా వర్షాకాలానికి ముందే ముంచుకొస్తున్న వానలు ప్రజల్లో అలజడి రేపుతున్నాయి. ఎప్పుడు వర్షాలొచ్చినా నగరంలో ఎదురవుతున్న పరిస్థితులే ఇందుకు కారణం. నాలాలు సాఫీగా ప్రవహించే పరిస్థితి లేక వరదనీరు పొంగిపొర్లడం, తీవ్ర ఆస్తి నష్టంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టాలు కూడా జరగడం ప్రజలను కలవరపెడుతున్నాయి.

తప్పుతున్న అంచనాలు

సాధారణంగా ప్రతి సంవత్సరం జూన్ రెండో వారంలో వర్షాలొస్తాయనే అంచనాలతో ప్రభుత్వ యంత్రాంగాలు ముందస్తు చర్యలు చేపడుతుంటాయి. ఈ ఏడాది సైతం జూన్‌ను దృష్టిలో ఉంచుకొనే జీహెచ్ఎంసీ గత కమిషనర్ ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లు సంయుక్త సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని భావించారు. ఇంకా ఆ పనులు జరగలేదు. మరోవైపు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం వానాకాలం ముందస్తు చర్యలపై అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఇటీవలే అధికారులతో నిర్వహించాల్సిన సమీక్ష సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీలోని అధికారులు సైతం ఆయా పనులు చేస్తున్నప్పటికీ, ఇంకా అవి పూర్తికాలేదు. వారు జూన్ నెలను లక్ష్యంగా పెట్టుకొని పనులు చేపట్టారు. వాస్తవానికి లక్ష్యం కంటే ఇంకొంత ఆలస్యం జరగడం పరిపాటి. ఈసారి జూన్‌కు ముందే నగరంలో వర్షాలు కురుస్తున్నాయి. రోహిణి కార్తెలో రోకండ్లు పగిలే ఎండలుంటాయనేది పెద్దలు చెప్పే మాట. కానీ కాలం, వాతావరణం, పరిస్థితులు మారాయి. ఎండలు మండే మే నెలలోనూ కుండపోత వానలు కురుస్తున్నాయి. పనులు వేగంగా జరగకపోవడానికి ఇదీ ఒక కారణం. అనుకోకుండా భారీ వర్షాలొస్తే మాత్రం నగర ప్రజలు విలవిలలాడాల్సిన పరిస్థితులే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరింత ముందు చూపుతో మరిన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఖైరతాబాద్ జోన్‌లోని వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్

నానా కష్టాల నాలాలు

వానల్లో కలిగే ఎక్కువ నష్టాలకు నాలాలే కారణం. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, మారని ప్రజల వైఖరి కూడా నాలాల సమస్యలకు కారణం. నాలాల్ని సకల వ్యర్థాలు వేసే ప్రాంతాలుగా భావిస్తున్న ప్రజలు వాటిల్లోనే పాత దుప్పట్ల నుంచి మొదలు పెడితే పనికిరాని కుర్చీల వరకు వేస్తున్నారు. దాంతో నీరు పోయే దారి లేక పరిస్థితి దారుణంగా మారుతోంది. డీసిల్టింగ్‌లోనూ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఉపశమనానికి హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్

భారీగా నీరు చేరి వాహనాలు మునిగిపోయే ప్రాంతాల్లో రోడ్లపై ఆ పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు 50 వరకు రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మించాలనుకున్నప్పటికీ, తొలిదశలో పనులు చేపట్టిన 12లో 11 పూర్తిచేశారు.

ఇప్పటి వరకు పనులిలా..

పూర్తయింది..

కేసీపీ జంక్షన్, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ (2), సెక్రటేరియట్ బస్టాప్, జూబ్లీహిల్స్ రోడ్‌నంబర్ 45, ఖాజాగూడ, సాగర్ రింగ్‌రోడ్, పీవీఎన్ఆర్ పిల్లర్ నంబర్ 264, చిల్కానగర్ టి జంక్షన్.

పూర్తి కావాల్సింది..

ఆర్‌టీఏ ఆఫీస్, ఖైరతాబాద్.

మాన్సూన్ టీమ్స్

వరద ముప్పు లేకుండా నీరు నిలిచే ప్రాంతాల్లో నీటిని ఎప్పటికప్పుడు తోడిపోసేందుకు జీహెచ్ఎంసీ మాన్సూన్ టీమ్స్‌ను నియమిస్తుంది. ప్రస్తుతానికి 309 టీమ్స్ ఏర్పాటు చేసి, అవసరాల కనుగుణంగా వాటిని పెంచాలని అధికారులు భావిస్తున్నారు. అవసరాన్ని బట్టి ఏటా ఇలాంటి టీమ్స్ 400 వరకు నియమిస్తారు. వీటి నియామకాలు పూర్తి కావాల్సి ఉంది.

మాన్సూన్ టీమ్స్ (టెండర్ల దశలో)

జోన్	స్టాటిక్ టీమ్స్	మొబైల్ టీమ్స్	(అంచనా. రూ.కోట్లు)
ఎల్‌బీనగర్	20	25	6.53
చార్మినార్	9	38	7.32
ఖైరతాబాద్	30	28	12.99
శేరిలింగంపల్లి	60	16	8.01
కూకట్‌పల్లి	11	24	5.86
సికింద్రాబాద్	25	28	8.59

'ఢీ' సిల్టింగ్

వాస్తవానికి జనవరి నుంచే నాలాల్లో పూడికతీత పనులు (డీసిల్టింగ్) ప్రారంభించి, మేలోగా పూర్తిచేయాల్సి ఉండగా, ఈసారి ఉన్నతాధికారులు తరచూ మారడంతో టెండర్లు.. పనులు కూడా ఆలస్యంగా మొదలయ్యాయి. దాంతో పనులు పూర్తి కాలేదు.

డీ సిల్టింగ్ .. జోన్ల వారీగా

జోన్	నాలాలు (కి.మీ)	పనులైంది (నాలాలు)
ఎల్‌బీనగర్	104.39	77.86
చార్మినార్	387.75	281.91
ఖైరతాబాద్	181.11	98.19
శేరిలింగంపల్లి	74.96	49.05
కూకట్‌పల్లి	103.28	74.01
సికింద్రాబాద్	100.20	69.97

మరింత అప్రమత్తత అవసరం

వానలు ముందస్తుగానే వస్తున్నందున అధికార యంత్రాంగం మరింత ముందుచూపుతో వ్యవహరించాలని నగర ప్రజలు భావిస్తున్నారు. మరి అధికారులు ఎలా వ్యవహరించనున్నారో. ఏయే ప్రత్యేక చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే!

వస్తోంది వర్షాకాలం.. సన్నద్ధమవుదాం

ఐసీసీసీలో కీలక విభాగాల సమావేశం



వర్షాకాలం నేపథ్యంలో నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ విభాగాలు దృష్టి పెట్టాయి. ఇందుకోసం కీలక విభాగాలకు చెందిన అధికారులతో జాయింట్ యాక్షన్ టీమ్ (జాట్) ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) కీలక విభాగాలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నేతృత్వంలో సాగిన ఈ భేటీలో పలు కీలకాంశాలు చర్చించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 141 వాటర్ లాగింగ్ ఏరియాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటర్ లాగింగ్ ఏరియాల్లో ట్రాఫిక్ నిర్వహణపై చర్చించారు. భారీ వర్షం కురిసిన సందర్భంలోనూ తక్షణం స్పందించిన విద్యుత్ పునరుద్ధరించడంపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. రహదారులపై నిలిచే వరద నీటిని వాహనచోదకులతో పాటు స్థానికులకు ఇబ్బందులు లేకుండా నాలాల్లోకి మళ్లించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. విపత్తుల సమయంలో స్పందిచడంపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) రూపొందించాలని ఫైర్స్ డీజీ వై.నాగిరెడ్డి అభిప్రాయపడ్డారు. సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్ సంయుక్త సీపీ డాక్టర్ గజారావు భూపాల్, ఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలాల నుంచి తీసిన పూడిక



మూసీ..మురికిగానే

నది పునరుజ్జీవంపై నీలినీడలు

- ఆక్రమణల తొలగింపు, భూ సేకరణ, నిధుల రూపంలో సవాళ్లు
- నిర్మాణాల తొలగింపులపై ప్రజల నుంచి వ్యతిరేకత
- నది చుట్టూ భూములపై స్పష్టత వస్తేనే డీపీఆర్ తయారీ
- సాంకేతిక అనుమతి పొందితేనే రుణం విడుదల
- ముఖ్యమంత్రి రేవంత్ డ్రీమ్ ప్రాజెక్ట్ అడియాసేనా?

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ పునరుజ్జీవంపై నీలినీడలు కమ్ముకున్నాయి. నది గర్భంలో ఆక్రమణల తొలగింపు, స్థల సమీకరణ, నిధుల సేకరణ రూపంలో మూడు ప్రధాన సవాళ్లు ఎదురవుతున్నాయి. నిర్మాణాల తొలగింపు చేయాలంటే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ప్రస్తుత పరిస్థితుల్లో లేనిపోని చిక్కులు కొనితెచ్చుకోవడం ఎందుకని సర్కారు భావిస్తోంది. అలాగే మూసీ పరీవాహక ప్రాంతాల్లోని ఆక్రమణలు తొలగించి, స్థల సమీకరణ పూర్తయితేనే సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమవుతుందని ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన సింగపూర్ కంపెనీ మెయిన్‌హార్ట్ ఇప్పటికే ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. మరోవైపు మూసీ పునరుజ్జీవానికి అవసరమైన నిధుల కోసం డీపీఆర్‌లు సాంకేతికంగా అనుమతి పొందితేనే ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం విడుదలకు అంగీకరిస్తామని కేంద్రం మెలిక పెట్టింది. మొత్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్ట్ మూసీ మురికి వదలడం కలగానే మిగిలిపోనుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

వ్యతిరేకతతో వెనుకడుగు..

కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా మారింది మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ యంత్రాంగం పరిస్థితి. మూసీ ఆక్రమణలు, స్థల సమీకరణపై స్పష్టత ఇస్తేనే ప్రాజెక్ట్‌పై ముందడుగు పడుతుందని కన్సల్టెన్సీ సంస్థ తేల్చి చెప్పడంతో ఈ విషయంపై ఎలా ముందుకెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడింది. ముందుగా మూసీ పరీవాహక ప్రాంతంలోని నివాసాలు, షెడ్లు, గోదాముల వంటి అక్రమ నిర్మాణాలను తొలగిస్తే తప్ప నది చుట్టూ ఎన్ని భూములు ఉన్నాయో ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. ఆక్రమణలను కూల్చివేస్తే రాజకీయ ప్రకంపనలు ఏర్పడటం ఖాయం. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో పాటు ప్రతిపక్షాలు కూడా దీన్నే అస్త్రంగా మలుచుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర విమర్శల పాలవుతుంది. ప్రస్తుత తరుణంలో మూసీ ఆక్రమణల జోలికి వెళ్లకపోవడమే మంచిదనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది.

భూ సేకరణ అయితేనే డీపీఆర్..

మూసీ పరీవాహక ప్రాంతంలోని ఆక్రమణలు తొలగించి, స్థల సమీకరణ చేస్తేనే మూసీ డీపీఆర్ తయారీ సాధ్యమవుతుందని కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. మూసీకి ఇరువైపులా ఎక్కడెక్కడ ఎన్ని భూములు అందుబాటులో ఉన్నాయో తేలితే.. ఎక్కడ ఏ తరహా అభివృద్ధి చేపట్టవచ్చో స్పష్టత వస్తుందని వివరించింది. స్థల సమీకరణ పూర్తి కాకుండా మూసీ చుట్టూ వాణిజ్య ప్రాంతాల అభివృద్ధిని నిర్ణయించడం కష్టమని తెలిపింది. దీంతో మూసీ సుందరీకరణ కష్టమని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) యంత్రాంగ్రం భావిస్తోంది. ఇప్పటికే పలుమార్లు స్వయంగా ముఖ్యమంత్రే కన్సల్టెన్సీ సంస్థతో చర్చలు జరిపినా.. డీపీఆర్ సిద్ధం కాకపోవడం కొసమెరుపు. ఇప్పటివరకూ మూసీ సుందరీకరణ వైపు ఒక్క అడుగు కూడా పడకపోవడంతో 2030 డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలన్న సీఎం లక్ష్యం చేరడం కష్టమే.



వివాహేతర సంబంధంపై నిలదీశాడని భర్తను చంపిన భార్య

వనస్థలిపురం ఠాణా పరిధిలో దారుణం



కిషన్ నాయక్ (ఫైల్)

హస్తినాపురం: తన వివాహేతర సంబంధంపై నిలదీశాడనే కోపంతో కట్టుకున్న భర్తనే చంపేసింది ఓ భార్య. ప్రమాదవశాత్తు ఇంట్లో పడి చనిపోయాడని కట్టుకథ అల్లి అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. చివరికి అసలు విషయం బయటపడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వనస్థలిపురం పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. యాదాద్రి- భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వావిల్లపల్లి గ్రామం సభావత్ తండాకు చెందిన లారీ డ్రైవర్ కిషన్ నాయక్ తన భార్య చనిపోవడంతో ఇదే జిల్లా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన శిరీషను ఎనిమిదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా శిరీష ప్రవర్తనపై కిషన్ నాయక్ అనుమానంతో ఆమెను మందలించేవాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు జరగడంతో శిరీష హిల్ కాలనీలో వేరుగా ఉంటోంది. సోమవారం రాత్రి భర్త కిషన్ నాయక్‌కు ఫోన్ చేసి ఇంటికి రమ్మని చెప్పింది. భార్య శిరీష వద్దకు కిషన్ నాయక్ వెళ్లాడు. ఆమె వివాహేతర సంబంధంపై మళ్లీ నిలదీయడంతో కిషన్ నాయక్‌పై దాడిచేసి గోడకు నెట్టివేసింది. దీంతో అతను తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. తన భర్త ప్రమాదవశాత్తు ఇంట్లో పడి చనిపోయాడని చిత్రీకరించేందుకు శిరీష యత్నించింది. విషయం తెలుసుకున్న కిషన్‌నాయక్ మొదటి భార్య కూతురు బిందు, బంధువులు అతడి మృతిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిరీషను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో.. భర్త కిషన్ నాయక్‌ను తానే హత్య చేసినట్లు అంగీకరించిందని పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రాసెసింగ్ ఫీజు పేరుతో రూ.14.5 లక్షలు స్వాహా



సాక్షి, సిటీబ్యూరో: రుణ మంజూరు ప్రాసెసింగ్ పేరిట నగరానికి చెందిన ఓ యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.14.5 లక్షలు కాజేశారు. ఈ మేరకు బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ట్రావెల్స్ వ్యాపారం చేస్తున్న ఓ యువకుడు (36) కొన్నాళ్ల క్రితం ఇన్‌స్టాగామ్‌లో తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామనే ప్రకటనకు ఆకర్షితుడైన అందులో ఉన్న రెండు నంబర్లతో సంప్రదింపులు జరిపారు. తనకు రూ.కోటి రుణం కావాలని చెప్పడంతో.. సైబర్ నేరగాళ్లు కొన్ని పత్రాలు, ప్రస్తుతం చేస్తున్న వ్యాపారానికి సంబంధించిన వివరాలు పంపించాలన్నారు. బాధితుడు పంపించిన వివరాలను పరిశీలించి రుణం మంజూరు చేశామని నేరగాళ్లు నమ్మించారు. ఆ డబ్బు బదిలీ చేయాలంటే కొంత ప్రాసెసింగ్ ఫీజుగా చెల్లించాలంటూ రూ.14.5 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా తమ బ్యాంకు ఖాతాలో వేయించుకున్నారు. కొన్నాళ్లు ఎదురు చూసిన బాధితుడు తనకు రావాల్సిన రూ.కోటి రాకపోవడంతో నేరగాళ్లను సంప్రదించే ప్రయత్నం చేశారు. వారి ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం ఠాణాను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు నిందితులు వినియోగించిన ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. సోషల్‌మీడియాలో, ఫోన్ కాల్స్ ద్వారా వచ్చే ఇలాంటి ప్రకటనలు నమ్మవద్దని, కేవలం ఆర్‌బీఐ అధీకృత బ్యాంకులు, సంస్థల నుంచే రుణాలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నౌహీరా షేక్ అరెస్టు

దాదాపు ఆరు నెలలుగా అజ్ఞాతంలో

- హరియాణాలో పట్టుకున్న సీసీఎస్ అధికారులు
- నగరానికి తరలించి కోర్టులో హాజరు

సాక్షి, సిటీబ్యూరో: హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకురాలు, సీఈఓ నౌహీరా షేక్‌ను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు మంగళవారం హర్యానాలో అదుపులోకి తీసుకున్నారు. దాదాపు ఆరు నెలలుగా అజ్ఞాతంలో ఉన్న నౌహీరా కోసం ప్రత్యేక బృందం విస్తృతంగా గాలించింది. మరో రాష్ట్రానికి పారిపోయే ప్రయత్నాల్లో ఉన్న ఆమె కదలికలను హరియాణా–ఢిల్లీ సరిహద్దుల్లో గుర్తించింది. హుటాహుటిన నగరం నుంచి వెళ్లిన ప్రత్యేక బృందం అరెస్టు చేసింది. ఆమెను నగరానికి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచనున్నారు. దాదాపు 15 కంపెనీలతో హీరా గ్రూప్‌ను ఏర్పాటు చేసిన నౌహీరా షేక్ ఆపై ఆలిండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ పేరుతో రాజకీయ పార్టీని ఏర్పాటు చేసింది. గోల్డ్ సహా వివిధ రకాలైన స్కీముల పేరుతో ఆమె దేశ వ్యాప్తంగా అనేక మంది నుంచి డిపాజిట్లు సేకరించింది. గరిష్ఠంగా 36 శాతం వడ్డీ చెల్లిస్తానంటూ నమ్మించి దాదాపు రూ.5 వేల కోట్ల మేర డిపాజిట్లు సేకరించి మోసం చేసింది. ఈ మేరకు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ అయ్యాయి. వీటి ఆధారంగా 2018 అక్టోబర్‌లో నౌహీరాను అరెస్టు చేసిన అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. సీసీఎస్ పోలీసుల కేసు ఆధారంగా ముందుకు వెళ్లిన ఈడీ అధికారులు భారీగా ఆస్తులు సీజ్ చేశారు. సీసీఎస్‌లో నమోదైన కేసుల్లో నాంపల్లి కోర్టు బెయిల్ తిరస్కరించింది. దీంతో హైకోర్టును ఆశ్రయించిన నౌహీరా బెయిల్ పొందారు. ఇదే తరహా కేసులో 2021లో ముంబై పోలీసులు అరెస్టు చేయగా... డిపాజిట్లు తిరిగి చెల్లిస్తానంటూ హామీ ఇచ్చి బెయిల్‌పై బయటకు వచ్చారు. సీసీఎస్‌లో నమోదైన కేసులకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను పోలీసులు సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. నేరం తీవ్రత, కేసుల పూర్వాపరాలు పరిశీలించిన సుప్రీం కోర్టు హైకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేస్తూ గత ఏడాది అక్టోబర్‌లో తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన నౌహీరా వివిధ రాష్ట్రాల్లో సంచరిస్తూ పోలీసుల నుంచి తప్పించుకుంటున్నారు. ఇదిలా ఉండగా... బెయిల్ పొంది, కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానం మూడు కేసుల్లో నౌహీరాపై నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. దీంతో నౌహీరాను పట్టుకోవడానికి సీసీఎస్‌లో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. వీరు మంగళవారం నౌహీరా కదలికల్ని గుర్తించి అరెస్టు చేశారు.

మై స్కూల్ ఇటలీ నిర్వాహకురాలిపై స్థల యజమాని దౌర్జన్యం

సీఎం ప్రజావాణిలో మహిళా ఎన్నారై ఫిర్యాదు



లక్డీకాపూల్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 25 లో స్థలాన్ని లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న మై స్కూల్ ఇటలీ విద్యా సంస్థ ప్రాంగణంలో స్థల యజమాని రోనక్ యార్ ఖాన్ అతని అనుచరులు దౌర్జన్యం చేస్తూ భౌతిక దాడికి పాల్పడటమేగాక బీభత్సం సృష్టించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటలీకి చెందిన ఎన్నారై డాక్టర్ వల్లూరు అపర్ణ సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ జి. చిన్నా రెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు వెంటనే స్పందించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కు ఫోన్ చేసి బాధితురాలికి న్యాయం చేయాలని సూచించారు. డాక్టర్ వల్లూరు అపర్ణ యూకేలో ఉన్నతాభ్యాసం చేశారు. ఇటలీకి చెందిన ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ పెప్పోను వివాహం చేసుకుని అక్కడే స్థిర పడ్డారు. మాతృదేశంపై మమకారంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆమె సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరంలో మై స్కూల్ ఇటలీ విద్యా సంస్థను నెలకొల్పేందుకు రోనక్ యార్ ఖాన్ కు చెందిన ఎకరం స్థలాన్ని 2027 వరకు లీజుకు తీసుకున్నారు. సదరు స్థలంలో స్కూల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండగా స్థల యజమాని దౌర్జన్యం చేసి స్థలాన్ని వెంటనే ఖాళీ చేయాలని ఒత్తిడి పెంచుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదంపై మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఇప్పటికే కేసు నమోదైందని తెలిపారు.

రూ.50 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తాం

మావోయిస్టుల పేరుతో కూన రవీందర్‌గౌడ్‌కు లేఖ | పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

జీడిమెట్ల/కుత్బుల్లాపూర్: రూ. 50 లక్షలు ఇవ్వాలని లేని పక్షంలో మాజీ ఎన్‌ఎస్‌యూఐ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) అధ్యక్షుడు కూన రాఘవేందర్‌గౌడ్‌ను చంపేస్తామని బెదిరిస్తూ మావోయిస్టుల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు అతని తండ్రి కూన రవీందర్‌గౌడ్‌కు లేఖ రాసి కారుపై పెట్టి వెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షాపూర్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త కూన రవీందర్‌గౌడ్ కుమారుడు రాఘవేంద్రగౌడ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేశారు. ఈనెల 21న రాత్రి మంకీ క్యాప్, టీషర్ట్ ధరించిన వ్యక్తి అతడి ఇంటి మొదటి అంతస్తుకు వెళ్లాడు. ఆ తర్వాత కిందికి దిగి కారుపై ఎర్రటి వస్త్రంలో ఓ కవర్ పెట్టి అనంతరం ఇంటి ముందు ఉన్న తులసి మొక్కను తొలగించి వెళ్లిపోయాడు. 22న ఉదయం రవీందర్‌గౌడ్ తులసి మొక్క తొలగించి ఉండటాన్ని గుర్తించి పనివాళ్లతో మొక్కను అదే తొట్టిలో నాటించాడు. కొద్దిసేపటి తర్వాత కారుపై ఉన్న కవర్‌ను తెరిచి చూడగా నక్సలైట్ శంకరన్న గ్యాంగ్ పేరుతో రాసిన లేఖను గుర్తించాడు. షాపూర్‌నగర్‌లో ఉన్న రెండు ఇళ్లను పేల్చివేస్తామని.. నీకొడుకు రాఘవేంద్రను చంపేస్తామని..శుక్రవారంలోగా రూ.50లక్షలు సిద్ధంగా ఉంచుకోవాలని అందులో పేర్కొన్నారు. ఈ విషయమై కూన రాఘవేంద్ర గౌడ్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన విక్రాంత్ రెడ్డి కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. భూపాలపల్లి జిల్లాకు చెందిన దీక్షిత్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అభినయ్, మంచిర్యాలకు చెందిన అన్షు అతడి స్నేహితులు. గంజాయికి అలవాటు పడిన వీరు గంజాయిని కొనుగోలు చేసి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వారికి పరిచయమైన అనురాగ్, వినయ్ కూడా వారితో జత కలిశారు. దీంతో వారు 10 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చారు. కూకట్‌పల్లిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వెనుక టీస్టాల్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుల్లో ఒకరైన అభినయ్ 2024లో బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, మిగిలిన ముగ్గురూ ఖాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న అనురాగ్, వినయ్ కోసం గాలిస్తున్నామన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ సిబ్బందిపై దాడి

నిందితులపై కేసు నమోదు

ఉప్పల్: విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తులపై ఉప్పల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ పారిశుద్ధ్య సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లుతో కలిసి మంగళవారం రామిరెడ్డినగర్ కూడలి వద్ద రోడ్డుపై వేసిన చెత్తను శుభ్రం చేస్తున్నారు. అదే సమయంలో అదే ప్రాంతానికి చెందిన మణెమ్మ అనే మహిళ రోడ్డుపై నిర్లక్ష్యంగా చెత్తను పారబోస్తుండటంతో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ రోడ్డుపై చెత్త వేయవద్దని ఇంటికి వచ్చే ఆటోలోనే చెత్త వేయాలని లేని పక్షంలో ఫైన్ విధిస్తామని చెప్పాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ఆమె అతడితో వాగ్వాదానికి దిగింది. ఇంట్లో ఉన్న వ్యక్తులను పిలిచి గొడవ పెట్టుకుంది. ఈ లోగా అక్కడికి వచ్చిన పారిశుద్ధ్య సిబ్బంది ఆమెకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకుండా ఆమె కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా పారిశుద్ధ్య కార్మికులు జానకి, లక్ష్మీ, దేవి, సుజాత, జంగమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై దాడి చేసి గాయపరిచారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లకోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ నాగార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులకు ఎంపీసీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ, బీకాం, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు నేరుగా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

మూత పడినా 'పురుడు' పోస్తున్నాయి

పలు ఆస్పత్రుల్లో ఏళ్ల తరబడి సాగుతున్న నకిలీ బర్త్, డెత్ సర్టిఫికెట్ల దందా



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎంతో కాలంగా సాగుతున్న బర్త్(పుట్టుక), డెత్(మరణం)నకిలీ సర్టిఫికెట్ల దందా ఆగడం లేదు. అధికారులు ఒక మార్గంలో కట్టడి చర్యలు చేపడితే, వాటిపై ఆధారపడ్డ దళారులు మరో మార్గంలో తమ దందా నడిపిస్తున్నారు. వారికి, కొన్ని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు, జీహెచ్‌ఎంసీలోని కొందరు సిబ్బందికి మధ్య ఉన్న సంబంధాల కారణంగానే ఈ అక్రమ సర్టిఫికెట్ల దందా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవసరమైన వారి నుంచి అధిక మొత్తంలో వసూలు చేసి నకిలీ బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ చేసే వ్యవహారం జీహెచ్‌ఎంసీలో ఎంతో కాలంగా సాగుతోంది. కొన్ని సందర్భాల్లో పోలీసులు వాటిని బట్టబయలు చేశారు. అక్రమ సర్టిఫికెట్ల జారీని నిలువరించేందుకు జీహెచ్‌ఎంసీ చేస్తున్న ప్రయత్నాలు వృథా అవుతున్నాయి. ఇటీవలే టోలిచౌకి మెట్రో హాస్పిటల్ నుంచి 65 బర్త్ సర్టిఫికెట్లు, 8 డెత్ సర్టిఫికెట్లను నకిలీవిగా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించడం తెలిసిందే.

మరెన్నో ఆస్పత్రులు..

జీహెచ్‌ఎంసీలో వేల సంఖ్యలో ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. వాటిల్లో దాదాపు 1800 ఆస్పత్రులకు బర్త్, డెత్‌ల వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు జీహెచ్‌ఎంసీ వాటికి లాగిన్ సదుపాయం కల్పించింది. జనన, మరణ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు కావడంతోపాటు బర్త్, డెత్ సర్టిఫికెట్లు ఇన్‌స్టంట్‌గా జారీ చేసి, ప్రజలకు ఇబ్బందులు తొలగించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేశారు. దాదాపు రెండున్నరేళ్ల క్రితం నాన్ అవైలబిలిటీ పేరిట దాదాపు 25వేల బర్త్ సర్టిఫికెట్లు ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా పొందినట్లు గుర్తించిన అధికారులు వాటిని రద్దు చేశారు. తిరిగి అలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. ఆస్పత్రుల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో జరిగే శిశువుల జననాలకు రికార్డులు ఉండనందున వాటిని నాన్ అవైలబిలిటీగా పేర్కొంటూ, ఆర్డీఓ ధ్రువీకరణలతో అందజేస్తారు.ఎలాంటి ధ్రువీకరణలు, ఏ పత్రాలు లేకున్నా వేల సంఖ్యలో నకిలీ సర్టిఫికెట్లు జారీ కావడంతో ఆ తర్వాత పలు చర్యలు చేపట్టినట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. కానీ, ఆస్పత్రులు సైతం నకిలీ దందాలకు పాల్పడటాన్ని గుర్తించలేకపోయింది.

వెలుగులోకి ఇలా..

గత జీహెచ్‌ఎంసీ కమిషనర్ నాన్ అవైలబిలిటీ కింద బర్త్ సర్టిఫికెట్ల కోసం ఎన్నో దరఖాస్తులు రావడంతో అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వాటి పరిశీలనతోపాటు, ప్రైవేట్ ఆస్పత్రులపై సర్వేకు కూడా ఆదేశించారు. దీంతో సర్వే నిర్వహించిన అధికారులు 510 ఆస్పత్రులు పనిచేయడం లేదని గుర్తించారు. సదరు సర్వే సందర్భంలోనే మూతపడ్డ మెట్రో హాస్పిటల్‌నుంచి సైతం బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ కావడాన్ని గుర్తించి, మూతపడ్డ 510 ఆస్పత్రులకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే సదుపాయాన్ని రద్దు చేశారు. వాటిలోనూ నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసిన ఆస్పత్రులున్నాయో, లేవో, ఉంటే ఎన్ని ఆస్పత్రులు ఎన్ని సర్టిఫికెట్లను జారీ చేశాయో తెలియదు.

బక్రీద్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

- ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకోవాలి
- అధికారులు, మతపెద్దలకు సీపీ సూచనలు
- సాలార్ జంగ్ మ్యూజియం ఆడిటోరియంలో సమన్వయ సమావేశం

చార్మినార్: బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకు మంగళవారం ఆయన సాలార్ జంగ్ మ్యూజియం ఆడిటోరియంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నగర అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రమ్ సింగ్ మాన్, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి వెంకన్న, ఆర్డీఓ రఘు ప్రసాద్, పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి, విద్యుత్ శాఖ ఎస్ఈ డి.సోమి రెడ్డితో పాటు పలువురు అధికారులు, మజ్లీస్ ఎమ్మెల్యేలు, మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరంలో తరతరాలుగా అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సవాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు, భద్రతా కారణాల దృష్ట్యా మాత్రమే నగర కమిషనరేట్ చుట్టూ తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జంతువులను రవాణా చేయరాదన్నారు. పశువైద్యుల అనుమతితోనే జంతువులను తరలించాలన్నారు. అక్రమ రవాణా పేరుతో ఇతరులు ఎవరూ వాహనాలను అడ్డుకోరాదని కోరారు. వాహనాలను ఆపేందుకు, తనిఖీ చేయడానికి ప్రభుత్వ అధికారులు ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

ఫీవర్‌లో కోవిడ్ అనుమానిత కేసు ?

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మంగళవారం ఓ కోవిడ్ అనుమానిత కేసు నమోదైంది. హిమాయత్‌నగర్‌కు చెందిన వ్యక్తి(50) ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన అతను స్థానిక వైద్యుడి సూచన మేరకు కోవిడ్ పరీక్షలు చేయించుకోగా పాజిటివ్ వచ్చింది. దీంతో అతను మంగళవారం మధ్యాహ్నం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి వచ్చాడు. అతడి రిపోర్టులను పరిశీలించిన ఆసుపత్రి డీఎంవో కోవిడ్‌గా అనుమానిస్తూ మందులు రాసి ఇచ్చాడు. కోవిడ్ లక్షణాలు ఉండడంతో మరోసారి ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇన్‌పేషంట్‌గా చేరితే వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తామని తెలిపారు. అందుకు అతను తిరస్కరిస్తూ ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉంటానని చెప్పడంతో అతడి కుటుంబ సభ్యులందరూ కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

యూఎస్ వీసా ఇప్పిస్తానంటూ మోసం..

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: యూఎస్ వీసా పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..గచ్చిబౌలికి చెందిన కాసా ప్రణయ్‌యాదవ్ అమెరికాలోని రుట్‌గర్స్ యూనివర్సిటీలో ఎంఎస్ చేసేందుకు బషీర్ అహ్మద్ అనే వ్యక్తిని సంప్రదించాడు. యూఎస్ వీసా కోసం సర్వీసు చార్జీల కింద రూ.50 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో అడ్వాన్స్‌గా రూ.20 వేలు చెల్లించాడు. వీసా అప్రూవల్ కోసం ఎంబసీ ఆఫీసర్ ఒకే ఒక్క ప్రశ్న వేస్తాడని, దాంతో వీసా అప్రూవల్ అవుతుందని బషీర్ అహ్మద్ చెప్పాడు. అయితే ప్రణయ్‌యాదవ్ ఎంబసీకి వెళ్లి హాజరుకాగా ఆయనను ఏడు ప్రశ్నలు అడిగాడు. అందుకు సమాధానం చెప్పలేకపోవడంతో వీసా రిజక్ట్ అయ్యింది. తనను వీసా పేరుతో మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి



విజయ్ మృతదేహం

మూసాపేట: అనుమానాస్పద స్థితిలో భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వివేకానందనగర్‌లోని మయూరి కర్రీ పాయింట్‌లో బిహార్‌కు చెందిన విజయ్ (32) అనే వ్యక్తి కుక్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తూ వాసిరెడ్డి స్వగృహ భవనంలోని 3వ అంతస్తులో ఉంటున్నాడు. ఈనెల మంగళవారం తెల్లవారుజామున పెద్దశబ్దం రావటంతో వాచ్‌మెన్ వెళ్లి చూడగా విజయ్ కిందపడి ఉన్నాడు. స్థానికుల సహాయంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మద్యం తాగే అలవాటు ఉన్న విజయ్ తాగిన మైకంలో ప్రమాదవశాత్తు కిందపడి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్‌లోగా సుంకిశాల పనులు పూర్తి..!

- పనులు వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలు
- ప్రాజెక్టు పనులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



సుంకిశాల ఇంటేక్ వెల్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి కృష్ణాజలాల తరలింపుకోసం చేపట్టిన సుంకిశాల ఇంటేక్ వెల్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రాజెక్టు నిర్మాణ సంస్థ సీఈఓ, డైరెక్టర్, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్లు, టీసీఎస్, గేట్ల ఎక్స్‌పర్ట్, తదితరులతో కలిసి సుంకిశాల ప్రాజెక్టు పనులను పరిశీలించారు. తొలుత ఉన్నతాధికారులతో కలిసి పైప్‌లైను విస్తరణ పనులను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు మిగిలిపోయిన పైప్‌లైన్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. వర్షాకాలం సమీపించినందున పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణ సంస్థ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నిపుణులతో కలిసి సుంకిశాల పునర్నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీడిజైనింగ్ సంబంధించిన వివరాలపై చర్చించారు. శిథిలాల తొలగింపు అనంతరం సివిల్ వర్క్, కంట్రోల్ రూం పనులను వేగంగా ముగిస్తే సైడ్ వాల్ పునర్నిర్మాణానికి మార్గం సులువవుతుందని అంచనా వేశారు. అనంతరం నాగార్జున సాగర్ జలాశయం వైపు ఉన్న టన్నెలింగ్ పనులను పరిశీలించారు. టన్నెలింగ్ వద్ద గేట్ల నిర్మాణం, డిజైన్లపై నిపుణుడు కన్నయ్య నాయుడుతో చర్చించారు.

15 రోజుల్లో పునర్‌నిర్మాణ డిజైన్ ఫైనల్

సుంకిశాల ఇంటేక్ వెల్ రిటైనింగ్ వాల్ శిథిలాలను తొలగింపు పూర్తిచేసి పునర్‌నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు డిజైన్‌లు, డ్రాయింగ్ లను 15 రోజుల్లో ఫైనలైజ్ చేయాలని ఎండీ ఆదేశించారు. పునర్‌నిర్మాణ పనులు చేపట్టి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను సూచించారు. ఇంటేక్ వెల్ ప్రాజెక్టు పైప్‌లైన్ పనులు నాలుగు కిలోమీటర్లు మినహా పూర్తి చేశామన్నారు. ఎలక్ట్రిక్ పనులు సైతం చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం మహేష్ కుమార్, హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు శశిధర్, సురేంద్రనాథ్, గేట్ల రూపకర్త కన్నయ్య నాయుడు, టీసీఈ ప్రతినిధి నితీష్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

బడికి బాట దొరికింది...



దారికి అడ్డుగా కట్టిన గోడ తొలగించిన హైడ్రా

సికింద్రాబాద్: చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు బాట దొరికింది. ఆ మార్గానికి అడ్డంగా స్థానికులు కట్టిన గోడను హైడ్రా అధికారులు మంగళవారం కూల్చేశారు. ఈ గోడ కారణంగా పాఠశాలకు వచ్చి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి సోమవారం నిరసన తెలిపారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట 'మా బడికి బాట వేయండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. దీనిపై సమాచారం అందడంతో స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ అంశంపై దృష్టి పెట్టాల్సిందిగా ఇన్‌స్పెక్టర్ ఆదిత్యను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన ఆ పాఠశాలకు వెళ్లే మార్గంలో అడ్డుగా గోడ ఉన్నట్లు నిర్ధారించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌తో కలిసి గోడను తొలగించారు. త్వరలోనే అక్కడ గేటు ఏర్పాటు చేయనున్నట్లు బల్దియా జోనల్ కమిషనర్ రవి కిరణ్ ప్రకటించారు.

ఫతేనగర్ వంతెన మెట్లు కూల్చివేత

పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



బాలానగర్: ఫతేనగర్ ఫ్లైఓవర్‌కు సంబంధించిన పాత మెట్లు శిథిలావస్థకు చేరడంతో హైడ్రా అధికారులు మంగళవారం కూల్చేశారు. సోమవారం వీటి ద్వారా దిగుతుండగా కొన్ని విరిగిపడటంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ఆ ప్రాంతానికి వెళ్లి శిథిలావస్థకు చేరిన మెట్లను పరిశీలించారు. ప్రతి ఆదివారం సనత్‌నగర్‌లో సంత జరుగుతుందని, ఆ సందర్భంగా వందలాది మంది ఈ మెట్లను వినియోగిస్తారని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఆ మెట్ల వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉందని, వర్షాకాలంలో ముప్పు ఎక్కువని గుర్తించిన రంగనాథ్ వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు ఆ మెట్లను తొలగించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో శిథిలావస్థకు చేరిన ఇలాంటి నిర్మాణాలను గుర్తించడానికి సివిల్ ఇంజినీరింగ్ నిపుణులతో తనిఖీ చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న వాటిని గుర్తించి కూల్చేయాలని సూచించారు. ఫతేనగర్ ఫ్లైఓవర్‌కు కొత్త మెట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.17, సల్లవంకాయ.18, పొడుగు వంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.40, బజ్జీమిర్చి.35, క్యాప్సికం.45, పచ్చికాకరకాయ.45, పందిరిబీర.40, క్యాబేజీ.13, క్యారెట్.35, దొండకాయ.16, గుండు బీన్నీస్.105, గింజచిక్కుడు.65, గోకరకాయ.40, బీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.17, ఉల్లిగడ్డ.16, ఆలుగడ్డ.25, చామగడ్డ.35, మొరంగడ్డ.19, కందగడ్డ.65, క్యాలిఫ్లవర్.23, సొరకాయ.09, పొట్లకాయ.23, అరిటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.40, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ట్రంప్ వ్యాపారాలను బహిష్కరించాలి

హిమాయత్‌నగర్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు భారత దేశానికి వ్యతిరేకంగా, తలవంపులు తెచ్చేలా ఉన్నాయని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ట్రంప్ తన వ్యాపారాల్లో ఒకటైన ట్రంప్ టవర్స్ అనే పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో భారత దేశానికి వస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని, ట్రంప్ వ్యాపారాలకు ఎలాంటి అనుమతి ఇవ్వరాదని డిమాండ్ చేశారు.

మంత్రివర్గంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

లిబర్టీ: మంత్రివర్గంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. మంత్రివర్గ కూర్పులో బీసీలకు అన్యాయం జరగకుండా ఏఐసీసీ నాయకత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బీసీల జనాభాకు అనుగుణంగా మంత్రివర్గడంలో ప్రాధాన్యం కల్పించి బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

ఎంఆర్‌సీ కాలనీలో పార్కు స్థలం కాపాడండి

ఫిలింనగర్: షేక్‌పేట మండలం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ రోడ్డునెంబర్-7లోని ఎంఆర్‌సీ కాలనీలో జీహెచ్‌ఎంసీ పార్కును కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని జూబ్లీహిల్స్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు సలీం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గత జనవరి 3న కూడా ఈ కబ్జాల వ్యవహారంపై హైడ్రా దృష్టికి తీసుకురావడం జరిగిందని గుర్తుచేశారు. జీహెచ్‌ఎంసీ పార్కును కబ్జా చేయడం జరిగిందని, సుమారుగా 2300 గజాల ఈ స్థలాన్ని కాపాడాలని, ఇప్పటికే ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కూడా ఈ పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ గుడి పక్కన ఆక్రమణలు, కిరాయికి ఇవ్వడం, ఎవరి ఆధీనంలో ఉన్నాయి, ఈ మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ జరపాలని కోరారు.

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

బంజారాహిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు విధానాలను ప్రశ్నిస్తే దాడులు చేయడం ఏంటని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నాయకులు దాడుల సంస్కృతికి తెర లేపారని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడికి దిగిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇప్పటికే కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నిందితులుగా ఉండగా, తాజాగా కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పేరు చేర్చడంతో దీని నుంచి తెలంగాణ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ దాడులకు పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసే ప్రతి తప్పునూ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారన్నారు.

అకారణంగా దాడి చేసిన యువకుడిపై కేసు

సనత్‌నగర్: వ్యక్తిపై దాడి చేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సనత్‌నగర్ డీఎస్‌ఎంకాలనీ ఈద్గా సమీపంలో ఉండే సయ్యద్ గౌస్ అలీ (33) వృత్తి రీత్యా వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు మూసాపేట నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా డీఎస్‌ఎంకాలనీ జాఫ్రీద్ మసీదు వద్దకు చేరుకోగానే అదే కాలనీకి చెందిన అవాద్ బిన్ ఖ మోష్ (20) అలియాస్ పోపట్ అకారణంగా గొడవకు దిగాడు. దీంతో సయ్యద్ గౌస్ అలీ వెళ్లేందుకు యత్నిస్తుంటే మళ్లీ యువకుడు కర్ర తో దాడి చేయగా కుడి చేతిపై రక్తస్రావం జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డంపర్ బిన్లు మళ్లీ వచ్చేశాయ్!

- స్వచ్ఛ ఆటోలు వెళ్లలేని చోట ఏర్పాటు
- జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 100 ప్రాంతాల గుర్తింపు



ఎస్‌బీటీనగర్ ఎల్లమ్మ గుడి వద్ద ఏర్పాటు చేస్తున్న డంపర్‌బిన్లు

బంజారాహిల్స్: చెత్త పేరుకుపోతున్న ప్రాంతాలు, చెత్త సేకరించలేని ప్రాంతాల్లో మళ్లీ డంపర్ బిన్లు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోలు వెళ్లలేని ప్రాంతాల వారి కోసం ఈ డంపర్ బిన్లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో డంపర్ బిన్ రహిత జీహెచ్‌ఎంసీ కార్యక్రమంలో భాగంగా అప్పటికే ఉన్న డంపర్ బిన్లను తొలగించారు. ప్రజలకు రోడ్ల పక్కన చెత్త వేయవద్దని అవగాహన కల్పించారు. ఎవరైనా రోడ్ల పక్కన చెత్త వేస్తే వారికి జరిమానాలు కూడా విధించారు. విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నారు. అయినా సరే జనం బేఖాతర్ చేశారు. ఎప్పటిలాగే రోడ్ల పక్కన చెత్త వేస్తూనే ఉన్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల్లో మార్పు కనిపించలేదు. డంపర్ బిన్లు తీసేసిన చోట్ల గుట్టలుగా చెత్తా చెదారం పేరుకుపోయి గాలికి కొట్టుకుపోవడం, వర్షం వస్తే వరదనీటితో పాటు కొట్టుకువెళ్లడం, దుర్వాసనలు, దుర్గంధం తదితర సమస్యలతో పరిశుభ్రత లోపించింది. దీంతో తరచూ చెత్తవేసే ప్రాంతాల్లో డంపర్ బిన్లు ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయంతో జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో పలు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

స్థానికుల అభిప్రాయమేరకే..

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించడంతో పాటు వీలుకాని చోట్ల ఈ డంపర్ బిన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో 80 నుంచి 100 చోట్ల డంపర్ బిన్ల ఏర్పాటు అవసరమని గుర్తించారు. రామ్‌కీ సంస్థ ఆధ్వర్యంలో ఈ డంపర్ బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ బస్తీలో పలుచోట్ల డంపర్ బిన్లు ఏర్పాటు చేశారు. డంపర్ బిన్లు ఏర్పాటు చేయాల్సిన చోట్ల బస్తీవాసులు, కాలనీవాసుల అభిప్రాయాలను తీసుకుని వాటిని ఏర్పాటుచేస్తున్నారు. బంజారాహిల్స్, షేక్‌పేట డివిజన్లలో మొత్తం 40 బిన్లు ఏర్పాటు చేస్తుండగా ఇందులో షేక్‌పేట డివిజన్‌లో 30, బంజారాహిల్స్ డివిజన్‌లో 10 ఏర్పాటు చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీకి వెళ్లే రోడ్డులో ఏసీబీ కార్యాలయం ముందు మూడు బిన్లను ఏర్పాటు చేస్తున్నారు. మొన్నటి వరకు డంపర్ బిన్లు లేనిచోట చెత్త కుప్పలుగా పేరుకుపోయి ఆ ప్రాంతం సమస్యాత్మకంగా ఉండేది. తాజా పరిణామాలతో ఇక చెత్త రోడ్డు పక్కన కాకుండా ఈ డంపర్ బిన్లలో వేస్తారు. దీని ద్వారా చెత్త రోడ్ల పక్కన కనిపించకుండా ఉంటుంది.

భార్యపై హత్యాయత్నం

భర్త రిమాండ్



అప్పలనాయుడు

ఫిలింనగర్: భార్యపై అనుమానంతో హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం అగ్రహారంకు చెందిన అనుచూరి అప్పలరాజు (51) సినిమా షూటింగ్‌లలో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుండగా భార్య వెంకటరమణమ్మ కూడా సినిమా షూటింగ్‌ల్లో పని చేస్తుంది. వీరు ఫిలింనగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్ బస్తీలో అద్దెకు ఉంటున్నారు. ఇటీవల అప్పలరాజు తన భార్య వెంకటరమణమ్మ ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్నాడు. భార్యను హత్య చేయాలని నిర్ణయించుకుని ఇటీవల స్వగ్రామం నుంచి కొబ్బరి బొండాలు కొట్టే కత్తిని తీసుకువచ్చి భద్రపరిచాడు. రోజూ ఆమెతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మరోసారి గొడవ కావడంతో అప్పలరాజు తాను తెచ్చుకున్న కత్తితో ఆమె మెడపై దాడి చేసేందుకు యత్నించగా ఆమె చేయి అడ్డం పెట్టగా తీవ్ర రక్తస్రావం జరిగింది. తప్పించుకుని బయటకు వచ్చిన బాధితురాలు చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పలరాజును రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



కొనేటి రమ్య

ఖైరతాబాద్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్, లింగాలకు చెందిన కోనేటి వెంకటేష్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హౌస్‌కీపింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో అతడి కూతురు కోనేటి రమ్య(17) ఖైరతాబాద్ వెంకటరణమ కాలనీలో నివాసముండే మామ ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం దుకాణానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన రమ్య ఎంతకీ ఇంటికి రాకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చింతలబస్తీలో..



రోషన్‌రాయ్

చింతలబస్తీలో నివాసముండే నేపాల్‌కు చెందిన కరన్ రాయ్ తన కుమారుడు రోషన్ రాయ్(15)ను ఇటీవల నగరానికి తీసుకువచ్చాడు. రోషన్‌ను చదువుకోమని చెప్పినప్పుడల్లా తండ్రి మాట వినకుండా తిరిగేవాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి రూ.500 బట్టలు తీసుకొని వెళ్లిపోయాడు. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



సమావేశంలో ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ నేతలు వెంకటేష్, వెన్నెల, అజారుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ టీపీసీ నేషనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. వెంకటేష్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్ ఏజీకాలనీ నుంచి ర్యాలీగా లిమ్రా ఫంక్షన్‌హాల్ వరకూ వెళ్లి సమావేశాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల అన్ని వర్గాలకు సమానత్వ ఫలాలు అందుతున్నాయని, బీజేపీ చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజలు గమనించాలని వెంకటేష్ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ పిలుపు మేరకు దేశ సంరక్షణకు, ప్రజలు నిజాలు తెలియాలని జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీ అజారుద్దీన్ అన్నారు. నేతలు నవీన్‌యాదవ్, భవానీశంకర్, దూడల రవిగౌడ్, వనం శ్రీనివాసయాదవ్, మాజిద్, కిరణ్‌యాదవ్, రమేష్‌నాయక్, సలీమ్, ఖాసీం, శశి, నయీమ్ పాల్గొన్నారు.

అన్నదానం



వెంగళరావునగర్: నిరుపేదలకు అన్నదానం చేయడం ఎంతో మహాభాగ్యకరమని అన్నపూర్ణాదేవి అన్న సమర్పణ సొసైటీ నేతలు తెలియజేశారు. మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని సొసైటీ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని రహమత్‌నగర్ చౌరస్తాలో అన్నపూర్ణాదేవి, శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ నేతలు మాట్లాడుతూ..రాష్ట్రంలో కరువు, కాటకాలు రాకుండా, ఉపద్రవాలు ప్రజలను ముంచెత్తకుండా, సిరులతో, సుఖసంతోషాలతో ప్రజలు ఉండాలని కోరుతూ ప్రతి నెల ఇలాంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తాడికొండ కృష్ణమూర్తి గుప్తా, ఎం.శ్యాంరావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, బి.ఆంజనేయులు యాదవ్, బుద్ధ నాగార్జున గుప్తా, పి.వి.బ్రహ్మానందం గుప్తా, కొవ్వూరి ప్రభు గుప్తా, జి.సత్యనారాయణ గౌడ్, పి.చందర్‌గౌడ్, టి.శ్రీనివాస్, ఎల్.బుచ్చయ్య, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెం-14లోని వెంకటేశ్వరనగర్ బస్తీ కమ్యూనిటీ హాల్ ముందు వరద నీటి కాలువ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. నెల రోజులు గడుస్తున్నా అధికారులకు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు మండిప పడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

వృద్ధ సైంటిస్ట్‌పై యువకుడి దాడి

వెంగళరావునగర్: అకారణంగా వృద్ధ సైంటిస్ట్‌పై యువకుడు దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మధురానగర్ నివాసి డాక్టర్ కె.నారాయణరెడ్డి నాచారంలో సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఏడాదిన్నరగా తన కారును సత్యనారాయణ రాజు అనే వ్యక్తి స్థలంలో పార్కింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 22న పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లగా మధ్యాహ్నం సత్యనారాయణరాజు కుమారుడు సందీప్ కారు అద్దాలు, వివిధ భాగాలు పగలకొట్టాడు. వాచ్‌మెన్ చెన్నారావు ఈ విషయాన్ని నారాయణరెడ్డికి తెలిపారు. ఆయన పార్కింగ్ స్థలం వద్దకు వచ్చి కారు పార్కింగ్ చేయడానికి మీ తండ్రి అనుమతి తీసుకున్నానని చెప్పాడు. అనంతరం అక్కడ నుంచి కారును తీయడానికి ప్రయత్నించగా సందీప్ దుర్భాషలాడుతూ సైంటిస్ట్‌పై దాడి చేశాడు. బాధితుడు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న వ్యక్తిపై కేసు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో నివసించే పూలే శేఖర్ అనే మేస్త్రీ హకీంబాబా దర్గా వద్ద ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తుండగా ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. భారత్ మట్కా అనే బెట్టింగ్ వెబ్‌సైట్‌లో శేఖర్ కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

టీచర్ కళ్లుగప్పి రూ. 40 వేలు డ్రా

వెంగళరావునగర్: టీచర్ కళ్లుగప్పి ఓ యువకుడు రూ.40 వేలు డ్రా చేసుకున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏజీ కాలనీలో ఉండే ఫర్హాబాను టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. సోమవారం ఎస్ఆర్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి నగదు డ్రా చేసేందుకు యత్నించగా డ్రా కాలేదు. పక్కనే ఉన్న యువకుడు ఆమె కార్డు తీసుకుని ప్రయత్నించాడు. నగదు డ్రా కాలేదు. దాంతో ఆమె కార్డు తీసుకుని బయటకు వచ్చింది. కొంతదూరం వెళ్లాక చూసుకుంటే తన చేతిలో ఉన్నది తన ఏటీఎం కార్డు కాదని తెలుసుకుని మళ్లీ ఏటీఎం వద్దకు వచ్చి చూడగా అతడు కనిపించలేదు. కాసేపటి తర్వాత ఆమె అకౌంట్‌లో నుంచి రూ.40 వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

బంజారాహిల్స్: ఉరేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రోడ్డు నెంబర్-5లోని దుర్గాభవానీనగర్ బస్తీలో నివసించే మాదవత్ బుజ్జి (33) కల్లుకు బానిసైంది. కల్లు తాగడం మానేయాలని భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఆమెను హెచ్చరించడంతో వారం రోజులుగా తాగడం మానేసింది. రోజూ కల్లు తాగే ఆమె ఒక్కసారిగా మానేయడంతో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: దళితులపై దాడిని నిరసిస్తూ ఈనెల 30న చేపట్టిన 'చలో బోరిగాం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు పిలుపునిచ్చారు. పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థి సంఘాల నేతలు శ్రీకాంత్, కోట శ్రీనివాస్‌గౌడ్, సుమంత్, రుక్మత్ పాషా, ఉదయ్, హరీశ్, అఖిల్, ముత్యం, అరుణ్, అనిల్, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్థానికుల అవసరాలకు కేటాయించండి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ భూములను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని 'ప్రజావాణి'లో సోమవారం జాయింట్ కలెక్టర్‌కు కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్‌నగర్‌లో ప్రభుత్వ భూములు ప్రజలకు ఉపయోగపడాలే తప్ప ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లవద్దని కోరారు. ఆర్టీఓ కార్యాలయానికి స్థలం కేటాయించడంతో అసలైన వివాదం నెలకొందని, కార్వాన్ నియోజకవర్గ ఆర్టీఓ కార్యాలయం ఇక్కడ ఎందుకని, ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఒక ఆర్టీఓ కార్యాలయం ఇప్పటికే ఉందని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ గానీ, ప్రభుత్వ కళాశాల గానీ, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ గానీ నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన ఉండాలి



మాట్లాడుతున్న డీఈఓ రోహిణి

వెంగళరావునగర్: విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో ఉపాధ్యాయుల బోధన ఉండాలని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా హైదరాబాద్ జిల్లాలోని జీవశాస్త్రం ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం యూసుఫ్‌గూడ ట్రెనింగ్ సెంటర్‌ను డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ రోహిణి మాట్లాడుతూ..ఏ లాంగ్వేజ్‌లో విద్యార్థులకు బోధన చేస్తున్నప్పటికీ పాఠ్యాంశం మాత్రం తప్పనిసరిగా విద్యార్థి అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు కొన్ని ప్రయోగాల ద్వారా, మరికొన్ని పాఠాలుగా, చిత్రలేఖనం ద్వారా సబ్జెక్ట్‌పై పూర్తిస్థాయి పరిజ్ఞానం కలిగేలా ప్రయత్నించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్, ఉప విద్యాశాఖాధికారితో పాటుగా రీసోర్స్ పర్సన్లు లక్ష్మీనారాయణ, మాలతి, గోవర్ధన మణి, సుచిత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ క్లినిక్‌లు, వైద్యులను అరికట్టాలి



మాట్లాడుతున్న పూర్ణిమ మండవ

పంజగుట్ట: నకిలీ క్లినిక్‌లు, వైద్యులు, కొంత మంది టెక్నీషియన్‌లే వైద్యులుగా చెప్పుకుంటూ అసాంఘిక వైద్య పద్ధతుల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, ప్రభుత్వం వీరిపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ క్రీడాకారిణి, ఉమెన్స్ వెల్నెస్ కోచ్ పూర్ణిమ మండవ అన్నారు. ఎవరైనా వైద్యుడి వద్దకు వెళ్తే సదరు వైద్యుడి పూర్తి సమాచారం తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో న్యాయవాది హనుమంతరావుతో కలిసి మాట్లాడుతూ..తాము గత కొన్ని రోజులుగా నకిలీ డాక్టర్లను, క్లినిక్‌లను గుర్తించి అన్ని ఆధారాలతో బయటపెడుతున్నామన్నారు. దీంతో కొంతమంది వారి క్లినిక్‌లల్లో ఉన్న అవకతవకలు సరిచేసుకుంటుటే.. మరికొంతమంది బెదిరించడం, కొంతమంది లీగల్ నోటీసులు పంపడం లాంటివి చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రఘు, దుర్గాంజలి, పవన్, రాఘవేంద్ర పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో..

దంచికొట్టిన వాన

దంచి కొట్టిన వానకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. మంగళవారం రాత్రి 7 గంటల నుంచి రెండు గంటలకు పైగా జూబ్లీహిల్స్, పంజగుట్ట, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. దీంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు నీట మునిగాయి. శ్రీకృష్ణానగర్ వీధులన్నీ చెరువులను తలపించాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

– బంజారాహిల్స్



కేబీఆర్ పార్కు వద్ద వరద నీటిని పంపింగ్ చేస్తున్న సిబ్బంది



పెద్దమ్మగుడి మెట్రోస్టేషన్ వద్ద..

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన హకీంపేట్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన నిరుపేదల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దీనికి తోడుగా నిరుపేదల వైద్యం కోసం సీఎం సహాయ నిధి పథకం నుంచి కూడా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూన్ ఫరాన్, వజీఉజ్జమా సిద్ధిఖీ, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

మరో 20 టీఎంసీలు..

- జూన్ మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా..
- గోదావరి రెండు, మూడో దశ పనులకు శంకుస్థాపన
- రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా జలమండలి ప్రణాళిక

సాక్షి, సిటీబ్యూరో: మహానగర తాగునీటి అవసరాల కోసం మరో 20 టీఎంసీల జలాలను తీసుకొచ్చే గోదావరి రెండు, మూడో దశ పనుల శంకుస్థాపనకు ముహూర్తం ఖరారైంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జూన్ మొదటి వారంలో సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా ఉస్మాన్‌సాగర్ వద్ద గోదావరి తాగునీటి సరఫరా పథకం రెండు, మూడో దశ పనులు ప్రారంభించే విధంగా జలమండలి ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో పనులు ప్రారంభించేందుకు చర్యలకు ఉపక్రమించింది. సుమారు రూ.7,360 కోట్ల అంచనా వ్యయంతో హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్)ప్రాజెక్టు పనులు చేపట్టనున్నారు. మొత్తం వ్యయంలో ప్రభుత్వ వాటా 40 శాతం, నిర్మాణ సంస్థ వాటా 60 శాతం భరించనుంది. ఇప్పటికే ప్రభుత్వం తన వాటా కింద సుమారు రూ.300 కోట్ల నిధుల సమకూర్చుకునేందుకు హడ్కో వద్ద రుణం కోసం ఆమోదం పొందింది. రెండేళ్లలో ప్రాజెక్టు పనులను పూర్తయ్యేలా జలమండలి ప్రణాళిక రూపొందించింది.

- గోదావరి జలాల్లో నగర తాగునీటి అవసరాలకు సుమారు 30 టీఎంసీల కేటాయింపు ఉంది. ఇప్పటికే గోదావరి మొదటి దశ కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని తరలిస్తుండగా, రెండు, మూడు దశల పనులు పూర్తయితే మిగిలిన 20 టీఎంసీలు తరలించేందుకు వెసులుబాటు ఉంటుంది. మొత్తం 20 టీఎంసీల్లో నగర తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు, మిగిలిన 5 టీఎంసీలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల పునరుజ్జీవనానికి వినియోగించనున్నారు. మొత్తం మీద ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రెండోదశ నుంచి 150 ఎంజీడీలు, మూడోదశ నుంచి 150 ఎంజీడీల నీరు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సరఫరా జరిగే అవకాశం ఉంది.

నిమ్స్‌మే మైదానాన్ని సందర్శించిన కేంద్రమంత్రి



నిమ్స్‌మే మైదానాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి జితన్ రామ్ మాన్‌జీ

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లోని నిమ్స్‌మే మైదానాన్ని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్ రామ్ మాన్‌జీ మంగళవారం సందర్శించారు. మైదానం విస్తీర్ణం, ఆక్రమణల గురించి నిమ్స్‌మే డైరెక్టర్ అశుతోశ్ కేంద్రమంత్రికి వివరించారు. రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ నాలుగు చోట్ల నిమ్స్‌మేకు చెందిన దాదాపు 15 ఎకరాల స్థలాలు ఉన్నాయని, ఇందులో టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే యువతకు ఉపయోగకరంగా ఉంటుందని ఎంఎస్‌ఎంఈ సంయుక్త కార్యదర్శి మెర్సీ ఎపావో కేంద్రమంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

కాన్వాయ్ ఆపి.. పూలమాల వేసి..

రహమత్ నగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న కేంద్రమంత్రి జితన్ రామ్ మాన్‌జీ మార్గమధ్యలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రహమత్‌నగర్ కార్మికనగర్ చౌరస్తాలోకాంగ్రెస్‌నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తుండగా పక్కనే ఉన్న నిమ్స్‌మే మైదానంలోకి మంత్రి కాన్వాయ్‌లో వెళ్తున్నారు. దానిని గమనించిన కేంద్రమంత్రి వెంటనే కాన్వాయిని ఆపి అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నగరంలో నేడు

- మిస్‌వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్ సమీపంలోని రైతుబజార్ రోడ్‌లో ఉన్న వనస్థలిపురం కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ క్యాంపస్‌లో మధ్యాహ్నం 2.30గంటలకు 12వ తరగతి టాపర్లకు ప్రతిభ సమ్మాన్ సమారోహ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వేగం ఎక్కువ.. తీవ్రత తక్కువ..

- కోవిడ్ కేసులపై భయపడాల్సిన పనిలేదు
- గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అప్రమత్తంగా ఉండాలి
- పరీక్షా కిట్లు, వార్డులు, మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు
- ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజారావు





సాక్షి, సిటీబ్యూరో: దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇటీవల నగరంలోని ఓ వైద్యుడికి కోవిడ్ పాజిటివ్ అని తేలడంలో అందరిలోనూ భయాందోళన మొదలైంది. మళ్లీ పరిస్థితులు ఎటు దారి తీస్తాయోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న కరోనా వైరస్ వేరియంట్ ఒమెక్రాన్‌తో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాప్తిని అడ్డుకోవడానికి గతంలో మాదిరిగా జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజారావు 'సాక్షి'తో మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుత కరోనా వేరియంట్ వ్యాప్తి, దాని ప్రభావం, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఆయన మాటల్లోనే..

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..

ప్రపంచ ఆరోగ్య సంస్థ, నేషనల్ మెడికల్ కౌన్సిల్ సమాచారం ప్రకారం.. కరోనా వైరస్ వేరియంట్ ఒమిక్రాన్ వ్యాప్తి అనేది వేగంగా, దాని తీవ్రత తక్కువగా ఉంటుంది. సాధారణ ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికి కరోనా సోకినా మృతి చెందేంత తీవ్ర స్థాయి వేరియంట్ కాదు. ప్రస్తుతం ఉన్న అన్ని వేరియంట్ల పరిస్థితి ఇదే. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరికైనా కోవిడ్ లక్షణాలుంటే వ్యక్తిగతంగా ఐసోలేటెడ్ అయిపోవాలి. ఫలితంగా వైరస్‌ను వ్యాప్తి చెందకుండా నివారించగలుగుతాం.

ఆ వయసు వారు జాగ్రత్త..

కరోనా వైరస్ వ్యాప్తి, ప్రభావం పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో ఎక్కువగా ఉంటుంది. వీరు జన సమూహాలకు దూరంగా ఉండటం మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలి. భయాందోళనకు గురికావాల్సిన పనిలేదు.

ఆసుపత్రుల్లో ఏర్పాట్లు..

నగరంలో ఒక కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆసుపత్రులను అప్రమత్తం చేసింది. ఇప్పటికే గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసింది. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు అన్నిచోట్ల కరోనా పరీక్షా కిట్లు, సత్వర చికిత్స కోసం వైద్యులను అందుబాటులో ఉంచారు. జలుబు వంటి లక్షణాలను గుర్తిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి. కోవిడ్ అని నిర్ధారణ అయితే అక్కడ వైద్య సేవలు, మందులు అన్నీ ఉచితంగా అందిస్తారు.

వరద నివారణకు ప్రత్యేక సిబ్బంది

– నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి



ఎల్‌బీనగర్: వచ్చే వర్షాకాలంలో ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, వరద నీరు నిలిచే ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తామని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ అన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లకు చెందిన కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికాలతో మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత కేశవ పాటిల్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కోవిడ్ విస్తరిస్తున్న దృష్ట్యా ఎంటమాలజీ, శానిటేషన్ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని అంటు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రీ మాన్‌సూన్ టీంలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విస్తరిస్తున్న కాలనీలకు అనుగుణంగా శానిటేషన్ సిబ్బంది, కార్మికుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రేటర్ పరిధిలో వెయ్యి డస్ట్‌బిన్స్ కొనుగోలు చేశామని, ఇప్పటికే 750 బిన్స్ అందుబాటులో ఉన్నాయని, రాంకీ సంస్థ ద్వారా పక్కాగా చెత్త సేకరణ జరుగుతోందని అన్నారు. కాగా, నగరంలో వీధి దీపాల సమస్యపై బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని మేయర్ తెలిపారు. డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలను కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, రంగనర్సింహ్మాగుప్త, పవన్‌కుమార్, సుజాతనాయక్, డీసీలు యాదయ్య, సేవా ఇస్లావత్, సుజాత, ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, సీపీ శ్రీనివాస్‌యాదవ్, పలువురు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐజీసీఎస్‌ఈ టెన్త్‌లో శ్రీ చైతన్య గ్లోబల్ సత్తా



లక్ష్మి అనిక

సాక్షి, సిటీబ్యూరో: ఐజీసీఎస్‌ఈ పదో తరగతి పరీక్షల్లో శ్రీ చైతన్య ఫ్యూచర్ పాత్ వేస్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు స్కూల్ డైరెక్టర్ సీమా బొప్పన ఒక ప్రకటన తెలిపారు. 3 నుంచి 8వ తరగతి వరకు 24 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. గచ్చిబౌలికి చెందిన 13 ఏళ్ల ఎనిమిదో తరగతి విద్యార్థిని లక్ష్మి అనిక నృసింహదేవర 10 తరగతి పరీక్ష రాసి రసాయన శాస్త్రంలో 93 శాతం మార్కులు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పినట్లు తెలిపారు. విద్యార్థులందరూ 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డైరెక్టర్ సీమా బొప్పన, చీఫ్ ఆఫ్ అకాడమిక్స్ పుష్పవల్లి, ఏజీఎం శివరామకృష్ణ అభినందించారు.

గిగ్ ప్లాట్‌ఫామ్ కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

హైదరాబాద్ కార్మిక శాఖ ఉప కమిషనర్ జాసన్



చిక్కడపల్లి: ఈ శ్రమ్ పోర్టల్‌లో జొమాటో, ఉబర్, ఓలా వంటి గిగ్ ప్లాట్‌ఫామ్ కార్మికులు పేర్లను నమోదు చేసుకోవాలని హైదరాబాద్ కార్మిక శాఖ ఉప కమిషనర్ బి.జాసన్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు, అంగ వైకల్యం సంభవిస్తే రూ.లక్ష వరకు బీమా లభిస్తుందన్నారు. దీనికి యాజమాన్యం కూడా సహకారం అందించాలన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌తో కార్మిక శాఖ(ఏఎల్‌ఓ) అధికారులకు వివరాలను అందజేయాలన్నారు. వారంపాటు జరిగే కార్మికుల పేర్ల నమోదు కార్యక్రమాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్, సహాయ కమిషనర్‌లు పాల్గొన్నారు.

ప్రజావాణికి అమెరికన్ల కితాబు



సీఎం ప్రజావాణిని సందర్శించిన ఎన్నారై బృందాన్ని శాలువాతో సత్కరించిన చిన్నారెడ్డి, దివ్య

లక్డీకాపూల్: 'ప్రజావాణి'తో ప్రజల సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతున్నాయని, సమస్యల పరిష్కారానికి ఇది సరైన వేదికగా కనిపిస్తోందని అమెరికన్ల బృందం అభిప్రాయపడింది. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన సీఎం ప్రజావాణిని అమెరికాకు చెందిన పానిస్ ఎంఎస్సీ సంస్థ సీఎఫ్‌వో రాబర్ట్ హల్, మాక్స్ సూర్ సంస్థ ప్రెసిడెంట్ శ్రీక్ సూగోడ్, ఐసోవిజ్ సంస్థ సీఈవో చరణ్ గుంటీలు సందర్శించారు. ప్రజావాణిలో ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన ప్రవాసి ప్రజావాణి డెస్క్‌ను అమెరికన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి దగ్గర ఉండి ప్రజావాణి నిర్వహణ తీరును ఎన్నారై బృందానికి వివరించారు ఎన్నారై హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు వంటి పనితీరుపై ఆ బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. అనంతరం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డితోపాటు స్టేట్ నోడల్ అధికారి దివ్యతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమెరికన్లను చిన్నారెడ్డి శాలువాతో సన్మానించారు.

ధర్నాచౌక్‌లో 'ఆటో ఆకలి కేకలు'

హామీలను అమలు చేయాలని ఆటోడ్రైవర్లు డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, అధ్యక్షుడు మంద రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 90 మంది ఆటోడ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని విచారం వ్యక్తం చేశారు. హామీలు నెరవేర్చాలని కోరుతూ ఏప్రిల్ 25న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రారంభమైన ఆటో రథయాత్ర మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా 'ఆటో ఆకలి కేకల మహాసభ'నిర్వహించారు. ముఖేష్‌గౌడ్, రవికుమార్ మాట్లాడుతూ ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 8 వేలు ఉన్న ఇన్సూరెన్స్‌ను రూ.వెయ్యికి తగ్గించాలని కోరారు. ఓలా, ఉబర్, ర్యాపిడో సంస్థల ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్స్‌ను వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్లందరూ కలిసి ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని అన్నారు. ధర్నాలో బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య, బీఎంఎస్ ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ హబీబ్, టీయూసీఐ నాయకుడు ఉయ్యాల ప్రవీణ్ పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ ఏర్పాటు కావాలి

లాలాపేట: భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రం అవతరించిందని, సామాజిక తెలంగాణ ఇంకా ఏర్పాటు కావాల్సి ఉందని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ సంజయ్ ఆనంద్ అన్నారు. మంగళవారం లాలాపేటలోని లోగోస్ గాస్పల్ చర్చిలో ఎన్‌సీసీ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణలో ఏర్పాటైన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జూలై 2న ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్‌సీసీ పాటుపడుతుందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను కాపాడాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెవరెండ్ బక్క ఏలియా, మహిళా అధ్యక్షురాలు ప్రసన్న బోల్డ్, కౌన్సిల్ సభ్యులు రెవరెండ్ గడిపె సుదర్శన్, సునీల్, ప్రీతి, వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లు బలోపేతం కావాలి: కోదండరాం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ స్కూళ్లు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. విద్య అమ్మకం సరుకు కాదని, ప్రైవేటీకరణ వల్ల విద్యావ్యవస్థ కుప్పకూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఉన్నత విద్యను గందరగోళంలోకి నెట్టారని, నిధులు కూడా సక్రమంగా విడుదల కావడంలేదని విచారం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, పార్ట్‌టైం టీచర్స్‌తో నడిపిస్తున్నారని విమర్శించారు. విద్యను సామాజిక అవసరంగా చూడాలని, అది ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఈ ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు. టీచర్స్ సంఘం ప్రతినిధి వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన విద్య అందడం లేదని, ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మారిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. టీపీజేఏసీ కో కన్వీనర్లు కన్నెగంటి రవి, మైస శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఎంవీఎఫ్ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవిచంద్ర, పర్వతరెడ్డి, ప్రభాకర్, సాదిక్ అలీ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఫీవర్'లో కోవిడ్ ఐసోలేషన్ వార్డు సిద్ధం

ఆక్సిజన్ ఏర్పాట్లతో అందుబాటులో 30 పడకలు



ఫీవర్‌లో సిద్ధం చేసిన కోవిడ్ ఐసోలేషన్ వార్డు

నల్లకుంట: దేశవ్యాప్తంగా కోవిడ్ విస్తరిస్తున్న నేపథ్యంలో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో 30 పడకలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డును అధికారులు సిద్ధం చేశారు. ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యాలతో ఈ పడకలను ఏర్పాటు చేశారు. వారం క్రితం నగరంలోని కూకట్‌పల్లిలో ఓ కోవిడ్ పాజిటివ్ కేసు, తాజాగా ఫీవర్‌లో ఓ పాజిటివ్ కేసు నమోదు కావడంతో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. గతంలో కోవిడ్‌కు వినియోగించిన మందులను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం కొత్త వేరియంట్‌కు అనుగుణంగా చికిత్సలు చేయడంతోపాటు ఏ మందులు వినియోగించాలో కేంద్రం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచారు.

మందులు అందుబాటులో ఉన్నాయి



30 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు సిద్ధం చేశాం. అవసరమైతే మరిన్ని పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే కోవిడ్ నిర్ధారణ పరీక్ష తప్పనిసరిగా చేసుకోవాలి. అనుమానితులకు ఆసుపత్రిలో ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ టెస్టులు చేస్తున్నాం. కొత్త వేరియంట్‌పై ఆందోళన వద్దు. మాస్కులు ధరించడం మంచిది. 60 ఏళ్లు పైబడిన వారు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు, బాలింతలు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లు ఇంటి నుంచి బయటకు రాకపోవడం మంచిది. వాతావరణంలో మార్పులు వచ్చిన కారణంగా అప్రమత్తత అవసరం.

–డా.జయలక్ష్మి, ఫీవర్ సీఎస్ ఆర్ఎంవో

సవాళ్లు ఉన్నా కీలక రంగాల్లో భారత్ పటిష్టం

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు డాక్టర్ అనంత నాగేశ్వరన్



మాట్లాడుతున్న డాక్టర్ అనంత నాగేశ్వరన్

రాయదుర్గం: ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సవాళ్లు ఎన్నో ఉన్నా భారతదేశం కీలక రంగాల్లో పటిష్టంగా ఉందని, ఊహించని రీతిలో ముందుకు సాగుతోందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంతనాగేశ్వరన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) క్యాంపస్‌లో కేంద్ర ప్రభుత్వ గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ(ఎంఓఎస్‌పీఐ), జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌ఓ), ఐఎస్‌బీ సంయుక్తంగా అన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ వార్షిక సర్వే(ఏఎస్‌యూఎస్‌ఈ)–2023–24, ప్రైవేట్ సెక్టార్ క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్(సీఏపీఈఎక్స్) పెట్టుబడి ఉద్దేశాలపై ఫార్వర్డ్ లుకింగ్ సర్వే ఫలితాల విశ్లేషణకుగాను మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తయారీ రంగంలో బలమైన మూలధన వ్యయం గురించి సర్వే ఆసక్తికర విషయాలు వెల్లడించిందన్నారు. వ్యవసాయేతర రంగంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు డేటా చెబుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఓఎస్‌పీఐ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు, పరిశోధకులు, ఆర్థికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాంకీ ఫౌండేషన్‌కు టస్కర్ అవార్డు



శశి థరూర్ చేతుల మీదుగా టస్కర్ అవార్డు అందుకుంటున్న రామిరెడ్డి

బంజారాహిల్స్: రాంకీ ఫౌండేషన్‌కు 'టస్కర్'అవార్డు లభించింది. సీఎస్ఆర్ ఎక్స్‌లెన్స్ విభాగంలో ఈ అవార్డును ప్రముఖ కాంగ్రెస్ నేత, ఎంపీ శశి థరూర్ చేతుల మీదుగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి కేరళలోని తిరువనంతపురంలో అందుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సహజ వనరుల సంరక్షణ, విద్య, వైద్యం, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, మహిళా సాధికారత వంటి రంగాల్లో రాంకీ ఫౌండేషన్ అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించింది. ఇండో కాంటినెంటల్ ట్రేడ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రమోషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పురస్కార ప్రదానోత్సవంలో ప్రముఖ వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. సీఎస్ఆర్ చట్టం రావడానికి ముందు నుంచే సామాజిక బాధ్యతగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న రాంకీ ఫౌండేషన్‌ను టస్కర్ అవార్డుకు ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందని, ఇది తమ బాధ్యతను ఇంకా పెంచిందని రామిరెడ్డి అన్నారు. అవార్డు అందించిన సందర్భంగా శశి థరూర్ తమ సేవల గురించి ఆరా తీసి అభినందనలు తెలిపారని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లోనూ తమ సేవలను మరింతగా విస్తరించబోతున్నామని, ఈ ఆర్థిక సంవత్సరంలో సేవా కార్యక్రమాల నిమిత్తం రూ.100 కోట్లు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం: సజ్జనార్



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో రాష్ట్రస్థాయి ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాల చెల్లింపు, 21 శాతం ఫిట్‌మెంట్, 2017 పీఆర్‌సీ, 2013 ఆర్‌పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతోపాటు పెండింగ్ డీఏలను మంజూరు వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. విధి నిర్వహణలో మరణించిన 2,350 మంది సిబ్బంది కుటుంబసభ్యులకు కారుణ్య నియమకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామని చెప్పారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన మరో 535 మందికి కూడా ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఆరోగ్య బీమా కల్పిస్తామన్నారు. మహాలక్ష్మీ పథకం అమలులో సిబ్బంది పనిభారాన్ని తగ్గించేందుకు తాత్కాలిక నియామకాలు చేపడుతుంటే, కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో 3,036 రెగ్యులర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, సాంకేతిక కారణాల వల్ల జాప్యం అవుతోందన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేవిధంగా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. కార్యక్రమంలో ఈడీలు మునిశేఖర్, ఖుస్రో ఖాన్, సోలమాన్, వెంకన్న, రాజశేఖర్, విజయ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

5జీ అంబులెన్సులు ప్రారంభం



5జీ అంబులెన్సులను ప్రారంభిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్: కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 'ది పవర్ ఆఫ్ త్రీ'పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలోని కేర్ ఆస్పత్రుల్లో 5జీ అంబులెన్స్ సేవలను మంగళవారం ప్రారంభించారు. అత్యవసరమైన సేవలను వేగంగా అందించేందుకు ఈ అంబులెన్సులు ఉపయోగపడనున్నాయి. ఇలాంటి అంబులెన్సులను నగరంలో మొట్టమొదటిసారిగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా మాట్లాడుతూ 5జీ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం కేవలం హాస్పటల్‌కే కాదని, దేశంలో ఆరోగ్య సంరక్షణకు గర్వకారణమని అన్నారు. ఎమర్జెన్సీ కాల్స్‌కు 3 రింగ్స్ లోపల స్పందిస్తారని, హైదరాబాద్‌లో ఎక్కడైనా 30 నిమిషాల్లో అంబులెన్స్ రోగిని తీసుకువెళ్తుందని చెప్పారు. బంజారాహిల్స్, హైటెక్ సిటీ, నాంపల్లి, మలక్‌పేట, ముషీరాబాద్‌లోని ఆస్పత్రుల్లో రోగి రాగానే వెంటనే ఎమర్జెన్సీ డాక్టర్ చికిత్స ప్రారంభిస్తారన్నారు. అత్యవసర సమయంలో వెంటనే సహాయం పొందేందుకు ప్రజలు 040–61656565 హెల్ప్‌లైన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కాగా, నూతన 5జీ అంబులెన్స్‌లకు ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి, గ్రూప్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ నిఖిల్ మాథూర్, జోనల్ సీఓఓ బిజు నాయర్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 28, మే, 2025



భాగ్య నగరం మామిడి ప్రియత్వంతో ఉవ్విళ్లూరుతోంది. పండ్ల సీజన్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. విభిన్న రకాల మామిడి వెరైటీలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. మామిడి విక్రయాల విషయంలో ఆఫ్ లైన్ మార్కెట్‌తో ఆన్‌లైన్ పోటీపడే స్థాయికి చేరుకోవడం ఈ సీజన్ విశేషం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నగర మామిడి మార్కెట్ స్థితిగతుల పై ఓ విశ్లేషణ..

- సాక్షి, సిటీబ్యూరో



ఆన్‌లైన్‌లో.. ఆమ్ కా జోష్..

భాగ్యనగరంలో మామిడి సీజన్ స్వింగ్

- ఆఫ్‌లైన్‌తో పోటీపడుతూ ఆన్‌లైన్ అమ్మకాలు
- ఖరీదైన పండ్ల రకాల కోసం ఆన్‌లైన్ వైపే చూపు
- ఆర్గానిక్ మామిడిని ఇష్టపడేవారిదీ అదే బాట
- హిమాయత్, దసేరి నుంచి టాంగీ తెల్ల గులాబీ వరకూ

తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మామిడి పండ్లతో పాటు, హిమాయత్, దాసేరి, బెనిషాన్, అల్ఫోన్సో, రసాలు వంటి రకాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి నగరానికి వస్తాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో అకాల వర్షాలు, ఈదురు గాలులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను తాకాయి. ఇది నగర ప్రాథమిక మామిడి సరఫరాదారులపై తీవ్ర ప్రభావం చూపింది. హోల్‌సేల్ మార్కెట్‌లను పండని, పక్వానికి రాని పండ్లు ముంచెత్తడానికి కారణమైంది.

ధరలు డౌన్.. సేల్స్ అప్..

నగరంలోని మామిడి కేంద్రమైన బాటసింగారం, పీక్ సీజన్‌లో ప్రతిరోజూ 3,000 నుంచి 5,000 క్వింటాళ్ల పండ్ల క్రయవిక్రయాలు నిర్వహిస్తోంది. నగటు ధరలు క్వింటాకు రూ.2,345గా ఉన్నాయి. మరో మార్కెట్ అయిన జాంబాగ్, సీజన్ ప్రారంభ రోజుల్లో 500–800 క్వింటాళ్లు ఏప్రిల్‌లో 1,000–1,500 క్వింటాళ్లు ప్రాసెస్ చేస్తుంది. రిటైల్ మార్కెట్ విషయానికి వస్తే సీజన్ ప్రారంభంలో పండ్ల ధరలు కిలో రూ.200, రూ.400 వరకూ పలికాయి. అయితే రానురానూ తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం మామిడి విక్రయాలు బాగా ఊపందుకున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ధరలు స్థిరంగా ఉన్నాయి. రకాన్ని బట్టి కిలోకు రూ.70 నుంచి రూ.200 వరకూ ఉన్నాయి.

పచ్చడి మామిడిదీ అదే దారి..

'గతానికి భిన్నంగా పచ్చడి, ఇతర అవసరాల కోసం కూడా సిటిజనులు ఆన్‌లైన్‌ను ఆశ్రయిస్తుండడం కనిపిస్తోంది. 'ఈ సీజన్‌లో పచ్చి మామిడి పండ్ల అమ్మకాలు రోజుకు 30–40 సంచుల నుంచి 20 సంచులకు తగ్గాయి. దీనికి కారణం నగరవాసులు నేరుగా ఆంధ్రాకు వెళ్లి తెచ్చుకోవడమే.. లేకుంటే ఆన్‌లైన్‌లోనే పచ్చళ్లు ఆర్డర్ చేస్తున్నారు' అని కూకట్‌పల్లి రైతుబజార్‌లో పండ్ల దుకాణం యజమాని పవన్ చెబుతున్నారు. ఊరగాయల కోసం టాంజీ, తెల్లగులాబి, షెల్ఫ్ లైఫ్ కోసం కొత్తపల్లి కొబ్బరి, సీజన్ చివరి రుచి కోసం జలాలు.. వంటివన్నీ నూజివీడు, కాకినాడ, విజయవాడ నుంచి వస్తాయి.

ప్రత్యేక వెరైటీల కోసం..

సాధారణంగా బంగినపల్లి వంటి తెలిసిన రకాలు కాకుండా ప్రత్యేకంగా కొన్ని వెరైటీలు ఆర్డర్ చేయాలి అనుకునేవారు కూడా ఆన్‌లైన్ వైపే చూస్తున్నారు. మ్యాంగోస్ హైదరాబాద్ సంస్థ సేంద్రియ పద్ధతిలో పండించిన బంగినపల్లి, హిమాయత్, లంగ్రా, కేశర్, మల్లికా, దసేరి, చిన్ని రసాలు, పంచదార కలసం వంటి పలు రకాలని అందిస్తోంది. రూ.145 నుంచి రూ.1,950 వరకూ ఉన్నాయి. అలాగే మ్యాంగోస్ మార్ట్ సంస్థ ఆల్ఫోన్సో, బంగినపల్లి, హిమాయత్, కేశర్, చిన్ని రసాలు, దసేరి వంటి వెరైటీలను అందిస్తోంది. కనీస ఆర్డర్ పరిమాణం 3 కిలోలు ఉండాలని సూచిస్తోంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కూడా సీజన్‌ను అనుసరిస్తోంది. సింధూరా, బాదామి, మల్లికా, ఆల్ఫోన్సో వంటి మామిడి రకాలును ఇది అందిస్తోంది. సింధూరా (3 పండ్లు) రూ.129, బాదామి (1 పండు) రూ.65, మల్లికా (2 పండ్లు) రూ.149, ఆల్ఫోన్సో (6 పండ్లు) రూ.649.. ఇలా ధరలు ఉన్నాయి. ఈ ఆన్‌లైన్ సంస్థలు కనీసం 24 గంటల నుంచి 48 గంటల వ్యవధిలో డెలివరీకి తీసుకుంటున్నాయి.





ఆర్గానిక్.. ఆన్‌లైన్‌లో క్లిక్..

కృత్రిమంగా పండించడం గురించిన ఆందోళనలు నగరవాసుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇది కొత్త కొత్త విక్రయ మార్గాలను తెరుస్తోంది. అదే క్రమంలో పొలం నుంచి నేరుగా ఇంటికి వచ్చే ప్రత్యామ్నాయాలను ఇష్టపడే వినియోగదారులు కూడా పుట్టుకొచ్చారు. పెరిగిన డిమాండ్‌తో రిటైల్ దుకాణాలు సేంద్రీయ బంగినపల్లి రకాన్ని కిలోకు రూ.150 నుంచి రూ.400 చొప్పున విక్రయిస్తుండగా ఆన్‌లైన్‌లో అంతకన్నా తక్కువ ధరకే లభిస్తున్నాయి. ఆన్‌లైన్ స్టోర్ నడుపుతున్న రాఘవేంద్ర, తాను 2011లో ఆన్‌లైన్‌లో మామిడి పండ్లను అమ్మడం ప్రారంభించానని అంటున్నారు. ఆయన సదాశివపేట, షామిర్‌పేట నుంచి మామిడి పండ్లను సేకరించి నగరంలోని ఇళ్లకు డెలివరీ చేస్తున్నాడు. ఇతర నగరాలకు ఆర్డర్‌లు కార్గో బస్సుల ద్వారా సరఫరా చేస్తున్నాడు. 'ఆన్‌లైన్ సేవలు విశ్వసించగల సురక్షితమైన, సేంద్రీయ పండ్లను అందిస్తాయి' అని అత్తాపూర్‌కు చెందిన కస్టమర్ తహ్సీన్ ఫర్హా అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ మార్కెట్ ఒకప్పుడు ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితం. ప్రస్తుతం సామాన్యులకు సైతం ప్రత్యేకమైన పండూరి వంటి తక్కువ-తెలిసిన రకాలను కూడా అందిస్తోంది.







రమణీయం
భారతీయ కళా వైభవం

గన్‌ఫౌండ్రీ : నేటి యువతరానికి పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని పలువురు ప్రముఖులు అన్నారు. రవీంద్రభారతిలో సిరాజ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో భారతీయ సకల కళా వైభవం –2025 పేరిట మంగళవారం సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ తేజావత్ రాందాస్ మాట్లాడుతూ చిన్నారులను శాస్త్రీయ సంగీత కళల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. విశ్రాంత న్యాయమూర్తి జడ్జి బూర్గుల మదుసూధన్‌రావు మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం వంటి కళల్లో ప్రావీణ్యం పొందిన విద్యార్థులు ఇతర విద్యార్థుల కంటే చురుకుగా ఉంటారని తెలిపారు. అంతకు ముందు జానపద, శాస్త్రీయ నృత్య రూపకాలు అహూతులను ఆకట్టుకోగా జబర్దస్త్ నటులు అప్పారావు, నవీన్, వినోద్ చిన్నారులతో సందడి చేశారు. బుల్లితెర నటులు రోజా ఖుషి, పూజితా రెడ్డి, శ్రీప్రియ శేఖర్, డైరెక్టర్ గిరిరాజ్, డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు, డాక్టర్ ఎస్‌కే సిరాజ్ పాల్గొన్నారు.



శిల్పారామంలో..

సెంట్రల్, వెస్ట్ ఆఫ్రికా డెలిగేట్ల సందడి..



మాదాపూర్ : మాదాపూర్‌లోని శిల్పారామాన్ని ఇన్ఫర్మేషన్, పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలంగాణ, సెంట్రల్ అండ్ వెస్ట్ ఆఫ్రికా మీడియా డెలిగేట్లు, కంటెంట్ క్రియేటర్స్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ సభ్యులు మంగళవారం సందర్శించారు. తెలంగాణ నృత్యరీతులు పేరిణినాట్యం, ఒగ్గుడోలు నృత్యాలను తిలకించారు. సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ఉత్పత్తులను సందర్శించి కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌ఎస్‌లు కృతిక భరద్వాజ్, అన్నపూర్ణ సింగ్ పాల్గొన్నారు. ఒగ్గుడోలు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలను చేశారు.

డిజైన్ ఎక్స్‌ప్లోర్ సమ్మర్ క్యాంప్
జూన్ 2 నుంచి 13 వరకు రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో నిర్వహణ

రాయదుర్గం : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, డిజైనింగ్ రంగంలో అవగాహన కల్పించడం కోసం ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)హైదరాబాద్ ఆధ్వర్యంలో 'డిజైన్ ఎక్స్‌ప్లోర్ సమ్మర్ ఇన్నోవేషన్ క్యాంప్–2025' నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో పదో గ్రేడ్ నుంచి 12వ గ్రేడ్ విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు వివరించారు. జూన్ 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ (పది రోజుల పాటు) ప్రత్యేకంగా ఈ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఎఫ్‌డీడీఐ చొరవ యువ మనసుల్లో విద్యారంగంలో అంతకుమించి జీవితంలో రాణించడానికి ప్రోత్సహించేలా తమ నిబద్ధత ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ గుర్తింపుతో భవిష్యత్తు నాయకులను, ఆవిష్కర్తలను పెంపొందించడానికి సహాయపడుతుందని అన్నారు. డిజైన్ ఆలోచన, ఆవిష్కరణలో నిమగ్నమయ్యే మాడ్యూల్స్, పరిశ్రమ–నిపుణుల నేతృత్వంలోని సృజనాత్మక వర్క్‌షాప్‌లు, క్యాంపస్ పర్యటనలు, ఇంటరాక్టివ్ ల్యాబ్ సెషన్లు, భాగస్వామ్య ధృవపత్రాలు, ఆచరణాత్మక ప్రాజెక్టు అనుభవం వంటివి విద్యార్థులకు ఉపకరిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 78693 98146, 95055 55133లో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు.

శిఖర బాలుడు

సాధారణంగా స్కూల్ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఎత్తయిన శిఖరాల గురించి చదువుకుంటుంటారు.. అయితే నగరానికి చెందిన పడకంటి విశ్వనాథ కార్తికే ఆ చిన్న ప్రాయంలోనే వివిధ ఖండాల్లోని, ప్రపంచంలోనే ఎత్తయిన పర్వత శిఖరాలను అధిరోహించడం ప్రారంభించాడు. ఈ అద్భుత ప్రయాణంలో విశ్వనాథ కార్తికే తన 16 ఏళ్ల వయసులోనే 7 ఖండాల్లోని ఎత్తయిన పర్వతాలను (7 సమ్మిట్స్) అధిరోహించి చరిత్ర సృష్టించాడు. కార్తికే దేశంలో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగానే కాకుండా ప్రపంచంలో రెండో అతిచిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. - సాక్షి, సిటీబ్యూరో





- ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తయిన పర్వతాలు అధిరోహణ
- 7 సమ్మిట్స్ పూర్తి చేసిన పిన్న వయస్కుడిగా రికార్డు
- ఈ ఘనత సాధించిన ప్రపంచ రెండో, దేశంలో మొదటి బాలుడు
- నగర బాలుడు విశ్వనాథకు పలువురి ప్రశంసలు

బాల్యం నుంచే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వతారోహణ ప్రారంభించిన కార్తికే ఈ ఏడాది జనవరిలోనే దక్షిణ అమెరికాలోని అకోంకాగువా పర్వతాన్ని (6,961 మీ/22,838 అడుగులు) ఎక్కి తన ఆరవ ఎత్తయిన పర్వతారోహణను పూర్తి చేశాడు. ప్రస్తుతం తన పర్వతారోహణ ప్రయాణంలో కీలక లక్ష్యమైన మౌంట్ ఎవరెస్ట్ (8,848 మీ/29,029 అడుగులు)ను అధిరోహించి రికార్డు సృష్టించాడు. గతంలో అకోంకాగువా (దక్షిణ అమెరికా)తో పాటు ప్రపంచంలో ఎత్తయిన పర్వతాలైన డెనాలీ (ఉత్తర అమెరికా), కిలిమంజారో (ఆఫ్రికా), ఎల్బ్రస్ (యూరప్), విన్సన్ మాసిఫ్ (అంటార్కిటికా), కోసియస్కో (ఆస్ట్రేలియా)ను అధిరోహించాడు.

అమ్మ మాటే ప్రేరణ..

ఈ సాధన వెనుక ఉన్న శ్రమ, కృషి మాటల్లో చెప్పలేనిది. 'ఈ ప్రయాణం నన్ను శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా పరీక్షించింది. ఎవరెస్ట్ శిఖరంపై నిలిచిన ఆ క్షణం, నా కల నిజమవుతున్న అనుభూతి ఇచ్చింది' అని విశ్వనాథ్ కార్తికే తన ఆనందాన్ని వ్యక్తపరిచాడు. ఈ విజయం వెనుక తన కుటుంబం, తల్లిదండ్రులు పడకంటి రాజేంద్ర ప్రసాద్, లక్ష్మి తన వెన్నుతట్టి ప్రోత్సహించారని పేర్కొన్నారు. 'నీకు నచ్చింది చేస్తే.. జీవితం ఆనందంగా ఉంటుంది' అని తల్లి చెప్పిన మాటలే ఆత్మస్థైర్యాన్నిచ్చాయని అన్నాడు.



ఈ తరానికి స్ఫూర్తి..

ఈ పయనంలో విశ్వనాథ్‌కు శిక్షణ ఇచ్చిన కోచ్‌లు భరత్, లెఫ్టినెంట్ రోమిల్ బార్తోవాల్ (ఇండియన్ ఆర్మీ రిటైర్డ్) పాత్ర కీలకం. రోమిల్ స్వయంగా ఒక ప్రఖ్యాత పర్వతారోహకుడు. వీరి మార్గదర్శకత్వం విశ్వనాథ్‌కి పర్వతారోహణలో నైపుణ్యం, మానసిక దృఢత్వాన్ని అందించాయి. లక్ష్యాలను ఎంచుకుని, కష్టపడి సాధించగలిగే అనేకమంది యువతకు ప్రేరణగా నిలిచారు. పర్వతాలను అధిరోహించడం అంత సులభం కాదు. ఇది శరీరానికే కాదు, మనసుకు కూడా పరీక్షే. కానీ తాను 16 ఏళ్ల వయసులో ఈ ప్రయాణం పూర్తి చేయడం విశేషం.



బొటానికల్ గార్డెన్‌లో ఆహ్లాదం
కనువిందు చేస్తున్న బొమ్మలు

కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో బొమ్మలు **కనువిందు** చేస్తున్నాయి. సందర్శకులు, వాకర్లకు ఆహ్లాదాన్ని **పంచుతున్నా**యి. ప్రధాన ద్వారం సమీపంలోని వాటర్ ఫాల్స్‌ను **ఆకర్షణీయం**గా తీర్చిదిద్దారు. ఎలుగుబంటి నోట్లో నుంచి వస్తున్న **నీటి దారలు,** వాటర్ ఫాల్స్ వెంట ఉన్న ఏనుగుల గుంపు చూపరులను **కట్టిపడేస్తున్నా**యి. అంతే కాకుండా బొటానికల్ గార్డెన్‌లో అడుగు పెట్టగానే ఈగల్, పీకాక్, క్రేన్ ఆకారంలో ఉన్న క్రీపర్ చెట్లు ఔరా అనిపిస్తున్నాయి. ఇనుప చువ్వలకు తీగల మాదిరిగా పెరిగే మొక్కలను వివిధ పక్షుల అకారంలో మలిచారు. బొటానికల్ గార్డెన్‌లోకి వచ్చే సందర్శకులు సేదదీరేందుకు టీజీఎఫ్‌డీసీ అనేక చర్యలు తీసుకుంటోంది.

– గచ్చిబౌలి






ప్రధాన ద్వారం

సకల హంగులతో సరికొత్త హైకోర్టు

కాంట్రాక్టు దక్కించుకున్న డీఈసీ ఇన్‌ఫ్రా

- రూ.2,583 కోట్ల అంచనా వ్యయం
- ఆరు అంతస్తుల్లో ఇండో-పర్షియన్ శైలిలో ప్రధాన భవన నిర్మాణం
- 60 మంది జడ్జీలకు సరిపడా కోర్టు హాళ్లు, నివాసాలు
- 4 వేల ద్విచక్ర వాహనాలు, 2 వేల కార్లకు పార్కింగ్ సదుపాయం


ప్రధాన భవనం


ఏజీ ఆఫీస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు నూతన భవన నిర్మాణానికి కీలక అడుగు ముందుకు పడింది. సకల హంగులతో సరికొత్తగా భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని వసతులతో ఇండో-పర్షియన్ శైలిలో నిర్మించనున్నారు. దాదాపు రూ.2,583 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ ప్రాజెక్టు కాంట్రాక్టును డీఈసీ ఇన్‌ఫ్రా తాజాగా దక్కించుకుంది. గత డిసెంబర్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవగా, రెండు సంస్థలు మాత్రమే బిడ్ దాఖలు చేశాయి. రాజేంద్ర నగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో నూతన హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయించగా, గతేడాది మార్చిలో భూమి పూజ చేసిన విషయం విదితమే. పాత హైకోర్టు మాదిరిగానే ఎత్తైన ప్రధాన ద్వారం ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన భవనం ఉస్మానియా ఆర్ట్స్' కాలేజీ నమూనాను తలపించేలా ఉండటం విశేషం. ఆరు అంతస్తుల్లో ప్రధాన భవనంతోపాటు 60 మంది జడ్జీలకు సరిపడా కోర్టు హాళ్లు, నివాసాలు, పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రధాన కోర్టు భవనం ఆరు అంతస్తుల్లో 8.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ప్రధాన న్యాయ మూర్తితోపాటు జడ్జీల క్వార్టర్లు, సిబ్బంది నివాసాలు, బార్ కౌన్సిల్ భవనం, న్యాయవాదుల గ్రంథాలయం, బార్ అసోసియేషన్ బిల్డింగ్, అడ్వొకేట్ జనరల్ ఆఫీస్‌తో కలిపి 40 భవనాలతో పాటు 42,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆడిటోరియం నిర్మించనున్నారు. పాత కోర్టులో వచ్చిన పార్కింగ్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 4 వేల ద్విచక్ర వాహనాలు, 2 వేల కార్లు వచ్చినా ఎలాంటి సమస్య లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు.

కోర్టు చుట్టూ 'పచ్చ'లహారం

హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా ప్రస్తుతం 29 మంది ఉన్నారు. భవిష్యత్‌లో మొత్తం నియామకాలు జరిగినా.. అంతకుమించి పోస్టులు మంజూరైనా ఎలాంటి ఆటంకం రాకుండా 60 మంది కోసం కోర్టు హాళ్లను సిద్ధంగా ఉంచనున్నారు. కోర్టుకు వచ్చే ప్రజలకు కూడా ఇబ్బందులు రాకుండా క్యాంటీన్, టాయిలెట్లు నిర్మించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మరో రెండు అంతస్తుల్లో 1.63 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం మేరకు ప్రజలకు కేటాయించనున్నారు. భవనాల చుట్టూ హరితం పరుచుకున్నట్లు ఆకట్టుకునేలా పచ్చికను ఏర్పాటు చేయనున్నారు. పూలమొక్కలు, చెట్లను కూడా నాటనున్నారు. సివిల్ పనుల కోసం రూ.1,980 కోట్లు, ఫర్నిచర్‌తోపాటు ఇతర ఖర్చుల కోసం రూ.603 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఖరారు బాధ్యతను వన్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఆ సంస్థ పలు డిజైన్లను సిద్ధం చేయగా.. జడ్జీల కమిటీ అందులో ఒకదాన్ని ఖరారు చేసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ ప్రాంగణాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సకల వసతులతో నిర్మిస్తోంది.

క్లుప్తంగా...

గిరిజనుల సంస్కృతి పరిరక్షణకు ప్రత్యేక విభాగం

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: గిరిజన జాతుల సంస్కృతి పరిరక్షణకు.. త్వరలో గిరిజన సంక్షేమ శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం గ్రామంలో ఆదివాసుల పోరాటయోధుడు కుమ్రంభీం విగ్రహావిష్కరణ సందర్భంగా ఆమె మాట్లాడారు. జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో కుమ్రంభీం ఉద్యమించారని, తెలంగాణ ఉద్యమం కూడా ఆయన స్ఫూర్తితోనే సాగిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోండ్, కోలాం, లంబాడ జాతులే అత్యధికంగా ఉన్నాయని వివరించారు. నాయక్‌పోడ్ తెగ ఉందనే విషయం చాలా మందికి తెలియదన్నారు. వరంగల్ జిల్లాలో కోయ భాష అంతరించి పోతోందన్నారు. నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు జారీ కాకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ.లక్షలోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్
రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హత సాధించిన వారిలో.. రూ.లక్ష లోపు విలువైన యూనిట్లకు మాత్రమే తొలివిడత ప్రొసీడింగ్స్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సీతక్క వెల్లడించారు. అర్హత సాధించిన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు ఇస్తామని, ప్రొసీడింగ్స్ మాత్రం విడతల వారీగా అందిస్తామన్నారు.

తెనాలి ఘటన మానవ హక్కుల ఉల్లంఘనే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: గంజాయి అమ్ముతున్నారనే నెపంతో ఇద్దరు దళితులను, ఓ మైనారిటీ వ్యక్తిని ఏపీకి చెందిన తెనాలి పోలీసులు విచక్షణారహితంగా లాఠీలతో కొట్టడం మానవ హక్కుల ఉల్లంఘనే అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'ఎవరైనా తప్పు చేస్తే పోలీసులు చట్ట ప్రకారం శిక్షించాలే తప్ప విచక్షణారహితంగా కొట్టే హక్కు లేదు. తెనాలి పోలీసులు కనీస మానవత్వం మరిచి అత్యంత దారుణంగా కొట్టారు. దళితులను తామేం చేసినా ప్రశ్నించే వారు లేరనే తెగింపుతో ఈ దాష్టీకానికి పాల్పడ్డట్టు తెలుస్తోంది. రాజకీయ పలుకుబడి, అధికార పార్టీ అండదండ ఉంటే ఎన్ని దౌర్జన్యాలు అయినా చేయవచ్చని తెనాలి పోలీసులు చూపించారు. ఈ వ్యవహారంతో అక్కడి చంద్రబాబు ప్రభుత్వ దమననీతి ఏంటో తేటతెల్లం అవుతుంది. సంఘటన జరిగి నెలరోజులైనా ఈ చర్యకు పాల్పడిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ పెద్దలు అండగా నిలిచారంటే అక్కడి ప్రభుత్వ తీరు అందరికి అర్థమవుతోంది. సోషల్ మీడియాలో చూసిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ తీరును చీత్కరిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొని దళితులపై దాడికి పాల్పడిన పోలీసులపై కేసులు నమోదు చేయాలి. ప్రజాస్వామ్యవాదులు ముక్త కంఠంతో ఈ చర్యను ఖండించాలి' అని జాన్‌వెస్లీ అన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా?

తెనాలి ఘటనలో దళిత, మైనార్టీ బాధిత కుటుంబాల ఆక్రోశం..

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ''రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా?.. ఇంత క్రూరంగా వ్యవహరిస్తారా?.. దారుణంగా మా పిల్లలను హింసిస్తారా?.. ఇదేం ఘోరం..? మా గుండెలు బద్ధలయ్యాయి..! రాజ్యాంగం మీకేమైనా ప్రత్యేక రక్షణ కల్పించిందా? లక్షల మందిపై కేసులున్నాయి.. కానీ ఇలా ఎవరినైనా, ఎక్కడైనా కొట్టారా? ఇది ప్రభుత్వ ఉగ్రవాదమే..!'' తెనాలిలో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన దళిత, మైనారిటీ వర్గాలకు చెందిన బాధిత యువకుల తల్లితండ్రుల ఆక్రోశం ఇదీ!! పోలీస్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం చేశారనడం అంతా బూటకమని, తమ పిల్లలపై తప్పుడు కేసులు బనాయించడంపై న్యాయ పోరాటానికి వెనుకాడబోమని స్పష్టం చేస్తున్నారు. కానిస్టేబుల్ మామూళ్ల కోసం ఒత్తిడి చేయడం వల్లే ఘర్షణ చోటు చేసుకుందని, తమ బిడ్డలను నడిరోడ్డుపై గొడ్డును బాదినట్లు చితక బాదడం ఏమిటని నిలదీస్తున్నారు. ఈ దౌర్జన్యాలు, అరాచక పాలనను ప్రశ్నిస్తూ దళిత, ప్రజాసంఘాలు తమతో కలసి రావాలని వేడుకుంటున్నారు. ఈ ఘటనపై దళిత సంఘాలు భగ్గుమనడంతో పోలీసులు నష్ట నివారణ చర్యలకు దిగారు. రాజీ పడదామంటూ బాధిత కుటుంబాలతో సంప్రదింపులు జరిపారు. తెనాలిలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు.

ఇదేం ఘోరం? ఇంత క్రూరత్వమా?

–చేబ్రోలు ఇశ్రాయెల్ (బాధితుడు జాన్ విక్టర్ తండ్రి)

మా సొంతూరు చుండూరు మండలం ఆలపాడు. ప్రస్తుతం మంగళగిరిలో ఉంటున్నా. ఎల్‌ఐసీ ఏజెంటుగా పని చేస్తున్నా. నా కుమారుడు జాన్‌విక్టర్ న్యాయవాదిగా నమోదు చేసుకుని గుంటూరు కోర్టుకు వెళుతున్నాడు. కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. తెనాలిలో చదివే సమయంలో అయితానగర్‌కు చెందిన వేము నవీన్ అలియాస్ కిల్లర్ నా కుమారుడికి స్నేహితుడు. గత నెల 24న పుట్టినరోజు పార్టీ అంటూ నవీన్ పిలిస్తే నా కుమారుడు తన స్నేహితుడు బాబూలాల్‌తో కలసి తెనాలి వెళ్లాడు. అయితానగర్ పల్లెకొండవారి వీధిలో నవీన్, రాకేష్ వారిని కలిశారు. రాత్రి 9.30 గంటల సమయంలో అక్కడకు వచ్చిన త్రీటౌన్ పోలీస్ కానిస్టేబుల్ కన్నా చిరంజీవి 'గంజాయి అమ్ముతున్నారు కదా! మామూలు ఇవ్వండి... సీఐ అడిగి రమ్మన్నారు..' అని చెప్పాడు. 'మేమెందుకివ్వాలి..? మాకేం సంబంధం..?' అంటూ నవీన్ ఎదురు తిరగడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అడ్డుకోవటానికి ప్రయత్నించిన నా బిడ్డపై కానిస్టేబుల్ దౌర్జన్యం చేశాడు.

అక్రమ కేసు బనాయించారు

సాంబశివరావు (బాధితుడు బాబు లాల్ సోదరుడు, మంగళగిరి)

నా తమ్ముడు ఎలాంటి తప్పు చేయలేదు. అక్రమ కేసులో ఇరికించి గొడ్డుని బాదినట్టు బాదారు. ఆ కానిస్టేబుల్ తాను పోలీసునని చెప్పలేదు. పోలీస్ మీదకు వెళ్లారంటూ అక్రమ కేసు బనాయించారు. దారుణమైన నేరాలు చేసిన వారిని కూడా ఇలా చిత్రహింసలకు గురి చేయలేదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి.

తెల్లవారుజామున వన్‌టౌన్ కానిస్టేబుల్ రమేష్‌నాయక్‌తో కలసి చిరంజీవి మా ఇంటికి కారులో వచ్చాడు. సీఐ రమ్మన్నారంటూ నా కుమారుడిని తీసుకెళ్లారు. మర్నాడు నేను, నా భార్య స్టేషనుకు వెళ్లినా మా బిడ్డను చూపించలేదు. తర్వాత మూడు రోజులకు అరెస్టు చేశారని తెలిసింది. త్రీటౌన్ కానిస్టేబుల్ చిరంజీవిపై హత్యాయత్నం చేశారంటూ కేసు పెట్టారు. ఇలా నడిరోడ్డుపై ప్రజల సమక్షంలో దారుణంగా హింసించడం వైరల్ అయిన వీడియోతోనే తెలిసింది. మా గుండెలు బద్ధలయ్యాయి. ఇదేం ఘోరం? పోలీసు అధికారులు ఇంత క్రూరంగా వ్యవహరిస్తారా? సభ్య సమాజంలో ఇలా ఎక్కడైనా జరుగుతుందా? మేం దళితులం అయినందునే కదా ఇంతటి దారుణానికి ఒడిగట్టారు? రకరకాల కేసుల్లో ఉన్న ఇతర వర్గాలకు చెందినవారిని ఏనాడైనా ఇలా శిక్షించారా? మా బిడ్డకు జరిగిన అన్యాయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. దీనిపై పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేస్తాం. తీసుకోకుంటే కోర్టును ఆశ్రయిస్తాం. ఇప్పటికే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు పంపాం.

కానిస్టేబుల్ బ్యాంకు ఖాతా పరిశీలించాలి

–దోమా వాసు (బాధితుడు రాకేష్ తండ్రి, తెనాలి, అయితానగర్)

నేను పెయింటింగ్ మేస్త్రిగా పని చేస్తున్నా. కుమారుడు దోమా రాకేష్ డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ చేస్తున్నాడు. ఐదేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గతంలో యాక్సిడెంటులో గాయపడటంతో కుడి కాలు, కుడి చేతిలో రాడ్ వేశారు. గత నెలలోనే ఇక్కడకు వచ్చాడు. ఏప్రిల్ 24న రాత్రి స్నేహితులను కలిసేందుకు అయితానగర్ పల్లెకొండవారి వీధికి వెళ్లాడు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో త్రీటౌన్ కానిస్టేబుల్ చిరంజీవి వారి దగ్గరకు వెళ్లాడు. వేము నవీన్ అలియాస్ కిల్లర్‌కు, కానిస్టేబుల్‌కు మధ్య ఘర్షణ జరిగింది. కానిస్టేబుల్ అక్కడే ఉన్న మావాడి చొక్కా పట్టుకోవడంతో విడిపించుకుని ఇంటికి వచ్చాడు. మామూళ్ల కోసమే ఆ కానిస్టేబుల్ అక్కడకు వచ్చాడు. పట్టణంలో చాలామంది దగ్గర మామూళ్లు వసూలు చేస్తుంటారు. కొందరు డబ్బులిస్తే మరికొందరు ఫోన్ పే చేస్తుంటారు. కానిస్టేబుల్ బ్యాంకు ఖాతా పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. కానిస్టేబుల్ గాయపడితే ఆసుపత్రిలో చికిత్స పొందకుండా కొద్ది గంటల్లోనే మా ఇంటికి ఎలా వచ్చాడు? కావాలనే కేసు అక్రమ కేసు పెట్టారు. నా కుమారుడిని పోలీసు అధికారులు నడిరోడ్డుపై చిత్రహింసలకు గురి చేశారు. కాలులో రాడ్ ఉందని వేడుకున్నా వినలేదు. ఒక సీఐ బూటుకాలితో తొక్కిపెడితే మరో సీఐ విచక్షణారహితంగా చితకబాదాడు. రౌడీషీటర్ లడ్డూతో మావాడికి సంబంధాలున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మా బిడ్డను కొట్టిన పోలీసులకు తగిన శాస్తి జరగాలి. ఇందుకోసం న్యాయపోరాటం చేస్తాం.

అక్రమ కేసు పెట్టి చిత్రహింసలా?



నాకు నలుగురు మగ పిల్లలు. నాలుగో కుమారుడు బాబు లాల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. జాన్ విక్టర్ తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుక ఉందని ఆహ్వానించడంతో బాబులాల్ వెళ్లాడు. తరువాత రోజు పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో వెళ్లాం. పుట్టిన రోజు పార్టీ తరువాత బండి మీద వచ్చిన ఓ వ్యక్తితో ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఆ వ్యక్తి పోలీస్ దుస్తుల్లో లేకపోవడం, పోలీస్‌నని చెప్పకపోవడం, నోటికి వచ్చింది మాట్లాడి చేయి చేసుకోవటం దీనికి కారణం. ఆ కానిస్టేబుల్ అది మనసులో పెట్టుకుని వారంతా గంజాయి సేవించినట్టు, ఒక కత్తి కూడా పక్కన పెట్టి, చేయని నేరాలు మోపి అక్రమ కేసు పెట్టారు. మా అబ్బాయి, వాడి స్నేహితులను నడి రోడ్డు మీద కూర్చోపెట్టి దారుణంగా చితకబాదిన వీడియో చూశా. అక్రమ కేసు పెట్టటమే కాకుండా ఇలా కొట్టటం ఎంత వరకు సమంజసం?

– రెహ్మతుల్ల షేక్
(బాధితుడు బాబు లాల్ తల్లి, మంగళగిరి)

తెలంగాణకు ముగ్గురు జడ్జీలు

- రాష్ట్ర హైకోర్టుకు జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ లలిత, జస్టిస్ సుమలత
- ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్ కలకత్తా హైకోర్టుకు బదిలీ
- కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల్లోని 21 మంది న్యాయమూర్తులను సుప్రీంకోర్టు కొలీజియం బదిలీ చేసింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదు గురు న్యాయమూర్తులతో కూడిన కొలీజియం ఈ మేరకు కేంద్రానికి సిఫార్సు చేసింది. బదిలీలకు సిఫార్సు చేసిన వారిలో జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ చిల్లకూర్ సుమలత కూడా ఉన్నారు. జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ సుమలత మాతృ హైకోర్టు (పేరెంటల్ హైకోర్టు) తెలంగాణ కాగా, జస్టిస్ కన్నెగంటి లలిత తొలుత ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అనంతరం ఆమె కూడా తెలంగాణకు బదిలీ అయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తుండగానే పట్నాకు జస్టిస్ అభిషేక్‌రెడ్డి, కర్ణాటకకు జస్టిస్ లలిత, జస్టిస్ చిల్లకూర్ సుమలత బదిలీపై వెళ్లారు. ఇప్పుడు ఈ ముగ్గురు తెలంగాణ హైకోర్టుకు బదిలీ కానున్నారు. కాగా, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే)గా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం హైకోర్టులో ఏసీజేతో కలిపి 29 మంది న్యాయమూర్తులున్నారు. ఒకరు బదిలీపై వెళ్లడం, ముగ్గురు న్యాయమూర్తుల రాకతో ఈ సంఖ్య 31కి చేరనుంది. ఇంకా 11 పోస్టులు ఖాళీ ఉండనున్నాయి. అలాగే, మద్రాస్ హైకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫార్సు చేసింది. ఇదిలా ఉండగా, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయాలని కొలీజియం సిఫార్సు చేసినట్లు సమాచారం.

న్యాయమూర్తుల ప్రొఫైల్స్
(సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో)

చంద్రబాబు సర్కారు అరాచకానికి ఇంతకంటే సాక్ష్యం ఏంకావాలి?

- తెనాలి దారుణంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై పోలీసులు బహిరంగంగానే థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఉల్లంఘిస్తున్నదో చెప్పడానికి ఇంతకంటే సాక్ష్యం కావాలా? అని ధ్వజమెత్తారు. చంద్రబాబు సర్కారు తీరును తీవ్రస్థాయిలో ఎండగడుతూ మంగళవారం ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. తెనాలిలో యువకులపై పోలీసుల దాడిని ఉటంకిస్తూ.. 'చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. పోలీసులకు అంతులేని అధికారాన్ని కల్పించి... దళితులు, మైనార్టీలు, ఎస్టీలు, బీసీల హక్కులను గౌరవించకుండా 'రెడ్‌బుక్ రాజ్యాంగం' అమలు చేస్తోంది'' అని వైఎస్ జగన్ మండిపడ్డారు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై నిపుణుల కమిటీ!

- సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏబీ పాండ్య నేతృత్వం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడం, సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల భద్రతపై నేషనల్ డ్యామ్‌ల సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికపై ఎలా ముందుకెళ్లాలనే అంశంలో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏబీ పాండ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ నియమించాలని నిర్ణయించింది. ఇందుకోసం నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జాకు లేఖ రాశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నిపుణుల కమిటీని నియమించాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ లేఖ రాశారు. ఎన్‌డీఎస్‌ఏలో పేర్కొన్న పలు అంశాలను ఏ విధంగా అమలు చేయాలి, ఈ బరాజ్‌లను ఎలా వినియోగించుకోవాలి? అనే అంశంపై సూచనలు ఇవ్వాలని పాండ్య కమిటీని ప్రభుత్వం కోరనుంది. కమిటీలో సభ్యులుగా ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్, ఐ అండ్ క్యాడ్), ఇంజనీర్ ఇన్ చీఫ్(ఓ అండ్ ఎం), చీఫ్ ఇంజనీర్ (సీడీవో), ప్రభాస్‌చంద్ర (సీడబ్ల్యూపీఆర్ఎస్ డైరెక్టర్), కె.సత్యనారాయణ (సీఈ, రిటైర్డ్), ఎస్ రమణమూర్తి (వరంగల్ నిట్ ప్రొఫెసర్), ఆర్ సతీష్ (ఐఐటీ, హైదరాబాద్ ప్రొఫెసర్), కన్వీనర్‌గా చీఫ్ ఇంజనీర్, రామగుండం వ్యవహరిస్తారు.

కాళేశ్వరం బరాజ్‌ల గేట్లు ఎత్తే ఉంచండి

- ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత వర్షాకాలంలో కూడా కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌ల గేట్లు ఎత్తి ఉంచి వరదను కిందకు విడుదల చేయాలని రామగుండం చీఫ్ ఇంజనీర్‌ను నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ ఆదేశించారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు, పంప్ హౌస్‌లను చీఫ్ ఇంజనీర్ కె.సుధాకర్‌రెడ్డి (ఇరిగేషన్) నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం తనిఖీ చేసి ఇచ్చిన నివేదికను రామగుండం చీఫ్ ఇంజనీర్‌కు పంపించారు. గేట్లు మూసేస్తే పియర్స్‌పై ఒత్తిడి పెరిగి బరాజ్‌లకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. గేట్లను సరిగ్గా లూబ్రికేట్ చేయాలని సూచించారు. పంప్ హౌస్‌లు మునిగిపోకుండా హెడ్ రెగ్యులేటర్స్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. అన్నారం పంప్ హౌస్ మునగకుండా నిర్మిస్తున్న రక్షణగోడ పనులు వెంటనే పూర్తి చేయాలని, అన్నారం పంప్ హౌస్ ప్రెషర్ మెయిన్స్‌తో నీటితో నింపి ఉంచాలని ఆదేశించారు. నిర్ధారిత ప్రొటోకాల్స్‌ను పాటించాలని సూచించారు.

ప్రతి కార్యకర్త గర్వపడేలా పాలన

- కడప మహానాడులో చంద్రబాబు ప్రారంభోపన్యాసం



సాక్షి, అమరావతి: ఏడాది పాలనలో ఎన్నో విజయాలు సాధించామని, ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. ప్రతి కార్యకర్త గర్వపడేలా పాలన సాగిస్తున్నామని, గ్రామాల్లో కార్యకర్తలు మీసం మెలేసేలా చేస్తామన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని స్పష్టం చేశారు. కూటమిగా మూడు పార్టీలు కలిసి నడవాలన్నారు. వైఎస్సార్ కడప జిల్లా కేంద్రమైన కడపలో మంగళవారం ప్రారంభమైన టీడీపీ మహానాడులో పార్టీ అధ్యక్షుడిగా ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. తన అనుభవంతో కూటమి పార్టీలైన బీజేపీ, జనసేనలతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని నిలబెడుతున్నామన్నారు. మరో 40 ఏళ్లు పార్టీ బలంగా నిలబడడానికి అవసరమైన ప్రణాళికకు లోకేశ్ ఈ మహానాడులో తుది రూపు ఇస్తారని చెప్పారు. దేశంలో పెద్ద నోట్లను రద్దు చేయాలని ప్రధాని మోదీని కోరినట్లు చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం చెలామణీలో ఉన్న రూ.500 నోట్లను కూడా రద్దు చేయాలన్నారు.

వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్/ వైరా/రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ (63) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయనకు కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో ఈనెల 23 నుంచి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలోనే తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందారు. వైరా ఎమ్మెల్యేగా 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఆయన గెలుపొందారు. ఆపై రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్)లో చేరిన మదన్‌లాల్ 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినా విజయం దక్కలేదు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడి సర్పంచ్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన తొలుత 1987–89 వరకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. తర్వాత రాజకీయాల్లో చేరి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ఎన్నికవడంతో పాటు ఎమ్మెల్యేగానూ గెలిచారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య మంజుల, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, మదన్‌లాల్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని నివాస గృహానికి తీసుకురాగా పలువురు నివాళులర్పించారు. అక్కడి నుంచి స్వగ్రామమైన ఈర్లపూడికి తరలించి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అయితే, మదన్‌లాల్ సోదరుడు, హైదరాబాద్‌లో ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న జవహర్‌లాల్ మార్చి 7న మృతి చెందగా, మూడు నెలల్లోపే మదన్‌లాల్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఖమ్మంలో ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం: మదన్‌లాల్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వేర్వేరు ప్రకటనల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మదన్‌లాల్ నాకు సన్నిహితుడు: కేసీఆర్ మదన్‌లాల్ అకాల మరణంపై మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు ఎంపీ రవిచంద్ర ఫోన్ చేసి స్వర్గీయ మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌తో మాట్లాడిచ్చారు. 'మీ తండ్రి మదన్‌లాల్ నాకు సన్నిహితుడు, ఆయన అకాల మరణం తీవ్ర బాధాకరం' అని కేసీఆర్ పరామర్శించారు.

హక్కులు తేల్చాల్సింది ట్రిబ్యునలే..

- దేవాదాయ భూములపై తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దేవాలయాలకు దాతలు ఇచ్చిన భూములపై హక్కులు తేల్చాల్సింది ఆ చట్టప్రకారం ఏర్పాటైన ఎండోమెంట్స్ ట్రిబ్యునలే అని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ భూములపై హక్కులు ఆలయానికి చెందుతాయా? లేదా ఆలయ పూజారికి చెందుతాయా? అనేది టిబ్యునల్ తేల్చాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లను తొలగిస్తూ కలెక్టర్ 2024లో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన పూజారులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, నరసింహాచార్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ల తండ్రి నరసింహాచార్యుల పేరుతో 10.31 ఎకరాలు, పిటిషనర్ శ్రీనివాసాచార్యుల పేరుతో 3.30 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉండగా, పట్టాదారు కాలమ్‌లో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల పేర్లను అన్యాయంగా చేర్చారని వారి తరఫు న్యాయవాది వాదించారు. ఎలాంటి విచారణ చేయకుండానే అధికారులు పిటిషనర్ల పేర్లను తొలగించారని చెప్పారు. దీంతో ప్రభుత్వం వ్యవసాయ భూములకిచ్చే ప్రోత్సాహకాలు పిటిషనర్లకు అందడం లేదని వెల్లడించారు. రెవెన్యూ రికార్డుల్లో పిటిషనర్ల పేర్లను పునరుద్ధరించి పట్టాదార్ పాస్ పుస్తకాల జారీకి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల పూర్వీకులు ఆలయ అర్చకులుగా చేస్తున్నప్పుడు భూమి సాగుకు ఇచ్చారన్నారు. భూమి ఆలయ అర్చకులది కాదని, వారికి ఎలాంటి యాజమాన్య హక్కులు లేవని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రెవెన్యూ రికార్డుల్లో రెండు ఆలయాలతోపాటు అర్చకుల పేర్లు ఉన్నాయని, వీటి ఆధారంగా భూ యాజమాన్య హక్కులను నిర్ధారించేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. ఈ వివాదాన్ని ఎండోమెంట్స్ ట్రిబ్యునల్‌లో తేల్చుకోవాలని ఇరుపక్షాలకు సూచించారు.

హరిహరా.. కథ అడ్డం తిరిగింది!

- సినిమా థియేటర్ల బంద్ వెనుక ఉన్నది జనసేన నాయకుడేనని నిర్ధారణ



సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం: సినిమా థియేటర్ల బంద్‌పై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్ సహా జనసేన నేతలు చేసిన రాద్ధాంతం.. చివరకు వారినే అభాసుపాలు చేసింది. థియేటర్ల బంద్ నిర్ణయం వెనుక జనసేన నాయకుడే ఉన్నట్లు తేలడంతో వారి పరిస్థితి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లుగా మారింది. వివరాలు.. సినీ పరిశ్రమ సమస్యలపై నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల మధ్య కొంత కాలంగా చర్చలు జరుగుతుండగా.. పవన్‌కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, జనసేన నేతలు రాద్ధాంతం మొదలుపెట్టారు. పవన్ సినిమా విడుదలను అడ్డుకోవడానికే జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ అంటున్నారని.. 'ఆ నలుగురు కుట్ర' పన్నారంటూ ఆరోపణలు చేశారు. దుర్గేష్ మరో అడుగు ముందుకేసి దీనిపై విచారణ చేయాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో నిర్మాతలు దగ్గుబాటి సురేశ్‌బాబు, అల్లు అరవింద్, దిల్ రాజుపై పవన్ అభిమానులు సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేశారు. దీంతో అల్లు అరవింద్, దిల్ రాజు మీడియా ముందుకు వచ్చి క్లారిటీ ఇచ్చారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జనసేన ముఖ్య నాయకుడే థియేటర్ల బంద్ నిర్ణయం తీసుకున్నారంటూ దిల్ రాజు ప్రకటించడం.. అతను మంత్రి దుర్గేష్ అనుచరుడు కావడంతో ఆ పార్టీ నాయకులంతా కంగుతిన్నారు. ప్రైవేట్ పెట్టుబడితో తాము సినిమాలు చేసుకుంటుంటే ప్రభుత్వ అజమాయిషీ ఏంటంటూ గతంలో ప్రశ్నించిన పవన్‌కళ్యాణ్.. ఇప్పుడెందుకు సినీ పరిశ్రమ విషయంలో జోక్యం చేసుకుంటున్నారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు నిలదీశారు. దీంతో పవన్ హడావుడిగా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. థియేటర్ల బంద్ నిర్ణయం వెనుక జనసేన నేత ఉన్నా చర్యలు తీసుకోవాలని పవన్ ప్రకటించగా.. ఆ వెంటనే బంద్ నిర్ణయం వెనుక ఉన్న రాజమండ్రి సిటీ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ అత్తి సత్యనారాయణను పార్టీ బాధ్యతల నుంచి తొలగించారు. పార్టీ సభ్యత్వం రద్దు చేస్తున్నట్లు.. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలంటూ ఆ పార్టీ నేత అజయ్‌కుమార్ ఓ ప్రకటన జారీ చేశారు.

ఘనత



ఈ నెల 30న జరగనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) పాసింగ్ ఔట్ పరేడ్ చారిత్రక సందర్భం కానుంది. 'ఎన్‌డీఏ'లో తొలిసారిగా 17 మంది మహిళా క్యాడెట్స్ ఉన్నారు. ఫస్ట్‌బ్యాచ్‌కు చెందిన పదిహేడు మంది మహిళలు 'ఎన్‌డీఏ'తో తమకు ఉన్న మూడు సంవత్సరాల అనుభవాన్ని, అనుబంధాన్ని పంచుకున్నారు...

ఎన్నాళ్లో వేచిన ఉదయం!

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఎన్‌డీఏ, నావల్ అకాడమీ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులైన మహిళలను అనుమతించాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. 2021 ఆగస్ట్‌లో సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతో ఎన్‌డీఏలోకి మహిళా క్యాడెట్‌ల ప్రవేశానికి మార్గం సుగమం అయింది.

'ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. నా కుటుంబ సైనిక నేపథ్యమే నేను సైన్యంలోకి రావడానికి స్ఫూర్తిని ఇచ్చింది. మా నాన్న సైన్యంలో హవల్దార్‌గా పనిచేశారు. మా తాత కూడా సైన్యంలో పనిచేశారు. అకాడమీ గురించి ఒక మాట చెబుతుంటారు... అకాడమీ ఫస్ట్ బ్రేక్స్ యూ అండ్ దెన్ మేక్స్ యూ. ట్రైనింగ్‌లో ఇది అక్షర సత్యం అని తెలుసుకున్నాను' అంటుంది పదిహేడు మంది క్యాడెట్స్‌లో ఒకరైన హర్ సిమ్రాన్ కౌర్.

'సైన్యం అనే భావన నా రక్తంలోనే ఉంది. నా తండ్రి మాజీ ఎన్‌డీఏ ఆఫీసర్. నా సోదరి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేసింది' అంటుంది శృతి దక్ష్.

'ఫస్ట్ బ్యాచ్‌కు చెందిన మహిళలుగా మేము ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాల్సిన అవసరం ఉంది' అంటుంది హర్‌సిమ్రాన్ కౌర్.

'లింగ వివక్షత ఎక్కడా కనిపించలేదు. అందరినీ సమానంగా చూశారు. మేము ఇక్కడ ఒక కుటుంబంలా ఉన్నాం. కష్టసుఖాలను పంచుకున్నాం. పరుగు నుంచి కొండలు ఎక్కడం వరకు అన్నిటిలోనూ పోటీ పడ్డాం. ఎన్‌డీఏలో మహిళలు అడుగుపెట్టడం అనేది మహిళాసాధికారతకు, సాయుధ బలగాలలో పాలుపంచుకోవాలన్న యువ మహిళల ఆకాంక్షకు అద్దం పడుతుంది' అంటుంది కేడెట్ ఇషితా శర్మ.

'ఎన్‌డీఏలో ఇచ్చే శిక్షణ కఠినంగా ఉంటుందని తెలిసినా ఎప్పుడూ బెదరలేదు. ఎన్‌డీఏలోకి రావడానికి ముందు పరిస్థితి ఎలా ఉన్నా, ఇప్పుడు మాత్రం ఎలాంటి విపత్కరమైన పరిస్థితి అయినా తట్టుకొనే సామర్థ్యం, ధైర్యసాహసాలు వచ్చాయి. ఇక్కడ ఇచ్చిన శిక్షణ మమ్మల్ని తీర్చిదిద్దింది. మానసికంగా దృఢత్వాన్ని తీసుకువచ్చింది' అంటుంది బెటాలియన్ కెప్టెన్ క్యాడెట్ రీతుల్.

గతంలోకి వెళితే...

ఎన్‌డీఏలో మహిళల ప్రవేశానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై కొందరికి సందేహాలు వచ్చాయి. 'ఇంతకీ నిరూపించుకుంటారా?' 'బ్రహ్మాండంగా' అని చెప్పడానికి ఎన్‌డీఏలో ఫిమేల్ క్యాడెట్స్ ప్రతిభ కొలమానం. తిరుగులేని సమాధానం. మహిళా క్యాడెట్లు ఎన్నో హద్దులను అధిగమించారు. అకాడమిక్ పెర్‌ఫార్‌మెన్స్‌లోనే కాదు పీటీ, డ్రిల్‌లోనూ మెరిట్ కార్డ్ సాధించారు.

సవాళ్లను అధిగమించి సత్తా చాటారు

శిక్షణ పూర్తి చేసుకున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లోని ఉమెన్ క్యాడెట్స్ కళ్లలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. 'మా కోర్సులను విజయవంతంగా పూర్తి చేశాం. ఎంతో సవాలుతో కూడిన క్యాంప్ రోవర్స్, క్యాంప్ టోర్న, క్యాంప్ గ్రీన్‌లను అవలీలగా పూర్తి చేశాం' అంటుంది ఎయిర్ ఫోర్స్ క్యాడెట్ రీతుల్. 'పదిహేడుమందిలో ఎవరి స్థాయిలో వారు సత్తా చాటారు' అంటుంది ఇషితా శర్మ.

ఇంటిప్స్

మార్కెట్లో దొరికే డిష్ వాష్‌బార్‌లు, లిక్విడ్‌లు మన చేతులకు హాని చేస్తాయి. రసాయనాలతో తయారయ్యే ఈ వాష్‌బార్లు మన చర్మంలోని తేమని హరించి వేసి వివిధ రకాల చర్మసమస్యలకు దారి తీస్తాయి. అందువల్ల వీటికి ప్రత్యామ్నాయంగా గంజి నీళ్లు, బేకింగ్ సోడా, నిమ్మరసాన్ని గిన్నెలు తోమడానికి వాడుకోవచ్చు. అవేంటో చూద్దాం...



- వెనిగర్‌లో పదినిమిషాలు గిన్నెలను నానబెట్టి తరువాత కొబ్బరిపీచుతో బేకింగ్ సోడాని అద్దుకుని తోమితే చక్కగా శుభ్రపడతాయి.
- గంజినీళ్లలో బేకింగ్ పోడా వేసి పదినిమిషాలు ఉంచాలి. తరువాత ఈ నీటితో గిన్నెలను తొమితే మురికితోపాటు, జిడ్డు కూడా పూర్తిగా పోతుంది.
- బేకింగ్ సోడాలో నిమ్మరసం కలిపి ఆ మిశ్రమంతో గిన్నెలు తోమితే మురికి వదలడమే గాక మంచి వాసన కూడా వస్తాయి.

గోరంత అందం..



గోళ్ల రంగుని శుభ్రంగా తొలగించి.. గోరువెచ్చని జొజోబా నూనెను గోళ్లమీద, చుట్టూ ఉన్న చర్మంపైన వేసి గుండ్రంగా మర్దన చేయాలి. దీనివల్ల గోళ్లకు రక్త సరఫరా జరిగి చక్కగా పెరుగుతాయి. రాత్రి పడుకునే ముందు మర్దన చేసి ఉదయం కడిగేయాలి. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల గోళ్లు అందంగా పెరుగుతాయి.

ప్రపంచ సాహిత్యంలో దీప కాంతులు

'హార్ట్ ల్యాంప్' ఇద్దరు మహిళల హృదయ స్పందన!



దీపా భష్తీ

మూల రచయిత బాను ముష్తాక్ తన కమ్యూనిటీలోని స్త్రీల సమస్యలను చిన్న చిన్న కథలుగా అక్షరీకరిస్తే .. ఆ సహజత్వాన్ని, సున్నితత్వాన్ని అంతే చక్కగా అంగీకరించి తన స్పందననూ తెలియజేశారు దీపా భష్తీ! ఈ రచనతో బాను ముష్తాక్ బుకర్ ప్రైజ్ అందుకున్న తొలి ప్రాంతీయ భాషా రచయిత్రిగా, రెండో భారతీయురాలిగా నిలిస్తే, ఇదే రచనతో దీపా భష్తీ.. బుకర్ ప్రైజ్ అందుకున్న తొలి భారతీయ అనువాదకురాలిగా ప్రపంచ సాహిత్య రంగంలో చరిత్ర సృష్టించారు. 'హార్ట్ ల్యాంప్' కన్నడ సాహిత్యంలో ఓ గొప్ప అచీవ్‌మెంటే కాదు ప్రపంచ పాఠకులకు గొప్ప కానుకగా అభివర్ణిస్తున్నారు సాహిత్యకారులు. అంతే కాదు దీపా భష్తీ అనువాదం చిక్కగా.. పాఠకులను ఉత్తేజపరిచేలా ఉంది. ఇలాంటి శైలి నేటి ఆంగ్ల కాల్పనిక సాహిత్యంలో అరుదుగా కనిపిస్తోందని ప్రశంసిస్తున్నారు.



మూల రచయిత్రి బాను ముష్తాక్ తో దీపా భష్తీ

దీపా భష్తీ సొంతూరు కర్ణాటకలోని కొడగు జిల్లా, మడికేరి. మాస్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ చేశారు. ఆమె అనువాదకురాలే కాదు పిల్లల రచయిత, కాలమిస్ట్, సాంస్కృతిక విమర్శకురాలు కూడా. దీపా రాసిన వ్యాసాలు, కాలమ్స్, సాంస్కృతిక విమర్శలు, ఫిక్షన్స్ ఎన్నో జాతీయ అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. కన్నడ ప్రముఖ రచయిత కోట శివరామ కారంత్ నవల 'అదే ఊరు, అదే మార'ను 'ద సేమ్ విలేజ్, ద సేమ్ ట్రీ'గా, కన్నడ స్త్రీవాద రచయిత కొడగిన గౌరమ్మ రచన 'ఫేట్స్ గేమ్ అండ్ అదర్ స్టోరీస్'గా ఆంగ్లంలోకి అనువదించారు. మూల రచనను ఉన్నదున్నట్టుగా అనువదించడం ఆమె స్టయిల్ కాదు. ఆ రచనల్లోని ఆత్మను పట్టుకుంటారు. అందుకే మూల రచనల్లోని స్థానికత ఆమె ఆంగ్ల అనువాదంలో ఎక్కడా మిస్ కాదు. పాఠకులకు మూల రచన చదివిన అనుభూతే కలుగుతుంది. ఆ శైలికే బుకర్ ఆమెను వరించింది. 'హార్ట్ ల్యాంప్'ను అనువదించే ముందు దీపా.. ఇస్లాం స్త్రీల తీరుతెన్నులు, సంస్కృతీసంప్రదాయాలు, పద్ధతులు తెలుసుకోవడానికి పాకిస్తానీ సీరియల్స్ చూసేవారట. ఉర్దూ చదవడం, రాయడం వరకే కాకుండా సామెతలు, జాతీయాలు, నుడికారాలు సహా భాషను నేర్చుకున్నారట. ఆ కమిట్‌మెంటే ఆమెకు ఈ రోజు ప్రపంచ సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపునిచ్చింది. ఆమె రాసిన పిల్లల పుస్తకం 'చంపి అండ్ ఫిగ్ ట్రీ' పుస్తకం త్వరలోనే పబ్లిష్ కానుంది.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) 27న ముగింపు రూ.లలో



హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	96,100
బంగారం (22 క్యారెట్లు)	89,000
వెండి	99,100
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,400
బంగారం (22 క్యారెట్లు)	89,950
వెండి	1,00,400
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,130
బంగారం (22 క్యారెట్లు)	89,950
వెండి	1,11,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,400
బంగారం (22 క్యారెట్లు)	92,650
వెండి	1,03,400
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,000
బంగారం (22 క్యారెట్లు)	88,320
వెండి	98,900
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,120
బంగారం (22 క్యారెట్లు)	89,950
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

లీగల్

ఉద్యోగం మాన్పించడం కూడా గృహహింసే!..

ఉద్యోగం మానేయమని చెప్పానని నా భార్య నన్ను వదిలి వెళ్లిపోయింది. ఇది జరిగి తొమ్మిది నెలలు అవుతోంది! తను ఉద్యోగం చేస్తే ఎవరిమాటా వినడం లేదనే ఉద్యోగం మానిపించాం. మళ్లీ తిరిగి వచ్చాక ఎలాగోలా మానిపిద్దాము అనుకుంటే నేను తాగుతున్నాను అనే వంకతో తిరిగి రానంటోంది. ఇప్పుడు నాకు కూడా తనంటే ఇష్టం పోయింది. ఏం చేయమంటారు?

– పవన్ కుమార్, రాజమండ్రి

మీరు వెంటనే డైవర్స్ పిటిషన్ ఫైల్ చేయండి. మీలాంటి పురుషాధిక్య భావజాలం ఉన్న వ్యక్తితో ఎవరూ ఉండకూడదు. మీ నుంచి ఆవిడకి విముక్తి అవసరం. భర్తని తన తల్లిదండ్రుల నుంచి విడదీయాలి అనుకోవడం క్రూరత్వం అని చాలా సందర్భాలలో కోర్టులు ఎలాగైతే చెప్పాయో, భార్య చేస్తున్న ఉద్యోగం మాన్పించి ఇంట్లోనే కూర్చోబెట్టాలి అనుకోవటం, భర్త – అత్తామామల ఆజ్ఞలు మాత్రమే పాటించాలి అనుకోవడం కూడా అలాగే 'గృహహింస' కిందకి వస్తాయి. ఆవిడా మీరు వద్దని అంటోంది కాబట్టి సామరస్యంగా మాట్లాడుకొని మ్యూచువల్ కన్సెంట్ డివోర్స్ (పరస్పర అంగీకార విడాకులు) తీసుకుని మిమ్మల్ని మీరు కేసులనుండి కాపాడుకోవటం మంచిది.

నాకు బాగా తెలిసిన ఒక వ్యక్తికి రెండు సంవత్సరాల క్రితం 10 లక్షల రూపాయలు నెలసరి వడ్డీకి ఇచ్చాను. ఇచ్చేటప్పుడు ప్రామిసరీ నోటు మీద సంతకాలు, సాక్షుల సంతకాలు తీసుకున్నాను. అయితే అతను అసలు వడ్డీ కట్టకపోగా అసలు కూడా ఇవ్వడం లేదు. అతనికి, అతని భార్యకి, పిల్లలకి కూడా ఆస్తులు ఉన్నాయి. ఎంత అడిగినా 'నేను చెక్కులు కూడా ఇవ్వలేదు కదా ఏం చేసుకుంటావో చేసుకో' అంటున్నాడు. నా డబ్బులు తిరిగి వచ్చే ఆస్కారమే లేదా?

– ఎస్‌డీ. జహంగీర్, హైద్రాబాద్

మీరు డబ్బులు ఇచ్చి కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే అయింది అని చెప్తున్నారు కాబట్టి మీరు సివిల్ కోర్టును ఆశ్రయించి అతనిపై దావా వేయవచ్చు. ఒకవేళ ఉద్దేశపూర్వకంగా అతను మిమ్మల్ని మోసం చేశాడు అనడానికి ఏదైనా ఆధారం లేదా రుజువు చేసే పత్రాలు ఉంటే పోలీసులను ఆశ్రయించి క్రిమినల్ కేసు కూడా నమోదు చేసే వీలు ఉంది. మీ లేఖలో రాసిన దాని ప్రకారం మీ డబ్బులు మీకు తిరిగి రావు అని చెప్పలేము. అలాగే కచ్చితంగా వస్తాయి అని కూడా చెప్పలేము. మీ దగ్గర ఉన్న పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, మీ ఆర్థిక స్థితిగతులు చూపించడానికి వీలు ఉండే ఏదైనా ఆధారాలు తీసుకొని ఒక లాయర్ గారిని కలవండి. అన్నీ పరిశీలించిన తర్వాత మీ కేసులో ఏం చేయాలో నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుంది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

అమ్మలకు ఆదాయ పన్ను మినహాయింపు

ఇద్దరు లేదా ముగ్గురు పిల్లల తల్లులకు ఆదాయ పన్ను మినహాయింపును ప్రకటించారు హంగేరి ప్రధాని విక్టర్ ఓర్బాన్. దీని వల్ల ఇద్దరు పిల్లలు ఉన్న 6,50,000 మంది తల్లులు, ముగ్గురు పిల్లలు ఉన్న 2,50,000 మంది తల్లులు లబ్ధి పొందుతారు. ఇంతకు ముందు ఈ మినహాయింపు 30 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న తల్లులు, నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్న తల్లులకు మాత్రమే అందుబాటులో ఉండేది. ఈ మినహాయింపు ఈ ఏడాది అక్టోబర్ నుంచి, ఇద్దరు పిల్లల తల్లులకు 2026 జనవరి నుంచి అమల్లోకి రానుంది.



బ్యూటిప్ ఇలా కడగండి.. అలా పెరుగుతుంది

కప్పు నీళ్లల్లో టేబుల్ స్పూను టీపొడి, టేబుల్ స్పూను మెంతులు వేసి ఐదు నిమిషాలు మరిగించాలి. మరిగిన నీటిని వడగట్టి పిప్పి తీసేయాలి. మిగిలిన నీటిలో రోజూ వాడే షాంపుని వేసి కలపాలి. ఈ మిశ్రమంతో తలస్నానం చేస్తే జుట్టు ఒత్తుగా పెరగడంతోపాటు సిల్కీగా మెరిసిపోతుంది.



స్ఫూర్తి

అంధత్వం కాదు అక్షర బంధుత్వం



అక్షరం ఆయుధమే కాదు చీకటి నుంచి వెలుగులోకి తీసుకువెళ్లే కాంతిపుంజం. 'నేను అంధురాలిని' అని ఎప్పుడూ నిరాశపడలేదు సాయిజ్యోతి. ఆమె ఉత్సాహం పేరు... అక్షరం. ఆమె శక్తి పేరు... పుస్తకం. గుంటూరు జిల్లా పాత మంగళగిరికి చెందిన చింతకింది సాయిజ్యోతి అంధుల్లో సానుకూల దృక్పథాన్ని కలిగించే లక్ష్యంతో కవితల నుంచి నవలల వరకు ఎన్నో ప్రక్రియలలో రచనలు చేస్తోంది...

పదేళ్ల వయసు వచ్చేవరకూ లోకాన్ని అందరిలాగే చూసింది సాయిజ్యోతి. ఉపాధ్యాయులు చెప్పేది విని నోటు పుస్తకంలో రాసుకునేది. కానీ జన్మతః వచ్చిన లోపం కారణంగా ఆ తరువాత కంటిచూపును కోల్పోయింది. అప్పటివరకూ అందంగా కనిపించిన రంగుల ప్రపంచం ఒక్కసారిగా చీకటైపోయింది. స్థానిక విజయమేరి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో హైస్కూలు విద్య, హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి నేత్ర విద్యాలయంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. మంగళగిరిలో డిగ్రీ, నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన జ్యోతి ప్రస్తుతం నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూలులో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తోంది.

అక్షరాల తోటలోకి...

సాహిత్యంపై చిన్నప్పటి నుంచే సాయిజ్యోతికి ఆసక్తి ఉండటతో చిన్న చిన్న రచనలు చేసేది. ఆ తరువాత తన సాహిత్యానికి సోషల్ మీడియాను వేదిక చేసుకుంది. వివిధ సాహిత్య వేదికలకు చెందిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లాంటి గ్రూపులతో పరిచయం అయింది. 'చైత్రశ్రీ' అనే కలం పేరుతో రచనలకు శ్రీకారం చుట్టింది. తొలి కవితా సంకలనం 'కవితాంజలి' ఈ ఏడాది వెలువడింది.

తన జీవితమే తన నవల

'మంచు తాకిన ప్రేమ' నవలకు మంచి పేరు వచ్చింది. 'ఎవరు అతను?' పేరుతో రెండో నవల రాసింది. మూడవ నవల 'అన్వేషిత' తన జీవితాన్నే స్ఫూర్తిగా తీసుకొని రాసింది. కుటుంబంలో ఒక అమ్మాయి అంధురాలిగా పుడితే ఆమెను కుటుంబం ఏ విధంగా చూసుకుంది? సమాజంలో తనని తాను ఏ విధంగా నిరూపించుకుంది? తోటి అంధులకు ఆమె ఏ విధంగా సహాయపడింది? స్ఫూర్తిని ఇచ్చింది? అంధుల జీవితం ఎలా ఉంటుంది.. మొదలైన అంశాలను తీసుకొని నవల రాసింది. అరవై భాగాలు ఉన్న 'అన్వేషిత' నవలను పుస్తక రూపంలోకి తీసుకురానున్నారు. ఇవేకాక ఏడు చిన్న కథలు, ఆరు పాటలు రాసింది. అవి స్నేహితుల ద్వారా యూ ట్యూబ్ వరకూ చేరి ప్రేక్షకాదరణ పొందుతున్నాయి.

– బోణం గణేష్, సాక్షి, అమరావతి

అందుకోసమే నా రచనలు

సానుకూల దృక్పథాన్ని ఎలా అలవర్చుకోవాలి, ప్రతికూల పరిస్థితులను ఏ విధంగా ఎదుర్కోవాలిలాంటి అంశాలే నా రచనకు మూలం. సమస్యలకు కుంగిపోకుండా పరిష్కారాలను అన్వేషించాలని నేను గట్టిగా నమ్ముతాను. సమాజంలో అంధుల పట్ల ఉన్న ఆలోచన ధోరణిని మార్చాలనేది నా ప్రయత్నం. అందుకోసమే రచనలు చేస్తున్నాను. అద్భుత విజయాలు సాధించడానికి అంధత్వం అడ్డుకాదని చరిత్ర నిరూపించింది. నిరూపిస్తూనే ఉంది.

– చింతకింది సాయిజ్యోతి



రంగులు పూసుకున్నారా లేదా?

వేసవి సెలవుల్లో చేయాల్సిన పనులెన్నో చెప్పకున్నాం. ఇంకా కొన్నే మిగిలాయి. ముఖ్యమైనది పెయింటింగ్. పిల్లలూ... మీరు నేచురల్ పెయింటర్స్. అంటే మీరు బ్రష్ తీసుకుని ఏది గీసినా అందులో అందం ఉంటుంది. బొమ్మలు వేయడంలో చాలా విధానాలున్నాయి. బొమ్మలు వేయకుండా పిల్లలు ఉండకూడదు. ఈ సమ్మర్‌ను కలర్‌ఫుల్ జ్ఞాపకంగా మిగుల్చుకోవాలంటే కాసిన్ని బొమ్మలేసి దాచుకోవాల్సిందే.

రంగులకు ఏ విలువా లేదు. కాని వాటితో వేసే రూపాలకు విలువ. పిల్లలూ... బొమ్మలు వేయడం మనిషి పుట్టుకతో వచ్చే ఒక కుతూహలం. బొమ్మలు ఎప్పటికీ రాని వాళ్లు కూడా పెన్నూ పేపర్ దొరికితే పిట్ట బొమ్మో పిల్లి బొమ్మో గీస్తారు. మన చేతుల్లో నుంచి ఒక రూపం పుట్టడం మనిషికి ఆనందం. చెట్టు వేసి దాని మీద గూడు వేసి ఆ గూటిలో పిల్లల్ని వేసి ఆ బొమ్మను చూసుకుంటే సంతోషం కలుగుతుంది. మనం బొమ్మలు ఎందుకు వేస్తామంటే మనం చూసింది, ఊహించింది రంగుల్లో నిక్షిప్తం చేసుకోవడానికి. బొమ్మలు వేయడం మంచి హాబీ. కాలక్షేపం. మీరు మంచి పెయింటర్‌లుగా ఎదిగితే ఆ బొమ్మలను కొనేవాళ్లు కూడా ఉంటారు. నిజం. మన దేశంలో త్యాబ్ మెహతా అనే ఆర్టిస్ట్ ఉండేవాడు. ఆయన బొమ్మలు ఇప్పటికీ కొంటారు. ఎంతకు తెలుసా? ముప్పై కోట్లు... నలభై కోట్లు... చిన్న బొమ్మ. అంత డబ్బు. అయితే ఆ బొమ్మల్లో ఏదో ప్రత్యేకత ఉంటుంది. మీ బొమ్మల్లో కూడా ప్రత్యేకత ఉండాలి. అది సాధన చేస్తే వస్తుంది. బొమ్మలు వేయకుండా సెలవుల్ని ముగించకూడదు. అసలు మీ అందరి దగ్గర కలర్స్, కలర్ పెన్సిల్స్, చార్‌కోల్స్, బ్రష్షులు తప్పకుండా ఉండాలి. వాటర్ కలర్స్‌తో వండర్స్ సృష్టించొచ్చు తెలుసా?

చిత్రలేఖనంలో రకాలు..

బొమ్మలు గీయడమంటే మీకు చాలా ఇష్టం. తెల్ల కాగితం, రంగుల పెన్సిళ్లు కనిపిస్తే ఏదో ఒకటి తోచింది గీస్తూ ఉంటారు కదా. దాన్నే మరింత నైపుణ్యంగా గీస్తే చిత్రలేఖనం మీ చేతికి వచ్చేసినట్లే. చిత్రలేఖనంలో అనేక రకాలున్నాయి. ఆబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్, ఫిగరేటివ్ పెయింటింగ్స్, ల్యాండ్‌స్కేప్ పెయింటింగ్స్, యానిమల్స్ పెయింటింగ్స్, గాడ్ పెయింటింగ్స్... ఇలా. వాటి గురించి మీరు బొమ్మలు గీసేకొద్దీ తెలుసుకుంటారు. ఇవి కాకుండా కార్టూన్లు, క్యారికేచర్లు... కూడా గీయొచ్చు. లైన్ ఆర్ట్ సాధన చేయొచ్చు. రాజా రవివర్మ, దామెర్ల రామారావు, పాకాల తిరుపతిరెడ్డి, ఎం.ఎఫ్.హుస్సేన్, ఆర్.కె.లక్ష్మణ్, బాపు, మోహన్, బాలి, చంద్ర, ఏలే లక్ష్మణ్ లాంటి అనేక మంది చిత్రకారుల బొమ్మలు మీకు నెట్‌లో దొరుకుతాయి. వాటిని చూసి వారిలా వేయడానికి సాధన చేస్తూ కూడా బొమ్మలు నేర్చుకోవచ్చు.

చిత్రలేఖనం వల్ల లాభాలు..

ఏకాగ్రత: చిత్రలేఖనమంటే రంగులతో మాత్రమే పూర్తయ్యే పని కాదు. బొమ్మ గీయాలంటే ఎంతో ఏకాగ్రత కావాలి. మనసులోని భావాలను కాగింతపై బొమ్మగా మారేందుకు ఆలోచించాలి, నిదానం పాటించాలి. అప్పుడే బొమ్మ అందంగా వస్తుంది. చిత్రలేఖనం సాధన చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఇది మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు చదువు మీద దృష్టి నిలిపేందుకు తోడ్పడుతుంది.

మానసికోల్లాసం: రంగులతో బొమ్మలేయడం వల్ల మానసికోల్లాసం లభిస్తుంది. ఖాళీ కాగితం మన చేతిలో రంగులమయం మారుతున్నకొద్దీ మనలో కొత్త ఉత్తేజం కలుగుతుంది. మన చేతివేళ్లు చకచకా కదిలి, బొమ్మగా రూపుదిద్దుకుంటే ఎంతో తృప్తి కలుగుతుంది. ఇదంతా చిత్రలేఖనం వల్ల సాధ్యపడుతుంది.



క్రియేటివిటీ: సమాజంలో రోజూ మీరు చూసే అంశాలను బొమ్మలుగా గీయాలనుకునే క్రమంలో మీలో క్రియేటివిటి పెరుగుతుంది. బొమ్మల్ని గీసే పద్ధతిలో మీదైన కొత్త విధానం ఒంటబడుతుంది. ఇది మీ మెదడును మరింత చురుగ్గా చేస్తుంది. కొత్త విషయాలు ఆలోచించేందుకు, కొత్తగా నేర్చుకునేందుకు ఉపకరిస్తుంది.

గుర్తింపు: చిత్రలేఖనం లలితకళల్లో ఒకటి. అనేకమంది చిత్రకారులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. వారి చిత్రాలు నేటికీ మనకు స్ఫూర్తిని అందిస్తున్నాయి. వారి పేరును చిరస్థాయిగా నిలిచేలా చేశాయి. మీరు చిత్రలేఖనం సాధన చేయడం ద్వారా అందరిలో గుర్తింపు పొందుతారు. మరింత పట్టు సాధించడం ద్వారా గొప్ప చిత్రకారులుగా పేరు పొందుతారు. అది మంచి భవిష్యత్తుకు తోడ్పడుతుంది.

చిత్రలేఖనం ఎక్కడ నేర్చుకోవాలి?

పిల్లలకు చిత్రలేఖనం నేర్పడానికి ప్రత్యేకంగా కొన్ని పాఠశాలలు, సంస్థలు ఉన్నాయి. రోజూ కొంత సమయం అక్కడికి వెళ్లి, వారి చెప్పిన పద్ధతిలో బొమ్మలు గీయడం సాధన చేయవచ్చు. చిత్రలేఖనం నేర్పేందుకు ఈ వేసవిలో కొన్ని క్యాంపులు నిర్వహిస్తుంటారు. వాటిలో చేరొచ్చు. ఆన్‌లైన్ ద్వారా చిత్రలేఖనం నేర్పేవారు కూడా అందుబాటులో ఉంటారు. ఆ పద్ధతిలో రోజూ సాధన చేయవచ్చు. మీకు మరింత ఆసక్తి ఉంటే సెలవుల తర్వాత కూడా దాన్ని కొనసాగించవచ్చు.

భారత ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ పునర్నియామకం

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన టి.దిలీప్ మళ్లీ ఎంపికయ్యాడు. ప్రతిష్టాత్మక ఇంగ్లండ్ పర్యటన కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దిలీప్‌ను మరో సారి ఫీల్డింగ్ కోచ్‌గా నియమించింది. 2021 నుంచి ఈ ఏడాది ఆరంభం వరకు దిలీప్ టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించగా... ఆస్ట్రేలియాలో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భారత జట్టు పేలవ ప్రదర్శనతో సహాయక కోచ్ అభిషేక్ నాయర్‌తో పాటు దిలీప్‌ను తొలగించింది. ఫీల్డింగ్ కోచ్‌గా విదేశీయుడిని నియమించాలని బోర్డు ప్రయత్నించినా... అది వీలు కాకపోవడంతో జట్టు సభ్యులతో మంచి అనుబంధం ఉన్న దిలీప్‌ను తిరిగి ఎంపిక చేసింది. 'దిలీప్ చాలా మంచి కోచ్. నాలుగేళ్లుగా భారత జట్టుతో కలిసి పనిచేశాడు. ఆటగాళ్ల బలాబలాలు అతడికి బాగా తెలుసు. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు అతడిని తిరిగి నియమించాం'అని బోర్డు అధికారి వెల్లడించారు. ఇక మరోవైపు భారత టెస్టు కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్, సుదర్శన్ జూన్ 6 నుంచి ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగే వార్మప్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.




జితేశ్ శర్మ

జితేశ్ జితాదియా

33 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో జితేశ్ శర్మ 85 నాటౌట్

6 వికెట్లతో లక్నోపై బెంగళూరు జయభేరి

- క్వాలిఫయర్–1కు అర్హత
- రిషభ్ పంత్ సెంచరీ వృథా


పంత్ సెంచరీ సంబరం

లక్నో: సొంతగడ్డపై విజయగర్వంతో సీజన్‌ను ముగించే భారీ స్కోరునే లక్నో చేసింది... ఛేదనలో సాల్ట్, లివింగ్‌స్టోన్, కోహ్లిలాంటి విలువైన వికెట్లను తీసింది. 52 బంతుల్లో 105 పరుగుల సమీకరణం బెంగళూరుకు క్లిష్టంగా అనిపించింది... అయితే కెప్టెన్ జితేశ్... మయాంక్‌తో కలిసి చేసిన బ్యాటింగ్ మ్యాజిక్ మ్యాచ్‌నే మార్చేసింది. ఇంకో 8 బంతులు మిగిలుండగానే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 6 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై జయభేరి మోగించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ రిషభ్ పంత్ (61 బంతుల్లో 118 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) సీజన్‌లో తొలి సెంచరీతో కదం తొక్కగా, మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 67; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. అనంతరం బెంగళూరు 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జితేశ్ శర్మ (33 బంతుల్లో 85 నాటౌట్; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు), కోహ్లి (30 బంతుల్లో 54; 10 ఫోర్లు) చెలరేగారు.

చితగ్గొట్టిన పంత్

మార్ష్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన బ్రిట్జ్‌కి (14) మూడో ఓవర్లో నిష్క్రమించాడు. తర్వాత రిషభ్ పంత్ రావడంతో లక్నో ప్రతీ ఓవర్లోనూ పండగ చేసుకుంది. యశ్ దయాళ్ వేసిన నాలుగో ఓవర్లో ఒక సిక్స్, రెండు బౌండరీలు బాదడం ద్వారా పంత్ ప్రతాపం మొదలైంది. పవర్‌ప్లే తర్వాత ఓ వైపు మార్ష్, ఇంకోవైపు రిషభ్ ధనాధన్ షోతో ఓవర్‌కు సగటున పది పరుగుల రన్‌రేట్ నమోదైంది. దీంతో 9.5 ఓవర్లో జెయింట్స్ 100 స్కోరును చేరుకుంది. ముందుగా పంత్ 29 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 14వ ఓవర్లో సిక్సర్‌తో మార్ష్ 31 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. ఆ ఓవర్లో రిషభ్ కూడా ఫోర్, సిక్స్ బాదడంతో 18 పరుగులు వచ్చాయి. 16వ ఓవర్లో వరుసగా 2 సిక్సర్లు కొట్టిన మార్ష్‌ను భువనేశ్వర్ అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 152 పరుగుల సుదీర్ఘ భాగస్వామ్యానికి తెరపడింది. అతని మరుసటి ఓవర్లో బౌండరీతో పంత్ 54 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేసుకోవడం, జట్టు 200 మార్క్ దాటడం జరిగిపోయాయి.

మెరుపు భాగస్వామ్యం...

సాల్ట్, కోహ్లిలు పెద్ద లక్ష్యాన్ని ఛేదించేందుకు అవసరమైన మెరుపు ఆరంభాన్నిచ్చారు. ఇద్దరు బౌండరీలతో స్కోరుబోర్డును పరుగు పెట్టించారు. 4 ఓవర్లలోనే స్కోరు 50కి చేరింది. కానీ పవర్‌ప్లే ఆఖరి ఓవర్లోనే సాల్ట్ (19 బంతుల్లో 30; 6 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. తర్వాత కోహ్లికి జతయిన రజత్ పటిదార్ (14) ఫోర్, సిక్సర్ బాదాడు. కానీ రూర్కే ఒకే ఓవర్లో అతన్ని, లివింగ్‌స్టోన్ (0)ను అవుట్ చేసి బెంగళూరును కష్టాల్లో పడేశాడు. కోహ్లి తన మార్క్ షాట్లతో చెలరేగిపోవడంతో రన్‌రేట్ లక్ష్యాన్ని కరిగించేంత వేగంగా దూసుకెళ్లింది. 9.1 ఓవర్లోనే ఆర్సీబీ స్కోరు వందను దాటేసింది. కోహ్లి 27 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ధాటిని కొనసాగించే ప్రయత్నంలో కొట్టిన షాట్ మిడాఫ్‌లో బదోని చేతికి చిక్కడంతో కోహ్లి నిరాశగా వెనుదిరిగాడు. అప్పుడు జట్టు స్కోరు 11.2 ఓవర్లలో 123/4. కాగా గెలుపు సమీకరణం 52 బంతుల్లో 105 చాలా కష్టమైంది. మయాంక్, కెప్టెన్ జితేశ్ శర్మల మెరుపులకు తోడు... లక్నో ఆటగాళ్ల చెత్త ఫీల్డింగ్, సులువైన రనౌట్‌పట్ల రూర్కే అశ్రద్ధ వెరసి... పరుగులు, బౌండరీలు అలవోకగా రావడంతో చూస్తుండగానే లక్ష్యం దిగొచ్చింది. అబేధ్యమైన ఐదో వికెట్‌కు మయాంక్, జితేశ్‌లు కేవలం 44 బంతుల్లోనే 107 పరుగులు జోడించడం విశేషం!

ఐపీఎల్ 'ప్లే ఆఫ్స్'

క్వాలిఫయర్–1 (మే 29)
పంజాబ్ X బెంగళూరు
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి

ఎలిమినేటర్ (మే 30)
గుజరాత్ X ముంబై
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్–2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
పంజాబ్	14	9	4	1	19	0.372
బెంగళూరు	14	9	4	1	19	0.301
గుజరాత్	14	9	5	0	18	0.254
ముంబై	14	8	6	0	16	1.142
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లక్నో	14	6	8	0	12	-0.376
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్కోరు వివరాలు

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 67; బ్రిట్జ్‌కి (బి) తుషార 14; పంత్ నాటౌట్ 118; పూరన్ (సి) యశ్ దయాళ్ (బి) షెఫర్డ్ 13; సమద్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 227.** **వికెట్ల పతనం:** 1-25, 2-177, 3-226. **బౌలింగ్:** తుషార 4-0-26-1, కృనాల్ పాండ్యా 2-0-14-0, యశ్ దయాళ్ 3-0-44-0, భువనేశ్వర్ 4-0-46-1, సుయశ్ 3-0-39-0, షెఫర్డ్ 4-0-51-1. **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** సాల్ట్ (సి) దిగ్వేశ్ (బి) ఆకాశ్ 30; కోహ్లి (సి) బదోని (బి) అవేశ్‌ఖాన్ 54; పటిదార్ (సి) సమద్ (బి) రూర్కే 14; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రూర్కే 0; మయాంక్ నాటౌట్ 41; జితేశ్ నాటౌట్ 85; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 230. వికెట్ల పతనం:** 1-61, 2-90, 3-90, 4-123. **బౌలింగ్:** ఆకాశ్ 4-0-40-1, విల్ రూర్కే 4-0-74-2, దిగ్వేశ్ రాఠి 4-0-36-0, షాబాజ్ 3-0-39-0, అవేశ్‌ఖాన్ 3-0-32-1, బదోని 0.4-0-9-0.

సినెర్ ముందంజ


సినెర్

- డానిల్ మెద్వెదెవ్‌కు షాక్
- రెండో రౌండ్‌కు గాఫ్, కీస్
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్: ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్, సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అలవోక విజయాలతో శుభారంభం చేశారు. అయితే మాజీ ప్రపంచ నంబర్‌వన్, 11వ సీడ్ రష్యన్ స్టార్ డానిల్ మెద్వెదెవ్‌కు తొలి రౌండ్లోనే ఊహించని షాక్ ఎదురైంది. మహిళల సింగిల్స్‌లో అమెరికన్ స్టార్లు కొకొ గాఫ్, మాడిసన్ కీస్ వరుస సెట్లతో ప్రత్యర్థుల్ని చిత్తు చేసి రెండో రౌండ్లోకి ప్రవేశించారు. మిగతా సీడెడ్ క్రీడాకారిణుల్లో జెస్సికా పెగులా, మిర అంద్రీవా ముందంజ వేశారు. గత ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనలిస్ట్ కొకొ గాఫ్ (అమెరికా) 6-2, 6-2తో గడెక్కి (ఆస్ట్రేలియా)పై గెలుపొందగా... అజరెంకా (బెలారస్) 6-0, 6-0తో విక్‌మయెర్ (బెల్జియం)పై నెగ్గింది. మూడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) 6-2, 6-4తో అన్క టొడొని (రొమేనియా)పై, ఆరో సీడ్ మిర అంద్రీవా (రష్యా) 6-4, 6-3తో క్రిస్టీనా బుక్సా (స్పెయిన్)పై విజయం సాధించారు. 12వ సీడ్ రిబాకినా 6-1, 4-6, 6-4తో రియెరా (అర్జెంటీనా)పై గెలుపొందగా, ఏడో సీడ్ కీస్ (అమెరికా) 6-2, 6-1తో సవిల్లే (ఆస్ట్రేలియా)ను ఓడించింది. సోఫియా కెనిన్ (అమెరికా) 6-3, 6-1తో గ్రాచెవా (ఫ్రాన్స్)పై గెలిచింది.

జొకో అలవోకగా...

మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 6-3, 6-3, 6-3తో అమెరికన్ ప్లేయర్ మెక్‌డొనాల్డ్‌పై సునాయాస విజయంతో ముందంజ వేశాడు. తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, టాప్ సీడ్ ఇటలీ స్టార్ సినెర్ 6-4, 6-3, 7-5తో రిండెర్క్‌నెచ్ (ఫ్రాన్స్) గెలుపొందాడు. మూడో సెట్లో స్థానిక ప్లేయర్ నుంచి గట్టిపోటీ ఎదురైనప్పటికీ మరో సెట్‌కు అవకాశమివ్వకుండా మూడు సెట్లలోనే ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు ముగించాడు. ఈ సీజన్ మెద్వెదెవ్‌కు నిరాశనే మిగిలిస్తోంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్లోనే ఇంటిదారి పట్టిన ఈ 11వ సీడ్ రష్యన్ స్టార్ ఇక్కడ తొలిరౌండ్లోనే 5-7, 3-6, 6-4, 6-1, 5-7తో కామెరూన్ నోరీ (బ్రిటన్) చేతిలో కంగుతిన్నాడు. బల్గేరియాకు చెందిన 16వ సీడ్ దిమిత్రోవ్ 6-2, 6-3 2-6తో అమెరికన్ క్వాలిఫయర్ కిన్‌పై రెండు సెట్లతో ఆధిక్యంలో ఉండగా రిటైర్డ్‌హర్ట్‌గా కోర్టు నుంచి నిష్క్రమించాడు. ఏడో సీడ్ కాస్పెర్ రూడ్ (నార్వే) 6-3, 6-4, 6-2తో రమోస్ వినొలస్ (స్పెయిన్)పై, గత ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్, ఈ సీజన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ రన్నరప్ మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 6-3, 6-4తో లర్నెర్ టియెన్ (అమెరికా)పై గెలుపొందారు.

సాక్షి సినిమా

కథ మొత్తం చెప్పినా భయపడను

- దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా



ఒక యాక్టర్‌కు కథ చెబితే, ఆ యాక్టర్ కథను లీక్ చేశారని, ఇలాంటి అసహ్యకరమైన పీఆర్ గేమ్స్ ఆడటం సరైనది కాదని అంటున్నారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' వేదికగా ఓ పోస్టును షేర్ చేశారు. ''నేను ఓ యాక్టర్‌కు కథ నరేట్ చేసినప్పుడు ఆ కథను ఆ యాక్టర్ ఎవరితోనూ షేర్ చేసుకోరని వంద శాతం నమ్ముతాను. ఈ విషయంలో నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ ఉన్నట్లే. కానీ మీరు (తన కథను విన్న యాక్టర్‌ను ఉద్దేశించి కావొచ్చు..) డిస్‌క్లోజ్ చేశారు. అలాగే మీ వ్యక్తిత్వం ఎలాంటిదో కూడా చూపించారు. మీరు అలా చేయడం వల్ల ఓ యువ నటిని ఇబ్బంది పెడుతున్నారు. మీ స్త్రీవాదం ఈ విధానాన్నే సూచిస్తుందా? ఓ ఫిల్మ్ మేకర్‌గా నేనెంతో కష్టపడి ఈ కథను సిద్ధం చేసుకున్నాను. సినిమాయే నాకు ప్రపంచం. అది మీకు అర్థం కాదు. అర్థం చేసుకోలేరు కూడా. మరోసారి కథ మొత్తం చెప్పండి. ఎందుకంటే... నేను ఏ మాత్రం భయపడను... డర్టీ పీఆర్ గేమ్స్'' అంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు సందీప్‌రెడ్డి వంగా. ఇక ప్రస్తుతం 'స్పిరిట్' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్నారు సందీప్‌రెడ్డి. ఈ చిత్రంలో ప్రభాస్ హీరోగా, 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ డిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. అక్టోబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందనే టాక్ వినిపిస్తోంది. అయితే... 'స్పిరిట్' సినిమా కథను ముందుగా దీపికా పదుకోన్‌కు చెప్పారట సందీప్‌రెడ్డి. దీపిక కూడా ఈ సినిమా చేసేందుకు అంగీకరించారట. కానీ 'స్పిరిట్' సినిమా చిత్రీకరణలో పాల్గొనేందుకు దీపిక కొన్ని షరతులు పెట్టారని, ఈ విషయంలో దర్శకుడు సందీప్–హీరోయిన్ దీపికకు క్రియేటివ్ డిఫరెన్సెస్ వచ్చాయని, ఈ నేపథ్యంలో ఓ బాలీవుడ్ వెబ్‌సైట్‌కు 'స్పిరిట్' కథను తన పీఆర్ సిబ్బంది ద్వారా దీపిక షేర్ చేశారనే ప్రచారం బాలీవుడ్‌లోనూ, ఇటు టాలీవుడ్‌లోనూ తెరపైకి వచ్చింది. అంతేకాదు... సందీప్‌రెడ్డి వంగా తన ఎక్స్ ఖాతాలో ప్రస్తావించిన నటి దీపికా పదుకోన్ అని, యువ నటి త్రిప్తి అని బాలీవుడ్ సినీ వాసులు ఊహిస్తున్నారు. మరి... కథను లీక్ చేసింది ఎవరు? అనేది తెలియాల్సి ఉంది. అలాగే వార్తల్లో దీపిక పేరు ఉంది కాబట్టి ఆమె స్పందిస్తారేమో చూడాలి.

నాకెందుకు ఈ పరీక్ష స్వామీ?


విష్ణు

'జటాజూటధారీ... నీ కోసం తపస్సు చేసే నాకెందుకు ఈ పరీక్ష స్వామీ?, హరహర మహాదేవ్' అంటూ పోస్ట్ చేశారు విష్ణు మంచు. ఆయన హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మంచు మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ వంటి వారు ఇతర కీలక పాత్రలు పోషించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీ బిజీగా ఉన్నారు విష్ణు మంచు. కాగా 'కన్నప్ప'లోని 90 నిమిషాల కీలక సన్నివేశాలకు సంబంధించిన హార్డ్ డ్రైవ్ చోరీపై ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విజయ్‌కుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విష్ణు మంచు స్పందిస్తూ– ''ముంబైలోని హైవ్ స్టూడియోస్ వారు హైదరాబాద్‌లోని మా కార్యాలయానికి 'కన్నప్ప' హార్డ్ డ్రైవ్‌ని కొరియర్ చేశారు. అయితే మా సంస్థతో ఏ మాత్రం సంబంధం లేని చరిత అనే మహిళ రఘు అనే వ్యక్తి (ఆఫీస్ బాయ్) ద్వారా అందుకుని చోరీకి పాల్పడింది. మా సినిమా విడుదల సమయంలో 90 నిమిషాల సన్నివేశాలను లీక్ చేయడానికి చేసిన కుట్ర ఇది. ఈ హార్డ్ డ్రైవ్‌లో 'కన్నప్ప'లోని రెండు ప్రధాన పాత్రలకు మధ్య కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలకమైన వీఎఫ్‌ఎక్స్ వర్క్ సన్నివేశాలున్నాయి. మా సినిమా రిలీజ్‌ను అడ్డుకోవడానికే ఈ సన్నివేశాలను లీక్ చేసినట్టుగా మాకు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. మా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రెడ్డి విజయ్ కుమార్ సైబర్ క్రైమ్ వారికి ఫిర్యాదు చేశారు. దయచేసి ఈ సినిమాకు సంబంధించిన పైరేటెడ్ కంటెంట్ బయటపడితే ప్రసారం చేయొద్దని మనవి చేస్తున్నా. 'కన్నప్ప'ని ఓ ల్యాండ్ మార్క్‌గా మార్చడానికి మా టీమ్ కృషి చేసింది. ఇలా లీక్ చేయడం ద్వారా మా సినిమాను అడ్డుకోలేరు'' అని తెలిపారు.

వినాయక చవితికి జాతర


రవితేజ, శ్రీలీల

ఆగస్టులో థియేటర్స్‌లో మాస్ జాతర అంటున్నారట రవితేజ. 'ధమాకా' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో లక్ష్మణ్ భేరి అనే పోలీసాఫీసర్ పాత్రలో రవితేజ, విలన్‌గా నవీన్ చంద్ర నటిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా టాకీ పార్టు చిత్రీకరణ దాదాపు పూర్తయింది. పాటల చిత్రీకరణ బ్యాలెన్స్ ఉందట. కాగా 'మాస్ జాతర' సినిమాను వినాయక చవితి సందర్భంగా ఆగస్టు చివరి వారంలో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

జూన్ నుంచి జోరుగా...


విజయ్ సేతుపతి

లొకేషన్ సెర్చ్ చేస్తున్నారు పూరి జగన్నాథ్. విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో టబు, కన్నడ నటుడు విజయ్ కుమార్ కీలక పాత్రల్లో నటించనున్నారు. పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మించనున్నారు. జూన్ చివరి వారంలో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. షూటింగ్ ఆరంభించినప్పటి నుంచి మొత్తం సినిమా పూర్తయ్యేవరకూ షెడ్యూల్స్‌ని జోరుగా జరిపేలా ప్లాన్ చేశారట. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై ఏరియాల్లో లొకేషన్స్ రెక్కీ చేస్తోంది పూరి అండ్ టీమ్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

కథ నచ్చడంతో నేనే నిర్మించాను

- హీరో–నిర్మాత రూపేష్



''ప్రస్తుతం మన సినిమాల్లో స్వచ్ఛమైన ప్రేమను చూపించడం లేదు. మా 'షష్టిపూర్తి' చిత్రంలో కుటుంబ అంశాలతో పాటు అన్ని రకాల భావోద్వేగాలను చూపించాం. అలాగే అందమైన ప్రేమకథ కూడా ఉంది. ఇందులోని పాత్రల్ని చూస్తే తమని తాము చూసుకున్నట్టుగా ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు'' అని హీరో–నిర్మాత రూపేష్ తెలిపారు. రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో, రూపేష్, ఆకాంక్షా సింగ్ జంటగా నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్‌పై రూపేష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో రూపేష్ విలేకరులతో మాట్లాడుతూ– ''షష్టిపూర్తి' కథను రాజేంద్ర ప్రసాద్‌గారి కోసమే పవన్ ప్రభ రాసుకున్నారు. ఆయన కొడుకు పాత్ర కోసం నన్ను సంప్రదించారు. పవన్‌గారు చెప్పిన ఈ కథ బాగా నచ్చడంతో ఈ కథని రాజీ పడకుండా తీయాలనే ఆలోచనతో నేనే నిర్మించాను. ఔట్‌పుట్ చూసుకున్నాక... కథ విన్నప్పుడు కంటే రెండింతల సంతృప్తి కలిగింది. పవన్‌గారు అంత బాగా తెరకెక్కించారు. మా చిత్రానికి ఇళయరాజా, తోట తరణివంటి పెద్ద సాంకేతిక నిపుణులు పని చేయడంతో బడ్జెట్ అనుకున్న దాని కంటే ఎక్కువైంది. అయితే ఆ ఖర్చు అంతా తెరపై కనిపిస్తుంది. మా ఆయి ప్రొడక్షన్స్ అంటే మా అమ్మ ప్రొడక్షన్ అని అర్థం. నేను నటించిన తొలి చిత్రం '22'. అయితే ముందుగా 'షష్టిపూర్తి' విడుదలవుతోంది. '22'ని కూడా విడుదలకు సిద్ధం చేస్తున్నాం. నా తర్వాతి సినిమాలకు రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అని చెప్పారు.

బద్మాషులు సక్సెస్ కావాలి

- దర్శకుడు వేణు

మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకత్వంలో తార స్టోరీ టెల్లర్స్ పతాకంపై బి. బాలకృష్ణ, సి. రామశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 6న దీపా ఆర్ట్స్ విడుదల చేస్తోంది ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను 'బలగం' ఫేమ్ వేణు విడుదల చేసి, మాట్లాడుతూ– ''ట్రైలర్ ఆసక్తికరంగా, ఫన్ రైడ్‌లా అనిపిస్తోంది. 'బద్మాషులు' చిత్రం సక్సెస్ సాధించి, చిత్ర బృందానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను'' అన్నారు.


విద్యాసాగర్, 'బలగం' వేణు, శంకర్, మహేశ్

ఆ తప్పులు మళ్లీ చేయకూడదని తెలిసొచ్చింది

- నారా రోహిత్



''ముగ్గురు హీరోలతో ఒక సినిమా చేయడం అంత సులభం కాదు. కానీ రాధామోహన్‌గారు మమ్మల్ని (సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్) నమ్మి 'భైరవం'ని రాజీ పడకుండా తీశారు. ఆయన లాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి చాలా ముఖ్యం. రాధామోహన్‌గారికి ఈ సినిమాతో పెద్ద విజయం, భారీగా డబ్బులు రావాలని కోరుకుంటున్నాను'' అని నారా రోహిత్ తెలిపారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా, అదితీ శంకర్, ఆనంది, దివ్యా పిళ్లై హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో జయంతిలాల్ గడా సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నారా రోహిత్ విలేకరులతో మాట్లాడుతూ– ''నిర్మాత బెల్లంకొండ సురేష్‌గారు ఫోన్ చేసి, తమిళ చిత్రం 'గరుడన్' చూడమంటే చూశాను... చాలా నచ్చింది. ఈ సినిమా తెలుగు రీమేక్ 'భైరవం'లో శశికుమార్ పాత్ర చేయాలని కోరారు. ఆ పాత్ర నాకూ బాగా నచ్చడంతో చేశాను. నా తొలి కమర్షియల్ మాస్ ఫిలిం 'భైరవం'. ఇక ఇన్నేళ్ల నా కెరీర్‌లో విజయాలు, అపజయాలు, ఎత్తుపల్లాలు ఉన్నాయి. కథల ఎంపికలో కొన్ని తప్పులు చేశాను. ఆ తప్పులు మళ్లీ చేయకూడదని తెలిసొచ్చింది. ఇకపై నా నుంచి రెగ్యులర్‌గా సినిమాలు వస్తాయి. నేను హీరోగా నటించిన 'సుందరకాండ' విడుదల జూలైలో ఉంటుంది'' అని పేర్కొన్నారు.

'పుష్ప'లో షెకావత్ (ఫాహద్ ఫాజిల్ చేసిన పాత్ర) క్యారెక్టర్‌కు నన్ను అడిగారు. ఫొటోలు పంపమంటే, మీసాలు పెంచుకుని ఫొటోషూట్ చేయించి, పంపాను. కానీ ఇది పాన్ ఇండియా మూవీ కాబట్టి వివిధ భాషల వాళ్లని తీసుకోవాలనే ఆలోచనతో ఫాహద్‌ని తీసుకుని ఉంటారేమో.

అప్పుడే కదరా లైఫ్‌కి మీనింగ్

దేవన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కృష్ణ లీల'. ఈ చిత్రంలో ధన్యా బాలకృష్ణ హీరోయిన్. బేబీ వైష్ణవి సమర్పణలో జి. జ్యోత్స్న నిర్మించిన ఈ సినిమాలోని 'సూరి ఓరి సూరి..' అనే పాటను మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీ నారాయణ విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకత్వంలో భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటను జెస్సీ గిఫ్ట్ పాడారు. ''ఫ్రెండూ యు కెన్ డూ ఎవ్రీథింగ్.. అప్పుడే కదరా లైఫ్‌కి మీనింగ్..' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఈ పాట సినిమాకే కాదు యువతరాన్ని కూడా ముందుకు తీసుకెళ్లడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాను'' అన్నారు లక్ష్మీనారాయణ. ''రాజమౌళిగారి విజన్, సుకుమార్‌గారి నరేషన్, సందీప్‌రెడ్డి రా అండ్ ఇంటెన్స్ ప్రజెంటేషన్ నా సినీ ప్రయాణాన్ని ప్రభావితం చేశాయి. 'కృష్ణ లీల' ఆ అభిమానం నుంచి పుట్టిందే. ఇక 'సూరి ఓరి..' పవర్‌ఫుల్ మోటివేషనల్ సాంగ్'' అన్నారు దేవన్. రచయిత అనిల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణ, దేవన్, జ్యోత్స్న, అనిల్ కిరణ్‌కుమార్

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
625	175
81,552	24,826

విదేశీ సూచీలు

సూచీ			
నాస్‌డాక్	19,183	▲	445
డోజోన్స్	42,259	▲	645
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,778	▲	60
డాక్స్	24,226	▲	199
షాంఘై	3,345	▽	6
నికాయ్	37,724	▲	193

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	84.70	85.72
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	114.20	117.11
€	యూరో	ఒక్కటి	95.76	98.46
¥	జపాన్ యెన్ (100)	ఒక్కటి	58.76	60.31
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	54.29	56.49
S$	సింగపూర్ డాలర్	భారమనుకి	63.94	68.63
SAR	సౌదీ రియాల్	భారమనుకి	21.79	23.30
UAE D	యూఏఈ దిర్హామ్	భారమనుకి	22.28	24.06
¥	చైనా యువాన్	భారమనుకి	10.96	12.79

హమారా.. స్కూటర్!

- పటిష్టమైన అర్బన్ డిమాండ్.. ఈవీల దన్ను
- బైక్ అమ్మకాలకు మించిన వృద్ధి
- మళ్లీ కోవిడ్ ముందస్తు స్థాయికి సేల్స్
- టూవీలర్లలో క్రమంగా ఎగబాకుతున్న స్కూటర్ల వాటా

మన రోడ్లపై స్కూటర్లు టాప్ స్పీడ్‌తో దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గుముఖంతో మందగమనాన్ని ఎదుర్కొంటున్న టూవీలర్ల మార్కెట్‌కు ఇప్పుడు స్కూటర్లే దన్నుగా నిలుస్తున్నాయి. బైక్ అమ్మకాలతో పోలిస్తే గతేడాది స్కూటర్ల విక్రయాల్లో భారీగా వృద్ధి నమోదవడం దీనికి నిదర్శనం. ఈ ఏడాది కూడా ఇదే జోరు కొనసాగుతుందని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఫుల్ డిమాండ్‌తో పాటు నెమ్మదిగా ద్విచక్ర వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ)కు మారుతుండటం కూడా స్కూటర్ దూకుడుకు దోహదం చేస్తోంది! – సాక్షి, బిజినెస్ డెస్క్




స్కూటర్ల అమ్మకాలు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 'టాప్'లేపాయి. ఏకంగా 68.5 లక్షల విక్రయాలతో కోవిడ్ ముందు (2018-19)లో నమోదైన 67 లక్షల రికార్డును బ్రేక్ చేశాయి. అప్పుడు కూడా స్కూటర్ల జోరు కారణంగానే మొత్తం టూవీలర్ విభాగం దేశీ అమ్మకాలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిని (2.12 కోట్ల వాహనాలు) తాకడం గమనార్హం. కాగా, ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ గణాంకాల ప్రకారం గతేడాది స్కూటర్ల విక్రయాలు 17.36 శాతం ఎగబాకాయి. మొత్తం టూవీర్ల అమ్మకాలు 9% పెరగ్గా... బైక్‌ల సేల్స్ 5 శాతం మాత్రమే పుంజుకున్నాయి.

పట్టణాల్లో ఫుల్ డిమాండ్...

గత కొన్నేళ్లుగా పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోవడం ఇతరత్రా సమస్యలకు తోడు.. కుటుంబంలో అందరూ నడపడానికి అనువుగా ఉండటం వంటి సానుకూలతల కారణంగా స్కూటర్ల వైపు మొగ్గు చూపుతున్నవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. 'గేర్‌లెస్ కావడంతో పాటు నగరాలు, పట్టణాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహంలో నడపడం ఈజీగా ఉండటం వల్ల నిత్యం ఆఫీసులకు వెళ్లొచ్చేవారు, ముఖ్యంగా మహిళలు, నవతరం వాహనదారులు స్కూటర్లకే జై కొడుతున్నారు. పటిష్టమైన అర్బన్ డిమాండ్‌కు తోడు ఈవీలకు మారుతున్న వారు పెరుగుతుండటం వల్ల కూడా బైక్‌లతో పోలిస్తే స్కూటర్ల విక్రయాల్లో భారీ వృద్ధి నమోదవుతోంది' అని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ పూనమ్ ఉపాధ్యాయ్ అభిప్రాయపడ్డారు.

వాటా పైపైకి...

టూవీలర్ విభాగంలో ఇప్పటికీ బైక్‌లదే పైచేయి. మొత్తం అమ్మకాల్లో 60 శాతం పైగా మెజారిటీ వాటాను కొల్లగొడుతున్నాయి. అయితే, గత నాలుగైదేళ్లుగా స్కూటర్ మార్కెట్ వాటా క్రమంగా పుంజుకుంటోంది. వాహన తయారీదారుల సంఘం (సియామ్) గణాంకాల ప్రకారం 2019-20లో టూవీలర్ అమ్మకాల్లో 66 శాతంగా ఉన్న మోటార్‌సైకిళ్ల వాటా.. 2024-25 నాటికి 62%కి దిగొచ్చింది. మరోపక్క, స్కూటర్ల వాటా 30 శాతం నుంచి 35 శాతానికి జంప్ చేసింది. దీని ప్రకారం చూస్తే... ట్రెండ్ మారుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని పరిశీలకులు పేర్కొంటున్నారు.



'ఎలక్ట్రిక్' వేగం...

ఇటీవలి కాలంలో ఈవీల జోరు పెరగడం.. ఎక్కువ మంది ఎలక్ట్రిక్ స్కూటర్లను ఎంచుకోవడంతో టూవీలర్ విభాగం పుంజుకోవడానికి దోహదపడుతోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. 2025-26లో అమ్ముడైన మొత్తం టూవీలర్లలో ఈవీల వాటా 6 శాతానికి పైగా నమోదైంది. 'రాబోయే కాలంలో ఈవీల ధరలు దిగొచ్చే అవకాశం ఉండటం, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలతో స్కూటర్ పరిశ్రమలో ఈవీల వాటా మరింత పెరగడం ఖాయం. ఇప్పటికే ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది' అని టీవీఎస్ మోటార్స్ సీఈఓ కేఎన్ రాధాకృష్ణన్ తాజాగా పేర్కొన్నారు. 2024-25లో తొలిసారి ఈ-టూవీలర్లు 10 లక్షల అమ్మకాల మైలురాయిని దాటాయి. మొత్తం 11.4 లక్షలకు పైగా సేల్స్‌తో ఈ-టూవీలర్ విభాగంలో ఏకంగా 21 శాతం వృద్ధి నమోదైంది. టీవీఎస్ మోటార్స్, బజాజ్ ఆటో, హీరో మోటో వంటి టూవీలర్ దిగ్గజాలతో పాటు నవతరం ఎలక్ట్రిక్ వాహన సంస్థలైన ఓలా ఎలక్ట్రిక్, ఏథర్ ఎనర్జీ వంటివి కొంగొత్త మోడళ్లతో ఈవీ మార్కెట్లో వాటా కోసం పోటీపడుతున్నాయి. స్కూటర్లలో విభిన్న వర్గాల అవసరాలకు, విభిన్న మోడళ్లు అందుబాటులో ఉండడం కూడా ఎకానమీ బైక్‌లకు మించి స్కూటర్ అమ్మకాలు పుంజుకోవడానికి మరో ముఖ్య కారణమని రాధాకృష్ణన్ చెప్పారు. 2021-22లో టీవీఎస్ టూవీలర్ సేల్స్‌లో స్కూటర్ల వాటా 25 శాతం ఉండగా.. 2024-25లో ఇది 40 శాతానికి దూసుకెళ్లింది. గతేడాది కంపెనీ మొత్తం 47.4 లక్షల ద్విచక్రవాహనాలను విక్రయించింది. ఇదిలాఉంటే, టీవీఎస్ స్కూటర్ విక్రయాల్లో 15 శాతం ఎలక్ట్రిక్ ఐక్యూబ్‌దే కావడం మరో విశేషం!

పన్ను రిటర్నులకు మరింత వ్యవధి

సెప్టెంబర్ 15 వరకు పొడిగింపు



న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు శుభవార్త. అసెస్‌మెంట్ సంవత్సరం (ఏవై) 2025-26కు సంబంధించి ఆదాయపన్ను రిటర్నుల (ఐటీఆర్‌లు) దాఖలు గడువును జూలై 31 నుంచి సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) మంగళవారం ప్రకటించింది. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఆడిటింగ్ అవసరం లేని సంస్థలు ఏటా పన్ను రిటర్నుల దాఖలుకు జూలై 31 తుది గడువుగా ఉంటోంది. సాంకేతిక సమస్యలు, ఇతరత్రా ప్రతికూల పరిస్థితుల్లో ఈ గడువును ఆదాయపన్ను శాఖ పొడిగిస్తుంటుంది. ఈ ఏడాది ఐటీఆర్‌లో మార్పులు చేయడంతో.. ఇందుకు సంబంధించి ఐటీ శాఖ వ్యవస్థలను సిద్ధం చేసేందుకు, ఐటీఆర్ యుటిలిటీలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీబీటీటీ తెలిపింది.

ఇక జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్స్

జాయింట్ వెంచర్‌కు సెబీ ఓకే

న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ మ్యూచువల్ ఫండ్స్ సేవలు ప్రారంభించేందుకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, యూఎస్‌కు చెందిన బ్లాక్‌రాక్‌కు చెరో 50 శాతం వాటా కలిగిన జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీ ఇది. 'జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్‌కు సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌తో పాటు.. జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్‌కు అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా వ్యవహరించేందుకు జియో బ్లాక్ రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్‌కు సెబీ ఈ నెల 26న అనుమతి మంజూరు చేసినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్లడించింది. మరోవైపు జియోబ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ సిద్ స్వామినాథన్‌ను ఎండీ, సీఈవోగా నియమించుకున్నట్టు ప్రకటించింది.

ఈ వార్తలతో జియో ఫైనాన్షియల్ షేరు 3.50% పెరిగి రూ.292 వద్ద స్థిరపడింది. ఒకదశలో 4% లాభపడింది.

ఎల్‌ఐసీ లాభం జూమ్

- క్యూ4లో రూ. 19,013 కోట్లు
- షేరుకి రూ. 12 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) గతేడాది (2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 38 శాతం జంప్‌చేసి రూ. 19,013 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ. 13,763 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 12 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,50,923 కోట్ల నుంచి రూ. 2,41,625 కోట్లకు క్షీణించింది. తొలి ఏడాది ప్రీమియం రూ. 13,810 కోట్ల నుంచి రూ. 11,069 కోట్లకు తగ్గింది. అయితే రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ. 77,368 కోట్ల నుంచి రూ. 79,138 కోట్లకు ఎగసింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఎల్‌ఐసీ నికర లాభం 18 శాతం పుంజుకుని రూ. 48,151 కోట్లను తాకింది. 2023-24లో రూ. 40,676 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,53,707 కోట్ల నుంచి రూ. 8,84,148 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు నామమాత్ర లాభంతో రూ. 871 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

బెంగళూరులో టెక్ సిబ్బంది @ 10 లక్షలు	ఈవీలపై మారుతీ ముందడుగు

బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ నష్టం 625 పాయింట్లు: 25,000 దిగువకు నిఫ్టీ

ముంబై: అధిక వాల్యుయేషన్ ఆందోళనలు, ఆసియా మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో బ్యాంకులు, ఐటీ, ఆటో షేర్లలో మంగళవారం లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా సెన్సెక్స్ 625 పాయింట్లు నష్టపోయి 81,552 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 175 పాయింట్లు కోల్పోయి 24,826 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,055 పాయింట్లు క్షీణించి 81,122 వద్ద, నిఫ్టీ 297 పాయింట్లు కుప్పకూలి 24,704 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఆసియాలో జపాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు ఒకశాతం వరకు నష్టపోయాయి. యూరప్‌లో మార్కెట్లు 1% లాభపడ్డాయి. అమెరికా స్టాక్ సూచీలు ఒకటిన్నర శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- బోరానా వీవ్స్ షేరు లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇష్యూ ధర (రూ.216)తో పోలిస్తే బీఎస్‌ఈలో 12.5% ప్రీమియంతో రూ.243 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 18% ఎగసి రూ.255 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి, అక్కడే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.680 కోట్లుగా నమోదైంది.

ఇండిగోలో వాటా విక్రయం

ఇండిగో బ్రాండు విమాన సర్వీసుల దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు చెందిన 5.7 శాతం వాటాను కుటుంబ ట్రస్ట్‌తో కలిసి ప్రమోటర్ రాకేష్ గంగ్వాల్ విక్రయించారు. బ్లాక్‌డీల్ ద్వారా ఓపెన్ మార్కెట్లో షేరుకి రూ. 5,231-5,235 ధరల శ్రేణిలో 2.21 కోట్ల షేర్లను అమ్మేశారు. తద్వారా రూ. 11,564 కోట్లు అందుకున్నారు. శోభా గంగ్వాల్, జేపీ మోర్గాన్ ట్రస్ట్ కంపెనీ ఆఫ్ డెలావేర్ సైతం వాటా విక్రయించాయి. ఈ విక్రయంతో ఇండిగోలో గంగ్వాల్ వాటా 5.3 శాతం నుంచి 4.7 శాతానికి తగ్గింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-కంప్యూటర్ అవేర్‌నెస్

జాబ్ పాయింట్

ఎయిమ్స్ మంగళగిరిలో 50 ఫ్యాకల్టీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50.
» **విభాగాలు:** బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్, మెడికల్ ఆంకాలజీ, మెడికల్ హెమటాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డీఎం, ఎంసీహెచ్, ఎండీ/ఎంఎస్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్‌కు 58 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.06.2025.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.06.2025.
» **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in

బీసీపీఎల్ లిమిటెడ్‌లో 27 పోస్టులు

అస్సాంలోని బ్రహ్మపుత్ర క్రాకర్ అండ్ పాలిమర్ లిమిటెడ్(బీసీపీఎల్).. డిప్యూటీ జనరల్ మేనేజర్, సీనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 27.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-01, సీనియర్ ఇంజనీర్ (కెమికల్)-15, సీనియర్ ఆఫీసర్(కాంట్రాక్ట్-ప్రొక్యూర్‌మెంట్)-01, సీనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, సీనియర్ ఆఫీసర్(ఫైనాన్స్-అకౌంట్స్)-02, సీనియర్ ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్)-03, సీనియర్ ఇంజనీర్(ఐటీ)-01, సీనియర్ ఆఫీసర్(మార్కెటింగ్)-01, సీనియర్ ఇంజనీర్(మెకానికల్)-01, ఆఫీసర్(ల్యాబొరేటరీ)-01.
» **విభాగాలు:** ఫైర్ సేఫ్టీ, కెమికల్, కాంట్రాక్ట్ అండ్ ప్రొక్యూర్‌మెంట్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఐటీ, మార్కెటింగ్, మెకానికల్, ల్యాబొరేటరీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ/ఐసీడబ్ల్యూఏ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు, మిగతా పోస్టులకు 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000, ఆఫీసర్(ల్యాబొరేటరి) పోస్టుకు రూ.40,000 నుంచి రూ.1,40,000, మిగతా పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.06.2025.
» **వెబ్‌సైట్:** https://bcplonline.co.in

ఎన్టీపీసీలో 150 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

ఎన్టీపీసీ లిమిటెడ్‌లో డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్(ఎలక్ట్రికల్)-40, డిప్యూటీ మేనేజర్ (మెకానికల్)-70, డిప్యూటీ మేనేజర్(సీ-ఐ)-40.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, సీ-ఐ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి 60% మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్, మెకానికల్, కంట్రోల్-ఇన్‌స్ట్రుమెంటేషన్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.70,000 నుంచి 2,00,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.06.2025.
» **వెబ్‌సైట్:** https://careers.ntpc.co.in

సీఈఎస్ఎస్, హైదరాబాద్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్(సీఈఎస్ఎస్).. వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-03, అసోసియేట్ ప్రొఫెసర్-02, అసిస్టెంట్ ప్రొఫెసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200 నుంచి రూ.2,18,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 నుంచి రూ.2,17,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 నుంచి రూ.1,82,400.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సీఈఎస్ఎస్), నిజామై అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్-500016 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** https://cess.ac.in

ఏసీఈఎం-డీఆర్‌డీవో, నాసిక్‌లో 41 అప్రెంటిస్‌లు

నాసిక్‌లోని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ఎనర్జిటిక్ మెటీరియల్స్ (ఏసీఈఎం)-డిఫెన్స్ రీసెర్చ్-డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 41.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-30, టెక్నీషియన్ అప్రెంటిస్-11.
» **అర్హత:** డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.12,000, టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.10,000.
» **ఎంపిక విధానం:** మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** apprentice.acem@gov.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.06.2025.
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in

కాలేజ్, కోర్స్.. ఎంపిక ఎలా!

ఇంజనీరింగ్.. లక్షల మంది విద్యార్థుల లక్ష్యం! రాష్ట్ర స్థాయిలోని ఈఏపీసెట్ మొదలు జాతీయ స్థాయిలోని జేఈఈ-మెయిన్ వరకూ లక్షల మంది హాజరు!! ఈ నెల(మే) 18న ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించిన అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మంది హాజరయ్యారు. ఆయా పరీక్షల ఫలితాల తర్వాత ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఇంజనీరింగ్ కాలేజ్ ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. కాలేజ్ లేదా కోర్సులో దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి తదితర వివరాలతో ప్రత్యేక కథనం..

» త్వరలో ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియ
» జూన్ 3 నుంచి జోసా కౌన్సెలింగ్
» కాలేజ్, బ్రాంచ్ ఎంపిక కీలకమంటున్న నిపుణులు



తెలుగు రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కాలేజీలు, ఉత్తీర్ణులయ్యే వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు అందరికీ సీట్లు లభించే అవకాశం ఉంది. కాని ఏదో ఒక కాలేజ్‌లో, ఏదో ఒక బ్రాంచ్‌లో చేరిపోదాం అనే దృక్పథం సరికాదంటున్నారు నిపుణులు. బ్రాంచ్, కాలేజీ ఎంపికలో బోధన నాణ్యత, ఫ్యాకల్టీ, జాబ్ మార్కెట్ ట్రెండ్స్, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు.

తొలి ప్రాధాన్యం బ్రాంచ్‌కే

ఇంజనీరింగ్ అనేది చాలా విస్తృతమైన విభాగం. ఇందులో రాణించేందుకు సమస్యా పరిష్కార నైపుణ్యంతోపాటు సృజనాత్మక ప్రతిభ సైతం ఉండాలి. కాబట్టి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు బ్రాంచ్ ఎంపికను తొలి ప్రాధాన్యంగా భావించాలి. బ్రాంచ్ ఎంపికలో తమ ఆసక్తి, అభిరుచితోపాటు భవిష్యత్ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వందల సంఖ్యలో కాలేజీలు, పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి అభ్యర్థులు బ్రాంచ్‌ను ఎంచుకునే ముందు సదరు బ్రాంచ్‌లో చదవాల్సిన సబ్జెక్టులు, సిలబస్, కరిక్యులం స్వరూపాన్ని పరిశీలించాలి. ఈ సిలబస్ తమ సహజ ఆసక్తికి అనుగుణంగా ఉందో లేదో స్వీయ విశ్లేషణ చేసుకోవాలి.

మెచ్చిన బ్రాంచ్ రాకుంటే

ఈఏపీసెట్‌లో తమ ర్యాంకుకు మెచ్చిన బ్రాంచ్‌లో సీటు వచ్చే అవకాశం లేకుంటే.. అనుబంధంగా ఉండే ఇంటర్ డిసిప్లినరీ బ్రాంచ్‌లవైపు దృష్టిసారించాలి. వాటి ద్వారా లభించే అవకాశాల గురించి తెలుసుకోవాలి. తద్వారా సదరు బ్రాంచ్‌లో రాణించేందుకు మానసికంగా సంసిద్ధత పొందాలి. అంతే కాని నిరుత్సాహానికి గురి కాకూడదు. ఉదాహరణకు సీఎస్‌ఈలో సీటు రాకుంటే.. ఏఐ అండ్ ఎంఎల్ తదితర కంప్యూటర్ సైన్స్ అనుబంధ బ్రాంచ్‌ల కరిక్యులంను పరిశీలించాలి.

కాలేజ్ ఎంపిక

బ్రాంచ్ ఎంపికలో స్పష్టత వచ్చిన విద్యార్థులు కాలేజ్ ఎంపికపై దృష్టిపెట్టాలి. కాలేజ్ ఎంపికలో.. సదరు కాలేజీకి ఉన్న పేరు, మౌలిక వసతులు, ఫ్యాకల్టీ అర్హతలు, ప్లేస్‌మెంట్స్, లొకేషన్, ఫీజులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

ఏఐసీటీఈ నిబంధనలు

కాలేజ్ ఎంపికలో ఫ్యాకల్టీ నుంచి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వరకూ.. అన్నీ నిబంధనల మేరకు ఉన్నాయా? లేదా? గుర్తించాలి. ఈ సమాచారం ఏఐసీటీఈ వెబ్‌సైట్‌లో లభిస్తుంది. ఒకవేళ అందులో సమాచారం లేకపోతే ప్రత్యక్షంగా కళాశాలలను సందర్శించి సదరు సమాచారం తెలుసుకోవాలి. తాము ఆసక్తి చూపిన బ్రాంచ్‌కు సదరు కాలేజీలో ఎన్‌బీఏ అక్రెడిటేషన్ ఉందో లేదో చూడాలి. ఎన్‌బీఏ గుర్తింపు బ్రాంచ్‌లా వారీగా ఉంటుంది. కొన్ని కళాశాలలు ఒకట్రెండు బ్రాంచ్‌లకే ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నా.. ఎన్‌బీఏ అక్రెడిటెడ్ అని ప్రకటనలిస్తున్నాయి. ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ల్యాబ్స్, లైబ్రరీ, లెర్నింగ్ రిసోర్సెస్ అన్నీ నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అనేది పరిశీలించాలి.

కాలేజ్‌కు ఉన్న పేరు

కాలేజీకి పరిశ్రమలో ఎలాంటి గుర్తింపు ఉందో తెలుసుకోవాలి. ఈ కాలేజీ అల్యుమ్నీ(పూర్వ విద్యార్థులు) నెట్‌వర్క్‌ను పరిశీలించాలి. సదరు కాలేజ్‌లో గత ఏడాది సీట్ల భర్తీలో ఓపెనింగ్-క్లోజింగ్ ర్యాంకుల వివరాలు విశ్లేషించాలి. టాప్ ర్యాంకర్లు చేరితే ఆయా కళాశాలకు విద్యార్థుల ఆదరణ ఉందని భావించొచ్చు. కళాశాలలు తమ పనితీరు ఆధారంగా విద్యార్థులను ఆకర్షిస్తున్నాయని చెప్పొచ్చు.

బోధన విధానం

ఒక కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ.. టీచింగ్ విధానంలో లోపాలు ఉండొచ్చు. కాబట్టి బోధన విధానం, ప్రాక్టికల్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, అందులో విద్యార్థులను మమేకం చేస్తున్న తీరుతెన్నులపై సునిశిత పరిశీలన చేయాలి. కొన్ని కళాశాలలు ఏఐసీటీఈ నిబంధనల మేరకు తమ కళాశాలలో పీహెచ్‌డీ ఫ్యాకల్టీ సైతం ఉన్నారని ప్రకటనలిస్తుంటాయి. కాబట్టి ఫ్యాకల్టీ అర్హతలు, వారి పరిశోధనలు, పరిశ్రమలో వీరి అనుభవం, బోధన అనుభవం గురించి తెలుసుకోవాలి.

ప్లేస్‌మెంట్స్

నాలుగేళ్ల బీటెక్ కోర్సు అనంతరం ప్రతి విద్యార్థి ప్రధాన లక్ష్యం.. చదువుకు తగ్గ ఉద్యోగం దక్కించుకోవడం! కాబట్టి కాలేజీని ఎంపిక చేసుకునేటప్పుడు ఆయా కళాశాలలో గత నాలుగేళ్ల ప్లేస్‌మెంట్ రికార్డ్స్ ఎలా ఉన్నాయి.. ఎలాంటి కంపెనీలు వస్తున్నాయి.. వచ్చిన కంపెనీలు ఎలాంటి ఉద్యోగాలు ఇస్తున్నాయో గమనించాలి. కొన్ని కళాశాలలు ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయని కలర్‌ఫుల్ బ్రోచర్లతో ఆకట్టుకునే యత్నం చేస్తున్నాయి. ఇలా వచ్చిన ప్రతిష్టాత్మక కంపెనీల్లో కోర్ ప్రొఫైల్స్‌లో ఎంతమందికి అవకాశాలు ఇచ్చాయనే విషయాన్ని అడిగి తెలుసుకోవాలి. ఎందుకంటే..ప్రతిష్టాత్మక కంపెనీలు సైతం ఇటీవల కాలంలో బీపీఓ, వాయిస్, నాన్-వాయిస్ ప్రొఫైల్స్‌లో ఆఫర్స్ ఇస్తున్నాయి. అదేవిధంగా ఎంపికైన అభ్యర్థులకు కంపెనీలు ఆఫర్ చేస్తున్న సగటు వేతన ప్యాకేజీల గురించి కూడా తెలుసుకోవాలి.

నచ్చిన కాలేజ్ రాకుంటే

ఎక్కువ మంది విద్యార్థులకు తాము కోరుకున్న కళాశాలలో సీటు రాని పరిస్థితి ఎదురవుతోంది. ఈ విషయంలోనూ ముందుగానే సంసిద్ధంగా ఉండాలి. తప్పనిసరి పరిస్థితిలో తమకు ఇష్టం లేని కాలేజ్‌లో చేరాల్సిన పరిస్థితి వస్తే.. ఆ నిరుత్సాహాన్ని కొనసాగనీయకుండా అకడమిక్‌గా రాణించేందుకు కృషి చేయాలి. ఫ్యాకల్టీ లేరనో లేదా సదుపాయాలు లేవనో అభ్యసనాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. సెల్ఫ్ లెర్నింగ్ టూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇప్పుడు ఇంటర్నెట్ ఆధారంగా ఎంతో విలువైన సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఈ-లెర్నింగ్ పోర్టల్స్ ఉన్నాయి. ఆన్‌లైన్ లెక్చర్స్, వర్చువల్ క్లాస్‌రూమ్స్, వర్చువల్ లేబొరేటరీ వంటి సదుపాయాలు సైతం లభిస్తున్నాయి.వీటిని సద్వినియోగం చేసుకుని తమను తాము తీర్చిదిద్దుకోవాలి.



సుదీర్ఘ నిరీక్షణ.. ఫలించిన వేళ

కారుణ్య నియామకం కింద కానిస్టేబుల్ కుమార్తెకు జూనియర్ అసిస్టెంట్ కొలువు

నియామక పత్రాన్ని అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ఓ కుటుంబం కల ఫలించింది. సుదీర్ఘ నిరీక్షణకు తెర దించుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆ కుటుంబంలోని మహిళకు నియామక పత్రాన్ని అందించారు. హోం శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇస్తూ మంగళవారం ఆ మహిళకు ఉత్తర్వులను అందించి ఆ కుటుంబంలో సంతోషం నింపారు. వరంగల్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ బి.భీమ్‌సింగ్ సర్వీస్‌లో ఉండగా సెప్టెంబర్, 1996లో మరణించారు. తండ్రి మరణంతో కారుణ్య నియామకం కోసం ఆయన కూతురు బి.రాజశ్రీ దరఖాస్తు చేసుకున్నారు. కానీ వివిధ కారణాలు చూపుతూ అధికారులు ఆమెకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించారు. రాజశ్రీ అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. రాజశ్రీ సమస్యను తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మానవతా దృక్పథంతో స్పందించిన రేవంత్ రెడ్డి నిబంధనలు సడలించైనా సరే ఉద్యోగం ఇవ్వాలని సీఎంవో అధికారులకు సూచించారు. దీంతో హోంశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. రాజశ్రీ తన కుటుంబంతో కలిసి వచ్చి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.





రాష్ట్రపతి నుంచి పద్మ పురస్కారాలు అందుకుంటున్న మంద కృష్ణ మాదిగ, కృష్ణ, రాఘవేంద్రాచార్య

మంద కృష్ణకు పద్మశ్రీ ప్రదానం

ఘనంగా పద్మ పురస్కారాలు-2025 ప్రదానోత్సవం

సాక్షి, న్యూఢిల్లీ: పద్మ పురస్కారాలు–2025 ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ఆయా రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. వ్యక్తిగత విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం ముగ్గురు పద్మశ్రీలు అందుకున్నారు. తెలంగాణ నుంచి ప్రజా వ్యవహారాల రంగంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, ఏపీ నుంచి సాహిత్యం, విద్యా రంగంలో ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ, వాచస్పతి డాక్టర్ వదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి తదితరులు పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. మంద కృష్ణ అవార్డు అందుకుంటున్న సమయంలో ఆయన కుమార్తె కృష్ణవేణి ఉద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జైశంకర్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మేంద్ర ప్రధాన్, ప్రహ్లాద్ జోషి, భూపేంద్ర యాదవ్ తదితరులు హాజరయ్యారు.

ఆందోళన అక్కర్లేదు



కరోనా కొత్త వేరియెంట్లు అంత ప్రమాదకరం కాదు

సాక్షి, హైదరాబాద్: దేశంలో కరోనా మళ్లీ విస్తరిస్తోంది. సినిమా భాషలో చెప్పాలంటే.. కోవిడ్‌కు సీక్వెల్ వచ్చింది. కరోనా వైరస్ రీ-రిలీజ్ అయ్యింది. గతంలో ఈ వైరస్ హారర్ సినిమాలా భయపెట్టింది. కానీ, తాజా సీక్వెల్ తీవ్రత మాత్రం కాస్త తక్కువే అంటున్నారు డాక్టర్లు. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్ర, తెలంగాణల్లో మరోమారు కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. ఈ కొత్త వైరస్ గురించి సీనియర్ కన్సల్టెంట్ జనరల్ మెడిసిన్ అండ్ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఉదయ్‌లాల్ చెబుతున్న విషయాలివి..

ప్రశ్న: ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న వేరియెంట్ ఏమిటి? దానికి ప్రత్యేకతలు ఏవైనా ఉన్నాయా?

జవాబు: ప్రస్తుతం భారత్‌లో ఎన్.బి.1.8.1, ఎల్.ఎఫ్.07, జె.ఎన్.1 వంటి వేరియెంట్లు ఎక్కువగా వ్యాప్తిలో ఉన్నాయి. ఎన్.బి.1.8.1, ఎల్.ఎఫ్.7 వేరియంట్లను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) జాగ్రత్తగా గమనిస్తూ 'వేరియెంట్స్ అండర్ మానిటరింగ్'గా చెబుతోంది. ఈ వేరియంట్లన్నింటిలోనూ జె.ఎన్.1 చురుగ్గా వ్యాప్తి చెందుతోంది. ఇది బి.ఎ.2.86 నుంచి ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. చురుగ్గా వ్యాప్తిచెందినా దీని తీవ్రత చాలా తక్కువ కావడంతో రోగులు ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం కూడా చాలా తక్కువే. కొందరిలో ఇది వచ్చినట్టు కూడా తెలిసే అవకాశం లేదు. అంతేకాదు.. ఈ వైరస్‌తో వచ్చే జ్వరం, ఇతర దుష్ప్రభావాలు చాలావరకు వాటంతట అవే తగ్గిపోతున్నాయి.

ప్రశ్న: కరోనా వైరస్ తొలిసారి వచ్చినప్పుడు చాలామంది ప్రాణాలకు ముప్పు తెచ్చింది. ఈసారి కూడా తొలిసారి వస్తున్న వేరియంట్లు చురుగ్గా ఉండి ప్రాణాంతకం కావచ్చా?

జవాబు: అలా ఏమీ లేదు. అప్పట్లో కొత్తగా వచ్చిన డెల్టా వేరియంట్లు బాగా చురుగ్గా ఉండటంతో పాటు తీవ్రత కూడా ఎక్కువగా ఉండి చాలా ప్రాణహాని కలిగించాయి. ప్రస్తుతం వస్తున్న వేరియంట్లు.. మరీ ముఖ్యంగా జె.ఎన్.1 వంటివి గతంలోని ఒమిక్రాన్ వైరస్ నుంచి మ్యూటేట్ అయినవే. గతంలో ఒమిక్రాన్ వేరియంట్ వచ్చే నాటికే వైరస్ బాగా బలహీన పడింది. కాబట్టి ఇప్పుడు ఇవి ప్రాణహాని గానీ, ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితినిగానీ తెచ్చి పెట్టక పోవచ్చు. అయితే, లక్షణాల తీవ్రత ఎక్కు వగా ఉంటే బాధితులను వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తరలించాల్సిందే. 60 ఏళ్ల పైబడ్డ వృద్ధులు.. క్రానిక్, అన్ కంట్రోల్డ్ బ్రాంకియల్ ఆస్తమా ఉన్నవారు, డయాబెటిస్ వంటివి ఉండి ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారు మినహా మిగతావారికి ఈ వేరియంట్లు ఏమాత్రం ప్రమాదకరం కాదు. అలాగని నిర్లక్ష్యంగా ఉండటం సరికాదు.

ప్రశ్న: ఇప్పుడు కనిపిస్తున్న వేరియెంట్ల లక్షణాలు ఏమిటి?

జవాబు: లక్షణాలన్నీ గతంలో లాగే ఉంటాయి. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం, డయేరియా వంటి లక్షణాలు కని పిస్తాయి. కాకపోతే ఈసారి లక్ష ణాల్లో కాస్త భిన్నత్వం కనిపిస్తోంది. గతంలో జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం వంటి లక్షణాలు ఎక్కువ. ఇప్పుడూ ఆ లక్షణాలు ఉన్నప్పటికీ డయేరియా (నీళ్ల విరేచనాలు), తీవ్రమైన అలసట (సివియర్ ఫెటీగ్), ఆకలి లేకపోవడం వంటి జీర్ణ సంబంధిత లక్షణాలు కనిపిస్తున్నాయి.

చాలామందిలో లక్షణాలు కూడా కనిపించటంలేదు

అలా అని నిర్లక్ష్యం చేయొద్దు.. జాగ్రత్తలు పాటించాలి

గత లక్షణాలకు అదనంగా ఈసారి డయేరియా, తీవ్ర అలసట

వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి

టీకా బూస్టర్ డోస్ వేసుకోవటం మంచిదే..

సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఉదయ్‌లాల్ సూచన

ప్రశ్న: నివారణకు ఎలాంటి జాగ్రత్తలు అవసరం?

జవాబు: గతంలో పాటించిన జాగ్రత్తలే ఈసారి కూడా పనికి వస్తాయి. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ తప్పనిసరిగా వేసుకోవాలి. చేతులు తరచుగా సబ్బుతో కడుక్కోవాలి. శానిటైజర్స్ ఉపయోగించాలి. భౌతిక దూరాలు పాటించడం మేలు చేస్తుంది. గర్భవతులు బహిరంగ ప్రదేశాలు, గుంపుల్లోకి రాకపోవటం మంచిది. తప్పని పరిస్థితుల్లో రావాల్సి వస్తే మాస్క్ ధరించాలి. మునపటిలాగే బాధి తులతో పాటు మిగతావారు కూడా అన్ని పోషకా లు అందేలా ఆకుకూరలు, కూరగాయలతో పాటు తినేవారైతే మాంసాహారంతో మంచి పోషకా హారం, తగినంత విశ్రాంతి తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోతే వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది.

ప్రశ్న: మునుపటిలాగే అందరూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలా?

జవాబు: అందరూ పరీక్షలు చేయించుకోకపోయినా ఒకవేళ లక్షణాలు కనిపించినవారు మాత్రం వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవడం మంచిది. పరీక్షల్లో ఒకవేళ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయితే డాక్టర్‌ను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వారు సూచించిన లక్షణాలను తగ్గించే మందులు తీసుకోవడం అవసరం. దీనివల్ల ప్రమాదకరమైన పరిస్థితిని నివారించవచ్చు.

ప్రశ్న: ఈసారి మళ్లీ టీకాలు తీసుకోవాలా?

జవాబు: గతంలో టీకా తీసుకుని బూస్టర్ డోస్ కూడా తీసుకున్న వారిపై తాజా వేరియెంట్లు అంతగా ప్రభావం చూపకపోవచ్చు. అయితే, జాగ్ర త్తగా ఉండటం, వృద్ధులు బూస్టర్ డోస్ తీసుకోవడం మంచిదే. దీనివల్ల హాస్పి టల్‌లో చేర్చాల్సిన పరిస్థితి చాలా వరకు తగ్గుతుంది. ప్రస్తుతం ఎమ్– ఆర్ఎన్ఏ వ్యాక్సిన్ వంటివి బాగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. కానీ, మన దేశంలో అవి లేవు. మనకు మామూలు వ్యాక్సిన్స్ బూస్టర్ డోసులే సరిపో తాయి. సాధారణంగా ఒక మోతాదు టీకా ఆరు నెలలకు పైగానే సమర్థంగా పనిచేస్తుంది. కాకపోతే దాని ప్రభావం క్రమంగా తగ్గు తూ ఉంటుంది కాబట్టి బూస్టర్ తీసుకోవడం మంచిదే.

ప్రశ్న: కొత్త చికిత్సలు ఏమైనా అందుబాటులోకి వచ్చాయా?

జవాబు: ఇది వైరస్‌తో వచ్చే సమస్య కావడం వల్ల దీనికి సాధారణంగా మందులు ఉండవు. కాకపోతే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. ఉదాహరణకు జ్వరం, ఒళ్లునొప్పులకు పారాసిటమాల్ ఇవ్వడం వంటివి. ఇది వైరస్‌తో వచ్చే సమస్య కాబట్టి యాంటీబయాటిక్స్ వంటివి వాడకూడదు. గొంతునొప్పి తగ్గడానికి గోరువెచ్చని నీళ్లలో ఉప్పు వేసి పుక్కిలించాలి. చేతులు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి. శరీరంలో నీరు / ద్రవాల మోతాదులు తగ్గకుండా (డీ–హైడ్రేషన్‌కు గురికాకుండా) ఉండటం కోసం తగినన్ని నీళ్లు తాగాలి. ద్రవాహారం తీసుకోవాలి. రిస్క్ ఎక్కువ ఉన్నవారు పల్స్ ఆక్సీమీటర్‌తో చెక్ చేసుకుంటూ ఆక్సిజన్ మోతాదులు తగ్గుతున్నట్లు గమనిస్తే బాధితులను వెంటనే హాస్పిటల్‌కు తరలించాలి.

పాఠం వింటేనే డ్రైవింగ్ లైసెన్స్..

వినూత్న ప్రక్రియకు రవాణా శాఖ శ్రీకారం



'సారథి' పోర్టల్ ద్వారా సాకారం

లెర్నింగ్ దశలోనే రహదారి భద్రతపై అవగాహన

10 నిమిషాల పాటు సూచనలు, సలహాలు

ఇప్పటికే సికింద్రాబాద్‌లో.. త్వరలో ఖైరతాబాద్, ఇతర ప్రాంతాలకు విస్తరణ

సాక్షి, హైదరాబాద్: డ్రైవింగ్ లైసెన్స్ కావాలా.. అయితే రహ దారి భద్రతపై పాఠం తప్పనిసరిగా వినాల్సిందే. పది నిమి షాల పాటు ఆడియో క్లాస్ వింటేనే స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే వాహనదారులకు ప్రాథమిక దశలోనే రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ ఈ వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. లెర్నింగ్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకునే వారికి మొదట రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన 'సారథి' సాంకేతిక వ్యవస్థకు అనుగుణంగా ఈ సరికొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. 'సారథి' పోర్టల్ ఇప్పటికే సికింద్రాబాద్ ఆర్టీఏలో వినియోగంలో ఉంది. త్వరలో ఖైరతాబాద్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతీయ రవాణా కేంద్రాలకు 'విస్తరించనున్నారు.

'సారథి' నుంచే స్లాట్

వాహనదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన పౌర సేవలను అందజేసే దిశగా ఆర్టీఏ చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా వాహనాల వివరాలను నమోదు చేసేందుకు 'వాహన్' వెబ్ పోర్టల్‌ను కేంద్రం అమల్లోకి తెచ్చినట్లుగానే దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సుల వివరాలను నమోదు చేసేందుకు హైదరాబాద్ కేంద్రంగా 'సారథి'ని ప్రవేశపెట్టారు. 6 నెలల కాలపరిమితి కలిగిన లెర్నింగ్ లైసెన్స్ కోసం సాధా రణంగా రవాణా శాఖ వెబ్ సైట్‌లో స్లాట్ నమోదు చేసుకోవాలి. కానీ కొత్తగా ప్రవేశపెట్టిన విధానంలో 'సారథి' పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వాహనదారులు లెర్నింగ్ లైసెన్స్ కోసం పోర్టల్‌ను తెరిచిన వెంటనే రోడ్ సేఫ్టీ పాఠం ఆడియో రూపంలో వినిపిస్తుంది. వాహనాలు నడి పేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో చెబు తారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ వంటి రక్షణ ఉపకరణాల ప్రాధాన్యాన్ని వివరిస్తారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల చోటుచేసుకుంటున్న ప్రమాదాల తీవ్రతను తెలియజేస్తారు. ప్రమాదకరమైన మొబైల్ డ్రైవింగ్‌పై ఆన్‌లైన్ ఆడియో పాఠం అప్రమత్తం చేస్తుంది. ఇదంతా పూర్తిగా విన్న తర్వాత మాత్రమే స్లాట్ నమోదవుతుంది. 'కారు, బైక్ వంటి ఏ వాహనాన్ని నడపాలను కున్నా కనీస అవగాహన ఉండాలి. అందుకే ఈ పద్ధతిని అమల్లోకి తెచ్చాం..' అని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిష నర్ రమేశ్ తెలిపారు. లెర్నింగ్ లైసెన్స్ కోసం నిర్వహించే పరీక్షల్లో రోడ్డు, ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారుల అవగాహనను తెలుసుకునే ప్రశ్నలు మాత్రమే ఉంటాయని తెలిపారు. లెర్నింగ్ లైసెన్స్ పొందిన తరువాత 30 రోజుల నుంచి 6 నెలల్లోపు ఎప్పుడైనా శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవచ్చు. ఆ వ్యవధిలో శాస్త్రీయమైన పద్ధతిలో డ్రైవింగ్ నేర్చుకొనేందుకు రవాణాశాఖ అవకాశం కల్పించింది. ఒకవేళ ఆ 6 నెలల కాలపరిమితిలో కూడా నేర్చుకో లేకపోతే మరో సారి లెర్నింగ్ లైసెన్స్ గడువును పెంచుకోవచ్చు. ఇందుకోసం వాహనదారులు ఆర్టీఏకు వెళ్లవలసిన అవసరం లేదు. నేరుగా ఆన్‌లైన్‌లోనే గడువు పొడిగింపును పొందవచ్చు.

లైసెన్స్ బదిలీకి ఎన్‌ఓసీ అవసరం లేదు..

→ సారథి పోర్టల్ ద్వారా మరిన్ని సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రవాణా శాఖ చర్యలు చేపట్టింది. సాధారణంగా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు లేదా, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి డ్రైవింగ్ లైసెన్స్ బదిలీ చేసుకోవాలంటే సదరు కార్యాలయం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకోవాలి. దీని ఆధారంగా కొత్త జిల్లా లేదా రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవచ్చు. కానీ ఇప్పుడు ఎన్‌ఓసీ అవసరం లేదు. సారథిలో దేశంలోని అన్ని డ్రైవింగ్ లైసెన్స్‌ల డేటా మొత్తం నిక్షిప్తమై ఉంటుంది. కాబట్టి వాహనదారులు ఎక్క డైనా లైసెన్సులను తీసుకోవచ్చు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో ఈ సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. రవాణా శాఖ పౌర సేవల్లో మరింత వేగాన్ని, పారదర్శకతను పెంపొందించేందుకు 'వాహన్', 'సారథి' దోహద పడతాయని జేటీసీ వివరించారు.



భారత్.. ప్రపంచాన్ని పోషించగలదు

ఆహారధాన్యాల ఉత్పత్తిలో అద్భుత ప్రగతి

బార్క్ జాతీయ అధ్యక్షుడు ప్రమోద్ చౌదరి

సాక్షి, హైదరాబాద్: తన జనాభాకే కాక ప్రపంచం మొత్తానికి ఆహారాన్ని అందించే స్థాయికి భారతదేశం చేరుకుందని భారతీయ ఆగ్రో ఎకనమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) జాతీయ అధ్యక్షుడు ప్రమోద్ చౌదరి అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలుపై చర్చించేందుకు హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ – నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) మంగళవారం మేధో మథన సదస్సును ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా 45 వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుంచి డీన్లు, డైరెక్టర్లు, రిజిస్ట్రార్లు సహా 75 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నార్మ్ సంయుక్త సంచాలకుడు డాక్టర్ గోపాల్‌లాల్ సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. ఢిల్లీలోని ఐసీఏఆర్ వ్యవసాయ విద్యా విభాగం సహకారంతో బుధవారం వరకు జరిగే ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రమోద్ చౌదరి మాట్లాడుతూ.. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారత్ అగ్రగామిగా ఉందని తెలిపారు. ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ హోం సైన్స్) డాక్టర్ బిమ్లేష్ మాన్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యవసాయ వర్సిటీల్లో పరిశోధనలకు విదేశీ నిధుల అవసరం ఉందని చెప్పారు. బార్క్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే దూబే మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం అమలులో అనేక సవాళ్లు ఎదురవుతున్నా యని, వాటిని అధిగమించేందుకు విజ్ఞులైన ప్రతినిధుల సలహాలు కీలకమని పేర్కొన్నారు. బార్క్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మకరంద్ కర్కరే మాట్లాడుతూ.. విద్యకు విలువల పునాది ఉండాలని, అది బాధ్యతతో కూడిన పౌరులను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. స్థిరమైన వ్యవసాయం అంటే ప్రకృతి వ్యవసాయమేనని, రైతు స్థితిగతులు మారితేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కె. సాయిరెడ్డి తెలిపారు. ఈ సదస్సులో ఐసీఏఆర్ వ్యవసాయ విద్య విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.సి అగర్వాల్, డాక్టర్ సెంథిల్ వినాయగం తదితరులు ప్రసంగించారు.

కోర్కెలు తీర్చే 'ముళ్లకంప'

తిమ్మానాయుడుపేటలో వైభవంగా తిరునాళ్లు



ముళ్లకంపపై దొర్లుతున్న భక్తుడు

మర్రిపాడు: ముళ్లకంపపై కాలు పెట్టాలంటేనే భయపడతాం. కానీ ఏకంగా వాటిపై దొర్లుతూ తమ భక్తిని చాటుకునే తిరునాళ్ల శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం తిమ్మానాయుడుపేట గ్రామంలో జరుగుతోంది. ఆ గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి ముళ్లకంప తిరునాళ్లు నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా సమీప వైఎస్సార్ జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం మూడు రోజులపాటు ఉంటుంది. చివరి రోజు మంగళవారం పెద్దసంఖ్యలో ప్రజలు కుటుంబసభ్యులతో గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యంగా పొంగళ్లు సమర్పించారు. ఈ క్రమంలో భక్తులు ఉపవాసం ఉండి ముళ్లకంపపై దొర్లాడారు. ఇలా చేస్తే గ్రామ దేవత అనుగ్రహించి తమ కోర్కెలు నెరవేరతాయని వారి నమ్మకం. ఈ విచిత్రమైన తిరునాళ్లను చూసేందుకు వేలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఏసీబీకి నకిలీల బెడద..

అప్రమత్తంగా ఉండాలని సూచన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను నకిలీల బెడద వేధిస్తోంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు ఏసీబీ అధికారుల పేరిట ఫోన్‌కాల్స్ చేసి బెదిరిస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. డబ్బులు ఇస్తే కేసులు నమోదు చేయమని కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్‌కాల్స్ చేసి బెదిరిస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చినట్టు ఏసీబీ డీజీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఖమ్మం జిల్లా టేకులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో ఒక ఘటనపై కేసు నమోదైనట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులెవరూ ఇలాంటి ఫోన్‌కాల్స్‌ను నమ్మి నకిలీ వ్యక్తులకు డబ్బులు చెల్లించవద్దని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ సూచించారు. ఎవరికైనా ఏసీబీ అధికారుల పేరిట ఇలాంటి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064లో సంప్రదించాలని, లేదంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఏసీబీ వాట్సాప్ (9440446106) లేదా సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్ (TelanganaACB), ఎక్స్ (@TelanaganaACB) లోనూ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

హెచ్‌సీఏ ఒత్తిడి నిజమే

ఐపీఎల్ టికెట్ల వివాదంపై విజిలెన్స్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల పంపిణీ విషయంలో ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మధ్య తలెత్తిన వివాదంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ తుది దశకు చేరుకుంది. పదిశాతం అదనపు టికెట్ల కోసం హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతోపాటు ఇబ్బందులకు గురిచేసినట్టు విజిలెన్స్ ప్రభుత్వానికి సమర్పించిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. ఉప్పల్ స్టేడియంలో గత మార్చిలో లక్నో, సన్‌రైజర్స్ మ్యాచ్ సందర్భంగా ఈ వివాదం తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం పదిశాతం టికెట్లు హెచ్‌సీఏకు ఉచితంగా ఇస్తున్నా... మరో పది శాతం టికెట్లు తమకు ఇవ్వాలని హెచ్‌సీఏ ఒత్తిడి తెచ్చినట్టు ఎస్ఆర్‌హెచ్ ఆరోపించింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు బెదిరింపులకు సంబంధించి ఆధారాలు.. ఇలా అనేక కోణాల్లో విజిలెన్స్ అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టారు. త్వరలో తుది నివేదికను ఇవ్వనున్నట్టు సమాచారం.

పన్ను ఎగవేతపై పక్కాగా విశ్లేషణ

అయకార్ భవన్‌లో 'డయల్'ల్యాబ్ ఏర్పాటుచేసిన సీబీడీటీ

సీజ్ చేసిన పెన్‌డ్రైవ్స్, హార్డ్‌డిస్క్‌ల విశ్లేషణలో కీలకం

ఢిల్లీ, ముంబై తర్వాత హైదరాబాద్‌లోనే ఈ సౌకర్యం

సాక్షి, హైదరాబాద్: కంపెనీల జమాఖర్చులు, లెక్కలు ఒకప్పుడు పుస్తకాల్లో ఉండేవి. ఆదా యపు పన్ను శాఖ (ఐటీ) అధికారులకు అనుమా నం వస్తే వాటిని స్వాధీనం చేసుకుని సరిచూసే వాళ్లు. ప్రస్తుతం అన్నీ కంప్యూటర్లు, ల్యాప్‌టా ప్‌లు, పెన్‌డ్రైవ్స్, హార్డ్‌డిస్క్‌ల్లోకి మారిపోయా యి. పన్ను ఎగవేత కేసుల దర్యాప్తులో కీలకమైన వీటిని పరిరక్షించడం, విశ్లేషించడానికి డిజిటల్ ల్యాబ్స్ అవసరం. కానీ, కొన్నాళ్ల క్రితం వరకు ఈ ల్యాబ్స్ ఢిల్లీ, ముంబైలో మాత్రమే ఉండేవి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ (సీబీడీటీ) హైదరాబాద్‌లోనూ ఇటీవల డిజిటల్ ఇంటెలిజెన్స్ అండ్ ఎనలటిక్స్ ల్యాబ్ (డీఐఏఎల్)ను ఏర్పాటు చేసింది. బషీర్‌బాగ్‌లోని అయకార్ భవన్‌లో ఇది పని చేస్తోంది. సీబీడీటీ అమలులోకి తెచ్చిన నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ పాలసీ-2024 అమలులో భాగంగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

పన్నుల విశ్లేషణలో కీలకం: కంపెనీలు, వ్యక్తులకు చెందిన ఈ–మెయిల్స్, ఆన్‌లైన్‌లో ఉన్న ఆర్థిక లావాదేవీల రికార్డులు, ఇతర డిజిటల్ కార్యకలాపాలను విశ్లేషించి, దర్యాప్తు చేయడానికి ఈ డయల్ ఉపకరిస్తోంది. ఆదాయపు పన్ను ఎగవేత, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల్ని ఐటీ అధికారులు దర్యాప్తు చేస్తుంటారు. ఇందులో భాగంగా సంస్థలు, వ్యక్తుల స్థిరచరాస్తులకు సంబంధించిన క్రయవిక్రయాల వివరాలతో పాటు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, జీఎస్టీ, బ్యాంకు ఖాతాలు తదితర లావా దేవీలు, రికార్డులను సేకరించి విశ్లేషించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఆయా వ్యక్తుల సోషల్ మీడియా పోస్టులను కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ద్వారా విదేశీ పర్యటనలు, భారీ ఖర్చులతో ఆడంబరంగా జరిగిన వివాహాలు, విలాసవంతమైన ఇళ్లు, జీవ శైలిలకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉంటుంది. వీటన్నింటినీ బేరీజు వేస్తూ ఆయా వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన ఐటీ రిటర్న్‌లు, అడ్వాన్స్ ట్యాక్స్ తదితరాలను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేయాలి. డిజిటల్ ఫార్మాట్‌లో ఉండే ఈ రికార్డులను డయల్‌లో పొందుపరిస్తే చాలు.. పక్కా విశ్లేషణలను అధికారులకు అందిస్తుంది. దశలవారీగా విశ్లేషించి నివేదికలు ఇవ్వడంతో పాటు ఆయా డేటాను అత్యంత భద్రంగా దాచే సాంకేతికత డయల్‌లో ఉందని అధికారులు చెప్తు న్నారు. దర్యాప్తు అధికారులు సైతం తమ కంప్యూటర్ల ద్వారానే ఈ డేటా మొత్తాన్ని చూసుకునే అవకాశం ఉంది. దాడుల సమయంలో అధికా రులు స్వాధీనం చేసుకున్న డిజిటల్ డేటాను ఈ ల్యాబ్ భద్రపరుస్తుంది. ఈ డేటాను ట్యాంపర్ చేయడానికి, అనధికారికంగా యాక్సెస్ చేయడా నికి ఆస్కారం ఉండదు. హైదరాబాద్ ల్యాబ్‌కు అనుబంధంగా విజయ వాడ, విశాఖపట్నంలో అక్కడి అవసరాలకు తగ్గట్టు తక్కువ సామర్థ్యంతో ల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి సీబీడీటీ సన్నాహాలు చేస్తున్నట్లు ఆదాయపు పన్ను శాఖ అధికారులు తెలిపారు.

ఐఆర్‌సీటీసీ ఆధ్యాత్మిక పర్యటనలు

జూన్ 14 నుంచి జూలై 13 వరకు ప్రత్యేక పర్యాటక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ఆధ్యాత్మిక పర్యటనలకు వెళ్లే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 14 నుంచి జూలై 13 వరకు ప్రత్యేక పర్యాటక రైళ్లను నడపనుంది. ఈ మేరకు గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్‌రాజ్, శృంగవర్‌పూర్, తదితర ప్రాంతాలను సందర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14న ప్రారంభమై 22వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ స్లీపర్ టికెట్ ధర రూ.16,200, థర్డ్ ఏసీ రూ.26,500, సెకండ్ ఏసీ రూ.35,000 చొప్పున ఉంటుందని ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, మధిర, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, తుని, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువ నేశ్వర్ మీదుగా వెళ్తుంది. అలాగే 5 జ్యోతిర్లింగ యాత్రలో భాగంగా మహాకాళే శ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్‌పూర్, తదితర ప్రాంతాలను సందర్శించవచ్చు. ఈ యాత్ర జూలై 5న ప్రారంభమై 13వ తేదీ వరకు కొనసాగనుంది. దీనికి ఒక్కొక్కరికి స్లీపర్ టికెట్ ధర రూ.14,700, థర్డ్ ఏసీ రూ.22,900, సెకండ్ ఏసీ రూ.29,900 చొప్పున ఉంటుంది. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామా బాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్ఖడ్, పూర్ణ మీదుగా బయల్దేరనుంది. ప్రయాణికులకు ఈ చార్జీల్లోనే రైలు ప్రయాణంతో పాటు రోడ్డు రవాణా, హోటల్ వసతి, భోజనం, టూర్ ఎస్కార్ట్, ప్రయాణ బీమా, తదితర అన్ని సదు పాయాలు ఉంటాయి. ప్రతి ట్రైన్‌లో 718 మంది ప్రయాణికులుంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు సమన్వయకర్తలు అందుబాటులో ఉంటారు. ప్రతి బోగీకి సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు. ట్రైన్‌లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని అధికారులు వెల్లడించారు. టికెట్ బుకింగ్, ఇతర వివరాల కోసం 9701360701, 9281030712 ఫోన్ నంబర్‌లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

అంజన్న కొండ.. భక్తులకు అండ..



కొండగట్టు ఆలయ సింహద్వారం

వాహన పూజలకు ప్రత్యేకంగా నిలుస్తున్న కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం

సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు వాహన పూజల నిర్వహణ

ఇక్కడ పూజ చేస్తే ఎలాంటి ఆటంకాలు కలగవని నమ్మకం

రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యం ఇస్తున్న భక్తులు

మల్యాల: ఆపదలో అభయాంజనేయస్వామిగా భక్తులకు అండగా నిలుస్తూ, కోరిన కోర్కెలు తీర్చుతున్న జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం రాష్ట్రంలో వాహనాల పూజలకు ప్రత్యేకంగా నిలుస్తోంది. నూతన వాహనాలు కొనుగోలు చేసిన అనంతరం స్వామివారిని దర్శించుకొని, వాహన పూజలు చేయడం ఆనవాయితీగా మారింది. సామాన్యుల నుంచి మొదలుకొని, ప్రముఖుల వరకు కొండగట్టులోనే తమ వాహనాల పూజ చేసేందుకు ప్రాధాన్యం ఇస్తుండటంతో ఏటా వాహన పూజల భక్తుల సంఖ్య పెరుగుతోంది. మల్యాల మండలం ముత్యంపేటలోని శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు నిత్యం వేలాదిమంది తరలి వస్తుండటంతో నిత్యం కొండగట్టు భక్తులతో కిటకిటలాడుతోంది. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతోపాటు, నూతనంగా వాహనాలు కొనుగోలు చేసిన వాహనదారులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తూ, వాహన పూజలు చేసుకుంటున్నారు.

మంగళ, శనివారాల్లో..

కొండగట్టులో నిత్యం వాహన పూజలతోపాటు ప్రతి మంగళవారం, శనివారాల్లో నూతన వాహనాలకు వాహనదారులు పూజలు చేసుకుంటారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల నుంచి వాహనాల కొనుగోలు అనంతరం స్వామివారిని దర్శించుకొని, వాహన పూజలు చేస్తుంటారు. ప్రతి వాహనానికి ఒక్కసారి అయినా అంజన్న సన్నిధిలో పూజ నిర్వహించాలని ఏటా వేలాదిమంది వాహనదారులు కొండగట్టులో తమ వాహనాలకు పూజలు నిర్వహిస్తున్నారు. కొండగట్టులో ఏటా దసరా పండుగ రోజు వేలాది మంది వాహనదారులు తమ వాహనాలకు పూజలు చేసుకుంటారు.

ఆంజనేయస్వామి అభయహస్తం..

శ్రీరాముడికి వాహనం హనుమంతుడు.. ఎక్కడికి వెళ్లినా తిరుగులేని కార్యాలు సాధించిన ఘనుడు హనుమంతుడు. ఈ నేపథ్యంలో వాహనాలకు ఎటువంటి ఆటంకాలు, ప్రమాదాలు కలుగవని, శుభాలు కలుగుతాయనే విశ్వాసంతో భక్తులు తమ వాహనాలను కొండగట్టులో పూజలు నిర్వహిస్తుంటారు. చొప్పదండి నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన వాహనానికి కూడా కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తన ఎన్నికల ప్రచారం కోసం కొనుగోలు చేసిన వారాహి వాహనానికి కొండగట్టులోనే పూజలు చేయించడం కొండగట్టు ప్రత్యేకతకు అద్దం పడుతోంది.

ఏటా రూ.20 లక్షల ఆదాయం

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో వాహన పూజలు నిర్వహించుకునేందుకు వాహనదారులు ఆసక్తి చూపుతుండటంతో ఏటా వాహన పూజ ఆదాయం పెరుగుతోంది. వాహన పూజల ద్వారా సుమారు రూ.20 లక్షలకుపైగా ఆదాయం సమకూరుతోంది. వాహనదారుల సౌకర్యం కోసం, స్వామివారి ఉచిత గర్భగుడి ప్రవేశం కల్పించి, స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తే, రాష్ట్రవ్యాప్తంగా మరింత మంది వాహనదారులు కొండగట్టులో వాహన పూజలతోపాటు, స్వామివారిని దర్శించుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.



కొండగట్టులో వాహనాలకు పూజలు చేయించుకుంటున్న భక్తులు

వాహనదారులకు అభయం



కొండగట్టు అంజనేయ స్వామి ఆలయంలో నూతన వాహనాలతో పాటు ఏటా ప్రతి దసరా పండుగకు ఉపయోగించే వాహనాలకు కూడా పూజలు నిర్వహిస్తుంటారు. కొండగట్టులో వాహనాలకు పూజలు నిర్వహిస్తే, ఆంజనేయస్వామి అభయం ఇస్తారని, ఎటువంటి ప్రమాదాలు జరుగవని భక్తుల విశ్వాసం. వాహన పూజల కోసం రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చి, తమ వాహనాలకు పూజలు చేసుకుంటున్నారు.

– రామకృష్ణ, కొండగట్టు ఆలయ ప్రధాన అర్చకుడు

స్వామివారి గర్భగుడి దర్శనం కల్పించాలి



కొండగట్టులో వాహన పూజలకు వచ్చే భక్తుల కుటుంబాలకు స్వామివారి గర్భగుడి ప్రవేశం కల్పించాలి. ఏటా వాహనాలకు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తాం. వాహన పూజకు ముందు స్వామివారి దర్శనం కోసం వెళ్లడంతో క్యూ లైన్లలో నిలబడటంతో జాప్యం జరుగుతోంది. వాహనపూజలు చేసుకునే భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని స్వామివారి గర్భగుడి దర్శనం కల్పించాలి.

– కొక్కుల రఘు, మల్యాల

వేగంగా ఆర్టీఏ, పాన్‌కార్డ్ సేవలు

మీసేవ డిజిటల్ కియోస్క్‌లను విస్తరించిన సర్కారు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (ఈఎస్‌డీ) మీసేవ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ డిజిటల్ కియోస్క్‌ల సేవలను విస్తరించింది. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలోని మీసేవ కేంద్రంలో అందుబాటులోకి వచ్చిన కియోస్క్‌ల ద్వారా 11 కొత్త ఆర్టీఏ సేవలను అందించనున్నారు. వాహన, రవాణా సంబంధిత సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా గత ఏడాది డిసెంబర్ 8న ప్రారంభమైన మీసేవ డిజిటల్ కియోస్క్‌లు హైదరాబాద్ ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. ఈ క్రమంలోనే 'ప్రొటీన్ ఈగవ్ టెక్నాలజీస్' సంస్థ ద్వారా కొత్త పాన్‌కార్డ్ సేవలు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి. నేరుగా గానీ, ఈ–పాన్‌కార్డుల కోసం గానీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఐటీశాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు ప్రారంభించిన మీసేవ డిజిటల్ కియోస్క్‌లు హైదరాబాద్ కలెక్టరేట్, ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం సహా ఐదు కీలక ప్రదేశాల్లో పనిచేస్తున్నాయి. జీహెచ్ఎంసీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నీటి, విద్యుత్ బిల్లు చెల్లింపులు, కమ్యూనిటీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల పునర్ జారీ వంటి 10 సేవలను అందిస్తున్నాయి. ఈ కియోస్క్‌లు గ్రామీణ ప్రాంతాల్లో సైతం సేవలందిస్తున్నాయి.

సర్వేయర్లకు శిక్షణ

తెలంగాణ అకాడమీ ఫర్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (టాలిమ్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో 50 రోజుల లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు మొదటి దశలో 7,003 మందిని, రెండో దశలో 3,028 మందిని ఎంపిక చేశారు. అందుకు 18–44 ఏళ్ల మధ్య వయస్సు ఉండి.. 12వ తరగతి ఎంపీసీలో 60% మార్కులు, ఐటీఐ సర్వేయింగ్ లేదా సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా చేసిన వారు అర్హులు. శిక్షణ రుసుము ఎస్సీ/ఎస్టీలకు రూ.2,500, బీసీలకు రూ.5 వేలు, జనరల్‌కు రూ.10 వేలుగా నిర్ణయించారు.

విపక్ష నేతగా కేసీఆర్ ఫెయిల్

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. ఆయన మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌కు కాళేశ్వరంపై నోటీసులు, కవిత లిక్కర్ కుంభకోణంలో, కేటీఆర్ ఫార్ములా ఈ కేసులో ఉన్నారన్నారు. విచారణ తరువాత తరువాత కడిగిన ముత్యాల్లా బయటకు వస్తామంటూ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవితలు మీడియా ముందుకు వస్తున్నారన్నారు. ఇది తమను తాము విముక్తులుగా చిత్రించుకునే ప్రయత్నమేనని ఎద్దేవా చేశారు. నిజంగా అవినీతి చేయలేదని నిరూపించుకోవాలంటే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రధాన ప్రతిపక్ష హోదాలకు వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత పంపుసెట్లు, సౌర పంపులు, ఆయుష్మాన్ భారత్, వ్యవసాయ సంబంధిత పథకాలు, ఎంఎస్ఎంఈ సబ్సిడీలు వంటి అనేక రంగాల్లో కేంద్రం సహాయం అందిస్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాల అమలుకు అడ్డుపడుతోందని ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి మార్గంలో సాగాలంటే.. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారీ కేంద్రంపై విమర్శలు చేస్తూ.. కాలయాపన చేస్తూ వచ్చారని ప్రభాకర్ ఆరోపించారు.

బదిలీకి సిఫార్సు చేసిన న్యాయమూర్తులు వీరే..

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని వివిధ హైకోర్టులకు సంబంధించి 21 మంది న్యాయమూర్తుల బదిలీకి రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టు జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, 21 మంది హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేయాలని సీజేఐ నేతృత్వంలోని కొలీజియం ప్రతిపాదించింది.

తెలంగాణ హైకోర్టు నుంచి : జస్టిస్ సుజోయ్ పాల్ (మాతృ హైకోర్టు, మధ్యప్రదేశ్) కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు.

పంజాబ్, హరియాణా హైకోర్టు నుంచి : జస్టిస్ సంజీవ్ ప్రకాష్ శర్మ (మాతృ హైకోర్టు, రాజస్తాన్) రాజస్తాన్ హైకోర్టుకు, జస్టిస్ సుధీర్ సింగ్ (మాతృ హైకోర్టు, పాట్నా) పాట్నా హైకోర్టుకు , జస్టిస్ అనిల్ క్షేత్రపాల్ ఢిల్లీ హైకోర్టుకు బదిలీ

రాజస్తాన్ హైకోర్టు నుంచి: జస్టిస్ అరుణ్ కుమార్ మోంగా (మాతృ హైకోర్టు పీఅండ్‌హెచ్) ఢిల్లీ హైకోర్టుకు, జస్టిస్ చంద్రశేఖర్ (మాతృ హైకోర్టు జార్ఖండ్) బాంబే హైకోర్టుకు బదిలీ

గౌహతి హైకోర్టు నుంచి: జస్టిస్ లనుసుంగ్కుమ్ను జమీర్ కలకత్తా హైకోర్టుకు, జస్టిస్ మనాష్ రంజన్ పాఠక్ ఒరిస్సా హైకోర్టుకు, జస్టిస్ సుమన్ శ్యామ్ బాంబే హైకోర్టుకు బదిలీ

కర్ణాటక హైకోర్టు నుంచి: జస్టిస్ వి.కామేశ్వర్ రావు ఢిల్లీ హైకోర్టుకు, జస్టిస్ సి.సుమలత (మాతృ హైకోర్టు, తెలంగాణ) తెలంగాణ హైకోర్టుకు, జస్టిస్ లలిత కన్నెగంటి (మాతృ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్) తెలంగాణ హైకోర్టుకు బదిలీ

అలహాబాద్ హైకోర్టు నుంచి: జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రా పంజాబ్, హరియాణా హైకోర్టుకు, జస్టిస్ వివేక్ చౌదరి ఢిల్లీ హైకోర్టుకు, జస్టిస్ ఓం ప్రకాష్ శుక్లా ఢిల్లీ హైకోర్టుకు, జస్టిస్ జయంత్ బెనర్జీ కర్ణాటక హైకోర్టుకు బదిలీ

మద్రాస్ హైకోర్టు నుంచి: జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ (మాతృ హైకోర్టు, అలహాబాద్) మధ్యప్రదేశ్ హైకోర్టుకు, జస్టిస్ బట్టు దేవానంద్ (మాతృ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్) ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ

పాట్నా హైకోర్టు నుంచి: జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్ రెడ్డి (మాతృ హైకోర్టు, తెలంగాణ) తెలంగాణ హైకోర్టుకు బదిలీ

బాంబే హైకోర్టు నుంచి : జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే ఢిల్లీ హైకోర్టుకు బదిలీ

కేరళ హైకోర్టు నుంచి: జస్టిస్ దినేష్ కుమార్ సింగ్ (మాతృ హైకోర్టు, అలహాబాద్) కర్ణాటక హైకోర్టుకు బదిలీ

న్యాయమూర్తుల ప్రొఫైల్స్

తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు జడ్జీలను బదిలీ చేస్తూ కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

జస్టిస్ అభిషేక్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన వారు. శశిరేఖరెడ్డి, పుల్లారెడ్డి దంపతులకు 1967, నవంబర్ 7న జన్మించారు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసి 1990 జూలైలో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా చేరారు. సీనియర్ న్యాయవాదైన ఆయన తండ్రి వద్దే ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ ట్రిబ్యునళ్లు, ఫోరమ్‌లతోపాటు జిల్లా కోర్టులు, హైకోర్టులో వాదనలు వినిపించారు. ప్రధానంగా రాజ్యాంగం, మధ్యవర్తిత్వం, పరిపాలన, సివిల్, కుటుంబం, రెవెన్యూ, భూసేకరణ, వివిధ శాఖలకు సంబంధించిన కేసుల్లో ప్రాక్టీస్ చేశారు. 1993లో వాషింగ్టన్ డీసీలోని అమెరికన్ విశ్వవిద్యాలయంలోని వాషింగ్టన్ కాలేజ్ ఆఫ్ లా నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2004లో ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ (నిషేధం) చట్టం కింద ప్రత్యేక కోర్టులో ప్రభుత్వ ప్లీడర్–కమ్–పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఏపీ, తెలంగాణ హైకోర్టుల్లో వివిధ ప్రభుత్వ విభాగాల తరఫున వాదనలు వినిపించారు. 2019, ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2023, మే 15న పట్నా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

జస్టిస్ కన్నెగంటి లలిత...

గుంటూరు జిల్లా బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెంకు చెందిన వారు. అమరేశ్వరి, అంకమ్మ చౌదరి తల్లిదండ్రులు. హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి కళాశాల నుంచి లా డిగ్రీని పొందారు. 1994, డిసెంబర్ 28న ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకున్నారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ, పన్నుల, సర్వీస్, నాన్–సర్వీస్, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్‌లు, మ్యాట్రిమోనియల్ కేసులతో సహా అన్ని రంగాల్లో ప్రాక్టీస్ చేశారు. పలు ప్రభుత్వ విభాగాలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వహించారు. కె.విజయ్ ప్రసాద్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు గౌతమ్, కుమార్తె మానస ఉన్నారు. 2020, మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. తర్వాత తెలంగాణకు బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా 2021, నవంబర్ 15న బాధ్యతలు స్వీకరించారు. 2023, జూలై 28న కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు.

జస్టిస్ చిల్లకూర్ సుమలత

నెల్లూరుకు చెందిన లక్ష్మీప్రసన్న, వెంకట సుబ్బయ్య దంపతులకు పెద్ద కుమార్తె. ఎల్ఎల్‌బీలో బంగారు పతకం సాధించారు. పదేళ్లపాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. జ్యుడీషియల్ ఆఫీసర్‌గా పనిచేయాలనే లక్ష్యంతో 2007లో జిల్లా న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. కర్నూలు, గుంటూరులో ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తిగా, హైదరాబాద్‌లో జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా, హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో చీఫ్ జడ్జిగా పనిచేశారు. రాజ్యాంగ చట్టంలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. 'భారత్‌లో వేగవంతమైన న్యాయం హక్కు' అనే అంశంపై పరిశోధన చేసి.. న్యాయశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా 2021, అక్టోబర్ 15న బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2023, నవంబర్ 23న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

యుద్ధభయం, జన సమ్మర్దానికి దూరంగా..

తమిళనాడు కొడైకెనాల్‌లో పచ్చని కొండల ఒడిలో లక్స్‌గ్లాంప్ రిసార్ట్స్

సేదదీరేందుకు స్విమ్మింగ్‌పూల్, ఆవిరిస్నానాల పెట్టె, ఆరుబయట షవర్

కేరళలోని త్రిస్సూర్‌కు చెందిన ఆంటోనీ థామస్ అద్భుత ఐడియా

హైదరాబాద్ నుంచి మొదలైన విహారయాత్రలు





పచ్చని కొండల్లో పరవశం.. లక్స్‌గ్లాంప్!

సాక్షి, హైదరాబాద్: దైనందిన జీవితంలోని వేగం, ఒత్తిడి, కాలుష్యం వగైరాలకు దూరంగా వెళ్లి ఓ నాలుగు రోజులు సేదతీరి రావాలని ఎవరికి ఉండదు? కానీ ఆ డెస్టినేషన్‌ను ఎలా ఎంచుకోవడం? మానసిక ప్రశాంతతే కాదు బడ్జెట్ ఫ్రెండ్లీ కూడా ముఖ్యమే కదా!

ఆ రెండింటికీ గమ్యం పూంబారై!

హిమాలయాల సరిహద్దుల్లోని హిల్స్‌స్టేషన్లలో యుద్ధభయం ఇంకా వీడకపోగా, దక్షిణాన ఉన్న నీలగిరితో పాటు ఇతర అన్ని హిల్ స్టేషన్స్ జనాలతో కిటకిటలాడుతూ పట్టణ, నగర వాతావరణాన్ని తలపిస్తున్నాయి. అందుకే సిమ్లా, కులూ, మనాలి నుంచి ఊటీ, కొడైకెనాల్ వరకు దేన్ని చూసినా అమ్మో.. వాటికన్నా ఇల్లే నయమనిపించేలా చేస్తున్నాయి. కానీ పూంబారై అలా కాదు. కొడైకెనాల్‌కి 25 కిలోమీటర్ల పైన పచ్చటి కొండల ఒడిలో.. జలజల పారే జలపాతాల మధ్య.. మూడు కాలాలకూ సూటయ్యే ఆహ్లాదకరమైన వాతావరణంలో కొలువుదీరి ఉందీ ఊరు! మిగిలిన హిల్ స్టేషన్లలో ఉన్నట్లు కిక్కిరిసిన హోటళ్లు.. జన సందోహంతో నిండిన రిసార్ట్స్ లేవు. ప్రకృతి వీక్షణ, ఆస్వాదనకు వీలుగా కొండవాళ్లలో ప్రైవసీ ప్రాధాన్యంగా డోమ్స్ నిర్మాణాలుంటాయి. ఇంత దూరం వచ్చి మళ్లీ సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్‌లో మునిగిపోకుండా ఉండటానికి డిజిటల్ డిటాక్సిఫికేషన్‌ను దృష్టిలో పెట్టుకుని వైఫై కనెక్టివిటీ ఇవ్వలేదు ఈ డోమ్స్‌కి. శారీరక, మానసిక రిలాక్సేషన్ కోసం జకూజీ, స్విమ్మింగ్ పూల్, ఆవిరి స్నానాల పెట్టె, ఆరుబయట షవర్ వంటి సౌకర్యాలన్నింటితో క్యాంపింగ్ తరహా బసలివి. అదే లక్స్‌గ్లాంప్ ఎకో రిసార్ట్స్! దీంతో ఇప్పుడు హైదరాబాద్ నుంచి పర్యాటకులు పూంబారై బాట పడుతున్నారు. ఈ రిసార్ట్స్ నిర్మాణానికి పూర్వం పూంబారైలో సరైన రోడ్లు, రవాణా సదుపాయాలు అంతగా ఉండేవి కావు. వీటి నిర్మాణంతో చక్కటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ అయింది. అంతేకాదు స్థానిక యువత, మహిళలకు ఈ రిసార్ట్స్ ఉపాధినీ కల్పిస్తున్నాయి. స్థానికంగా పండే పంటలు, కూరగాయలను ఇక్కడి రెస్టారెంట్స్ కొనుగోలు చేస్తున్నాయి. మూడుకాలాలు పూర్తి ఆక్యుపెన్సీతో ఉండే ఈ రిసార్ట్స్ వల్ల స్థానిక యువత నుంచి రైతుల వరకు అందరికీ ఏదోరకంగా ఉపాధి అందుతోంది. అంతేకాదు దీనివల్ల రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో స్థానికుల చదువు, వ్యాపార వాణిజ్యాలూ ఏ ఆటంకం లేకుండా సాగుతున్నాయి. దీంతో పూంబారై ఆర్థిక చిత్రం మారిపోయింది.

లగ్జరీ, క్యాంపింగ్ కలిసేలా.. లక్స్‌గ్లాంప్

ఈ డోమ్ తరహా రిసార్ట్స్‌ను ఇదే లక్స్‌గ్లాంప్ సంస్థ మున్నార్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మంచి ఫలితాలను ఇవ్వడంతో పూంబారైలోనూ నిర్మించింది. ఆ సంస్థ యజమాని కేరళ త్రిస్సూర్‌కు చెందిన ఆంటోనీ థామస్. బిజినెస్ డెవలపర్. వృత్తి రీత్యా దుబాయ్‌లో ఉంటున్నారు. ఈ రోజుల్లో కాలుష్యం లేని ప్రకృతిలో గడిపే అవకాశం రావడం నిజంగానే లగ్జరీనే. అలాంటి లగ్జరీ.. క్యాంపింగ్ రెండూ కలిసేలా ఈ రిసార్ట్స్‌కి లక్స్‌గ్లాంప్ అని పేరు పెట్టామని చెబుతారాయన. అసలు ఈ ఐడియా ఎలా వచ్చిందని అడిగితే.. 'నాకు చిన్నప్పటి నుంచీ కొత్త ప్రదేశాలకు వెళ్లడం, అక్కడి సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకోవడమంటే చాలా ఇష్టం. నాతో పాటే ఆ ఆసక్తీ పెరుగుతూ వచ్చింది. లక్కీగా మా ఆవిడ ఎలీనా థామస్‌కు పర్యటనలంటే ఇష్టం ఉండటంతో ఏ కాస్త టైమ్ దొరికినా ఇద్దరం ప్రపంచ దేశాలను సందర్శిస్తూంటాం. దీనివల్ల పని ఒత్తిడి నుంచి కాస్తంత ఉపశమనం దొరకడమే కాదు. మా బిజినెస్ డెవలప్‌మెంట్‌కి కొత్త ఐడియాలూ వస్తుంటాయి. అలా ఒకసారి యూరప్ వెళ్లినప్పుడు అక్కడ చాలా చోట్ల గ్లాస్ క్యాబిన్ల నుంచి ఆల్పైన్ లాడ్జెస్, డోమ్స్, బబుల్ రిట్రీట్స్ చాలా కనిపించాయి. వాటిల్లో బస చేశాం. వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియెన్స్ అలాంటిది మన దగ్గర కనిపించలేదు. క్యాంపింగ్‌కి కనీస వసతులు కూడా లేని గుడారాలు మాత్రమే కనిపిస్తుంటాయి. కుటుంబంతో కలిసి క్యాంపింగ్ చేయాలంటే భద్రత, సౌకర్యాలు ప్రధానమవుతాయి కదా! వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుంటే మేము యూరప్‌లో ఎక్స్‌పీరియెన్స్ చేసిన గ్లాస్ క్యాబిన్, డోమ్స్ పర్ఫెక్ట్ అనిపించాయి. వాటిని దక్షిణ భారతంలో ప్రవేశపెట్టాలనుకుని ముందు పైలట్ ప్రాజెక్ట్‌గా 2018లో మున్నార్‌లో స్టార్ట్ చేశాం. పూంబారైలో మా లక్స్‌గ్లాంప్ ఎకో రిసార్ట్స్ ప్రారంభంతోనే ఆ ఊరి ముఖచిత్రమే మారిపోయింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా చాలా వసతులు ఏర్పడి ఈ ఊరికి ఓ కొత్త కళ వచ్చింది. భవిష్యత్‌లో మరిన్ని పర్యాటక ప్రాంతాల్లోనూ ఈ తరహా కట్టడాలతో పర్యాటక ప్రియులకు సౌకర్యవంతమైన, పర్యావరణప్రియ బసను అందించాలనుకుంటున్నాం' అని ఆంటోనీ థామస్ తెలిపారు.


ఏందిరా.. మా అడ్డాకొచ్చావ్


ఏహే.. పిల్లాడ్ని భయపెట్టకు గురూ


అలా.. జాగ్రత్తగా మసులుకో


సరే.. ఇంకేంటి సంగతులు..


ఇక నుంచి మనం ఫ్రెండ్స్‌రా..

-సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం

శ్రమైక జీవనం

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న తల్లిదండ్రులు
- డబ్బు విలువ తెలిసేలా జాగ్రత్తలు
- కుల వృత్తులపై అవగాహన కల్పించేలా చర్యలు
- కష్టం తెలుసుకుని ఉన్నతంగా ఎదిగితే చాలంటున్న పేరెంట్స్

నేటి సమాజంలో యువత పెడదారి పడుతోంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేస్తోంది. విచ్చలవిడిగా దురలవాట్లకు బానిసలుగా మారి భవితను నాశనం చేసుకుంటోంది. తమను చదివించేందుకు తల్లిదండ్రులు పడే కష్టనష్టాలను గుర్తించేందుకు సైతం ఆసక్తి చూపని దుస్థితికి చేరింది. ఈ క్రమంలో సామాన్యులు తమ పిల్లలను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబ అవసరాలను సైతం త్యాగం చేస్తున్నారు. అయితే బిడ్డలను ఉన్నత స్థాయికి చేర్చేందుకు తాము శ్రమించే పరిస్థితులను ప్రత్యక్షంగా పిల్లలకు చూపించకపోవడమే ఇందుకు కారణంగా పలువురు విద్యావంతులు వెల్లడిస్తున్నారు. అహర్నిశలు శ్రమించే తల్లిదండ్రులు తమ ఇక్కట్లపై కడుపున పుట్టిన వారికి అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. పైసా విలువను చిన్ననాటి నుంచే తెలియజేయాలని కోరుతున్నారు. తమ ఫీజులు.. దుస్తులు.. పుస్తకాలు.. ఖర్చులకు డబ్బు ఎలా వస్తోందో వివరించాలని చెబుతున్నారు. ఈ మేరకు పలువురు నిరుపేద తల్లిదండ్రులు ఎందరికో మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. వేసవి సెలవులను తమకు అనుకూలంగా మలచుకుని పిల్లలను తమ వెంట కుల వృత్తులు.. చిరువ్యాపారాలకు తీసుకెళుతున్నారు. బిడ్డలకు బతుకు పాఠం నేర్పేందుకే తమ ప్రయత్నమని స్పష్టం చేస్తున్నారు.

- తిరుపతి సిటీ

పిల్లలకు తెలియాలి



మాది చిత్తూరు జిల్లా పూతలపట్టు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. రోజూ తిరుపతికి వచ్చి తాటిముంజెలు అమ్ముతుంటా. మా అబ్బాయి 8వ తరగతి పూర్తి చేసుకుని 9లోకి వెళుతున్నాడు. వచ్చేనెల పాఠశాల ప్రారంభం అవుతుంది. ఫీజు కట్టాలి.. పుస్తకాలు.. దుస్తులు కొనాలి. ఇందుకోసం నేను ఏం చేస్తున్నానో నా బిడ్డకు తెలియాలి. డబ్బు ఎలా వస్తుంది..అనే విషయం పిల్లలకు తప్పకుండా తెలియాలి. వేసవి సెలవులలో ఇంటి దగ్గర వదిలేస్తే విచ్చలవిడిగా తిరుగుతుంటారు. అందుకే ప్రతి రోజూ నాతోపాటు తీసుకువస్తున్నా. తాటి ముంజెలు అమ్మడంలో నా కష్టాన్ని నేరుగా చూస్తున్నాడు. భవిష్యత్‌లో మానాన్న లాగా కష్టపడకూడదు అనుకోవాలి.. బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలనే కోరిక కలగాలి.

- విద్యార్థి జీవన్ కుమార్‌తో తండ్రి మధు, తాటి ముంజెల వ్యాపారి

కష్టం తెలుసుకోవాలనే..



మా అబ్బాయి ఈ ఏడాది 10వ తరగతి. నేను పండ్ల వ్యాపారం చేస్తుంటా. వచ్చే అరకొర సంపాదనతోనే కుటుంబ పోషణతోపాటు పిల్లలను చదివిస్తున్నా. నేను రూపాయిని ఎలా సంపాదిస్తున్నానో, ఫీజు ఎలా కడుతున్నానో, చేతిఖర్చులకు డబ్బు ఎలా ఇస్తున్నానో పిల్లలకు తెలియాలి. అందుకే ప్రతిరోజు మా అబ్బాయిని వెంట తీసుకుని వస్తున్నా. వేసవి సెలవులలో ఇంటి దగ్గర ఉంటూ సెల్‌ఫోన్ పట్టుకోవడం, స్నేహితులతో తిరగడం తప్ప చేసేదేమీ ఉండదు. దీనికి అడ్డుకట్టవేసి తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలకు ప్రత్యక్షంగా చూపిస్తే వారు కొంత మేర అర్థం చేసుకుంటారనే నమ్మకం ఉంది. మా కష్టాన్ని చూసి బాగా చదువుకుంటాడనే మా ఆశ.

- విద్యార్థి చైతన్యతో తండ్రి టి.భానుప్రకాష్, పండ్ల వ్యాపారి, తిరుపతి

వృత్తి తెలుసుకోవాలి



మా అబ్బాయి ఈ ఏడాది 10వ తరగతి పాస్ అయ్యాడు. ఇంటర్‌లో చేర్పిస్తున్నాం. మాది లాండ్రీ షాపు. నేటి పిల్లలు తమ తల్లిదండ్రులు ఎలా సంపాదించి వారిని చదివిస్తున్నారో అర్థం చేసుకోవడం లేదు. కనీసంకులవృత్తిపైనా అవగాహన ఉండడం లేదు. అందుకే వేసవి సెలవుల్లో మా అబ్బాయిని షాపు దగ్గరకు తీసుకువస్తున్నా. మా వృత్తిపై అవగాహన కల్పిస్తున్నా. కష్టాన్ని ప్రత్యక్షంగా చూడడం వల్ల పిల్లలు మరింత కసితో ఉన్నతంగా చదివి మంచి ఉద్యోగం సాధించే అవకాశముంటుంది.

- విద్యార్థి కార్తీక్‌తో తండ్రి నరసింహులు, లాండ్రీ షాపు, తిరుపతి

చేదోడుగా ఉంటాడు



ప్రస్తుతం పిల్లలను చదివించాలంటే రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మాలాంటి సామాన్యులం కుటుంబ అవసరాలతో పాటు పిల్లలను చదివించాలంటే భారంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో తల్లిదండ్రుల కష్టాలను బిడ్డలు తెలుసుకుని బాగా చదువుకుని కుటుంబానికి ఆదరువుగా నిలబడాలి. ఈ విషయంలో మేం కొంత వరకు అదృష్టవంతులమే. మా అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. మేము చిన్న టిఫిన్ అంగడి నడుపుతున్నాం. మా కష్టం అర్థం చేసుకుని సెలవులలో మాకు చేదోడుగా ఉంటాడు. ఊరెమ్మట తిరగకుండా మాకు సహకరిస్తుంటాడు.

- విద్యార్థి చరణ్‌తో తల్లి మాధవి, టిఫిన్ దుకాణం, తిరుపతి

తల్లిదండ్రులను అభినందించాలి



చిన్ననాటి నుంచి పిల్లలకు కష్టం విలువ తెలియజేయాలి. కొందరు ఎంత డబ్బులు అడిగితే అంత చేతికి అందించి పెడదోవ పట్టిస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. రూపాయిని ఎలా సంపాదిస్తున్నారనే విషయాన్ని చిన్ననాటి నుంచే పిల్లలకు ప్రత్యక్షంగా తెలియజేస్తే మంచిది. కొందరు తల్లిదండ్రులు సెలవులలో వారి బిడ్డలను వెంట తీసుకుని బతుకు విలువ నేర్పిస్తున్నారు. వారిని తప్పనిసరిగా అభినందించాలి. వారి పిల్లల జీవితాలను మార్చేందుకు ఇదే తొలిమెట్టుగా చెప్పవచ్చు.

- లక్ష్మీదేవమ్మ, విశ్రాంత ఉపాధ్యాయిని, తిరుపతి

బాధ్యత తప్పనిసరి



ఆధునికత పేరుతో చిన్నపిల్లలు సైతం స్మార్ట్‌ఫోన్లు, బెట్టింగ్ గేమ్స్, చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. పేరెంట్స్‌పై తిరగబడుతున్నారు. చదువును పూర్తిగా విస్మరిస్తున్నారు. ఈ దుస్థితి నుంచి యువతను గట్టెక్కించాలంటే ముందుగా తల్లిదండ్రులకు బాధ్యత తప్పనిసరి. చిన్ననాటి నుంచే కుటుంబ పరిస్థితితోపాటు కష్టం విలువ తెలియజేయాలి. గొప్పలకు పోకుండా బిడ్డలకు పైసా రాకపోకలపై అవగాహన కల్పించాలి.

- మునిరామయ్య, విశ్రాంత ప్రభుత్వోద్యోగి, తిరుపతి

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెనాలిలో దళిత, మైనారిటీ యువకులను బహిరంగంగా, విచక్షణరహితంగా కొట్టిన పోలీసులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎ) రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తికి వినతిపత్రం అందించారు.

50 వేల నీటి కుంటల నిర్మాణం పూర్తి

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల నీటి కుంటల(ఫాం పాండ్) నిర్మాణం పూర్తి చేసినట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 1.55 లక్షల నీటి కుంటల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటికుంటల చుట్టూ వేసిన మట్టి కట్టపై ఆకుకూరలు, కాయగూరలు పండించుకుని అదనపు ఆదాయాన్ని పొందాలని రైతులకు ఆయన సూచించారు.

జూన్ 1 నుంచి మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం

సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి. శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి : జూన్ ఒకటి నుంచి మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యాన్ని పరిచయం చేస్తామని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి. శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు రాష్ట్రస్థాయి శిక్షణ, వంటల పోటీలు గన్నవరం మండలం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సదరన్ క్యాంపస్‌లో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వండి పెట్టడం ఉద్యోగం కాదని, గొప్ప సేవ అని అన్నారు. సమగ్ర శిక్షా జాయింట్ డైరెక్టర్ ఆర్.ఎస్ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు ఎసరు!

యూనివర్సిటీల్లో పాత వారిని తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర

- నచ్చినవారికి పోస్టులు ఇచ్చేలా ప్లాన్
- కాంట్రాక్టు అధ్యాపకులను రెన్యువల్ చేయకుండా ఇంటర్వ్యూలకు పిలుస్తున్న వర్సిటీలు
- జేఎన్‌టీయూ(కే), జేఎన్‌టీయూ(ఏ), ఎస్వీయూలో అమలుకు చర్యలు
- కాకినాడ జేఎన్‌టీయూలో ఇంటర్వ్యూలను బాయ్‌కాట్ చేసిన కాంట్రాక్టు అధ్యాపకులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న అధ్యాపకుల ఉనికి ప్రమాదంలో పడింది. దాదాపు రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను కూటమి ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతోంది. సాధారణంగా ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు కాంట్రాక్టు అధ్యాపకులు, సిబ్బందిని రెన్యువల్ చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం తమకు నచ్చినవారిని యూనివర్సిటీల్లో కూర్చోబెట్టేందుకు ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఎసరు పెట్టింది. ఈసారి రెన్యువల్ చేయకుండా ఇంటర్వ్యూలకు హాజరు కావాలంటూ హుకుం జారీ చేసింది.

కాకినాడ నుంచే మొదలు

- ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలోని 20 యూనివర్సిటీల్లో సుమారు 2,500 మంది కాంట్రాక్టు పద్ధతిలో అకడమిక్ కన్సల్టెంట్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా సేవలందిస్తున్నారు. వీరిలో 10 నుంచి 20 ఏళ్లకుపైగా అనుభవంతో బోధన సాగిస్తున్నవారు అధికంగా ఉన్నారు. ఇప్పుడు వీరందరినీ రెన్యువల్ చేయకుండా కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. కొత్తగా మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించి భర్తీ చేయాలని నిర్ణయించింది. తద్వారా తమకు నచ్చినవారికి పోస్టింగ్‌లు ఇవ్వాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది.
- కాకినాడ జేఎన్‌టీయూలో 135 మంది, దానికి అనుబంధంగా నరసరావుపేటలో ఉన్న క్యాంపస్‌లో మరో 25 మంది వరకు కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నారు. వీరందరినీ రెన్యువల్ చేయకుండా మంగళవారం ఇంటర్వ్యూలకు హాజరుకావాలని వర్సిటీ ఆదేశించింది. దీనిపై కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ సమష్టిగా ఇంటర్వ్యూలను బాయ్‌కాట్ చేసింది.
- అనంతపురం జేఎన్‌టీయూ అధికారులు సైతం ఈ నెల 30 నుంచి జూన్ 4 వరకు ఇంటర్వ్యూలకు రావాలని కోరడంతో కాంట్రాక్టు అధ్యాపకులు మండిపడుతున్నారు.
- శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో 262 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉంటే, వారిని సైతం ఈ ఏడాది రెన్యువల్ చేయకుండా వచ్చే నెలలో నూతన నోటిఫికేషన్ ద్వారా కొత్త వారితో పోస్టులను భర్తీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.
- ఇలా యూనివర్సిటీల్లో కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి, ఆ స్థానంలో తమ వారిని నియమించుకోవడంతోపాటు కొన్ని పోస్టులు మిగిల్చుకుని ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీ ఊసేది?

ఎన్నికల సమయంలో ప్రభుత్వ యూనివర్సిటీలపై అలవికాని ప్రేమ కురిపించిన చంద్రబాబు, లోకేశ్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు జపం మొదలెట్టారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో శాశ్వత ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యూనివర్సిటీల్లో పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. కోర్టు కేసులను పరిష్కరించి 3,220 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఆ పోస్టుల భర్తీని నిలిపివేసింది. ప్రస్తుతం ఏపీలోని విశ్వవిద్యాలయాల్లో 4,330 శాంక్షన్ పోస్టులు ఉంటే, ఇప్పుడు 700 నుంచి 800 మంది మాత్రమే శాశ్వత అధ్యాపకులు ఉన్నారు. ఏటా 50 నుంచి 100 మంది వరకు రిటైర్ అవుతున్నారు. ఇలాంటి తరుణంలో అనుభవం కలిగిన కాంట్రాక్టు అధ్యాపకులను సైతం తొలగించాలని ప్రభుత్వం ప్రయత్నించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోం



పీహెచ్‌డీలు చేసి దారుణ పరిస్థితులు అనుభవిస్తున్నాం. దశాబ్దాలుగా బోధన రంగంలో అనుభవం ఉన్నా కాంట్రాక్టు ఉద్యోగులుగా అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వం కొత్త పోస్టులు భర్తీ చేస్తే రెగ్యులర్ అధ్యాపకులమవుతామనే ఆశతో పని చేస్తున్నాం. మాకు యూజీసీ నిబంధనల ప్రకారం పే స్కేల్ దక్కట్లేదు. పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచలేదు. ఇప్పుడు కాంట్రాక్టును రెన్యువల్ చేయకుండా ఇంటర్వ్యూలకు పిలుస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న వారిని తొలగించి నచ్చిన వారికి పోస్టులు కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోంది. మాకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోం. ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేస్తాం.

- డాక్టర్ కె.అర్జునుడు, ఏపీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్స్ సమాఖ్య(కాంట్రాక్టు) అధ్యక్షుడు

మూడేళ్లు మించిన మినిస్టీరియల్ స్టాఫ్ విధిగా బదిలీ

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, రీజినల్ డైరెక్టర్ కార్యాలయాల్లో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న మినిస్టీరియల్ స్టాఫ్‌ను తప్పనిసరిగా బదిలీ చేయాలని నిర్ణయించినట్టు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శాఖ ఉద్యోగుల బదిలీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మార్గదర్శకాలకు సీఎం ఆమోదం లభించినట్టు వెల్లడించారు. 20 రోజుల్లో బదిలీల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఏళ్ల తరబడి ఒకే చోట మినిస్టీరియల్ స్టాఫ్ పాతుకుపోయి అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీల నిబంధనను సడలించి మినిస్టీరియల్ స్టాఫ్ మూడేళ్లు పూర్తయితే విధిగా బదిలీ చేయాలనే నిబంధన తెచ్చినట్టు వివరించారు. ఇతర ఉద్యోగులు ఒకే చోట రెండేళ్ల సర్వీస్ పూర్తయితే రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అర్హత ఉంటుందన్నారు. అదే విధంగా ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని సీనియార్టీ ప్రాతిపదికన కదిలిస్తామన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) నిబంధనల మేరకు ఉన్న ఖాళీలనే ప్రకటించి ప్రస్తుత బదిలీల ద్వారా భర్తీ చేస్తామన్నారు.

యోగా డేకు జనాన్ని సమీకరించండి

- సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం టార్గెట్
- వారం రోజులుగా ఇంటింటి సర్వే

సాక్షి, అమరావతి: యోగా దినోత్సవ కార్యక్రమాలకు భారీగా జన సమీకరణ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ప్రభుత్వం టార్గెట్ పెట్టింది. ఇందులో భాగంగా ఆయూష్ విభాగం డైరెక్టర్ దినేష్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ మంగళవారం రాష్ట్రంలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జనసమీకరణపై దిశా నిర్దేశం చేశారు. జూన్ 21వ తేదీన ప్రభుత్వం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది పాల్గొనేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని అధికారులు తెలిపారు. కాగా, యోగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎవరు ఆసక్తిగా ఉన్నారనే విషయం తెలుసుకునేందుకు ఇప్పటికే వారం రోజుల నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 20లక్షల మంది మాత్రమే ఆసక్తిని కనబరుస్తున్నారని తేలింది. దీంతో వీలైనంత ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు చేపట్టాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు ఆదేశించారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీలో సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025–26 అడ్మిషన్లలో భాగంగా ప్రత్యేక కేటగిరీ సీట్ల భర్తీకి గాను ఈనెల 28 నుంచి 31 వరకు సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఇందుకోసం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు చేశారు. 28న సైనికోద్యోగుల పిల్లల (సీఏపీ) కోటాలో 153 మంది, క్రీడా కోటాలో 320 మంది సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. 29న సీఏపీ కోటాలో 117, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 247, ఎన్‌సీసీ కోటాలో 341, క్రీడా కోటాలో 245 మంది సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. 30న ఎన్‌సీసీ కోటాలో 452, క్రీడా కోటాలో 467 మంది, 31న ఎన్‌సీసీ కోటా అభ్యర్థులు 661 మంది సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమవుతుంది.

శాస్త్రోక్తంగా చక్రస్నానం




కార్వేటినగరం: చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఉదయం 9గంటలకు చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో మూలవిరాట్‌ను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా స్కంధ పుష్కరిణి వద్దకు చేరుకున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, చక్రతాళ్వార్‌కు వేద పండితులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. 9.30 గంటలకు చక్రతాళ్వార్‌కు వేద మంత్రోచ్చారణ నడుమ స్కంధ పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు.

సాగుబడి

రోహిణి కార్తె: 25 నుంచి









887 అద్భుతమైన పాత పంటలు

విపరీత వాతావరణ పరిస్థితుల్ని దీటుగా తట్టుకొని మంచి దిగుబడులనిచ్చే వంగడాలు అని అనగానే జన్యుమార్పిడి, జన్యుసవరణ వంటి అత్యాధునిక ప్రజనన (బ్రీడింగ్) పద్ధతుల్లో తయారు చేస్తున్న సరికొత్త వంగడాలే మనల్ని ఆదకోగలవు అన్న అభిప్రాయం కలుగుతుంది. అయితే, వాతావరణ మార్పుల్ని దీటుగా తట్టుకునే అపురూప దేశీ వంగడాలు (పాత పంటలు) చాలానే మన రైతుల దగ్గర అనాదిగా సాగులో ఉన్నాయని భారతీయ సుసంపన్న వ్యవసాయక వారసత్వ పటిమను ఎరిగిన వారు చెబుతున్నారు. దేశీ విత్తనాలు కొల్లలుగా ఉన్నప్పటికీ, వాటిలో ఆధారపడదగిన గణాంకాలతో కూడిన ఆధారాలున్న పాత పంటలు ఎన్ని అనేది ఖచ్చితంగా తెలీదు.

ఈ లోటు తీర్చటం కోసం న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే ప్రముఖ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) తాజాగా ఓ అధ్యయనం చేసి మంచి పని చేసింది. 71 రకాల పంటలకు సంబంధించిన 887 దేశీ వంగడాలు భేషైన పాత పంటల వంగడాలు అందుబాటులో ఉన్నాయని ఈ అధ్యయనంలో వెల్లడైంది. అయితే, నిజానికి వాతావరణ ప్రతికూలతల్లోనూ దిగుబడినిస్తున్న పాత పంటల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని, తాము సేకరించగలిగింది కేవలం 15 రాష్ట్రాల్లో కొన్ని సంస్థలు, కొందరు విత్తన సంరక్షకుల వద్ద గల సమాచారాన్ని మాత్రమేనని సిఎస్ఇ ప్రకటించింది.

ప్రతికూల వాతావరణ మార్పులు వ్యవసాయానికి, ముఖ్యంగా వ్యవసాయాధార దేశమైన మనకు, పెద్ద సవాలుగా మారింది. గడచిన 16 నెలలు గతమెన్నడూ ఎరుగని రీతిలో విపరీత వాతావరణ పరిస్థితులు ముఖ్యంగా పగలు / రాత్రి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యాయి. ఈ ఫలితంగా అనేక పంటలు సాగులో సవాళ్లు పెరిగిపోయాయి. ఈ పూర్వరంగంలో విపరీత వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలబడి, మంచి దిగుబడులను ఇచ్చే విత్తనాలు (క్లైమెట్ రిసైలియంట్ సీడ్స్) మన రైతులకు అందించటం వారి జీవనోపాధి/ ఆదాయ భద్రతకు, దేశానికి ఆహార భద్రతకు అత్యంత కీలకంగా నిలిచాయి. అటువంటి అపురూప దేశీ వంగడాలు, 71 రకాల పంటలకు సంబంధించిన, 887 మన దేశంలోని 15 రాష్ట్రాల్లో ఇప్పటికీ రైతుల దగ్గర ఉన్నాయని న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే ప్రముఖ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) నిర్వహించిన అధ్యయనం తేల్చింది. భేషైన పాత పంటల వంగడాలు అందుబాటులో ఉన్నాయని ఈ అధ్యయనంలో వెల్లడైంది. కరువును, అధిక ఉష్ణోగ్రతలను, చీడపీడలను, నీటి ముంపును, పెనుగాలులను, చౌడును తట్టుకొనే గుణాలు ఈ దేశీ వంగడాలకు పుష్కలంగా ఉన్నాయని ఈ అధ్యయనం వెల్లడించింది. విత్తన సంరక్షకులు, సామాజిక విత్తన బ్యాంకులు (కమ్యూనిటీ సీడ్ బ్యాంక్‌లు-సిబిఎస్‌లు) వీటిని ప్రతి ఏటా సాగు చేస్తూ పరిరక్షిస్తున్నాయని సిఎస్ఇ అధ్యయనంలో తేలింది. క్లైమెట్ ఛేంజ్‌ని ఎదుర్కొనే క్రమంలో ప్రభుత్వం కమ్యూనిటీ సీడ్ బ్యాంక్‌లను పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తే ప్రకృతి సేద్యానికి కూడా దోహదమవుతుందని సిఎస్ఇ తెలిపింది. దేశీ వంగడాలు ఇప్పటికీ ఎప్పటికీ ఎంత ప్రాణవసరమో తెలియజెప్పడానికి ఈ అధ్యయనం వెలుగులోకి తెచ్చిన అపురూప సమాచారంతో కూడిన కథనం..

కమ్యూనిటీ సీడ్ బ్యాంక్ అంటే?

వాతావరణ మార్పు నేపథ్యంలో, ఆహార భద్రత మరియు సార్వభౌమత్వాన్ని ఆధారం చేసుకునే జీవవైవిధ్యం వేగంగా నష్టపోవడాన్ని మనం చూస్తున్నాం. తరతరాలుగా సమాజాలను పోషించిన సాంప్రదాయ పంట రకాలు మన పొలాల నుంచి, మన ఆహారం నుంచి క్రమంగా కనుమరుగవుతున్నాయి.

వాతావరణ మార్పుల ముప్పు ఉన్న ప్రపంచంలో వ్యవసాయానికి, రైతులకు వెన్నుదన్నుగా నిలవడానికి అవసరమైన విత్తనాలను రక్షించడంలో కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు (సిబిఎస్‌లు) లేదా సామాజిక విత్తన బ్యాంకులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.


సామాజిక విత్తన బ్యాంకులు అనేవి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఒక రకమైన వికేంద్రీకృత జన్యు బ్యాంకులు. స్థానిక రైతు సంఘాలు, స్వయం సహాయక బృందాలు, లాభాపేక్షలేని సంస్థలు, మహిళలు వీటిని నిర్వహిస్తున్నారు. దేశీయ విత్తనాలను, విపరీత వాతావరణ ప్రభావాలను దీటుగా తట్టుకొని నిలిచే విత్తనాలను అనాదిగా ఏటేటా రైతుల ద్వారా సాగు చేయిస్తూ, అవి కాలగర్భంలో కలసిపోకుండా పరిరక్షించటం సామాజిక విత్తన బ్యాంకుల ప్రాథమిక ఉద్దేశ్యం. ఈ విత్తనాలను పరిరక్షించటంతో పాటు వాటి ఉపయోగాలు, ఔషధ గుణాల గురించిన సంప్రదాయ విజ్ఞానాన్ని కూడా సంరక్షించడం వీటి లక్ష్యం.

ఉదాహరణకు, మన దేశంలో కరువు పరిస్థితుల్లో, ఉప్పు నీటిలో పెరిగే వరి రకాలు ఉన్నాయి. మనకు అధిక వేడిని తట్టుకునే కూరగాయల రకాలు ఉన్నాయి. ఈ వంగడాలను సంరక్షించడంలో, వాటిని రైతులకు అందుబాటులో ఉంచడంలో సామాజిక విత్తన బ్యాంకులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. అయితే, వాటికి ఇంత ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, వాటిపై అవగాహన లేకపోవడం, ప్రభుత్వ విధానాల మద్దతు పరిమితంగా ఉండటం, ఆర్థిక సవాళ్ల కారణంగా అవి తగినంత గుర్తింపు పొందటం లేదు.

దేశంలోని వివిధ రాష్ట్రాలలో సామాజిక విత్తన బ్యాంకుల్లో అందుబాటులో ఉన్న అపారమైన వైవిధ్యాన్ని మ్యాప్ చేయడానికి, డాక్యుమెంట్ చేయడానికి సిఎస్ఇ చేసిన ఒక ప్రయత్నమే ఈ నివేదిక. శుభవార్త ఏమిటంటే, మనకు ఇప్పటికీ వ్యవసాయక సమాజాలు సంరక్షిస్తున్న సాంప్రదాయ పాత పంట రకాలు విస్తృత శ్రేణిలో ఉన్నాయి. వీటిలో ధాన్యాలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, నూనె గింజలు, తదితర రకాల పంటల విత్తనాలు ఉన్నాయి. ఈ అపురూప పాత పంట విత్తనాలను, వాటిని సంరక్షించే సంఘాలను మనం కాపాడుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో దేశీ వంగడాలు

సంస్థ/వ్యక్తి	సీడ్ బ్యాంక్	పంట పేరు	వంగడం/ స్థానిక పేరు	గుణాలు
శ్రీసత్యసాయి ఫార్మర్స్ ఎం.ఎ.సి.ఎఫ్. లిమిటెడ్	అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు	వేరుశనగ	టిసిజిఎస్-1694 (విశిష్ట)	100-110 రోజులు. హెక్టారుకు 45 క్వింటాళ్ల దిగుబడి. అధిక నూనెశాతం. రబీకి అనుకూలం. నీటివసతి ఉన్న పొలాలకు అనుకూలం.
సుస్థిర వ్యవసాయ కేంద్రం	ఎ) ముసలరెడ్డి గారి పల్లి గ్రామం, తాళ్లపల్లి పంచాయతి, వేంపల్లి మం., వైస్సార్ జిల్లా.	వరి	కుజిపటాలియ	దేశవాళీ
	బి) వేముల సీడ్ బ్యాంక్, భూమయ్యగారిపల్లి, వేముల మం.,	వరి	నవార	
	సి) ప్రొద్దటూరు ఎఫ్‌పిఓ సీడ్ బ్యాంక్, తల్లమాపురం	వరి	రక్తశాలి	
	డి) విలేజ్ పిఓ సీడ్ బ్యాంక్, తాళ్లపల్లి	వరి	● రత్నచోడి ● బ్లాక్ రైస్ ● సిద్ధ సన్నాలు ● దూదేశ్వర్ ● హెచ్ఎంటి ● చిట్టిముత్యాలు ● బహురూపి ● బర్మా బ్లాక్ ● నారాయణ కామిని ● కాలాబట్టి ● రాధాజిగేల్	
		వంగ	ముళ్ల వంగ	స్థానిక రకం
		కాకర	బోడ కాకర (చిట్టి కాకర)	
		బెండ	ముళ్ల బెండ (చేను బెండ)	
		ఉలవ		ఉలవ



తెలంగాణలో దేశీ వంగడాలు

సంస్థ/వ్యక్తి	సీడ్ బ్యాంక్	పంట పేరు	వంగడం/ స్థానిక పేరు	గుణాలు
డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ	సంఘం సీడ్‌బ్యాంక్, మాచనూరు, సంగారెడ్డి జిల్లా	జొన్న	పచ్చజొన్న ఎర్రజొన్న గరీబు జొన్న	పచ్చజొన్న వాన నీటిని పొదివిపట్టుకుంటుంది. ఎర్రజొన్న పిండి మృదువుగా ఉంటుంది. గరీబు జొన్న వంద రోజుల పంట. పక్షులు తినటానికి వీల్లేకుండా కంకి వంపు తిరిగి ఉంటుంది.
		సజ్జ	-	కరువును తట్టుకుంటుంది. పోషకాలు మెండు. తక్కువ వర్షపాత ప్రాంతాలకు అనుకూలం.
		కొర్రలు		పండగకు వాడతారు కరువును తట్టుకుంటుంది. అధిక దిగుబడినిస్తుంది.
		సామెలు	-	కరువును తట్టుకుంటుంది. పోషకలోపం ఉన్న నేలల్లో పెరుగుతుంది. అతి తక్కువ నీరు చాలు.
		ఊదలు	-	త్వరగా పెరుగుతుంది. ఎరువు ఏమీ వెయ్యకపోయినా పెరుగుతుంది. నీటి ముంపును తట్టుకుంటుంది.
		రాగులు	-	అధిక కాల్షియం. నేలను సారవంతం చేస్తుంది. కరువును తట్టుకుంటుంది.
		అరికలు	-	చీడపీడలను తట్టుకుంటుంది. పీచు అధికంగా కలిగిఉంటుంది.
		కంది	-	నేలను సారవంతం చేస్తుంది. వర్షాలు అస్తవ్యస్తంగా పడినా తట్టుకుంటుంది.
		పెసలు	-	గంగా పెసర, చమ్కీ పెసర, బాలింత, నీలాల పెసర. కరువును తట్టుకుంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉంటాయి. గంగా పెసర అధిక వానలను తట్టుకుంటుంది. చమ్కీ పెసర చీడపీడలను తట్టుకుంటుంది. బాలింత రకం పెసలు జిగటగా ఉంటాయి.
		మినుములు	-	అంతర పంటగా వేస్తారు. మాంసకృత్తులు అధికం. నేలలో నత్రజనిని స్థిరీకరిస్తుంది.
		చిక్కుడు	-	తీగ బెబ్బరి, ఎర్ర బెబ్బరి, నల్ల బెబ్బరి, మూడు నెలల బెబ్బరి. తీగ బెబ్బరి దీర్ఘకాలిక తీగ పంట. ఎర్ర బెబ్బరి కాయలో ఎర్ర గింజలు ఉంటాయి. నల్ల బెబ్బరికి తెగుళ్లు ఎక్కువ.
		బెబ్బర్లు	-	కరువును తట్టుకుంటుంది. నత్రజనిని స్థిరీకరిస్తుంది. పశుగ్రాసంగా పనికొస్తుంది.
		ఉలవలు	-	అధిక వేడిని తట్టుకుంటుంది. సారం లేని భూముల్లోనూ పండుతుంది. జీర్ణశక్తిని పెంచుతుంది.
		సెనగలు	-	కరువును తట్టుకుంటుంది. ఎరువులు చాలా తక్కువ ఇచ్చినా చాలు.
		సిరి సెనగలు లంకలు	- -	మొండి పంట. చీడపీడలకు తట్టుకుంటుంది. వర్షాధార సేద్యానికి అనుకూలం. నీటి నిల్వను తట్టుకుంటుంది.
		నువ్వులు		తెల్ల నువ్వులు, నల్ల నువ్వులు తెల్ల నువ్వుల్లో నూనె ఎక్కువగా ఉంటుంది. నల్లనువ్వులను మతపరమైన పనులకు వాడతారు.
		గడ్డి నువ్వులు	-	ఐరన్ ఎక్కువగా ఉంటుంది. కరువును తట్టుకుంటుంది.
		అవిసెలు	-	ఒమెగా -3 ఎక్కువ. నేల సారాన్ని పెంచుతుంది.
		కుసుమ	-	చీడపీడలను తట్టుకుంటుంది. అనేక పంటలతో కలిపి సాగు చేయడానికి అనుకూలం.
		గోధుమ	కట్టె గోధుమ, బోడ గోధుమ, నల్లముళ్లు గోధుమ	కట్టె గోధుమ కంకులు బలంగా వస్తాయి. బోడ గోధుమ పిండి మృదువుగా ఉంటుంది. నల్లముళ్ల గోధుమకు ముళ్లు ఉంటాయి. లోతట్టు భూములకు అనువైనది. తెల్ల బుడమ వడ్లు, నల్ల బుడమ వడ్లు, ఎర్ర వడ్లు, పొరక వడ్లు. తెల్ల బుడమ వడ్ల గింజలు చిన్నవి. పొరక వడ్లు పొడవుగా ఉంటాయి. వేగంగా పెరుగుతుంది.
		ధనియాలు	-	ఎర్ర, నల్ల నేలల్లో పెరుగుతుంది. జీర్ణశక్తిని పెంచుతుంది.
		వాము	-	సహజంగానే చీడపీడలు ఆశించవు. జీర్ణశక్తిని పెంచుతుంది.
		పొద్దు తిరుగుడు	-	పురుగుల నియంత్రణకు ఎర పంటగా ఉపయోగపడుతుంది.
		గోంగూర (పుంటి కూర)	తెల్ల పుంటి, ఎర్ర పుంటి, నల్ల పుంటి, గుమోజ్ పుంటి	గుమోజ్ పుంటి రకాన్ని నారకోసం పెంచుతారు. ఎర్ర పుంటి త్వరగా కోతకు వస్తుంది.

ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే దేశీ వంగడాలు ఇవే!

1. కరువును తట్టుకునే రకాలు

అతి తక్కువ వర్షం పడినా తట్టుకొని దిగుబడినిస్తాయి. మెట్ట ప్రాంతాలకు అనువైనవి.

వరి: నవార, నందన్ కరువ, రక్తశాలి, లాల్ కద, గండ భట్, జీరె, దాప్తరి, అంబమోర్, కాలాబటి, కాలు భట్ (100 రోజులు), మోహ్మాయ, గోల్డెన్ నవార, చాపురే, సలీమ్ సన, బాసుమతి, చినమల్లి.

రాగులు: భదీ, లపద్వ

మొక్కజొన్న: పిర్వ, సతివ, చౌర్వ

కంది: మఘర, రామ్‌ర ప్రియ

గ్రాస్‌పీ (లతిరస్): ధెలావ

సొర: టుండ దూధి, దాల్లి దూధి, తర్పు దూధి

పప్పుధాన్యాలు: సరు ఖుండబిరి, మన్‌కడదంటి, లహ కంకడదండి, బరగడి, తుల బరగడి

నూనెగింజ పంటలు: జడ, ధలశోరిష, నువ్వులు

చిరుధాన్యాలు: భాలు, భటి, మామి, జనహర, ఖుంపమండియ, కుయిరి, సువన్, బడమండి ఖుడమండియ, హలదాయ్‌మక

2. అధిక వేడిని తట్టుకునే రకాలు

అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుంటాయి

రాగులు: భదయీా, లపద్వ

వంగ: ముళ్ల వంగ

కంది: మధర, రామ్‌రప్రియ

3. వరద ముంపును తట్టుకుంటాయి

నీటిముంపులో కూడా బలంగా నిలబడతాయి

వరి: రక్తశాలి, కుట్టదన్, పదేయ, అమాఘవాడ్, గజ్‌ముక్త, లాల్ కద, దూధ్‌మలై, దేవభోగ్, కరియకామత్, గోల కుషండ్, కాలాభట్.

పెసర: గంగా పెసారి

గోధుమ: బన్సి

4. గాలులకు నిలబడుతుంది

బలమైన గాలులను తట్టుకుంటుంది

వరి: పొంఛి

5. చౌడుకు తట్టుకుంటుంది

సాల్టీ సాయిల్స్‌లో బాగా పెరుగుతుంది

వరి: రక్తశాలి

చిరుధాన్యాలు: భాలు, భటి, మామి, జన్హర, ఖుపామండియ, కుయిరి, సువన్, బడమండి ఖుడ మండియ, హలదైమక.

6. చీడపీడలను తట్టుకుంటాయి

తెగుళ్లు/ పురుగుల నిరోధకత

వరి: ధాన్-హాజిని, సిల్కి, 6444, చిట్టిముత్యాలు, బహురూపి

పెసలు: చమ్కి, పెసరి

చిరుధాన్యాలు: భాలు, భటి, మామి, జన్హర, ఖుపామండియ, కుయిరి, సువన్, బడమండి ఖుడమండియ, హలదైమక.

బెంగళూరులో టెక్ సిబ్బంది@10 లక్షలు

- 12 గ్లోబల్ పవర్‌హౌస్‌ల జాబితాలో చోటు
- సీబీఆర్‌ఈ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత సిలికాన్ వేలీగా పేరొందిన బెంగళూరులో టెకీ సిబ్బంది సంఖ్య 10 లక్షల మార్కును దాటింది. తద్వారా అంతర్జాతీయంగా 12 టెక్నాలజీ హబ్‌లలో ఒకటిగా నిల్చింది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ విడుదల చేసిన గ్లోబల్ టెక్ టాలెంట్ గైడ్‌బుక్ 2025'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం నిపుణుల లభ్యత, నాణ్యత, వ్యయాల ప్రాతిపదికన 115 మార్కెట్లను మదింపు చేసి మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. అత్యధిక స్థాయిలో నిపుణుల లభ్యత, తీవ్రమైన పోటీ ఉన్న మార్కెట్లను పవర్ హౌస్‌లుగా, ప్రతిభావంతుల లభ్యత నిలకడగా ఉండే మార్కెట్లను ఎస్టాబ్లిష్డ్ మార్కెట్లుగా, సామర్థ్యలను మెరుగుపర్చుకుంటూ వృద్ధి చెందుతున్న మార్కెట్లను వర్ధమాన మార్కెట్లుగా వర్గీకరించారు. 12 టెక్ పవర్‌హౌస్‌లలో బీజింగ్, బోస్టన్, లండన్, న్యూయార్క్, ప్యారిస్ తదితర నగరాల సరసన బెంగళూరు కూడా నిల్చింది.



ఆసియా పసిఫిక్ ప్రాంతంలో బీజింగ్, షాంఘైతో పాటు బెంగళూరులో అత్యధికంగా టెక్నాలజీ నిపుణులు ఉన్నారని, టెక్ సిబ్బంది సంఖ్య 10 లక్షల పైగా ఉందని నివేదిక పేర్కొంది. గ్లోబల్ టెక్ పవర్‌హౌస్‌గా బెంగళూరు ఎదగడమనేది భారత్‌లో డిజిటల్ ఆవిష్కరణలు, కృత్రిమ మేథకు సంబంధించి లోతైన పరిజ్ఞానాన్ని తెలియజేస్తోందని వివరించింది. ఉద్యోగం చేసే వయస్సు గల జనాభాపరంగా 12 భారీ మార్కెట్లలో బెంగళూరు నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. 28 యూనికార్న్‌లు (1 బిలియన్ డాలర్ల పైగా వేల్యుయేషన్ గల స్టార్టప్‌లు), సానుకూల నిబంధనలు మొదలైనవి నగరానికి సానుకూలాంశాలుగా ఉంటున్నాయి. 2024లో 3.3 బిలియన్ డాలర్ల విలువ చేసే 140 వెంచర్ క్యాపిటలిస్ట్ డీల్స్‌కి బెంగళూరు కేంద్రంగా నిల్చింది. వీటిలో 34 డీల్స్ కృత్రిమ మేథకు సంబంధించినవి ఉన్నాయి.

ఐపీవో స్ట్రీట్

కోల్ ఇండియా సబ్సిడరీ సై..



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మెటల్ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ కోల్ సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్(సీఎంపీడీఐఎల్) పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీనిలో భాగంగా మాతృ సంస్థ కోల్ ఇండియా 7.14 కోట్ల షేర్లు విక్రయించే ప్రణాళికల్లో ఉంది. ప్రమోటర్ కోల్ ఇండియాసహా ఇతర అనుబంధ కంపెనీలకు బొగ్గు అన్వేషణ, గనుల అభివృద్ధి, డిజైన్, యుటిలైజేషన్ తదితర కన్సల్టెన్సీ, ఇంజినీరింగ్ సర్వీసులను సీఎంపీడీఐఎల్ అందిస్తోంది. అనుబంధ సంస్థలు బీసీసీఎల్, సీఎంపీడీఐఎల్‌లను లిస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు ఇటీవలే కోల్ ఇండియా ప్రకటించిన సంగతి తెలిసిందే.

మళ్లీ నీల్‌సాఫ్ట్ రెడీ..



పుజిత కార్పొరేషన్‌కు పెట్టుబడులున్న నీల్‌సాఫ్ట్ లిమిటెడ్ మరోసారి పబ్లిక్ ఇష్యూకి సిద్ధపడుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 90 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 80 లక్షల షేర్లు ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. నిజానికి 2024 డిసెంబర్‌లో సెబీకి దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌లో రూ. 100 కోట్ల ఈక్విటీ జారీకి ప్రణాళికలు వేసింది. అయితే ఈ ఏడాది(2025) మార్చిలో సెబీ ప్రాస్పెక్టస్‌ను తిప్పి పంపింది. టెక్నాలజీ ఆధారిత ఇంజినీరింగ్ సర్వీసులందించే నీల్‌సాఫ్ట్ ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 70 కోట్లు పెట్టుబడి వ్యయాలకు వెచ్చించనుంది.

బ్యాంకర్లతో ఓయో చర్చలు



గ్లోబల్ ట్రావెల్ టెక్ ప్లాట్‌ఫామ్ ఓయో ఐపీవోకు మళ్లీ సన్నాహాలు ప్రారంభించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) చివరి క్వార్టర్‌లో లిస్ట్‌కావడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకు వీలుగా బ్యాంకర్లతో చర్చిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 6-7 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 60,000 కోట్లు) విలువలో కంపెనీ ఐపీవోకు రావచ్చని తెలియజేశాయి. ఈ ఏడాది ఆగస్ట్, సెప్టెంబర్‌లో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసే వీలున్నట్లు వెల్లడించాయి. కంపెనీ ఇంతక్రితం 2021లోనూ సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 8,430 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసింది. అయితే 2024 మే నెలలో ప్రాస్పెక్టస్ వెనక్కి తీసుకుంది. దీంతో మరోసారి ఐపీవోవైపు దృష్టి సారించినట్లు పేర్కొన్నాయి.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	8,950.00	2.39
JSWSTEEL	1,030.00	2.13
M&M	3,075.00	2.07
TRENT	5,529.00	1.72
HINDALCO	661	1.68

నిఫ్టీ 50


టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	226.65	-4.59
ULTRACEMCO	11,676.00	-0.6
KOTAKBANK	2,090.00	-0.51
POWERGRID	296.7	-0.47
NTPC	343.3	-0.38

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	9,416
ఎన్‌ఎస్‌ఈ	1,19,285
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	4,31,025
ఎఫ్‌ఐఐ	+ 348
డీఐఐ	+ 10,105

ముడిచమురు... (బ్యారెల్)



నైమెక్స్ లైట్ స్వీట్	60.82	$ 61.53
బ్రెంట్	63.48	$ 61.12

ఏఐ ఆటోమేషన్‌కి ప్రాధాన్యత

- ఖర్చులు తగ్గించుకోవచ్చు, సైబర్ దాడులను అడ్డుకోవచ్చు
- చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ల అభిప్రాయం
- విప్రో నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: పెరిగిపోతున్న వ్యయాలు, సైబర్ ముప్పులను అధిగమించేందుకు కంపెనీల్లోని సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రస్తుతం కృత్రిమ మేథ (ఏఐ) వైపు మొగ్గు చూపుతున్నారు. అంతర్జాతీయంగా మూడో వంతు సైబర్‌సెక్యూరిటీ లీడర్లు ఏఐ ఆధారిత ఆటోమేషన్‌కే ప్రాధాన్యతనిస్తామంటున్నారు. ఐటీ దిగ్గజం విప్రో రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం సైబర్ సెక్యూరిటీని పెంచుకునేందుకు, బడ్జెట్లను అదుపులో ఉంచుకునేందుకు ఏఐ ఆటోమేషన్‌పై పెట్టుబడులు పెట్టేందుకు ప్రాధాన్యతనిస్తామని చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్లలో (సీఐఎస్‌వో) 30 శాతం మంది తెలిపారు. సాధనాలను క్రమబద్ధీకరించుకోవడం (26 శాతం మంది), సెక్యూరిటీ.. రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రక్రియను మెరుగుపర్చుకోవడం (23 శాతం), నిర్వహణ విధానాలను సరళతరం చేసుకోవడం (20 శాతం) ద్వారా కూడా ఖర్చులను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. 'సైబర్ ముప్పులు చాలా వేగంగా అధునాతన రూపు సంతరించుకుంటున్నాయి. ఆ స్థాయిలో సైబర్‌సెక్యూరిటీ బడ్జెట్లను పెంచుకోవడం కష్టతరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తక్కువ వ్యయాలతో రక్షణ వ్యవస్థలను పటిష్టం చేసుకునేందుకు కంపెనీలకి ఏఐ ఉపయోగపడుతుంది. అందుకే సీఐఎస్‌వోలు దీనిపై దృష్టి పెడుతున్నారు' అని విప్రో ఎస్‌వీపీ టోనీ బఫోమెంట్ తెలిపారు.

నివేదిక ప్రకారం కేవలం ఖర్చులను నియంత్రించుకోవడానికే కాకుండా ముప్పులను గుర్తించే సామర్థ్యాలను పెంచుకునేందుకు, సత్వరం స్పందించేందుకు ఏఐని ఉపయోగిస్తున్నట్లు 31 శాతం మంది వివరించారు. అధునాతన ఏఐ ఆధారిత సెక్యూరిటీ సొల్యూషన్స్‌లో ఇన్వెస్ట్ చేయడం, నిరంతరాయంగా ఏఐ పరిణామాలను పర్యవేక్షిస్తుండటం, సైబర్‌సెక్యూరిటీ సిబ్బందిలో కొత్త ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడంలాంటి అంశాలు రిస్కులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పుడు కీలకంగా మారాయని నివేదిక పేర్కొంది.

ఈవీలపై మారుతీ ముందడుగు

130 ఐటీఐల్లో హై వోల్టేజీ సిస్టమ్‌లపై శిక్షణ కార్యక్రమం



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ (ఎంఎస్‌ఐ) .. విద్యుత్ వాహనాల విభాగంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు కావాల్సిన హై వోల్టేజీ సిస్టంల నిర్వహణ కోసం నిపుణులను సిద్ధం చేస్తోంది. ఇందు కోసం దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 130 ఐటీఐల్లో సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. ఏటా 4,100 మంది పైగా విద్యార్థులకు తర్ఫీదునివ్వనున్నట్లు పేర్కొంది. శిక్షణానంతరం వారు మారుతీ సుజుకీ నెట్‌వర్క్‌లో లేదా ఇతర ఏదైనా సంస్థలోనైనా చేరొచ్చని వివరించింది.

శిక్షణా కార్యక్రమంపై రూ. 3.9 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ఎంఎస్‌ఐ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ భారతి తెలిపారు. ఆఫ్టర్ సేల్ సర్వీస్ లభ్యతపై సందేహాల వల్ల కూడా ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు వెనుకాడుతున్నట్లు తమ అధ్యయనంలో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిపుణులైన టెక్నీషియన్లు అందుబాటులో ఉండటమనేది ఈవీల వినియోగం గణనీయంగా పెరిగేందుకు కొంత దోహదపడుతుందని వివరించారు. ఇప్పటికే హైబ్రిడ్ టెక్నాలజీ కార్లను విక్రయిస్తున్న మారుతీ సుజుకీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో తమ తొలి ఎలక్ట్రిక్ వాహనం 'ఈ–విటారా'ను ప్రవేశపెట్టబోతోంది.

కేవైసీ విషయంలో బ్యాంక్‌లకు కరస్పాండెంట్ల సాయం

ఆర్‌బీఐ ముసాయిదా సర్క్యులర్ విడుదల



ముంబై: కస్టమర్ల కేవైసీ వివరాల నవీకరణతో పాటు చురుగ్గాలేని (ఇనాపరేటివ్) ఖాతాలను వినియోగంలోకి తీసుకువచ్చే విషయంలో బిజినెస్ కరస్పాండెంట్ల సాయం బ్యాంక్‌లు తీసుకునే వెలుసుబాటు లభించనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనతో ఆర్‌బీఐ ఒక ముసాయిదా సర్క్యులర్ విడుదల చేసింది. కాలానుగుణంగా చేయాల్సిన కేవైసీ అప్‌డేషన్ విషయమై పెద్ద ఎత్తున పని అపరిష్కృతంగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. ఇందులో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), ఎలక్ట్రానిక్ రూపంలో ప్రయోజనం బదిలీ (ఈబీటీ) కోసం తెరిచిన ఖాతాలు కూడా ఉన్నాయి. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం కింద తెరిచిన ఖాతాల విషయంలోనూ కస్టమర్లు సమస్యలను ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించినట్టు ఆర్‌బీఐ తెలిపింది. కేవైసీ అప్‌డేషన్ విషయంలో సమస్యలపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నట్టు పేర్కొంది. కస్టమర్ల సౌకర్యం దృష్ట్యా కేవైసీ అప్‌డేషన్ విషయంలో బిజినెస్ కరస్పాండెంట్లను అనుమతించేందుకు సవరణలు చేసినట్టు తెలిపింది. దీనిపై జూన్ 6లోపు ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆర్‌బీఐ కోరింది.

దేశమంతా ఒకే ధరకు ఎలక్ట్రిక్ సెడాన్ బీఎండబ్ల్యూ ఐ7



ముంబై: బీఎండబ్ల్యూ ఇండియా తన ఎలక్ట్రిక్ సెడాన్ ఐ7 కారును దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే ఎక్స్–షోరూమ్ ధర(రూ.2.05 కోట్లు)కు అందిస్తున్నట్లు తెలిపింది. ఇందులో రిజిస్ట్రేషన్ ఫీజు, జీఎస్టీ, కాంపెన్సేషన్ సెస్(రాష్ట్రాల ఆదాయాల భర్తీ కోసం ఉద్దేశించినది) ఉంటాయి. కొత్త ధరల ప్రకారం, కస్టమర్లు బీఎండబ్ల్యూ ఐ7కు సంబంధించి రిజిస్ట్రేషన్ ఖర్చును చెల్లించాల్సిన అవసరం లేదు. కంపెనీయే చెల్లిస్తుంది. కస్టమర్లు బీమా, టీసీఎస్(మూలం వద్దే పన్ను వసూలు), స్థానిక సెస్‌లను మాత్రమే చెల్లించాలి. ''రిజిస్ట్రేషన్ పన్నులు ప్రతి రాష్ట్రంలో వేర్వేరుగా ఉన్నాయి. రాష్ట్రంలో కూడా ఇది కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. ఈ పరిస్థితి కొనుగోలుదారుల్లో అనిశ్చితిని సృష్టిస్తుంది. దీన్ని అధిగమించేందుకు దేశమంతా ఒకే ధరకు వాహనాన్ని అందిస్తున్నాము'' అని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా అధ్యక్షుడు విక్రమ్ పావా తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్రలో లేదా మరే ఇతర రాష్ట్రంలో కస్టమర్ ఉన్నా, రిజిస్ట్రేషన్ పన్నులో ఉన్న తేడాతో సంబంధం లేకుండా అందరికీ ఒకే ధరకు వాహనం లభిస్తుందన్నారు. కస్టమర్ కేంద్రీకృత సేవలపై మరింత దృష్టి సారించడంతో పాటు ఎలక్ట్రిక్ మొబిలిటీ వినియోగాన్ని ప్రోత్సహించడం తమ ముఖ్య ఉద్దేశమని పావా పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-5-2025

విశాఖ	535-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

2025-26లో ట్రిలియన్ డాలర్ల ఎగుమతులు

- గత ఆర్థిక సంవత్సరం కంటే 21 శాతం అధికం
- ఎఫ్‌ఐఈవో ప్రెసిడెంట్ రల్హన్ అంచనా



న్యూఢిల్లీ: దేశ వస్తు, సేవల ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) ట్రిలియన్ డాలర్లను (సుమారు రూ.85 లక్షల కోట్లు) అధిగమించొచ్చని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్‌ఐఈవో) ప్రెసిడెంట్ ఎస్‌సీ రల్హన్ అంచనా వేశారు. 2024-25లో మొత్తం ఎగుమతులు 825 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే 21 శాతం పెరగనున్నట్లు చెప్పారు. వస్తు ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో 437 బిలియన్ డాలర్లుగా ఉంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 525-535 బిలియన్ డాలర్లకు చేరొచ్చన్నారు. సేవల ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో 387 బిలియన్ డాలర్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 465-475 బిలియన్ డాలర్ల మేర ఉండొచ్చని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రధానంగా ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 60 బిలియన్ డాలర్ల మేర ఉండొచ్చని.. మెషినరీ ఎగుమతులు 40 బిలియన్ డాలర్లు, కెమికల్స్ ఎగుమతులు 40 బిలియన్ డాలర్లు, ఫార్మాస్యూటికల్స్ ఎగుమతులు 30 బిలియన్ డాలర్లు, పెట్రోలియం ఎగుమతులు 70 బిలియన్ డాలర్లు, వస్త్ర ఎగుమతులు 23-25 బిలియన్ డాలర్లు, రత్నాభరణాల ఎగుమతులు 30-35 బిలియన్ డాలర్లు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 55 బిలియన్ డాలర్ల చొప్పున ఉండొచ్చని అంచనా వ్యక్తం చేశారు. పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను చేసుకోనుండడం ఎగుమతులను వృద్ధి చేస్తుందని రల్హన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని రంగాల నుంచి ఎగుమతుల్లో వృద్ధి ఉంటుందన్నారు. యూకేతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్ అంగీకారానికి రాగా, ఈయూ, యూఎస్‌తో చర్చలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

మార్చి త్రైమాసిక ఫలితాలు

బీఎస్‌ఎన్‌ఎల్‌కు మళ్లీ లాభాలు

- క్యూ4లో రూ. 280 కోట్లు
- క్యూ3లోనూ రూ. 262 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలోనూ టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నష్టాలను వీడి రూ. 280 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 849 కోట్ల నికర నష్టం నమోదైంది. గతేడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లోనూ రూ. 262 కోట్ల నికర లాభం ఆర్జించిన సంగతి తెలిసిందే. వెరసి 2007 తదుపరి వరుసగా రెండో త్రైమాసికంలోనూ లాభాలు ప్రకటించినట్లు కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. గత 18ఏళ్ల తరువాత నిర్వహణ లాభం, సానుకూల మార్జిన్లు, నికర లాభాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితంగా మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర నష్టం భారీగా(58 శాతం) తగ్గి రూ. 2,247 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 5,370 కోట్ల నష్టం నమోదైంది. నిర్వహణ ఆదాయం 8 శాతం ఎగసి రూ. 20,841 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 10 శాతం బలపడి రూ. 23,400 కోట్లకు చేరగా.. 2023-24లో నమోదైన 3 సర్కిళ్లతో పోలిస్తే సుమారు 10 సర్కిళ్లలో నికర లాభాలు సాధించినట్లు సింధియా వెల్లడించారు. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 24,432 కోట్ల పెట్టుబడులు వెచ్చించినట్లు తెలియజేశారు. ఆదాయంలో మొబిలిటీ నుంచి 6 శాతం వృద్ధితో రూ. 7,499 కోట్లు లభించగా.. ఫైబర్ టు హోమ్ బిజినెస్ 10 శాతం అధికమై రూ. 2,923 కోట్లు అందుకుంది. ఎంటర్‌ప్రైజ్ విభాగం 4 శాతం పుంజుకుని రూ. 4,096 కోట్ల ఆదాయం సాధించింది. 4జీ, 5జీ సేవలపై దృష్టి పెట్టడం ద్వారా వృద్ధిని కొనసాగించనున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ ఏ రాబర్ట్ జే రవి పేర్కొన్నారు.

ఎన్‌ఎండీసీ లాభం అప్

- క్యూ4లో రూ. 1,483 కోట్లు
- షేరుకి రూ. 1 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం వృద్ధితో రూ. 1,483 కోట్లను తాకింది. ఇందుకు ముడిఇనుము, పెల్లెట్స్ అమ్మకాలు దోహదపడ్డాయి. అంతక్రితం ఏడాది (2023-24) ఇదే కాలంలో రూ. 1,416 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం 9 శాతం ఎగసి రూ. 7,497 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 6,908 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఆదాయంలో ముడిఇనుము బిజినెస్ నుంచి రూ. 6,350 కోట్లు, ఇతర మినరల్స్ నుంచి రూ. 662 కోట్లు లభించాయి. పూర్తి ఏడాదికి నికర లాభం 17 శాతం జంప్‌చేసి రూ. 6,539 కోట్లకు చేరింది. 2023-24లో రూ. 5,571 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 22,679 కోట్ల నుంచి రూ. 25,499 కోట్లకు ఎగసింది. క్యూ4లో ముడిఇనుము ఉత్పత్తి 13.31 మిలియన్ టన్నుల(ఎంటీ)ను తాకగా.. అమ్మకాలు 12.67 ఎంటీగా నమోదైనట్లు కంపెనీ చైర్మన్, ఎండీ అమితవ ముఖర్జీ వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌ఎండీసీ షేరు బీఎస్‌ఈలో 0.6% నష్టంతో రూ. 73 వద్ద ముగిసింది.

రాణించిన హిందుస్థాన్ కాపర్

52 శాతం పెరిగిన లాభం




న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ హిందుస్థాన్ కాపర్ మార్చి త్రైమాసికంలో పనితీరు పరంగా రాణించింది. లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 52 శాతం ఎగసి రూ.189 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.125 కోట్లుగా ఉంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.585 కోట్ల నుంచి రూ.777 కోట్లకు వృద్ధి చెందింది. వ్యయాలు సైతం రూ.401 కోట్ల నుంచి రూ.519 కోట్లకు పెరిగాయి. ఒక్కో షేరుకు రూ.1.46 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. సెక్యూర్డ్ లేదా అన్ సెక్యూర్డ్ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీలు) లేదా బాండ్ల జారీ రూపంలో రూ.500 కోట్లను సమీకరించే ప్రతిపాదనకు వాటాదారుల ఆమోదం తీసుకోవాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు అర శాతం లాభపడి రూ.245 వద్ద ముగిసింది.

ఆర్‌సీఎఫ్ లాభం రూ.72 కోట్లు

- మార్చి త్రైమాసికంలో 24% డౌన్
- షేరుకు రూ.1.32 చొప్పున డివిడెండ్



న్యూఢిల్లీ: రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) మార్చితో అంతమైన మూడు నెలల కాలంలో బలహీన పనితీరు నమోదు చేసింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 24 శాతం క్షీణించి రూ.72 కోట్లకు పరిమితమైంది. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 4 శాతం క్షీణించి రూ.3,730 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.95 కోట్లు, ఆదాయం రూ.3,880 కోట్ల చొప్పున ఉన్నాయి. ఇక 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆర్‌సీఎఫ్ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 8 శాతం వృద్ధితో రూ.242 కోట్లకు చేరింది. ఆదాయం రూ.16,933 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.225 కోట్లు, ఆదాయం రూ.1,6981 కోట్ల చొప్పున ఉండడం గమనార్హం. ప్రతీ షేరుకు రూ.1.32 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఫలితాల నేపథ్యంలో

బీఎస్‌ఈలో ఆర్‌సీఎఫ్ షేరు ఒక శాతానికి పైగా లాభపడి రూ.156 వద్ద ముగిసింది.

శ్రీరామ్ ప్రాపర్టీస్ పనితీరు భళా



న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ శ్రీరామ్ ప్రాపర్టీస్ మార్చి త్రైమాసికంలో పటిష్ట పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే రెట్టింపునకు పైగా పెరిగి రూ.48 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.20 కోట్లుగా ఉంది. ఆదాయం ఇదే కాలంలో రూ.358 కోట్ల నుంచి రూ. 427 కోట్లకు దూసుకుపోయింది. ఇక 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి మాత్రం పనితీరు స్తబ్దుగా నమోదైంది. రూ.77 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.75.42 కోట్లతో పోల్చి చూస్తే వృద్ధి అతి స్వల్పంగా ఉంది. ఆదాయం మాత్రం రూ. 987 కోట్ల నుంచి రూ.973 కోట్లకు తగ్గింది. ఈ సంస్థ దక్షిణాదిన ప్రధానంగా కార్యకలాపాలు నిర్వహిస్తుంటుంది.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు 15%కి పైగా ఎగసి రూ.97 వద్ద ముగిసింది.

జేకే లక్ష్మీ సిమెంట్ బలమైన పనితీరు

- 19 శాతం పెరిగిన లాభం
- సామర్థ్య విస్తరణపై పెట్టుబడులు



న్యూఢిల్లీ: జేకే లక్ష్మీ సిమెంట్ గత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో (క్యూ4) పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 19 శాతం జంప్ చేసి రూ.193 కోట్లకు చేరింది. అమ్మకాలు పెంచుకోవడానికి తోడు వ్యయ నియంత్రణ కోసం తీసుకున్న చర్యలు ఫలితమిచ్చాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.162 కోట్లుగా ఉంది. ఆదాయం ఇదే కాలంలో 6.5 % పెరిగి రూ.1,898 కోట్లుగా నమోదైంది. సీక్వెన్షియల్‌గా లాభం పెరగడానికి అధిక అమ్మకాలు, మెరుగైన ఉత్పత్తుల మిశ్రమం, ఇంధన ఖర్చులు తగ్గించుకోవడాని కారణాలుగా కంపెనీ చైర్‌పర్సన్, ఎండీ వినితా సింఘానియా తెలిపారు. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి జేకే లక్ష్మీ సిమెంట్ లాభం 38 % తగ్గిపోయి రూ.302 కోట్లకు పరిమితమైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.488 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం 9% తగ్గి రూ. 6,239 కోట్లుగా నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌లోని దు ర్గ్, యూపీలోని ప్రయాగ్‌రాజ్, బీహార్‌లోని మధుబని, జార్ఖండ్‌లోని పత్రతులో క్లింకర్ సామర్థ్యాలను కూడా విస్తరించనున్నట్లు ప్రకటించింది.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు ఒక శాతం నష్టంతో రూ.867 వద్ద ముగిసింది.



సింధు

సింధు, ప్రణయ్ శుభారంభం

సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

సింగపూర్: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో పీవీ సింధు 21-14, 21-9 తేడాతో వెన్ యూ జాంగ్ (కెనడా)పై విజయం సాధించింది. 31 నిమిషాల్లో ముగిసిన పోరులో పూర్తి ఆధిపత్యం కనబర్చిన తెలుగమ్మాయి వరస గేమ్‌ల్లో గెలుపొందింది. బుధవారం జరగనున్న ప్రిక్వార్టర్స్‌లో టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, ప్రపంచ ఐదో ర్యాంకర్ చెన్ యూ ఫే (చైనా)తో సింధు తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 34వ ర్యాంకర్ ప్రణయ్ 19-21, 21-16, 21-14తో రాస్‌మస్ గెమ్కే (డెన్మార్క్)పై గెలుపొందాడు. 72 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్‌లో ఓడిన అనంతరం తిరిగి పుంజుకున్న ప్రణయ్... ప్రత్యర్థిపై ఆధిపత్యం కనబరుస్తూ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. తదుపరి రౌండ్‌లో ఫ్రాన్స్ షట్లర్ క్రిస్టోఫ్ పొపోవ్‌తో ప్రణయ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. కాగా ఈ టోర్నీలో మిగిలిన భారత షట్లర్లకు నిరాశ ఎదురైంది. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్, అన్‌మోల్ పరాజయం పాలవగా... పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్‌కు నిరాశ తప్పలేదు. మాళవిక, ప్రియాన్షు తొలి గేమ్ గెలిచినప్పటికీ అదే జోరు కొనసాగించడంలో విఫలమై పరాజయాల పాలయ్యారు. మాళవిక 21-14, 18-21, 11-21తో ఎనిమిదో సీడ్ సుపనిదా కటెథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో... ప్రియాన్షు 21-14, 10-21, 14-21తో ఏడో సీడ్ నరోకా (జపాన్) చేతిలో ఓడాడు. అన్‌మోల్ 11-21, 22-24తో చెన్ చేతిలో... కిరణ్ జార్జ్ 19-21, 17-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో సంతోష్ రామ్‌రాజ్ 14-21, 8-21తో కిమ్ గా ఇన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో, అషిత సూర్య-అమృత ప్రథమేశ్ జోడీలు నిరాశ పరచగా... మహిళల డబుల్స్‌లో కవిప్రియ సెల్వం-సిమ్రన్ సింగ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు.

క్వార్టర్స్‌లో ఐదుగురు భారత బాక్సర్లు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ఇన్విటేషనల్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఐదుగురు భారత బాక్సర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నారు. మంగళవారం పురుషుల 85 కేజీల విభాగంలో జుగ్నూ, 75 కేజీల విభాగంలో దీపక్... మహిళల 51 కేజీల విభాగంలో తమన్నా, 57 కేజీల విభాగంలో ప్రియా, 75 కేజీల విభాగంలో అంజలి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టారు. క్వార్టర్స్‌లో బెక్‌జాత్ (కజకిస్తాన్)తో జుగ్నూ, కిమ్ టై (దక్షిణ కొరియా)తో దీపక్, లీ యూ షాన్ (చైనీస్ తైపీ)తో తమన్నా, పార్క్ అహ్ హ్యూన్ (దక్షిణ కొరియా)తో ప్రియా, నవోకా కసహారా (జపాన్)తో అంజలీ తలపడనున్నారు. మరో ఐదుగురు భారత బాక్సర్లు క్వార్టర్ ఫైనల్లో ఓడారు. మహిళల విభాగంలో యషిక రాయ్ (48 కేజీలు), అభా సింగ్ (54 కేజీలు)... పురుషుల విభాగంలో పవన్ (55 కేజీలు), నొథోయ్ సింగ్ (50 కేజీలు), ధ్రువ్ సింగ్ (80 కేజీలు) పరాజయం పాలయ్యారు. చైనా, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ నుంచి 19 మంది బరిలోకి దిగారు.

గుల్‌వీర్‌కు గోల్డ్

10,000 మీటర్ల పరుగులో పసిడి కైవసం

- 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో సెబాస్టియన్‌కు కాంస్యం
- ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ పసిడి పతకంతో సత్తా చాటాడు. 10,000 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ అగ్ర స్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో భారత్‌కు చెందిన సెర్విన్ సెబాస్టియన్ కాంస్య పతకంతో మెరిశాడు. దీంతో పోటీల తొలి రోజు భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన 26 ఏళ్ల గుల్‌వీర్... మంగళవారం 10,000 మీటర్ల రేసును 28 నిమిషాల 38.63 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణం గెలుచుకున్నాడు. గుల్‌వీర్‌కు ఇదే తొలి ఆసియా చాంపియన్‌షిప్ స్వర్ణం. మెబుకి సుజుకి (28 నిమిషాల 43.84 సెకన్లు; జపాన్), అల్బర్ట్ రోప్ (28 నిమిషాల 46.82 సెకన్లు; బహ్రెయిన్) వరుసగా రజత, కాంస్యాలు గెలుచుకున్నారు. భారత్‌కే చెందిన సావన్ బర్వాల్ 28 నిమిషాల 50.53 సెకన్లలో లక్ష్యాన్ని చేరి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి రోజు పోటీలు ముగిసేసరికి భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో పతకాల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. 5 స్వర్ణాలు, 2 రజతాలతో చైనా నంబర్‌వన్‌గా ఉండగా... 3 రజతాలు, 2 కాంస్యాలతో జపాన్ మూడో స్థానంలో ఉంది.

చివరి 200 మీటర్లలో వేగం పెంచి..

ఉత్తరప్రదేశ్‌లోని నిరుపేద రైతు కుటుంబానికి చెందిన గుల్‌వీర్ సింగ్ ఇప్పటికే జాతీయ రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో అతడు 10,000 మీటర్ల రేసును 27 నిమిషాల 00.22 సెకన్లలో పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. మంగళవారం రేసులో చివరికి వచ్చేసరికి మూడో స్థానంలో కనిపించిన గుల్‌వీర్... మరో 200 మీటర్లలో రేసు ముగుస్తుందనగా వేగం పెంచాడు. ఒక్కొక్క సహచరుడిని వెనక్కి నెడుతూ చిరుతలా దూసుకొచ్చాడు. ఆఖరి వరకు అదే కొనసాగిస్తూ ఫినిషింగ్ లైన్ దాటాడు. 'విజేతగా నిలవాలనే లక్ష్యంతోనే బరిలోకి దిగా. టైమింగ్‌పై కాకుండా అందరికంటే ముందుండాలని అనుకున్నా. స్వర్ణం గెలవడం ఆనందంగా ఉంది. దీంతో నా ర్యాంకింగ్ మరింత మెరుగవనుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించడానికి అది తోడ్పడనుంది' అని గుల్‌వీర్ పేర్కొన్నాడు. భారత్ నుంచి 1975లో హరిచంద్, 2017 లక్ష్మణన్ పసిడి పతకాలు గెలవగా... ఇప్పుడు గుల్‌వీర్ ఆ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. 5000 మీటర్ల పరుగులోనూ జాతీయ రికార్డు కలిగిన గుల్‌వీర్ ఇక్కడ కూడా ఆ విభాగంలో పోటీపడనున్నాడు. 2023 ఆసియా చాంపియన్‌షిప్ 5000 మీటర్ల పరుగులో గుల్‌వీర్ కాంస్యం నెగ్గగా... ఇప్పుడు పతకం రంగు మార్చాలని కృతనిశ్చయంతో ఉన్నాడు.



గుల్‌వీర్

దెకాథ్లాన్‌లో తేజస్విన్ దూకుడు...

భారత స్టార్ అథ్లెట్ తేజస్విన్ శంకర్ డెకథ్లాన్ (100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, హై జంప్, 400 మీటర్ల పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్ త్రో, పోల్ వాల్ట్, జావెలిన్ త్రో, 1500 మీటర్ల పరుగు)లో సత్తాచాటుతున్నాడు. పోటీల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ఐదు ఈవెంట్‌లలో శంకర్ దుమ్మురేపాడు. దీంతో సగం పోటీలు ముగిసేసరికి తేజస్విన్ అగ్రస్థానంలో ఉన్నాడు. పురుషుల 400 మీటర్ల పరుగులో విశాల్ ఫైనల్‌కు చేరగా... మహిళల 400 మీటర్ల పరుగులో రూపాల్ చౌధరీ, విదయ రామ్‌రాజ్ తుది రేసుకు అర్హత సాధించారు. పురుషుల హై జంప్‌లో భారత అథ్లెట్ అనిల్ కుషారె 2.10 మీటర్ల ఎత్తు దూకి ఫైనల్‌కు అర్హత సాధించాడు. పురుషుల 1500 మీటర్ల రేసులో యూనుస్ షా ఫైనల్‌కు చేరాడు. మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాణి నాలుగో స్థానంలో నిలిచి పతకానికి దూరమైంది.

సెబాస్టియన్‌కు కాంస్యం

పురుషుల 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో సెబాస్టియన్ 1 గంట 21 నిమిషాల 13.60 సెకన్లలో లక్ష్యాన్ని చేరి మూడో స్థానంలో నిలిచాడు. 'పతకం నెగ్గడం సంతోషంగా ఉంది. విజేతల మధ్య పెద్ద అంతరం లేదు. ఆసియా చాంపియన్‌షిప్‌లో ఇదే నా తొలి పతకం' అని సెబాస్టియన్ అన్నాడు. వాంగ్ జవో (1 గంట 20 నిమిషాల 36.90 సెకన్లు; చైనా), కెంటా యొషికవా (1 గంట 20 నిమిషాల 44.90 సెకన్లు; జపాన్) వరుసగా స్వర్ణ, రజతాలు గెలుచుకున్నారు. ఇదే విభాగంలో పోటీపడిన మరో భారత వాకర్ అమిత్ 1 గంట 22 నిమిషాల 14.30 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఐదో స్థానంలో నిలిచాడు.



సెబాస్టియన్



వరల్డ్ చాంపియన్‌షిప్ పతకమే లక్ష్యం

షూటర్ సిఫ్ట్ కౌర్ ఆకాంక్ష

న్యూఢిల్లీ: దాదాపు ఏడాది క్రితం... పారిస్ ఒలింపిక్స్... 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్... భారత్‌కు చెందిన 23 ఏళ్ల సిఫ్ట్ కౌర్ సమ్రాపై భారీ అంచనాలు ఉన్నాయి. కచ్చితంగా పతకం సాధించగల షూటర్ల జాబితాలో ఆమె కూడా ఉంది. సంవత్సరం ముందు ఇదే ఈవెంట్‌లో సిఫ్ట్ ప్రపంచ రికార్డును నమోదు చేయడం కూడా అందుకు ఒక కారణం. అయితే అసలు సమయంలో రైఫిల్ గురి చెదిరింది. సగటు భారత అభిమాని కూడా ఆశ్చర్యపోయే రీతిలో ఒక్కసారిగా పేలవ ప్రదర్శన నమోదైంది. 32 మంది పోటీ పడితే సిఫ్ట్ కౌర్ 31వ స్థానంతో ముగించింది! ఈ షాక్‌కు ఒక్కసారిగా సిఫ్ట్ ఆట నుంచి తప్పనిసరిగా విరామం తీసుకోవాల్సి వచ్చింది. ఇకపై భవిష్యత్తు గురించి సందేహించాల్సిన పరిస్థితి వచ్చింది. ఎట్టకేలకు నాటి పరాభవం నుంచి కోలుకున్న సిఫ్ట్ ఇప్పుడు మళ్లీ చిరునవ్వులు చిందించింది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్‌లో ఆమె స్వర్ణంతో మెరిసి ఒలింపిక్ బాధను కాస్త మర్చిపోయేలా చేసుకుంది.



నిరాశ నుంచి కోలుకొని...

పారిస్‌లో ఘోర ప్రదర్శన తర్వాత సిఫ్ట్ కౌర్ మానసికంగా చాలా కుంగిపోయింది. ఆ ఈవెంట్ ముగిసిన సమయం నుంచి ఆమెను సాధారణ స్థితికి తెచ్చేందుకు తల్లిదండ్రులు, సోదరుడు ఎంతో శ్రమించాల్సి వచ్చింది. పారిస్ ఒలింపిక్స్ వేదిక నుంచి ఆమెను విహారయాత్ర కోసం వారు మరో నగరానికి తీసుకెళ్లి సరదాగా గడిపి వచ్చారు. స్వదేశానికి తిరిగొచ్చాక తండ్రి మరో రూపంలో ఆమెను బిజీగా ఉంచే ప్రయత్నం చేశారు. మళ్లీ మళ్లీ వైఫల్యం గురించి, స్కోర్ల గురించి ఆలోచించకుండా సరదాగా గన్స్‌తో ఆడుతున్నట్లుగానే ఆడమంటూ రైఫిల్ రేంజ్‌కే తీసుకెళ్లే ఓదార్చే ప్రయత్నం చేశాడు. మన దేశంలో అభిమానులు ఒలింపిక్స్ క్రీడలకు అన్నింటికంటే చాలా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని... అందరి దృష్టీ వాటి ఫలితాలపైనే ఉండటం వల్ల అసలు సమయంలో తాను తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు సిఫ్ట్ చెప్పుకుంది. కోలుకునేందుకు కొంత సమయం పట్టినా... తాను వెనక్కి వెళ్లి ఫలితాన్ని మార్చలేను కాబట్టి ఇక ఆలోచించడం అనవసరం అని ఆమె భావించింది.

జాతీయ స్థాయి పోటీలతో...

దాదాపు ఆరు నెలల తర్వాత సిఫ్ట్ మళ్లీ షూటింగ్‌లో పోటీ పడేందుకు సిద్ధమైంది. అందుకు ముందుగా పెద్ద ఆలోచనలు పెట్టుకోకుండా జాతీయ క్రీడల్లో పాల్గొంది. ఆమె స్థాయికి ఈ క్రీడలు చిన్నవే అయినా... ఆరంభానికి ఇదే సరైందని సిఫ్ట్ భావించింది. సహజంగానే స్వర్ణం నెగ్గడంతో కాస్త ఆత్మవిశ్వాసం వచ్చింది. ఆ తర్వాత వరుసగా రెండు సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొని అగ్రస్థానంలో నిలిచింది. ఇక్కడ చేసిన 595 పాయింట్ల స్కోరు పారిస్‌లో సాధించి ఉంటే ఆమె ఫైనల్స్‌కు చేరేది! తాజా ప్రదర్శనతో అర్జెంటీనాలో జరిగే వరల్డ్ కప్ షూటింగ్‌కు సిఫ్ట్ ఎంపికైంది.

సవాల్‌ను అధిగమించి...

బ్యూనస్‌ఎయిర్స్‌లో కొత్తగా నిర్మించిన రేంజ్‌లో వరల్డ్ కప్ స్థాయి పోటీలు జరగడం ఇదే తొలిసారి. వాతావరణం, గాలి దిశ... ఇలా అన్నీ కొత్తగానే ఉండటంతో సిఫ్ట్ కాస్త ఆందోళన చెందింది. 16.1 డిగ్రీల ఉష్ణోగ్రతలో మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు పోటీలు మొదలైనా ఇంకా చలిగానే ఉంది. తమ సన్నాహాలతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నమైన పరిస్థితి. అయితే పట్టుదలగా ఆడి క్వాలిఫికేషన్‌ను ఆమె అధిగమించింది. ఆపై ఫైనల్ పోరులో మళ్లీ తడబాటు. 'నీలింగ్' పొజిషన్ ముగిసేసరికి ఆమె చివరి స్థానంలో ఉంది. 'ప్రోన్' పొజిషన్ కాస్త మెరుగ్గా ఆడినా ఆ తర్వాతా అదే ఆఖరి స్థానం! ఆ తర్వాత తనకిష్టమైన 'స్టాండింగ్' పొజిషన్‌కు ఆమె సిద్ధమైంది. అసాధారణ ప్రదర్శన కనబరిస్తే గానీ ముందుకెళ్లే అవకాశం లేదు. ఇలాంటి సమయంలో సిఫ్ట్ తన ఆటకు పదును పెట్టింది. అద్భుతంగా లక్ష్యంపైకి బుల్లెట్లు సంధిస్తూ దూసుకుపోయింది. తుది ఫలితం చూస్తే 458.6 పాయింట్ల స్కోరుతో సిఫ్ట్‌కు స్వర్ణ పతకం. 'నీలింగ్' ముగిసిన తర్వాత సిఫ్ట్‌కంటే ఏకంగా 7.2 పాయింట్లు ముందంజలో ఉన్న జర్మనీ షూటర్ అనితను వెనక్కి నెట్టిన సిఫ్ట్ అగ్రస్థానం సాధించడం విశేషం. ఇప్పుడు సిఫ్ట్ తర్వాతి లక్ష్యం వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్. నవంబర్‌లో జరిగే ఈ పోటీల్లో చెలరేగి భారత్ తరఫున తొలి స్వర్ణం సాధించిన మహిళగా నిలవాలని సిఫ్ట్ కౌర్ లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసమే ఇప్పుడు తీవ్ర సాధనను కొనసాగిస్తోంది.

ఐపీఎల్ ఫైనల్‌కు త్రివిధ దళాధిపతులు

ఆహ్వానం పంపిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ ఫైనల్‌కు ప్రత్యేక అతిథులను ఆహ్వానించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించింది. జూన్ 3న అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఫైనల్‌కు భారత త్రివిధ దళాధిపతులను ఆహ్వానించింది. జమ్మూకశ్మీర్ పహల్గాంలో ఉగ్ర దాడి అనంతరం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించి దాయాది దేశంలోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన నేపథ్యంలో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మంగళవారం వివరాలు వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత సైన్యంలోని ఉన్నతాధికారులు, సైనికులను ఐపీఎల్ ఫైనల్‌కు ఆహ్వానం పలకాలని నిర్ణయించాం. ఉగ్ర దాడి నేపథ్యంలో వారు చూపిన ధైర్య సాహసాలు అనన్య సమాన్యమైనవి. నిజమైన హీరోలను గౌరవించుకోవడం మన బాధ్యత. అందుకే ఐపీఎల్ ముగింపు వేడుకల్లో వారిని ప్రత్యేకంగా ఆహ్వానించాం. దేశభద్రతకు మించింది లేదు' అని సైకియా పేర్కొన్నారు. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నావల్ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్... 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతిచెందగా... దానికి బదులుగా త్రివిధ దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రస్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించాయి.



కార్ల్‌సన్ చేతిలో గుకేశ్ పరాజయం



స్టావెంజర్ (నార్వే): ప్రపంచ చదరంగ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ నార్వే చెస్ టోర్నమెంట్‌లో... ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) చేతిలో పరాజయం పాలయ్యాడు. నాలుగు గంటల పాటు సాగిన సుదీర్ఘ పోరులో భారత గ్రాండ్‌మాస్టర్ 55 ఎత్తుల్లో ఓడాడు. ఈ విజయంతో కార్ల్‌సన్ ఖాతాలో 3 పాయింట్లు చేరాయి. ఈ మ్యాచ్‌లో నల్లపావులతో ఆడిన ప్రపంచ నాలుగో ర్యాంకర్ గుకేశ్... కీలక సమయంలో తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి చైనా ప్లేయర్ వై యీతో క్లాసిక్ గేమ్‌ను 'డ్రా' చేసుకొని ఆర్మగెడాన్‌లో విజయం సాధించాడు. దీంతో అర్జున్ 1.5 పాయింట్లు ఖాతాలో వేసుకోగా... చైనా ప్లేయర్‌కు 1 పాయింట్ దక్కింది. ఈ టోర్నీ నిబంధనల ప్రకారం క్లాసికల్ ఫార్మాట్‌లో విజయం సాధించిన వారికి 3 పాయింట్లు లభిస్తాయి. క్లాసికల్ గేమ్ 'డ్రా' అయితే ఇరువురు ప్లేయర్లకు చెరో పాయింట్ దక్కుతుంది. ఆర్మగెడాన్‌లో గెలిచిన వారికి 0.5 పాయింట్ కేటాయిస్తారు. రెండో రౌండ్‌లో గుకేశ్‌తో అర్జున్ తలపడనున్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి... వైశాలీపై విజయం సాధించింది. ఈ టోర్నీలో పురుషుల, మహిళల విభాగాల్లో టాప్-6 ప్లేయర్లు పాల్గొంటున్నారు. పురుషుల విభాగంలో గుకేశ్, కార్ల్‌సన్, ఫాబియానో కరువా (అమెరికా), హికారు నకమురా (అమెరికా), అర్జున్, వై యీ (చైనా) పాల్గొంటుండగా... మహిళల విభాగం నుంచి ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా), లై టింగ్‌జీ (చైనా), హంపి, అన్న ముజీచుక్ (ఉక్రెయిన్), సరసాదత్ (ఇరాన్), వైశాలీ పాల్గొంటున్నారు. 'డబుల్ రౌండ్ రాబిన్' ఫార్మాట్‌లో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో ఒక్కో ప్లేయర్ తమ ప్రత్యర్థులతో రెండేసి మ్యాచ్‌లు ఆడనున్నారు.



మంగళవారం బీజింగ్‌లో టెక్ ఎగ్జిబిషన్లో రెండు సీట్లతో కూడిన అత్యాధునిక మల్టీకాప్టర్ విమానాన్ని ఆసక్తిగా చూస్తున్న సందర్శకులు



నేలపైనా, గాల్లోనూ నడిచే సింగిల్ సీటర్ గోవీ ఎయిర్‌కార్ తాలూకు ప్రొటో టైప్ వద్ద సందడి చేస్తున్న సందర్శకులు

బంగ్లాలో నిరసనల హోరు

- యూనస్ సర్కారుపై జనాగ్రహం
- దేశవ్యాప్త సమ్మెకు దిగిన టీచర్లు
- ఇప్పటికే పౌర సేవకుల ఆందోళనలు

ఢాకా: బంగ్లాదేశ్ అల్లర్లతో అట్టుడుకుతోంది. ముహమ్మద్ యూనస్ తాత్కాలిక సర్కారుపై జనాగ్రహం కట్టలు తెంచుకుంటోంది. దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. ఇప్పటికే సైన్యం నుంచి తీవ్ర రాజకీయ ఒత్తిడి ఎదుర్కొంటున్న సర్కారుకు ఇది రోకటిపోటుగా పరిణమించింది. పౌర సేవకుల సమ్మె నాలుగో రోజుకు చేరగా వేతన పెంపు డిమాండ్‌తో టీచర్లు కూడా నిరసన బాట పట్టారు. వారు వేల సంఖ్యలో నిరవధిక సమ్మెకు దిగారు. మే 5 నుంచి పాక్షికంగా పని చేస్తున్నవారు కూడా సోమవారం నుంచి పూర్తిగా విధులు నిలిపేశారు. దీనిపై యూనస్ సర్కారు మండిపడింది. ఆందోళనలను తక్షణం కట్టిపెట్టాలంటూ సోమవారం రాత్రి ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రభుత్వ చర్యపై ఉద్యోగులు మరింత మండిపడుతున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళనను దేశవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ విస్తరిస్తామని హెచ్చరించారు.

రాజకీయ గందరగోళం

కొన్ని వారాలుగా యూనస్ ప్రభుత్వం తీవ్రమైన రాజకీయ గందరగోళంలో పడిపోయింది. భారత్‌లో ప్రవాసంలో ఉన్న మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై నిషేధం తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. ప్రజల్లో అశాంతి పెరిగింది. వచ్చే డిసెంబర్ కల్లా మధ్యంతర ఎన్నికలు నిర్వహించాల్సిందేనని ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్ పట్టుబడుతుండగా 2026 జూన్‌కు ముందు కుదరదని సర్కారు అంటోంది. మరోవైపు కీలక సంస్కరణలకు పార్టీలు మద్దతివ్వకపోవడంతో యూనస్ అలిగారు. రాజీనామా చేస్తానని బెదిరించినా తర్వాత వెనక్కు తగ్గారు. అధికారాన్ని నిలుపుకోవడానికే తాత్కాలిక ప్రభుత్వం ఎన్నికలను ఆలస్యం చేస్తోందంటూ బేగం ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ ఢాకాలో భారీ నిరసనలకు దిగింది. దాంతో యూనస్‌కు మద్దతుగా ఆయన అనుయాయులు విద్యార్థుల సారథ్యంలో మే 24న మార్చ్ నిర్వహించారు.

క్వారంటైన్‌లోకి శుభాన్షు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్న భారత వ్యోమగామి శుభాన్షు శుక్లాకు చివరి ఐసోలేషన్ ప్రక్రియ మొదలైంది. ఆగ్జియం మిషన్-4 (యాక్స్-4)కు సన్నాహకంగా ముగ్గురు సహచరులతో కలిసి కలిసి ఆయన ప్రీ-లాంచ్ క్వారంటైన్‌లోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆగ్జియం స్పేస్ ఉద్యోగులు వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మిషన్ విజయవంతమవుతుందని శుక్లా ధీమా వెలిబుచ్చారు. ఈ మిషన్‌ను జూన్ 8న అమెరికాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించనున్నారు. నాసా సీనియర్ వ్యోమగామి, ఆగ్జియం స్పేస్ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ డైరెక్టర్ పెగ్గీ విట్సన్ దీనికి నేతృత్వం వహిస్తున్నారు. నౌకకు పైలట్‌గా వెళ్తున్న శుక్లా ఐఎస్ఎస్‌లో అడుగు పెట్టిన తొలి భారతీయ వ్యోమగామి కానున్నారు. వీరితో పాటు పోలండ్‌కు చెందిన స్లావోజ్ ఉజ్నాన్‌స్కీ-విస్నియోవ్‌స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కాపు బృందంలో ఉన్నారు. వారిద్దరికీ కూడా ఇది తొలి అంతరిక్షయానం. అలా ఈ మిషన్ భారత్‌కే గాక పోలండ్, హంగరీలకు కూడా ఎంతో ముఖ్యమైనది.

ఐసోలేషన్ ఎందుకు?

ప్రీ లాంచ్ క్వారంటైన్ వ్యోమగాములకు కీలకమైన ప్రొటోకాల్. అంతరిక్షంలో గడపటం పలు సవాళ్లతో కూడిన విషయం. వ్యోమగాములకు అనారోగ్యం వంటివి ఉంటే అది మిషన్‌నే కాకుండా ఇప్పటికే ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములనూ ప్రభావితం చేస్తుంది. గురుత్వాకర్షణ శక్తి లేని చోట వ్యోమగాముల రోగనిరోధక శక్తి మరింత బలహీనపడి ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదముంటుంది. అందుకే వ్యోమగాముల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి దీనిని నిర్వహిస్తారు. ప్రయోగానికి 14 రోజుల ముందుకాలం క్వారంటైన్ ఉంటుంది. ఈ సమయంలో వ్యోమగాములు ప్రయోగ ప్రదేశానికి సమీపంలో ఉంటారు. ఒక చిన్న సహాయక బృందం కూడా వారికి అందుబాటులో ఉంటుంది. కఠినమైన ఒంటరితనం, మెరుగైన పరిశుభ్రత చర్యలు, రోజువారీ ఆరోగ్య పర్యవేక్షణ ఉంటాయి. తుది మిషన్ బ్రీఫింగ్‌లు, శిక్షణ, వ్యాయామాలు నిర్వహిస్తారు. సిబ్బందిలో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వారిని మరింత ఒంటరిగా ఉంచి నిశితంగా పర్యవేక్షిస్తారు.

ఎవరెస్ట్ మ్యాన్ కొత్త రికార్డు

31వసారి అధిరోహించిన షెర్పా



కఠ్మాండు: ఎవరెస్ట్ మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న నేపాలీ పర్వతారోహకుడు 55 ఏళ్ల కామి రీటా కొత్త చరిత్ర సృష్టించాడు. ప్రపంచంలోకెల్లా ఎత్తైన ఆ శిఖరాన్ని 31వసారి అధిరోహించాడు. ఎవరెస్టును అత్యధికసార్లు అధిరోహించిన వ్యక్తిగా సొంత రికార్డునే బద్దలు కొట్టారు. భారత సైనికాధికారుల బృందానికి మార్గనిర్దేశం చేస్తూ మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు కామి ఎవరెస్టును అధిరోహించాడు. కామి నేపాల్‌లోని సోలుకుంబ్ సమీపంలోని థామే గ్రామంలో జన్మించాడు. తన జీవితాన్ని పర్వతారోహణకే అంకితం చేశాడు. 1994లో ఒక వాణిజ్య యాత్రకు మార్గదర్శకునిగా తొలిసారి ఎవరెస్టును అధిరోహించారు. అప్పటి నుంచి దాదాపు ఏటా ఆ ఘనత సాధిస్తూ వచ్చారు. 2023, 2024ల్లోనైతే రెండేసిసార్లు ఎక్కారు. మరో నేపాలీ షెర్పా పసంగ్ దావా 29సార్లు ఎవరెస్టును ఎక్కారు. ''నారికార్డులతో సంతోషంగా ఉన్నా. కానీ రికార్డులు చివరికి బద్దలవుతాయి. నా రికార్డులు ప్రపంచ వేదికపై నేపాల్ గుర్తింపుకు దోహదపడటం సంతోషంగా ఉంది'' అని కామి అన్నాడు. బ్రిటిష్ పర్వతారోహకుడు కెంటన్ కూల్ ఇటీవలే 19వసారి ఎవరెస్టు ఎక్కారు. దాన్ని అత్యధికసార్లు అధిరోహించిన షెర్పాయేతర వ్యక్తిగా స్వీయ రికార్డునే బద్దలు కొట్టారు. ఎవరెస్టు ఎక్కే సీజన్ త్వరలో ముగియనుంది. ఈ ఏడాది 500 మందికి పైగా ఎవరెస్టును విజయవంతంగా అధిరోహించారు. ఎవరెస్ట్‌తో సహా పలు ఇతర శిఖరాలను ఎక్కడానికి నేపాల్ ఈ సీజన్‌లో 1,000కి పైగా పర్మిట్లు జారీ చేసింది. ఇటీవల ఎవరెస్ట్ ఎక్కేవారి సంఖ్య పెరగడం పర్యావరణ ఆందోళనలకు దారితీసింది.

విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తారా?

మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల తీరుపై బాంబే హైకోర్టు ఆగ్రహం

భారత్-పాక్‌లో ఘర్షణలపై పోస్టు పెట్టిన విద్యార్థికి బెయిల్

ముంబై: భారత్-పాకిస్తాన్ ఘర్షణలపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన కేసులో అరెస్టయిన పుణే విద్యార్థి(19)కి బాంబే హైకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ విద్యార్థి పట్ల మహారాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తమను దిగ్భ్రాంతికి గురిచేసినట్లు పేర్కొంది. ఆమె పట్ల అంత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించింది. సదరు విద్యార్థిని వెంటనే విడుదల చేయాలని, కాలేజీలో పరీక్షలు రాసేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ గౌరీ గాడ్సే, జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు అరెస్టు చేయడం దారుణమని న్యాయస్థానం తప్పుపట్టింది. ఆమెను కరడుగట్టిన నేరస్తురాలిగా పరగణించారని విమర్శించింది. ఈ విద్యార్థి జీవితాన్ని నాశనం చేయాలనుకున్నారా? అంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేసింది.

అసలేం జరిగింది?

భారత్-పాకిస్తాన్ ఘర్షణలు, ఆపరేషన్ సిందూర్‌పై తన అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ పుణే విద్యార్థి సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఈ పోస్టు వివాదాస్పదంగా మారింది. దాంతో ఆ విద్యార్థి తన పొరపాటును అంగీకరిస్తూ, క్షమాపణ చెప్పారు. ఆ పోస్టును తొలగించారు. అయినప్పటికీ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఆమెను తమ కాలేజీ నుంచి తొలగిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. కాలేజీ యాజమాన్యం నిర్ణయాన్ని సవాలు చేయడంతోపాటు ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని, జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ బాధితురాలు తొలుత స్థానిక కోర్టును ఆశ్రయించారు. ఆమె విజ్ఞప్తిని స్థానిక కోర్టు తిరస్కరించడంతో బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్ బాధితురాలికి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. క్షమాపణ చెప్పి, పోస్టును తొలగించారు కాబట్టి ఆమెను అరెస్టు చేసి ఉండాల్సింది కాదని అభిప్రాయపడింది. ఆమెను కళాశాల నుంచి తొలగిస్తూ జారీ చేసిన ఆర్డర్‌ను రద్దు చేసింది. పరీక్ష రాసేందుకు హాల్ టికెట్ ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని ఆదేశించింది. దేశ ప్రయోజనాలకు భంగం కలిగేలా పోస్టులు చేయడం సరైంది కాదని విద్యార్థికి హితవు పలికింది. ఆమె ప్రస్తుతం పుణేలోని ఎరవాడ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

ఉగ్రవాదం, రక్తపాతం కశ్మీర్‌లో పర్యాటకాన్ని ఆపలేవు

సీఎం ఒమర్ అబ్దుల్లా ధీమా

- పహల్గాంలో మంత్రివర్గ ప్రత్యేక భేటీ

శ్రీనగర్: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో డీలా పడ్డ జమ్మూ కశ్మీర్ పర్యాటకానికి పూర్వ వైభవం తేవడానికి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రయత్నాలు ప్రారంభించారు. మంగళవారం పహల్గాంలోని క్లబ్‌లో మంత్రివర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదుల పిరికి చర్యలు లోయలో పర్యాటకాన్ని అడ్డుకో జాలవన్నారు. ''ఇది లాంఛనప్రాయ మంత్రివర్గ భేటీ కాదు. ఉగ్రవాదం, రక్తపాతం కశ్మీర్‌లో పర్యాటకాన్ని, ఆనందాన్ని, అభివృద్ధిని ఆపలేవనే సందేశమివ్వడానికే ఇక్కడికి వచ్చాం. పహల్గాం ఉగ్ర దాడితో ఈ ప్రాంతంలో సందర్శకుల భద్రతపై భయాలు తలెత్తాయి. స్థానిక ఆర్థిక వ్యవస్థలో పర్యాట కమే కీలకం. జమ్మూ కశ్మీర్‌లో వేలాది కుటుంబాలకు పర్యాటకమే జీవనాధారం. కనుక ఈ ప్రాంతంలో ఘర్షణలు లేని వాతావరణం నెలకొనాలి'' అని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కూడా అన్నివి ధాలా అండగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చినట్టు చెప్పారు. పహల్గాం మారణ హోమం తర్వాత జమ్మూ కశ్మీర్ ప్రజలు, ముఖ్యంగా పహల్గాం వాసులు చూపిన ధైర్యాన్ని ఒమర్ ప్రశంసించారు. ఉగ్రవా దానికి వ్యతిరేకంగా గొంతెత్తినందు కు, అది సృష్టించిన భయోత్పాతానికి లొంగనందుకు వారికి కృతజ్ఞతలు తెలిపేందుకు మంత్రివర్గ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ''శత్రువులు మన సంకల్పాన్ని ఎప్పటికీ నీరుగార్చలేరు. జమ్మూ కశ్మీర్ దృఢంగా, బలంగా, నిర్భయంగా నిలుస్తుంది'' అన్నా రు. కేబినెట్ భేటీ ఫొటోలను సీఎం కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది.



పహల్గాంలో సెల్ఫీ తీసుకుంటున్న జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

'నెలసరి'పై అవాస్తవాల దాడి

సోషల్ మీడియాలో విచ్చలవిడిగా తప్పుడు సమాచారం

ఇన్‌ఫ్లుయెన్సర్ల సలహాలతో మహిళలకు అనారోగ్య సమస్యలు

'ఎవర్‌టీన్ మెన్‌స్ట్రువల్ హైజీన్ సర్వే'లో వెల్లడి

న్యూఢిల్లీ: ఆధునిక కాలంలో సామాజిక మాధ్యమాల ప్రభావం విపరీతంగా పెరిగిపోతోంది. ఫేసుబుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ తదితర వేదికలపై లెక్కలేనంత సమాచారం అందుబాటులో ఉంది. ఆరోగ్యానికి సంబంధించి చాలామంది నిపుణులు సోషల్ మీడియాలో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. డాక్టర్లు సైతం తమ అనుభవాలు పంచుకుంటున్నారు. ఈ సమాచారం ప్రజలకు ఉపయోగపడుతోంది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ మరోవైపు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారమే అధికంగా వ్యాప్తిలో ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇన్‌ఫ్లుయెన్సర్ల ముసుగులో కొందరు మిడిమిడి జ్ఞానంతో ఇస్తున్న సమాచారం ప్రాణాంతకంగా మారుతోంది. భారత్‌లో నెలసరికి(పీరియడ్స్) సంబంధించిన వివరాలు, సలహాల కోసం మహిళలు సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడుతున్నట్లు తాజా సర్వేలో తేలింది. తప్పుడు సమాచారం మహిళల నెలసరి ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నట్లు వెల్లడయ్యింది. అందుకే మహిళలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏదైనా సరే ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకోవాలని చెబుతున్నారు. బుధవారం 'మెన్‌స్ట్రువల్ హైజీన్ డే'. ఈ నేపథ్యంలో మహిళల నెలసరి ఆరోగ్యంపై ఇటీవల 'ఎవర్‌టీన్ మెన్‌స్ట్రువల్ హైజీన్ సర్వే'నిర్వహించారు. సర్వేలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, పంజాబ్, ఒడిశా, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, జమ్మూకశ్మీర్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో 1,152 మంది మహిళలను ప్రశ్నించారు. వీరిలో 72.4 శాతం మంది 19 నుంచి 35 ఏళ్లలోపువారే ఉన్నారు. 76.6 శాతం మంది గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఈ సర్వేలో ఏం తేలిందంటే.

- నెలసరికి సంబంధించిన సోషల్ మీడియాలో తగినంత సమాచారం అందుబాటులో ఉన్నట్లు 71.6 శాతం మహిళలు నమ్ముతున్నారు.
- ఇండియాలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు మహిళలు సోషల్ మీడియాపై ఆధారపడుతున్నారు. పీరియడ్స్ గురించి ఇన్‌ఫ్లుయెన్సర్లు, బ్లాగర్లు ఇచ్చే సమాచారాన్ని విశ్వసిస్తున్నారు. నెలసరి శుభ్రతపై వారు చక్కటి అవగాహన కల్పిస్తున్నట్లు భావిస్తున్నారు.
- మెన్‌స్ట్రువల్ అత్యవసర పరిస్థితుల్లో సమాచారం కోసం 11.5 శాతం మంది సోషల్ మీడియాపై ఆధారపడుతున్నారు.
- తప్పుదోవ పట్టించే లేదా ప్రమాకరమైన సమాచారం సైతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. దీనవల్ల తాము శారీరకంగా, మానసికంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నట్లు మహిళలు చెప్పారు.
- పీరియడ్స్ ఆలస్యం కావడం అనేది పాలిసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్(పీసీఓడీ)కు సంకేతమని కొందరు బ్లాగర్లు చెబుతున్నారు. ఇందులో ఎంతమాత్రం నిజం లేదు.
- నెలసరి సమయంలో నొప్పి అధికంగా ఉంటే నిమ్మరసం లేదా కాఫీ తాగాలన్నది కొందరి సలహా. కానీ, అలా చేస్తే నొప్పి తగ్గకపోగా మరింత పెరుగుతుంది.
- నెలసరి వచ్చినప్పుడు వ్యాయామం చేయడం చాలా ప్రమాదకరం అంటూ మరికొందరు హెచ్చరిస్తున్నారు. నిజానికి ఆ సమయంలో వ్యాయామం చేస్తే నొప్పి, చికాకు నుంచి ఉపశమనం లభిస్తుంది. మానసిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుంది. ఇందుకు శాస్త్రీయమైన ఆధారాలు కూడా ఉన్నాయి.
- నెలసరిలో విడుదలయ్యే రక్తం అపవిత్రమైందని, ఆ సమయంలో దేవాలయాలకు వెళ్లొద్దని, ఇళ్లల్లో పచ్చళ్లు కూడా ముట్టుకోవద్దని, ఇతరులకు దూరంగా ఉండాలన్న అభిప్రాయం ఇప్పటికే సమాజంలో పాతుకుపోయింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇలాంటి మూఢవిశ్వాసాలను మరింత పెంచేస్తున్నారు. కొత్తకొత్తవి జోడిస్తూ మహిళలను ఆందోళనకు గురి చేస్తున్నారు.
- పీరియడ్స్ వచ్చినప్పుడు ఫలానా ఆహారం తీసుకోవాలని లేదా తీసుకోవద్దని చెబుతున్నారు. కానీ, అందుకు ఎలాంటి ఆధారాలు లేవు. నెలసరి సమయంలో భాగస్వామితో కలిస్తే గర్భం రాదు అనేది తప్పుడు అభిప్రాయమేనని నిపుణులు అంటున్నారు.
- మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సోషల్ మీడియాలో కచ్చితత్వం, వాస్తవాలతో కూడిన, నిర్ధారించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాన్ హెల్త్‌కేర్ సంస్థ సీఈఓ చిరాగ్‌పాన్ సూచించారు.
- నెలసరి శుభ్రత కోసం శానిటరీ ప్యాడ్స్ ఉపయోగిస్తున్నట్లు 87.8 శాతం మంది చెప్పారు. 5.7 శాతం మంది డిస్పోజబుల్ పీరియడ్ ప్యాంటీస్, 4.7 శాతం మంది మెన్‌స్ట్రువల్ కప్స్, 1.6 శాతం మంది టాంపోన్స్ వాడుతున్నట్లు సర్వేలో వెల్లడయ్యింది.

కాల్పుల విరమణ లేదు

'అమెరికా ఒప్పందం' నిజం కాదు: ఇజ్రాయెల్

జెరూసలేం: అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ తాజాగా గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించారని, తామందుకు అంగీకరించామని వచ్చిన వార్తలను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. ''అమెరికా ఎలాంటి ప్రతిపాదనా చేయలేదు. మా ప్రభుత్వం ఆమోదించలేదు'' అని ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపారు. మధ్యవర్తుల ద్వారా అందిన కాల్పుల విరమణ ప్రతిపాదనకు హమాస్ అంగీకరించిందని పాలస్తీనా అధికారి ఒకరు అంతకుముందు చెప్పడం తెలిసిందే. ''70 రోజుల కాల్పుల విరమణ, గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాల పాక్షిక ఉపసంహరణ జరగాలి. బదులుగా రెండు విడతలుగా పదేసి మంది ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేయాలని ప్రతిపాదనలో ఉంది'' అని సదరు అధికారి తెలిపారు. కానీ ఈ ఒప్పందాన్ని విట్కాఫ్, లేదా అమెరికా ప్రతిపాదించలేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ముగిసినప్పటి నుంచీ గాజాపై దాడిని ఇజ్రాయెల్ తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో మిగతా బందీలందరినీ విడుదల చేయడానికి సిద్ధమని, గాజా నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా వైదొలిగితే శాశ్వత కాల్పుల విరమణ సమ్మతమేనని హమాస్ తెలిపింది. నెతన్యాహు మాత్రం ఇజ్రాయెల్ తాత్కాలిక కాల్పుల విరమణకు మాత్రమే అంగీకరిస్తుందని స్పష్టం చేశారు. హమాస్‌ను నిర్మూలించాకే యుద్ధం ముగుస్తుందని ప్రతిజ్ఞ చేశారు.

ఇద్దరు ఎమ్మెల్యేలపై బీజేపీ బహిష్కరణ వేటు

బెంగళూరు: కర్ణాటకలో బీజేపీ తమ ఇద్దరు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఆరేళ్ల పాటు పార్టీ నుంచి యశ్వంత్‌పుర ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్‌ను, యెల్లాపూర్ ఎమ్మెల్యే ఎ.శివరాం హెబ్బార్‌ను బహిష్కరిస్తున్నట్లు కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర తెలిపారు. సుదీర్ఘ చర్చ తర్వాత పార్టీ అగ్రనాయకత్వం ఈ నిర్ణయం తీసుకుందని విజయేంద్ర చెప్పారు. సోమశేఖర్, హెబ్బార్ గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండే వారు. హెచ్‌డీ కుమారస్వామి సారథ్యంలోని కాంగ్రెస్-జేడీఎస్ కూటమి సర్కార్‌ను 2019లో కూలదోసిన 18 మంది కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేల్లో సోమశేఖర్, హెబ్బార్ సైతం ఉన్నారు. ఆనాటి చర్యకు శిక్షగా కాంగ్రెస్ వీరిని అనర్హులుగా ప్రకటించగా ఇద్దరూ బీజేపీలో చేరారు. 2023లో బీజేపీ టికెట్‌తో ఇద్దరూ గెలిచినా మళ్లీ కాంగ్రెస్‌తో అంటకాగుతున్నారని బీజేపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. తరచూ సిద్దరామయ్య సారథ్యంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇద్దరూ బహిరంగంగానే పొగిడారని బీజేపీ శ్రేణులు ఆగ్రహంవ్యక్తంచేశాయి. ఈ నేపథ్యంలోనే ఇద్దరిపై కమలదళం బహిష్కరణ వేటు వేసింది. బహిష్కరణపై ఎమ్మెల్యేలిద్దరూ ఇంకా స్పందించలేదు.

కన్నడకు మాతృక తమిళమే

కమల్ వ్యాఖ్యలపై కర్నాటకలో దుమారం

చెన్నై: కన్నడ భాషకు తమిళమే మాతృక అంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగుతోంది. ఆదివారం చెన్నైలో జరిగిన తన సినిమా థగ్‌లైఫ్ ఆడియో విడుదల వేడుకలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాటిని నిరసిస్తూ మంగళవారం కర్నాటకవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు జరిగాయి. కమల్ వ్యాఖ్యలను పలు కన్నడ సంఘాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. లేదంటే కర్నాటకలో కమల్ సినిమాలను బహిష్కరిస్తామని కన్నడ రక్షణ వేదిక హెచ్చరించింది. బెంగళూరు వ్యాప్తంగా థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను నిరసనకారులు చించేశారు. ఆ సినిమాను రాష్ట్రంలో నిషేధించాలని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం బెంగళూరులో జరిగిన థగ్‌లైఫ్ ప్రీ రిలీజ్ కార్యక్రమ వేదిక వద్ద భారీ సంఖ్యలో గుమిగూడారు. కమల్‌పై నల్ల ఇంకు పోస్తామంటూ హెచ్చరించారు. తమకు భయపడి ఆయన వేడుకకు గైర్హాజరయ్యారని ఎద్దేవా చేశారు. కర్నాటక బీజేపీ అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తదితరులు కమల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

కాపీ కొట్టే తెలివైనా లేదు!

పాక్ ఆర్మీ చీఫ్‌పై అసద్ విసుర్లు

కువైట్: పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌కు కనీసం కాపీ కొట్టే తెలివితేటలు కూడా లేవని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎద్దేవా చేశారు. 2019లో చైనా చేపట్టిన సైనిక విన్యాసాల తాలూకు ఫొటోను భారత్‌పై పాక్ సైన్యం తాజాగా చేసిన దాడిగా చిత్రిస్తూ ప్రధాని షహబాజ్ షరీఫ్‌కు ఇచ్చి మునీర్ నవ్వులపాటు కావడం తెలిసిందే. దీన్ని మూర్ఖత్వానికి పరాకాష్టగా అసద్ అభివర్ణించారు. 'నకల్ కర్నే కే లియే అకల్ చాహియే (కాపీ కొట్టాలన్నా కాస్త తెలివితేటలుండాలి)'అంటూ ఎగతాళి చేశారు. పాక్ తప్పుడు ప్రచారాన్ని ప్రపంచం నమ్మొద్దన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్ష బృందంలో భాగంవగా కువైట్‌లో పర్యటిస్తున్న ఆయన అక్కడి భారతీయులతో మంగళవారం మాట్లాడారు. ''పాక్ ఆర్మీ చీఫ్ వంటి తెలివితక్కువ జోకర్లు భారత్‌తో పోటీ పడాలనుకుంటున్నారు. కనీసం కాపీ కొట్టే మెదడు కూడా లేదు వాళ్లకు''అన్నారు.

చైనా రసాయన ప్లాంట్‌లో భారీ పేలుడు

ఐదుగురు సజీవదహనం: 19 మందికి గాయాలు

బీజింగ్: చైనాలోని షాంగ్డాంగ్ ప్రావిన్సులోని ప్రభుత్వరంగ షాంగ్డాంగ్ యుదావో రసాయన కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పారిశ్రామిక ప్రమాదంలో ఐదుగురు సజీవదహనమయ్యారు. 19 మంది గాయపడ్డారు. మరో ఆరుగురి జాడ తెలియాల్సి ఉంది. గవోమీ సిటీలో మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ భారీ పేలుడు తీవ్రత ధాటికి కిలోమీటర్ల దూరంలోని భవనాల అద్దాల కిటికీలు పగిలిపోయాయి. పేలుడు సమయంలో ఫ్యాక్టరీ నుంచి పుట్టగొడుగు ఆకృతిలో ఒక భారీ పొగమేఘం గాల్లోకి ఎగసిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో షేర్ అవుతున్నాయి. 232 మంది అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. పురుగుమందుల తయారీలో వాడే క్లోరోపైరిఫోస్ పెస్టిసైడ్‌ను ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఈ షాంగ్డాంగ్ యుదావో కెమికల్ సంస్థే తయారుచేస్తోంది.

గంటల పాటు గాల్లో ప్రాణాలు

చెన్నై: సరదాగా ఎక్కిన జాయ్‌రైడ్ కాస్తా 30 మందిని చావు నోట్లోకి తీసుకెళ్లింది. ఈ ఉదంతం తమిళనాడు రాజధాని చెన్నైలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈస్ట్‌కోస్ట్ రోడ్డులోని ఓ అమ్యూజ్‌మెంట్ పార్కులో వారంతా సరదాగా జాయ్ రైడ్ ఎక్కారు. గాల్లో దూసుకుపోతుండగా ఇంజన్ మొరాయించడంతో 50 అడుగుల పైచిలుకు ఎత్తులో ఉన్నట్టుండి ఆగిపోయింది. మూడు గంటలకు పైగా అలాగే నిలిచిపోయింది. దాంతో 30 మందీ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. వారిలో చాలామంది స్త్రీలు, పిల్లలే. సాయంత్రం ఆరింటికి ఉదంతం జరిగితే రాత్రి 9.30కు గానీ వారిని కాపాడే ప్రయత్నాలు మొదలు కాలేదు! 50 అడుగుల ఎత్తున చిక్కుబడ్డవారిని సురక్షితంగా కిందికి తీసుకొచ్చేందుకు ఫైర్, రెస్క్యూ సేవల విభాగాలు శ్రమిస్తున్నాయి. భారీ క్రేన్ సాయంతో వారందరినీ ఒక్కొక్కరుగా కిందకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి.

కాల్పుల్లో మావోయిస్ట్ కమాండర్ మృతి

మేదినీనగర్/దుమ్ముగూడెం: జార్ఖండ్‌లో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మంగళవారం పలామూ జిల్లాలో భద్రతా దళాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో నిషేధిత సీపీఐ(మావోయిస్ట్) కమాండర్ తులసీ భూయియాన్ మృతిచెందినట్లు పలాము జిల్లా ఎస్పీ రేష్మా రమేశన్ తెలిపారు. హుస్సేనాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బర్వాహీ, నయ్యా గ్రామాల మధ్య మావోయిస్టుల సంచారం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందటంతో జార్ఖండ్ జాగ్వర్, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసుల బృందం కూంబింగ్ మొదలెట్టింది. హఠాత్తుగా బలగాలు ఎదురుపడటంతో మావోయిస్టులు కాల్పులు మొదలుపెట్టారు. భద్రతాబలగాలు వెంటనే స్పందించి ఎన్‌కౌంటర్ మొదలెట్టాయి. ఎన్‌కౌంటర్‌లో మరో మావోయిస్ట్ నితేశ్ యాదవ్ గాయపడినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలి నుంచి రైఫిల్‌సహా కొన్ని ఆయుధాలను బలగాలు స్వాధీనంచేసుకున్నాయి. లాతేహార్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ మనీశ్ యాదవ్ మృతిచెందారు. ఇతని తలపై రూ.5 లక్షల రివార్డ్ ఉంది. ఈ ఘటనలో జోనల్ కమాండర్ కుందన్ సింగ్ ఖర్వార్‌ను అరెస్టుచేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 18 మంది మావోయిస్టులు మంగళవారం లొంగిపోయారు. వారిలో నలుగురు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ సభ్యులుకాగా మిగిలిన వారు సాధారణ కార్యకర్తలు.

ప్రధాని రాజీనామా చేస్తే మంత్రి మండలి రద్దవుతుందా?

ప్రధాన మంత్రి-మంత్రి మండలి

రాజ్యాంగ రీత్యా దేశాధిపతి రాష్ట్రపతి అయితే ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రి మండలి వాస్తవమైన కార్యనిర్వాహక అధికారాలను కలిగి ఉంటుంది. భారతదేశంలో బ్రిటిష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థ ఉంది. దీన్నే 'వెస్ట్ మినిస్టర్' పద్ధతి అంటారు. (వెస్ట్ మినిస్టర్ అనేది ఇంగ్లండ్‌లో ఒక ప్రాంతం. అక్కడే పార్లమెంటు భవనం ఉంది. అందువల్ల దీనికి ఆ పేరు వచ్చింది.)

రాజ్యాంగ స్థానం

భారత రాజ్యాంగంలోని 5వ భాగంలో ప్రకరణలు 74, 75, 78లో ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలికి సంబంధించిన వివరాలను పొందుపరిచారు.

ప్రకరణ 74(1): రాష్ట్రపతికి తన విధి నిర్వహణలో సహాయం, సలహాలను అందించడానికి ప్రధాన మంత్రి అధ్యక్షతన మంత్రి మండలి ఉంటుంది. వీరి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలి.

ప్రత్యేక వివరణ: మౌలిక రాజ్యాంగంలో మంత్రి మండలి సలహాను రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలి అని అర్థం వచ్చేలా ఎలాంటి పదబంధం లేదు. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణకు 'షల్' (Shall) అనే పదం చేర్చారు. దీని ప్రకారం మంత్రి మండలి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 74లో మరో అంశాన్ని చేర్చారు. మంత్రి మండలి నిర్ణయాన్ని రాష్ట్రపతి పునర్ పరిశీలనకు పంపవచ్చు. పునర్ పరిశీలనకు పంపిన అంశాలను మంత్రి మండలి మార్చు చేయవచ్చు, చేయకపోవచ్చు. రెండో పర్యాయం రాష్ట్రపతి ఆమోదానికి పంపితే ఆ అంశాలను ఆయన తప్పకుండా ఆమోదించాలి.

ప్రకరణ 74(2) ప్రకారం మంత్రిమండలి రాష్ట్రపతికి ఏ సలహా ఇచ్చారో, ఆ సలహా ఎందుకు ఇచ్చారో న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలు లేదు.

నియామకం

- ప్రకరణ 75(1) ప్రకారం ప్రధాన మంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు. అదేవిధంగా ప్రధాని సలహా మేరకు ఇతర మంత్రులను కూడా నియమిస్తారు.
- ప్రకరణ 75(1ఎ) ప్రకారం కేంద్రంలో మంత్రిమండలి సంఖ్య, ప్రధాన మంత్రితో కలిపి లోక్‌సభ సభ్యుల మొత్తం సంఖ్యలో 15 శాతానికి మించరాదు.
- ప్రకరణ 75(1బి) ప్రకారం ఏదైనా గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం అనర్హుడైతే,

> భారత రాజ్యాంగం పార్లమెంటరీ లేదా మంత్రివర్గ పాలిత ప్రభుత్వాన్ని నిర్దేశించింది. పార్లమెంటరీ వ్యవస్థ ముఖ్య లక్షణం రెండు రకాలైన అధిపతులు ఉండటం. రాజ్యాంగ పరంగా ఉండే రాష్ట్రపతికి నామమాత్ర అధికారాలు ఉంటే, ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రిమండలి అన్ని అధికారాలను చెలాయిస్తుంది.

అతడిని మంత్రిగా నియమించరాదు. ఈ అనర్హత అతడు మంత్రిగా ఉన్న కాలంలో జరిగితే, అది అతడి సభ్యత్వ కాలం ముగిసేంత వరకు కొనసాగుతుంది. ఒకవేళ తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిస్తే, అంతటితో అనర్హత ముగుస్తుంది.

గమనిక: 75(1ఎ), (1బి) క్లాజులను 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

- ప్రకరణ 75(2) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు ప్రధాన మంత్రి, మంత్రి మండలి పదవుల్లో కొనసాగుతారు.
- ప్రకరణ 75(3) ప్రకారం మంత్రులు సంయుక్తంగా లోక్‌సభకు బాధ్యత వహిస్తారు.
- ప్రకరణ 75(4) ప్రకారం, మంత్రులందరూ తమ పదవిలోకి ప్రవేశించే ముందు మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న నమూనా ప్రకారం రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేయాలి.
- ప్రకరణ 75(5) ప్రకారం ఎవరైనా వ్యక్తి మంత్రి పదవి చేపట్టాక ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక కాకుంటే ఆయన మంత్రి పదవిని కోల్పోతారు.
- ప్రకరణ 75(6) ప్రకారం మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది. వీటి ప్రస్తావన రెండో షెడ్యూల్‌లో ఉంది.

ప్రధాని నియామకానికి సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేకమైన ప్రక్రియ గురించి పేర్కొనలేదు. పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం, లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడిని రాష్ట్రపతి ఆహ్వానించి, ప్రధాన మంత్రిగా నియమించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరతారు. లోక్‌సభలో ఏ రాజకీయ పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ సీట్లు లభించనప్పుడు రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పరిచే క్రమంలో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీ లేదా పార్టీల కూటమి నాయకుడిని ప్రధానిగా నియమించి, మెజారిటీ నిరూపించుకోమని కోరతారు.

ఉదాహరణకు 1979లో నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు చరణ్‌సింగ్‌ను ప్రధానిగా



గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

నియమించడం కొంత వివాదానికి దారితీసింది. నాటి ప్రతిపక్ష నాయకుడైన వై.బి.చవాన్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సంజీవరెడ్డి ఆహ్వానించారు. కానీ, చవాన్ తన అశక్తతను వ్యక్తపరిచారు. ఈ పరిస్థితిలో జగ్జీవన్‌రామ్‌ను విస్మరించి చరణ్‌సింగ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని ఆహ్వానించడం వివాదానికి కారణమైంది. అయితే చరణ్‌సింగ్ లోక్‌సభ సమావేశాలకు హాజరు కాకుండానే ప్రధాని పదవికి రాజీనామా చేశారు.

ఈ విధంగా లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ లేకుండా 1989లో వి.పి.సింగ్, 1990లో చంద్రశేఖర్, 1991లో పి.వి. నరసింహారావు, 1996లో ఎ.బి.వాజ్‌పేయి, 1996లో దేవెగౌడ, 1997లో ఐ.కె. గుజ్రాల్, 1998లో ఎ.బి. వాజ్‌పేయి, 2004, 2009లో మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రులుగా నియమితులయ్యారు.

సుప్రీం కోర్టు తీర్పులు: మెజారిటీ కోల్పోయిన ప్రధాన మంత్రి రాజీనామా చేసి, తదనంతరం లోక్‌సభ రద్దయితే, ఆ వ్యక్తిని ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగించి పరిపాలన చేయవచ్చు. అయితే విధాన నిర్ణయాలు చేయరాదని 1971లో యు.ఎన్.రావు Vs ఇందిరా గాంధీ కేసు సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

ప్రధాన మంత్రి అర్హతలు: రాజ్యాంగంలో ప్రధాన మంత్రి పదవికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక అర్హతలు గురించి పేర్కొనలేదు. అయితే పార్లమెంట్‌లో సభ్యుడిగా ఉండాలి. నియమితులయ్యే సమయానికి పార్లమెంటులో సభ్యత్వం లేకపోతే నియామకం పొందిన రోజు నుంచి ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికవ్వాలి.

ప్రత్యేక వివరణ: రాజ్యాంగపరంగా ప్రధాన మంత్రిగా నియమితులవడానికి పార్లమెంటు సభ్యుడైతే చాలు. సాధారణంగా ప్రధానమంత్రి లోక్ సభలో సభ్యుడై ఉండాలి. రాజ్య సభలో సభ్యులుగా ఉండి ప్రధాన మంత్రులైనవారు ఇందిరా గాంధీ (1966), దేవెగౌడ (1996), ఇందర్ కుమార్ గుజ్రాల్ (1997), మన్మోహన్ సింగ్ (2004, 2009).

ప్రధాని ప్రమాణ స్వీకారం - జీతభత్యాలు

- ప్రధాన మంత్రితో రాష్ట్రపతి పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాజ్యాంగ పరంగా భారత ఐక్యతను, సమగ్రతను పరిరక్షిస్తామని, నమ్మకంతో, నిర్భయంగా, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తామని ప్రధాన మంత్రి ప్రమాణం చేయాలి.
- ప్రధాన మంత్రి, ఇతర మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. పార్లమెంటు సభ్యులకు వచ్చే జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను కలిగి ఉంటారు.
- ప్రకరణ 78 ప్రకారం రాష్ట్రపతికి ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయడం ప్రధాన మంత్రి బాధ్యత.
- ప్రకరణ 78(ఎ) ప్రకారం కేంద్ర మంత్రి మండలి నిర్ణయాన్ని ప్రధాన మంత్రి రాష్ట్రపతికి తెలియజేస్తారు.
- ప్రకరణ 78 (బి) ప్రకారం, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర సమాచారాన్ని రాష్ట్రపతి ప్రధాన మంత్రి ద్వారా తెలుసుకోవచ్చు.
- ప్రకరణ 78 (సి) ప్రకారం.. సమర్పించిన సమాచారంలో ఏదైనా అంశం మంత్రి చేసిన నిర్ణయమా లేదా మంత్రి మండలి చేసిన నిర్ణయమా అనే సంశయం ఉన్నప్పుడు, దాన్ని మంత్రి మండలి పరిశీలనకు పంపమని రాష్ట్రపతి ప్రధాన మంత్రిని కోరవచ్చు.

ప్రత్యేక వివరణ: మంత్రి మండలి ఏర్పాటు పూర్తిగా ప్రధాన మంత్రి విశిష్టాధికారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి, ఎలా పునర్ వ్యవస్థీకరించాలి అనేది ప్రధాన మంత్రి అభీష్టం. అయితే రాజకీయ పరమైన అంశాలు, వివిధ వర్గాలకు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అధికార పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాన మంత్రికి ఇష్టం లేకపోయినా కొందరు ప్రముఖులను మంత్రి మండలిలోకి తీసుకోవాల్సి వస్తుంది.

ప్రధాన మంత్రి పదవీ కాలం, తొలగింపు

సాధారణంగా ప్రధాన మంత్రి పదవీ కాలం లోక్‌సభతో పాటుగా అయిదేళ్లు ఉంటుంది. అయితే ఇది లోక్‌సభలోని మెజారిటీ సభ్యుల విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. పదవిలో కొనసాగడానికి ఇష్టపడనప్పుడు రాష్ట్రపతికి రాజీనామా పత్రాన్ని సమర్పిస్తారు. ప్రధాన మంత్రి రాజీనామా చేస్తే మంత్రి మండలి స్వతహాగా రద్దవుతుంది. పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ప్రధాన మంత్రి కింద పేర్కొన్న పరిస్థితుల్లో పదవి కోల్పోతారు.

- లోక్ సభలో మంత్రి మండలిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు.
- లోక్ సభలో విశ్వాసం కోరిన తీర్మానానికి మెజారిటీ లభించనప్పుడు.
- లోక్ సభ ద్రవ్య బిల్లును తిరస్కరించినప్పుడు.
- బడ్జెట్‌పై కోత తీర్మానం నెగ్గినప్పుడు.
- రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానం వీగిపోవడం లేదా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణ తీర్మానం నెగ్గడం.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎఫ్‌డీడీఐ, చెన్నైలో 47 పోస్టులు

చెన్నైలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ).. అకడమిక్ అండ్ నాన్ అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 47.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ, బీటెక్/బీఈ, డిప్లొమా, పదో తరగతి, పీజీ, ఎంఈ/ఎంటెక్, ఎంఫిల్/పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** జూనియర్ ఫ్యాకల్టీకి 35 ఏళ్లు, ఫ్యాకల్టీకు 40 ఏళ్లు, సీనియర్ గ్రేడ్2 ఫ్యాకల్టీకి 45 ఏళ్లు, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్1కు 50 ఏళ్లు, చీఫ్ ఫ్యాకల్టీకి 53 ఏళ్లు, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్‌కు 35ఏళ్లు,ల్యాబ్ అసిస్టెంట్‌కు 40ఏళ్లు, సీనియర్ ల్యాబ్ అసిస్టెంట్‌కు 45ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 33 ఏళ్లు.
- **వేతనం:** నెలకు జూనియర్ ఫ్యాకల్టీకి రూ.45,000, ఫ్యాకల్టీకి రూ.65,000, సీనియర్ గ్రేడ్2 ఫ్యాకల్టీకి రూ.80,000, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్1కి రూ.1,10,000, చీఫ్ ఫ్యాకల్టీకి రూ.1,50,000, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.22,000, ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.25,000, సీనియర్ ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.30,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.40,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.05.2025.
- **వెబ్‌సైట్:** https://fddiindia.com

హెచ్‌పీసీఎల్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీలు

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ విభాగాల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** అభ్యర్థులు కనీసం 60 శాతం(ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 50 శాతం) మార్కులతో సంబంధిత విభాగాల్లో(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ) ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 30.05.2025 నాటికి 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు రూ.25,000.
- **ఎంపిక విధానం:** మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.05.2025.
- **వెబ్‌సైట్:** https://hindustanpetroleum.com

పర్యావరణ పరిరక్షణకు ముచ్చటైన మూడు సూత్రాలు

సహజ వనరులు

వనరులను సంరక్షించకపోతే కలిగే నష్టాలు, వాటిని సుస్థిరపరచుకునే విధానాల గురించి 'సహజ వనరులు' పాఠ్యభాగంలో వివరించారు. దీంట్లో భాగంగా రెండు గ్రామాల్లో నిర్వహించిన అధ్యయనాలను పేర్కొన్నారు.

వనపర్తి గ్రామంలో నీరు పుష్కలంగా లభిస్తుంది. ఈ గ్రామంలో బావుల ద్వారా నీటి పారుదల నిర్వహించే 25 కుటుంబాల సామాజిక, ఆర్థిక అంశాలను సేకరించారు. వడ్డిచెర్ల గ్రామంలో తీవ్ర నీటికొరత ఉంటుంది. ఈ రెండు గ్రామాల్లో బావుల సంఖ్య, నీటి పారుదల ఉన్న భూ వైశాల్య శాతం, అందులో తగ్గుదల, ఫలితంగా పంటల్లో వచ్చిన మార్పులను పరిశీలించారు. చిన్న, పెద్ద రైతులు బావుల ద్వారా నీటిపారుదలపై చేస్తున్న వార్షిక ఖర్చు, పంటల ద్వారా పొందిన ఆదాయాన్ని సరి చూశారు. ఈ గ్రామాల్లో ఎండిపోతున్న బావుల్లో నీరు చేరుకునేలా భూగర్భ జలాల సుస్థిరత్వం కోసం కేంద్రం దృష్టి సారించింది. మైక్రో ఇరిగేషన్ పద్ధతులు ప్రవేశ పెట్టడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం లాంటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించింది. ఫలితంగా నీటి వనరుల రక్షణలో పెద్ద ముందడుగు పడింది.

అందరికీ నీరు అనే అంశంలో భూమిపై ఉన్న మొత్తం నీటి గణాంకాలను తెలియజేస్తూ, మంచినీరు చాలా తక్కువగా ఉందని, నీటిని విచక్షణతో వాడుకోవాలని వివరించారు. వాటర్‌షెడ్, సామాజిక చెరువు, కాంటూర్ సేద్యం లాంటి సముదాయ ఆధారిత విధానాలను అవలంబించాలని తెలిపారు. కొత్తపల్లి గ్రామంలో నీటి యాజమాన్యం దిశగా జరిగిన ప్రయత్నం, సముదాయ ఆధారిత విధానాలు, వీటికి సహాయపడిన ఇక్రిసాట్ సంస్థ గురించి తెలుసుకోవాలి. తక్కువ ఎత్తు పెరిగే పంటలను సాగు చేయడం, కాంటూర్ సేద్యం మొదలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ.. నేల, నీరు, పోషకాలు దుర్వినియోగం కాకుండా కాపాడుకునే రైతు ఆధారిత విధానాలను ప్రోత్సహించడం చాలా అవసరం.

బీడు భూముల అభివృద్ధి, వాటిలో మొక్కల పెంపకం, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నీరు, నీటి వనరులు మొదలైన అంశాల గురించి తెలిపారు. గోదావరీ నదీజలాలు శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపడానికే సరిపోవడం లేదు. అందువల్ల నీటి పారుదల సౌకర్యాల వినియోగం కోసం మెరుగైన పథకాలను రూపొందించుకోవాల్సి ఉంది.

మన చుట్టూ ఉన్న పునరుద్ధరింపదగిన, పునరుద్ధరింపలేని వనరుల గురించి అవగాహన పెంచుకోవాలి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహారం, ఇళ్లు, వస్తువుల ఉత్పత్తి - రవాణా, ఇంధన వినియోగం గురించి తెలుసుకోవాలి. అడవి ఒక ప్రధాన పునరుద్ధరింపదగిన వనరు. భూమిపై అధికంగా మానవుడి తాకిడికి గురవుతున్న వనరు కూడా ఇదే. దీనివల్ల హరిత గృహ వాయువులు విడుదలై, గ్లోబల్ వార్మింగ్‌కు దారి తీస్తున్నాయి. భవిష్యత్ తరాలకు అటవీ వనరులను అందించడానికి సుస్థిర అటవీ విధానాలను అనుసరించాలి. అభివృద్ధి పేరుతో అడవులను నరికి వేయడం వల్ల వాతావరణ సమతౌల్యం దెబ్బతింటుంది. రాజస్థాన్‌లో బిష్ణోయి తెగకు చెందిన అమృతాదేవి, ఆమె కుమార్తెలు, గ్రామస్థులంతా అడవులను నరికివేయకుండా కాపాడటానికి ప్రాణాలు అర్పించడానికి సైతం సిద్ధపడ్డారు. సుస్థిర అటవీ పద్ధతులు, పునఃచక్రీయ విధానాలను అవలంబించడం ద్వారా అడవులను కాపాడుకోవాలి.

ఆహారోత్పత్తికి నేల అత్యంత అవసరం. ఒకే రకం పంటను పలుమార్లు పండించడం లాంటి లోపభూయిష్టమైన పద్ధతుల వల్ల నేలలోని పోషకాలు నశిస్తాయి. కాంటూర్ పట్టీ పంటలు, ఎంపిక పంట పద్ధతులతో నేలను రక్షించుకోవచ్చు. జీవవైవిధ్యం మరో ప్రధాన అంశం. భూమిపై తరిగిపోతున్న జీవులు, వాటిని కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధ్యయనం చేయాలి. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైంది శిలాజ ఇంధనాలు. మన దేశంలో ఉపయోగిస్తున్న వివిధ వనరుల గురించి తెలుసుకోవాలి. ఇంధన పొదుపు, దీని కోసం పాటించాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు (బయోడీజిల్), సైకిల్ వాడకం లాంటివాటి గురించి తెలుసుకోవాలి. భూమిలో లభించే

> భూమి సహజ వనరులకు ఆలవాలమైన గ్రహం. నీరు, నేల, అడవులు, వృక్షాలు, జంతువులు మానవ మనుగడకు ఎంతగానో దోహదం చేస్తున్నాయి. వీటిని సరైన రీతిలో వినియోగించుకోకపోతే అనేక అనర్థాలు కలుగుతాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. జీవవైవిధ్యాన్ని కాపాడాలి. భవిష్యత్ తరాలు సురక్షితంగా జీవించడానికి కావాల్సిన పరిస్థితులను కల్పించడం అందరి బాధ్యత.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జీవశాస్త్రం

వివిధ ఖనిజ లవణాల గురించి పరిశీలించాలి. గనుల తవ్వకం ద్వారా కోల్పోతున్న ఖనిజ నిక్షేపాలు, వెలువడుతున్న గాలి, ధూళి లాంటి కాలుష్య కారకాల గురించి తెలుసుకోవాలి.

ఇందిరాగాంధీ చెప్పినట్లుగా.. పర్యావరణ పరిరక్షణ కోసం అవసరమైన మూడు R (Reduce, Reuse, Recycle) లను ఆచరించాలి. IUCN లాంటి అంతర్జాతీయ సంస్థలు పర్యావరణ సంరక్షణ కోసం చేస్తున్న కృషిని తెలుసుకోవాలి. మన చుట్టూ ఉన్న పరిసరాలను జాగ్రత్తగా కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలి.

అభివృద్ధిపేరుతో వనరుల విధ్వంసం

- పరిశ్రమల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణం, రహదారుల ఏర్పాటు కోసం వనరులను ఎక్కువగా వినియోగిస్తున్నారు.
- రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల అనేక ప్రాంతాల్లో పంటపొలాలు ప్లాట్లుగా మారి బీడుపడిపోతున్నాయి.
- బహుళజాతి సంస్థల వల్ల అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు హరించుకుపోతున్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్ల పేరుతో నీరు వ్యాపారమైంది.
- బెంగాల్‌లోని సింగూరు భూములు, తమిళనాడు కుడంకుళం లాంటివాటిని వనరుల అతి వినియోగానికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. వీటికి సంబంధించి ప్రజావ్యతిరేకత అధికంగా ఉంది.

పర్యావరణ సంరక్షణ సూత్రాలు (3Rs)

తగ్గించడం, తిరిగి వాడటం, పునఃచక్రీయం అనే 3 అంశాల ద్వారా పర్యావరణ రక్షణను నిర్వహించాలి.

1. **తగ్గించడం (Reduce):** వనరులను వృథా చేయకుండా తక్కువగా వినియోగించాలి. అవసరంలేని సమయాల్లో విద్యుద్దీపాలు, ఫ్యాన్లను ఆర్పి ఉంచాలి.
2. **తిరిగి వాడడం (Reuse):** పారేయకుండా తిరిగి ఉపయోగించుకోవాలి. కాగితాన్ని తిరిగి వాడటం వల్ల మొక్కలను అధిక మొత్తంలో కాపాడగలుగుతాం.
3. **పునఃచక్రీయం (Recycle):** ఒకసారి ఉపయోగించి వృథాగా ఉన్న పదార్థాలను తిరిగి వేరే రూపంలో వినియోగించుకోవాలి. దీన్నే పునఃచక్రీయం అంటారు.

వీటితో పాటు ఇటీవల Rethink (తిరిగి ఆలోచించడం) అనే అంశం ఎక్కువగా వినిపిస్తోంది. ఇది కూడా ఆచరణీయమే.

కీలకభావనలు

ఇంకుడు చెరువు: నీటి ప్రవాహాలకు అడ్డంగా రాళ్లు, మట్టితో అడ్డుకట్టలు కట్టి ఏర్పరిచే నీటి నిల్వలే ఇంకుడు చెరువులు.

సూక్ష్మ నీటిపారుదల: బిందు సేద్యం, తుంపరల విధానం ద్వారా జరిగే నీటిపారుదల.

బోరుబావులు: భూగర్భ జలాలను పైకి తేవడానికి తవ్వే గొట్టపు బావులు.

సుస్థిర అభివృద్ధి: ఒక రంగంలో జరిగే అభివృద్ధి వల్ల మరో రంగానికి నష్టం కలుగకుండా సమగ్ర అభివృద్ధి సాధించడం.

జీవ ఇంధనాలు: మొక్కలు, జంతు సంబంధ వ్యర్థాలను ఉపయోగించి తయారు చేసే ఇంధనాలు.

కాంటూర్ పట్టీ పంటల విధానం: నేల క్రమక్షయానికి గురవకుండా నేలవాలుకు అడ్డంగా కట్టలను ఏర్పరచడం ద్వారా జరిపే వ్యవసాయ విధానం.

గట్లు: వర్షపు నీరు పొలాల్లోకి పారి వ్యర్థం కాకుండా అడ్డుగా నిర్మించే నిర్మాణాలు.

కట్టల నిర్వహణ: వాన నీటిని వ్యర్థం కాకుండా అడ్డుకట్టల్లో నిల్వచేసి, ఆ నీటిని తిరిగి ఎండిన బావులు, బోరుబావుల్లో నింపి భూగర్భ జలమట్టాన్ని పెంచడానికి అనుసరించే విధానం.

ఇంకుడు గుంతలు: వర్షపు నీరు భూమిలో ఇంకడం కోసం తవ్వే గుంతలు.

ఇక్రిసాట్ (ICRISAT): ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమి ఎరిడ్ ట్రాపిక్స్. ఇది అంతర్జాతీయ సంస్థ. ఇది అర్ధ శుష్క మండలాల్లో పెరిగే మొక్కలకు సంబంధించి పరిశోధనలు చేస్తుంది.

డైక్: ప్రాజెక్టు నుంచి వెళ్లే కాలువలకు కట్టే అడ్డుకట్టలను డైక్‌లు అంటారు.

నీటి వినియోగదారుల సంఘం: చెరువులు, కాలువలు, ప్రాజెక్టుల లాంటి నీటి వినియోగ నిర్మాణాలకు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పడిన ప్రజాసంఘాలు.

రైతు ఆధారిత విధానాలు: పొలాల్లో వ్యక్తిగతంగా నేల, నీటి సంరక్షణ కోసం రైతులు అమలు చేసే కార్యక్రమాలను రైతు ఆధారిత విధానాలు అంటారు.

గ్లైరిసిడియా: పొడి నేలలో పెరిగే లెగ్యుమినేసి కుటుంబ మొక్కలు. ఇవి నేలలో నైట్రోజన్ నిల్వలు పెరగడానికి, గట్లు బలంగా ఉండటానికి సహాయపడతాయి.

బిందు సేద్యం: ఇది సూక్ష్మ నీటిపారుదల విధానం. మొక్కలకు సన్నని పైపుల ద్వారా వేర్ల వద్ద నీరు అందేలా చేస్తారు.

UNDP: యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్. ఇది ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ. ఇది ప్రపంచ దేశాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

హరిత గృహ వాయువులు: కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, NO_2, క్లోరోఫ్లోరో కార్బన్లను గ్రీన్‌హౌస్ వాయువులు అంటారు. ఇవి ఓజోన్ పొరకు హాని కలుగజేస్తాయి.

సుస్థిర అటవీ విధానాలు: భవిష్యత్ తరాలకు అటవీ వనరులను అందజేయడానికి అవలంబించాల్సిన విధానాలను సుస్థిర అటవీ విధానాలు అంటారు.

ఎంపిక పంట పద్ధతి: పంట కోసేటప్పుడు ఒక్కో మొక్క లేదా చిన్న గుంపును తీసివేయడం. దీనివల్ల నేల క్రమక్షయాన్ని తగ్గించవచ్చు.

జట్రోఫా కర్కాస్: బయో డీజిల్ తయారీకి ఉపయోగపడే మొక్క.

బహుళైచ్ఛిక ప్రశ్నలు

1. మంజు ఇంటికి పాలిథిన్ కవర్లను తేవడం తగ్గించుకోవాలంటే ఏం చేయాలి?
   ఎ) ఆమె మార్కెట్టుకు వెళ్లకూడదు
   బి) అమె పాలిథిన్‌ను వాడాలి
   సి) మార్కెట్టుకు గుడ్డసంచీ తీసుకెళ్లాలి
   డి) కూరగాయల బదులు వేరేవి తినాలి
2. రమ్య తన పాత పుస్తకాలను పారేయ కుండా తన చెల్లెలికి ఇచ్చి చదువుకోమన్నది. ఈ చర్య దేనికి ఉదాహరణ?
   ఎ) తగ్గించడం బి) పునఃచక్రీయం
   సి) సహాయం డి) పునర్వినియోగం
3. కింది వాక్యాల్లో ఏది సత్యం?
   1) నేలలో నైట్రోజన్ నిల్వలు పెంచడానికి ఎక్కువ ఎరువులు వేయాలి
   2) గట్లపై గ్లైరిసిడియా మొక్కలను పెంచడం ద్వారా నత్రజని నిల్వలను పెంచాలి.
   ఎ) 1, 2 సత్యం
   బి) 1 సత్యం, 2 అసత్యం
   సి) 2 సత్యం, 1 అసత్యం
   డి) 1, 2 రెండూ అసత్యం
4. కిందివాటిలో రైతు ఆధారిత విధానం ఏది?
   ఎ) కాలువలు తీయడం
   బి) చెరువుల కింద సాగు
   సి) కాంటూర్ పట్టీ సేద్యం
   డి) ఎక్కువ నీటిని వినియోగించడం

సమాధానాలు

1) సి 2) డి 3) సి 4) సి


ఖాళీలను పూరించండి

1. అంతర్జాతీయ సంస్థ ఇక్రిసాట్ ——— లో ఉంది.
2. నీటి ప్రవాహాలకు అడ్డంగా రాళ్లు, మట్టితో ఆనకట్టలు కట్టి ఏర్పరచిన నిర్మాణాలు ———
3. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును ——— నదిపై నిర్మించారు.

జవాబులు

1) హైదరాబాద్ (రాజేంద్రనగర్)
2) ఇంకుడు చెరువులు
3) గోదావరి

వేసవి విడిది కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?



జాగ్రఫీ

1. ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం ఏయే జిల్లాల్లో లభిస్తుంది?
 1) కడప, చిత్తూరు, కర్నూలు
 2) నెల్లూరు, కడప, చిత్తూరు
 3) చిత్తూరు, అనంతపురం, కడప
 4) అనంతపురం, కడప, నెల్లూరు
2. నల్ల గొర్రె గొంగళ్లకు, తుంగ చాపలు (చిరి చాపలు)కు ప్రసిద్ధి చెందిన జిల్లా?
 1) ఆదిలాబాద్
 2) కరీంనగర్
 3) మహబూబ్‌నగర్
 4) నల్గొండ
3. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా ఉన్న మృత్తికలు ఏవి?
 1) జేగురు మృత్తికలు ద2) ఒండ్రు
 3) ఎర్ర మృత్తికలు 4) నల్లరేగడి
4. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు ఎన్ని మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంది?
 1) 99 మెగావాట్లు
 2) 56 మెగావాట్లు
 3) 500 మెగావాట్లు
 4) 1000 మెగావాట్లు
5. పత్తి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఎన్నో స్థానంలో ఉంది?
 1) 5వ 2) 6వ
 3) 4వ 4) 7వ
6. 8° చానల్ ఏ కేంద్రపాలిత ప్రాంతం ద్వారా వెళ్తుంది?
 1) లక్ష దీవులు
 2) ఛండీగఢ్
 3) దాద్రానగర్ హవేలి
 4) డయ్యూడామన్
7. ఖాసి-జాంతియా కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
 1) మిజోరాం 2) మణిపూర్
 3) మేఘాలయ 4) అసోం
8. ఆసియా ఖండంలో అతి చిన్న దేశం ఏది?
 1) మడగాస్కర్ 2) సింగపూర్
 3) మాల్దీవులు 4) వియత్నాం
9. అత్యధిక అటవీ విస్తీర్ణం గల రాష్ట్రం ఏది?
 1) త్రిపుర 2) సిక్కిం
 3) అసోం 4) మధ్యప్రదేశ్
10. భారతదేశంలో మొదటి బొగ్గు గని రాణి గంజ్ ఏ రాష్ట్రంలో ఉంది?
 1) ఛత్తీస్‌గఢ్ 2) పశ్చిమబెంగాల్
 3) ఒడిశా 4) జార్ఖండ్
11. ఖరీఫ్ కాలపు ప్రధాన పంట?
 1) వరి 2) గోధుమ
 3) వేరుశనగ 4) రబ్బర్
12. పశ్చిమ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం?
 1) హుబ్లీ 2) జబల్‌పూర్
 3) బిలాస్‌పూర్ 4) హాజీపూర్
13. వేసవి విడిది కేంద్రమైన కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?
 1) బాబుబుడాన్ కొండలు
 2) అన్నామలై కొండలు
 3) పళని కొండలు
 4) మహదేవ్ కొండలు
14. మనం ఎల్లప్పుడూ చంద్రుడి ఒకే ముఖాన్ని ఎందుకు చూస్తూ ఉంటాం?
 1) ఎందుకంటే భూమి సూర్యుడి చుట్టూ ఎంత వేగంగా తిరుగుతుందో, తన చుట్టూ అంతే వేగంగా తిరుగుతుంది కాబట్టి
 2) చంద్రుడి కక్ష్యపై భూమి వ్యతిరేక దిశలో పరిభ్రమిస్తుంది.
 3) చంద్రుడు.. భూమి చుట్టూ పరిభ్రమించడానికి, తన కక్ష్యపై తన చుట్టూ తాను పరిభ్రమించడానికి పట్టే కాలం సమానం
 4) చంద్రుడు.. భూమి కంటే చిన్నది కాబట్టి
15. భూమి కక్ష్య పొడవు?
 1) 960 మిలియన్ల కి.మీ.
 2) 965 మిలియన్ల కి.మీ
 3) 970 మిలియన్ల కి.మీ
 4) 955 మిలియన్ల కి.మీ
16. లిథోస్ అంటే?
 1) ఆవిరి 2) శిల
 3) నీరు 4) ఆవరణం
17. కిలిమంజారో విలుప్త అగ్నిపర్వతం ఏ దేశంలో ఉంది?
 1) ఇండోనేషియా 2) టాంజానియా
 3) ఇటలీ 4) ఈక్వెడార్
18. భుజ్ భూకంపం ఎప్పుడు సంభవించింది?
 1) 1992 2) 1995
 3) 2000 4) 2001
19. ఉష్ణోగ్రతను బట్టి మందాన్ని కలిగి ఉన్న పొర ఏది?
 1) స్ట్రాటో ఆవరణం
 2) ట్రోపో ఆవరణం
 3) థర్మో ఆవరణం
 4) మీసో ఆవరణం
20. భూమి ఆల్బిడో?
 1) 24 శాతం 2) 45 శాతం
 3) 38 శాతం 4) 35 శాతం
21. ఖండచలన సిద్ధాంతం ప్రకారం 'మహా ఖండ భూభాగం' పేరు?
 1) అంగారా 2) పాంథాలసా
 3) గోండ్వానా 4) పేంజియా
22. లాబ్రడార్ శీతల ప్రవాహం ఏ సముద్రంలో ఉంది?
 1) హిందూ మహాసముద్రం
 2) అట్లాంటిక్ మహాసముద్రం
 3) పసిఫిక్ మహాసముద్రం
 4) అంటార్కిటిక్ మహాసముద్రం
23. 'కంపాలు' అనే గడ్డి భూములు ఉన్న ఖండం?
 1) ఉత్తర అమెరికా
 2) ఆఫ్రికా
 3) యూరప్
 4) దక్షిణ అమెరికా
24. సీసం, జింక్ గనులకు ప్రసిద్ధి చెందిన బ్రోకెన్‌హిల్ గని ఎక్కడ ఉంది?
 1) పశ్చిమ ఆస్ట్రేలియా
 2) దక్షిణ ఆస్ట్రేలియా
 3) క్వీన్స్‌లాండ్
 4) న్యూసౌత్‌వేల్స్
25. ప్రపంచ పవనాలు అంటే?
 1) సముద్రం నుంచి భూమిపైకి వీచే పవనాలు
 2) భూమి నుంచి ఇతర గ్రహాల పైకి వీచే పవనాలు
 3) పీడన వలయాల మధ్య వీచే పవనాలు
 4) ఒక గ్రహం నుంచి మరొక గ్రహానికి వీచే పవనాలు

హిస్టరీ

26. బిసాంత్ అనే బంగారు నాణాన్ని ద్రవ్యరూపంగా వినియోగించినవారు?
 1) గ్రీకులు
 2) రోమన్లు
 3) పర్షియన్లు
 4) అరబ్బులు
27. కుష్ ప్రజల లిపిని ఏ విధంగా పిలుస్తారు?
 1) పహ్లవి లిపి
 2) సొపట్ లిపి
 3) బొమ్మల లిపి
 4) మిరియోంటిక్ లిపి
28. వ్యవసాయం ఏ యుగంలో ప్రారంభమైంది?
 1) ప్రాచీన శిలాయుగం
 2) నవీన శిలాయుగం
 3) సూక్ష్మ శిలాయుగం
 4) ఏదీకాదు
29. హరప్పా నాగరికతలో మట్టితో చేసిన గుర్రం బొమ్మ ఎక్కడ లభించింది?
 1) రూపార్ 2) చన్హుదారో
 3) లోథాల్ 4) మొహంజొదారో
30. జైన మతాన్ని ఆదరించిన కళింగాధీశుడు ఎవరు?
 1) ఖారవేలుడు 2) కనిష్కుడు
 3) చంద్రగుప్తుడు 4) అశోకుడు
31. నాలుగో బౌద్ధ సంగీతి ఎక్కడ జరిగింది?
 1) పాటలీపుత్రం 2) వైశాలి
 3) మగధ 4) కశ్మీర్
32. ఆంధ్ర శాతవాహనుల మొదటి రాజధాని నగరం?
 1) అమరావతి
 2) పైఠాన్
 3) బీరార్
 4) హైదరాబాద్
33. 'జీవక చింతామణి' ఎవరి రచన?
 1) తాల్కపియర్
 2) ఇలాంగో అడిగల్
 3) సుత్తలై సత్తమ్
 4) తిరుతక్కదేవర
34. గుప్తుల కాలంలో నిర్మించిన ప్రముఖ దశావతార దేవాలయం ఎక్కడ ఉంది?
 1) సారనాథ్ 2) దేవఘర్
 3) పురుకోట 4) గ్వాలియర్
35. 'బోస్టన్ తేనీటి విందు' ఏ సంవత్సరంలో జరిగింది?
 1) 1773 2) 1774
 3) 1775 4) 1777
36. 'జెండా అవెస్తా' ఎవరి పవిత్ర గ్రంథం?
 1) పర్షియన్లు 2) యూదులు
 3) గ్రీకులు 4) రోమన్లు
37. చైనా మహాకుడ్యాన్ని నిర్మించింది?
 1) సుంగ్ వంశస్థులు
 2) చౌ వంశస్థులు
 3) చింగ్ వంశస్థులు
 4) షాంగ్ వంశస్థులు
38. తంజావూరులోని బృహదీశ్వరాలయాన్ని నిర్మించింది?
 1) గుప్తులు 2) పల్లవులు
 3) కుషాణులు 4) చోళులు
39. నెపోలియన్ ఏర్పాటు చేసిన 'రైన్ కాన్ఫెడరేషన్'లో ఉన్న రాజ్యాలు?
 1) స్వీడన్, స్విట్జర్లాండ్, బవేరియాతోపాటు నైరుతి జర్మనీలో 13 చిన్న రాజ్యాలు
 2) ప్రేగ్, బవేరియా, హంగరీ, 8 ఇతర చిన్న రాజ్యాలు
 3) ఉర్టెన్ బర్గ్, బవేరియా, బాడెన్‌తోపాటు నైరుతి జర్మనీలోని 13 చిన్న రాజ్యాలు
 4) బవేరియా, ప్రేగ్, సాక్షనీ, వాయవ్య జర్మనీలోని 8 చిన్న రాజ్యాలు
40. రెండో ప్రపంచ యుద్ధానికి తక్షణ కారణం?
 1) ఇటలీపై మిత్ర రాజ్యాల దాడి
 2) రష్యాపై జర్మనీ దాడి
 3) పోలండ్‌పై హిట్లర్ దాడి చేయడం
 4) ముస్సోలినిని అరెస్ట్ చేయడం
41. వర్సయిల్స్ సంధి కారణంగా ఎక్కువ భూభాగాలు కోల్పోయిన దేశం?
 1) ఆస్ట్రియా 2) ఫ్రాన్స్
 3) రుమేనియా 4) జర్మనీ
42. వ్లాదిమిర్ ఇల్యుచ్ (లెనిన్) ఏర్పాటు చేసిన పోలీస్ దళం?
 1) బ్రౌన్ షర్ట్స్ 2) వైట్ గార్డ్స్
 3) ఆగ్‌పూ, చెకా 4) గెస్టాపో
43. 1973లో జరిగిన అలీన దేశాల నాలుగో సదస్సు ముఖ్య విధానం?
 1) కొరియా యుద్ధ పరిష్కారం
 2) అంతర్జాతీయ నూతన ఆర్థిక వ్యవస్థ
 3) ప్రపంచ మానవ హక్కులు
 4) పర్యావరణ పరిరక్షణ
44. 'సెయింట్ సోఫియా చర్చి'ని నిర్మించిన బైజాంటియన్ చక్రవర్తి?
 1) నికోలస్-I 2) జస్టీనియన్
 3) నికోలస్-II
 4) కాన్‌స్టాంటైన్
45. బక్సార్ యుద్ధం తర్వాత బెంగాల్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమితులైనవారు?
 1) కారన్ వాలీస్ 2) రాబర్ట్ క్లైవ్
 3) వెల్లస్లీ 4) వారన్ హేస్టింగ్స్
46. దక్షిణ భారతదేశంలో విద్యకు నిలయమైన నగరం?
 1) తంజావూర్ 2) చిదంబరం
 3) కంచి 4) మధురై
47. 1942లో గాంధీజీ భారతీయులకు ఇచ్చిన నినాదం?
 1) విదేశీ వస్తువులను తగులబెట్టండి
 2) బ్రిటిష్‌వారిని వెళ్లగొట్టండి
 3) సాధించు లేదా మరణించు
 4) స్వరాజ్యం మన హక్కు

ఎకనామిక్స్

48. పూర్తిగా పబ్లిక్ వస్తువుకు ఒక ఉదాహరణ?
 1) కార్లు 2) రోడ్లు
 3) పార్క్ 4) వీధి దీపాలు
49. తలసరి ఆదాయాన్ని గుణించడానికి సూత్రం?
 1) $\frac{\text{పెట్టుబడి ద్వారా వచ్చు ఆదాయం}}{\text{జనాభా}}$
 2) $\frac{\text{పన్నుల ద్వారా వచ్చు ఆదాయం}}{\text{జనాభా}}$
 3) $\frac{\text{జాతీయ ఆదాయం}}{\text{జనాభా}}$
 4) $\frac{\text{జనాభా}}{\text{జాతీయ ఆదాయం}}$
50. ధరల సిద్ధాంతం ఏ ఆర్థిక శాస్త్రంలో ఒక ప్రధాన అంశం?
 1) ప్రయోగ అర్థశాస్త్రం
 2) సూక్ష్మ అర్థశాస్త్రం 3) స్థూల అర్థశాస్త్రం
 4) ఏదీకాదు
51. మనదేశంలో ఉపాధి అవకాశాలను ఎక్కువగా కల్పించే రంగం?
 1) భారీ పరిశ్రమలు2) కంప్యూటర్ రంగం
 3) బ్యాంకింగ్ రంగం
 4) వ్యవసాయం, దాని అనుబంధ వృత్తి రంగాలు
52. కేంద్రీకృత ప్రణాళిక విధానం ఏ ఆర్థిక వ్యవస్థ ప్రధాన లక్షణం?
 1) మిశ్రమ ఆర్థిక వ్యవస్థ
 2) స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థ
 3) సామ్యవాద ఆర్థిక వ్యవస్థ
 4) పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ
53. తృతీయ రంగానికి చెందిన అంశం?
 1) వ్యవసాయం 2) మత్స్యకార చేతివృత్తి
 3) గనుల తవ్వకం 4) బ్యాంకింగ్

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 1	5) 2
6) 1	7) 3	8) 3	9) 4	10) 2
11) 1	12) 2	13) 3	14)3	15) 2
16) 2	17) 2	18) 4	19) 2	20) 4
21) 4	22) 2	23) 4	24) 4	25) 3
26) 2	27) 4	28) 2	29) 3	30) 1
31) 4	32) 2	33) 4	34) 2	35) 1
36) 1	37) 3	38) 4	39) 3	40) 3
41) 4	42) 3	43) 2	44) 2	45) 2
46) 3	47) 3	48) 4	49) 3	50) 2
51) 4	52) 3	53) 4.		

The Super Computer developed in India?

Model Questions



1. A ______ is approximately a million bytes.
 a) Giga byte b) Kilo byte
 c) Mega byte d) Tera byte
 e) None of these
2. If you want to extend the length of the network without having the signal degrade, you would use a:
 a) repeater b) router
 c) gateway d) switch
 e) None of these
3. What do you press to enter the current date in a cell?
 a) CTRL + ; (semicolon)
 b) CTRL + SHIFT + : (colon)
 c) CTRL + F10
 d) CTRL + F11
 e) None of these
4. To make the number pad act as directional arrows, you press the ____ key.
 a) Num lock b) Caps lock
 c) Arrows lock d) Shift
 e) Control
5. Press ____ to move the insertion point to the Address box, or to highlight the URL in the Address box.
 a) ALT + D b) ALT + A
 c) SHIFT + TAB
 d) TAB + CTRL e) None
6. To move to the bottom of a document, press ____
 a) Insert key
 b) Home key
 c) CTRL + End key
 d) End key
 e) None of these
7. Transmitting data in the form of light is called
 a) Light Transmitter
 b) Fiber glass c) LTP
 d) All of the above
 e) None of the Above
8. ___ is the memory card which is conceptually related to the smart card but similar to video desk?
 a) Debit card b) Master card
 c) Laser card d) Credit card
 e) None of the Above
9. Maximum Storage capacity of a DVD is ____
 a) 17 GB b) 15 GB c) 16 GB
 d) 10 GB e) None of the Above
10. Which of the following operating system uses first 64 bit technology?
 a) MS-DOS b) Windows XP
 c) Mac OS d) Linux
 e) None of the Above
11. A processing unit that coordinates networks and data communication is known as:
 a) Control unitb) CPU
 c) Communications Processor
 d) Data Coordinator
 e) None of the Above
12. Two or more computers connected to each other for sharing information form a:
 a) network b) router
 c) server d) tunnel
 e) pipeline
13. If a computer provides database services to other, then it will be known as:
 a) Web server
 b) Application server
 c) Database server
 d) FTP server e) None of these
14. Technology used to provide internet by transmitting data over wires of telephone network is __
 a) Transmitter b) Diodes
 c) HHL d) DSL
 e) None of these
15. Documents, Movies, Images and Photographs etc are stored at a:
 a) Application Sever
 b) Web Sever
 c) Print Server
 d) File Server
 e) None of these
16. RAM consists of which of the following?
 a) Conductor
 b) Semi Conductor
 c) Vaccum Tubes
 d) Transistor e) None of these
17. Who is the father of Internet?
 a) Charles Babbage
 b) Vint Cerf c) Denis Riche
 d) Martin Cooper
 e) None of these
18. ______is process of Verification?
 a) Access b) Login c) Logout
 d) Authentication

BANK EXAMS
COMPUTER KNOWLEDGE

 e) None of these
19. Identify the odd one from the following?
 a) CD/DVD b) Floopy Disks
 c) SD Disk d) BIOS
 e) None of these
20. USB is which type of storage device?
 a) Primay b) Secondary
 c) Tertiary d) All the above
 e) None of these
21. Which program is run by BIOS to check hardware components are working properly while computer is turned ON?
 a) DMOS b) POS
 c) CMOS d) RIP
 e) None of these
22. To identification particular location in storage area one have a:
 a) Address b) Password
 c) Logic d) Mouse
 e) None of these
23. The following computer's memory is characterized by low cost per bit stored:
 a) Primary b) Secondary
 c) Hard disk d) All of the above
 e) None of these
24. The following is true for Auxiliary Storage:
 a) It has an operating speed far slower than that of the primary storage.
 b) It has an operating speed faster than that of the primary storage.
 c) It has an operating speed equivalent than that of the primary storage.
 d) All of the above
 e) None of these
25. ALGOL is the ____ language
 a) High-level
 b) Low level c) Machine
 d) All of the above
 e) None of these
26. Which of the following is a logic circuit capable of forming the sum of two or more quantities?
 a) Adder b) Multiplier
 c) Address d) Access
 e) None of these
27. Which of the following will not cut information?
 a) Pressing Ctrl + C
 b) Selecting Edit > Cut from the menu
 c) Clicking the Cut button on the standard
 d) Pressing Ctrl+X
 e) None of these
28. MPG is a file extension of which type of files?
 a) Audio b) Image
 c) Video d) Flash
 e) None of these
29. What is the full form of EXIF?
 a) Exchangeable Image Fine Finish
 b) Exchangeable Image File Format
 c) Executable Image File Format
 d) Executable Image File Finish
 e) None of these
30. Which of the following can't spread virus?
 a) An e-mail with attachment
 b) A plain text mail
 c) Downloading files over the web
 d) All of the above
 e) None of these
31. There is a new anti-virus software update available, when it is downloaded to your computer __
 a) Everyday
 b) Only in the night
 c) When you next switch on your computer
 d) All of the above
 e) None of these
32. Numbers are stored and transmitted inside a computer in _________
 a) Binary form
 b) ASCII code form
 c) Alphabets form
 d) Numerical form
 e) None of these
33. CPU capacity can be measured in
 a) BPS b) MIPS
 c) MHz d) MPI
 e) None of these
34. "Zipping" a file means:
 a) Encrypting the message
 b) Compressing the message
 c) Transfer the message
 d) All of the above
 e) None of these
35. What is the Super Computer developed in India?
 a) CRAY b) PARAM
 c) CRAM d) Both a and b
 e) None of the above
36. Difference Engine invented by:
 a) Charles Babbage
 b) John McCarthy
 c) Pascal d) Newton
 e) None of these
37. Doing research by using an on-line database instead of a printed set of similar information offers which of the following advantage
 a) More current information
 b) Easier to understand
 c) Better charts
 d) All of the above
 e) None of these

Answers

1) c	2) a	3) a	4) a	5) a
6) c	7) b	8) c	9) a	10) d
11) c	12) a	13) c	14) d	15) d
16) b	17) b	18) d	19) d	20) c
21) b	22) a	23) b	24) a	25) a
26) a	27) a	28) c	29) b	30) b
31) c	32) b	33) b	34) b	35) b
36) a	37) a.			